పత్రికలలో ప్రచురించబడిన కథ, వ్యాసము, పాటలు, నాటికలు

రజని రచనలు

సంకలనము

పత్రికలలో ప్రచురించబడిన కథ, వ్యాసము, పాటలు, నాటికలు

వెన్నెల ఎందుకు (**కథ**)	అనసూయ	అగస్ట్ 1947	4
మహిళలు – సంగీతము (**వ్యాసము**)	ఆంధ్ర మహిళ	జనవరి 1959	9

గేయములు

కొత్త పాట	భారతి	ఫిబ్రవరి 1939	12
మాధురులు	భారతి	మే 1939	13
మేలుకొనవొ నాదు జన్మభూమి	ఆంధ్ర మహిళ	15 మే 1944	14
అమర గాయకుడు సైగల్	నవోదయ	16 ఫిబ్రవరి 1947	15
ఒక్కడవే (రవీంద్ర గేయం)	తెలుగు స్వతంత్ర	6 ఆగస్ట్ 1948	16
ద్వారం వెంకటస్వామి నాయుడు	అభినందన సంచిక	1949	17
ముక్కోటి కంఠాలు	తెలుగు స్వతంత్ర	2 నవంబర్ 1956	19
పిలుపు	ఆంధ్ర మహిళ	జనవరి 1959	20
చరమగీతం	శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ శత జన్మదిన ప్రత్యేక సంచిక	1961	21
శాంతిగీతి	గోపీచంద్ మెమోరియల్ ప్రత్యేక సంచిక	15 డిసెంబర్ 1963	22
జోహారులు	నాట్య కళ	సెప్టెంబర్ 1971	23
ఏరీ నీ సరి	ప్రకాశం మెమోరియల్ సంచిక	1972	24
మాదీ స్వతంత్ర దేశం	ప్రకాశం మెమోరియల్ సంచిక	1972	25
తాయిలం	బాలానందం	23 అక్టోబర్ 1974	26
దివి సీమ	ఆం. ప్ర. డ్రామా ఫెస్టివల్ ప్రత్యేక సంచిక	1977	27

రూపకములు

గోరీల తోట	భారతి	అక్టోబర్ 1939	28
రుచీ దేవి	ఆంధ్ర మహిళ	19 ఫిబ్రవరి 1944	33
గాజుల బేహారి	ఆంధ్ర మహిళాసభ వార్షికోత్సవ సంచిక	19 ఫిబ్రవరి 1944	36
చండీదాసు	ఆంధ్ర మహిళ	17 జనవరి 1945	39
లకుమాదేవి	ప్రతిభ	అక్టోబర్ 1945	44
శాఫో	ఆంధ్ర మహిళ	3 నవంబర్ 1945	48
ఖానా	ఆంధ్ర మహిళ	30 జులై 1947	50
ఆహిరి	తెలుగు స్వతంత్ర	1 అక్టోబర్ 1948	53
ఆషాఢస్య ప్రథమ దివసే	తెలుగు స్వతంత్ర	18 జులై 1952	58
శ్రీనాథ కనకాభిషేకము	తెలుగు స్వతంత్ర	8 ఫిబ్రవరి 1957	60
సుభద్రార్జునీయం	ఆంధ్ర మహిళ 16వ వార్షికోత్సవ సంచిక	మార్చ్ 1960	68
వాసవదత్త - ఉపగుప్తుడు	ఆంధ్ర మహిళ 16వ వార్షికోత్సవ సంచిక	మార్చ్ 1960	71
జ్యోతిరైక్యము	నాట్య కళ	డిసెంబర్ 1963	73
పరుసవేది	నాట్య కళ	ఫిబ్రవరి 1964	85
పద్మప్రాభృతము	భారతి	1 ఏప్రిల్ 1969	93
ఉభయాభిసారిక (భాణం)	భారతి	1 సెప్టెంబర్ 1972	106
మూలస్తంభాలు	బాలానందం	23 అక్టోబర్ 1974	117

వన్నెల ఎందుకు?

రజని



ముప్ఫయి వసంతాలు దాటి పోయినా దాసరి నరసయ్య బ్రహ్మచారిగానే అట్టే వుండి పోయాడు. అక్షరాలా అస్ఖలిత బ్రహ్మచారిగానే! పొడుగ్గా, బక్క పలాచగా - తనయింటి యెదట వీధి మొగలో పెన వేసుకుని యెదిగి పోయి, చల్లని నీడలు పరచిన వేపా, రావీ, చెట్లజోడానీడని చప్టామీద కూచుని ఆ వూరికి నిత్యమూ, 'సాజన్మ సాకార సద్గురుని కనరా' అని తత్వం బోధిస్తూంటాడు. తాను కొలిచే సద్గురుడు - ఆ పరబ్రహ్మం లీలలు, లోక సృష్టి కోసం, పరిపాలన కోసం ఆయన చేసే ఊహలు వాటివెనక మెదిలే మహాత్కారణాలూ, ఇవన్నీ తనకి పరిపూర్ణంగా తెలుస్తున్నవని అతని ఘట్టి నమ్మకం.

పొలంగట్లమ్మట పోతూంటే, అతనికి వొకొక్కప్పు డనిపించేది 'సృష్టిలో ఫలాని కార్యం-ఫలాని విశేషం ఆ విధంగా ఏర్పాటవటానికి పరమాత్ముడి పరమోద్దేశం యేమిటీ' అని. తానే భగవంతుడై వుంటే త నెందుకలా చేసివుంటాడో-కార్య కారణాలు విమర్శించుకుంటాడు — ఓపిగ్గా, తేలిగ్గా. 'పలు విధముల్గా నీదు

తోవలో దేవా
తెలియగా లేరూ మానవులూ' అనుకుంటాడు.

సద్గురుడైన భగవంతుడి సేవకుడు గనక, తనకి ఆయన లీలలు తెలిసితీరాలి. తెలియక పోయినా తా నూహించుకో గల గాలని అతని పట్టుదల.

సుఖదుఃఖాలవంటి వెలుగు నీడలలాంటి రంగులతో సరిసమా

నంగా చిత్రించిన చిత్రంలాగ ఒకటి ఎచ్చూ, ఒకటి తగ్గూ లేకుండా నాట్యంలో కింద ఆడే కాలికి ఊతగా పైన యెగిరే చెయ్యిలాగా సృష్టిలీల అంతా భగవంతుడు అద్భుతంగా లయబద్ధంచేసి వుంచాడని చెబుతూంటాడు నరసయ్య. ప్రతికార్యానికీ వెనకనే హేత్తుకుని ఉంటుందిట కారణం. మునిమాపువేళ ఉషఃకాంతులెందుకయ్యా అంటే — నిద్రించి లేచేవారందరి ఆనందానికీని. పట్టపగది వెలుతురు బండారం పంటలని కంటినిండుగా పండించడానికి. సాయంత్రం చల్లగా విశ్రాంతి తీసుకోడానికి — రాత్రి చీకటి — నిశ్శబ్దంగా పడుకోటానికి. వ్యవసాయదారుల సదుపాయానికిగాను, పొలాలు పంటలు పండి, తోటలు కాపు కాసి, గాదులూ దొడ్లూ నిండేందుకూ, ఆరుఋతువుల చక్రం ఎంతో చక్కగా అమరిచాడు సద్గురుడు. స్త్రీజాతిఅంటేమాత్రం అతనికి వెలపరం, అసహ్యం. ఇన్నోటి ప్రపంచాలను సృష్టించిన సద్గురుడు ఈ విషయంలో మాత్రం పప్పులో కాలేశాడు. తనే పశ్చాత్తాప పడుండాలాయన — స్త్రీని సృష్టించినందుకు.

చుట్టూ వుండే బళ్లవాళ్లూ, కిల్లీ కొట్లవాళ్లూ, ట్రిప్పులమధ్య తీరిక దొరికిన బస్సుడ్రైవర్ల కండక్టర్లూ వింటూంటే చెప్పేవాడు, నరసయ్య. 'ఆడదంటే ఇంద్రజాలినిరా! తన్ను పుట్టించిన బ్రహ్మదేవుణ్ణే వల్లో వేసుకుంది. నువ్వు నూరు తపస్సులు చెయ్యి: ఆమెలోతు కనుక్కోగలవా? వాళ్ల లోగుట్టు పెరుమాళ్లకు కూడా తెలీదురా. ఆడదీ, అందమూ అన్న మాటవినబడితే అటు చూడకు. అందుమీద ప్రేమా, బ్రమా అంటూ తియ్య మాటలు సాగించిందో — చెవుల్లో సీసమోసుకుని, అక్కణ్ణించి పారిపో. సద్గురుడు — నీకు తనమీద గురి ఎంత నిశ్చలంగా వుందో పరీక్షించడానికి పన్నిన ఉపాయం అనుకో ఆడదంటేను.' అంటూంటాడు నరసయ్య!

అయితే — ఆధీనంతప్పి, అన్నీ ఉడిగిన ముసిలవ్వల పైని మాత్రం కొంత సహానభావం చూపేవాడు. ఆ ముసిలి మొహాల్లోకూడా ముఖాలకి పసుపు పూసుకుని

విడజారిన తడితలలతో దేవళ్ళల్లో మొక్కులు మొక్కుకునేప్పుడుకూడా వాళ్ల హృదయాల్లో ఏదో ఆపలేని వూపుతో అణిగీ అణగని మాయాజాలం, ప్రేమ, అపేక్ష, అనే దొంగపేర్లతో తొంగిచూస్తూ వుంటుందని అతని అభిప్రాయం.

పక్కవూళ్లో అతనికో మేనకోడలుంది - తన అప్పకూతురు. నరసయ్య వూళ్లోవున్న సద్గురుడి గుళ్లో నరసయ్య వంశంవారంతా పారంపర్యా పూజార్లు. ఆ యింటిలోని ఆడవారే ఆ గుళ్లో అమ్మవారికి ప్రత్యేకసేవ చేసే ముత్తైదువులుగా వుంటూండే వారు. ఆ ముత్తైదువులు పెళ్లి చేసుకోకూడదు. నరసయ్య అప్పగారు అమ్మవారి ముత్తైదువుగా సిద్ధి పొందింది. చిన్నప్పగారు మాత్రం పెళ్లి చేసుకుని పక్కవూళ్లో కాపరం చేస్తూ ఒక కూతుర్ని కని - ఆధీనం తప్పి ఆ పద్నాలుగేళ్ల కూతురితో అక్కడే వుంటోంది - తనకు మిగిలిన చిన్న మడీమాన్యం చూసుకుంటూ.

నరసయ్య తన మేనకోడలు సరస్వతిని అమ్మవారి ముత్తైదువగా చెయ్యాలని సంకల్పం. సరస్వతి చలాకీపిల్ల. మామ ఏం చెప్పినా సరే తేలిగ్గా గేలిచేసి తీసిపారేస్తుంది. మాంచి ఉద్రేకంతో మామ సద్గురుడి తత్వం వివరిస్తుంటాడు. ఆమె పకాలున నవ్వేస్తుంది. మామ తబ్బిబ్బయ్యేలాగ మెడచుట్టూ చేతులు పెనవేసి, వేళ్లాడుతుంది. అతను సద్గురుణ్ణి తల్చుకుంటూ ఆ బంధాల నుంచి బయటపడ ప్రయత్నిస్తాడు, గాని — మగవారందరిలోనూ వుండే పితృవాత్సల్యం లాంటిదేదో తనలో కదుల్తున్నట్టూ, అందువల్ల తన రక్తంలో ఏదో తెలిసీ తెలియని ఒక ఆనందతరంగం కాస్త కదలినట్టూ అనిపిస్తుం దతనికి.

పుల్లకీ పుడకకీ, కూరకీ నారకీ పొలానికి పోతూ వస్తూ గట్లంబడి సరస్వతితో భగవానుడి సృష్టి చాకచక్యాన్ని గురించి గురుబోధవల్ల తాను తెలుసుకున్నదంతా చెబుతుంటాడు. ఆమె వింటూనా, ఆకాశంకేసి పరకాయిస్తుంది. గడ్డికేసో, పూలకేసో, జీవిత మాధుర్యం కళ్లల్లో ఉట్టి

పడుతూ చూస్తూంటుంది. లేదా ఏ సీతాకోక చిలకనో తూనీగనో తరుముతూంటుంది. మామా బాగులే దీని రంగురంగుల రెక్క? ముద్దు పెట్టుకో బుద్ధేస్తోంది. ఏంచక్క, అంటుంది. మామకి తలకొట్టినట్టు విసుగేసుకొస్తుంది. అదుగో అదే స్త్రీజాతి జాతంతకీ వున్న దుర్గుణం' అనుకుంటాడు.

ఒకనాడు పక్కింటి రంగమ్మ ...నరసయ్యతో ఓ ఘోరవార్త చెప్పింది. 'సరస్వతి రోజూ సంజ వేళ దాటేక, జామురాత్రివేళ, వాళ్లమ్మకి కూరుకుపడ్డాక పొలం గట్టున గడ్డివాము పక్కని ఎవరో చిన్నవాడితో స్నేహితం చేస్తోందని. ఏదో మందు నూరుతూన్న నరసయ్య మందలా కల్వంలోనే వుంచేసి చటాల్న లేచి పచార్లు మొదలెట్టాడు–పెరటివసారాలో. శిష్యుడు కులతప్పచేస్తే ఆగ్రహ పడిపోయే స్వాములారి మాదిరి మండిపడిపోతున్నాడు, పూజారి నరసయ్య. గురుద్రోహం కాదిదీ? పితృద్రోహం! తలిదండ్రులని కాదని కొమార్తె తన వర్ణాన్ని పంటే, ఆ తలిదండ్రుల కెంత కోపం వస్తుందో అదికూడా నరసయ్య మావఁ కోపానికి సాటి రాలేదు. భోంచేసి, ఆముదం దీపం దగ్గిర సద్గురుబోధ చదూదామని తీశాడు. అక్షరాలూ దీపప్పోగా ఒకేమాదిరి అలుముకుపోతూ కనిపించాయతనికి. పక్కబస్తీలో ఠాణాలో పదిగంటలు వినిపించే వరకూ అతడు సకల హైరానూ పడిపోయాడు, పెచ్చుపెరిగే కోపాన్ని అణుచుకోలేక. లావాటి చాపాటికర్ర తీసుక బయలు దేరాడు పొలంగట్లమీదికి. అతని కాలికింద భూమి దడదడ అదిరి పోతోంది. చేతికర్ర గాలిలోకెత్తి కసిగా కిందికి దింపేప్పటికి— గుమ్మంలోవున్న నీలిగోరంట పూలకుండీ తుక్కుతుక్కయి పోయింది.

ఊరుచివరి చిన్నవీధి దాటి పుంతలో పడేసరికి ఫెళ్లున మిన్ను విరగకాసిన వెన్నెల అతని మనస్సును చిత్తు చేసేసింది. అతని మనస్సులో–ఏవిటో–చెప్పడానికి వీల్లేకుండా — కవుల కవుతుందేమో అలాగ–కాక పూనకం వచ్చే భక్తులకే అవుతుందో— అలాటి తన్మయార్ద్రమైన ఒకానొక పరిస్థితి కలిగిందతని మన

స్నలో. ఆ అనంత ప్రశాంతమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆ వెన్నెలరాత్రిని కొనియాడకుండా ఉండబట్ట లేకపోయ్యాడు: పువ్వు కనబడకుండా వాసనలు విరజల్లే మొగలితో పులించి పోతున్నాడు. నీడ — వెన్నెల — నీడ వెన్నెల-వెన్నెల నీడల మీదుగా చల్లని గాలి సవారీలో తేలిపోతున్నాడు పూజారి నరసయ్య. సరస్వతి సంగతే మరచిపోయాడు నరసయ్యమావ. భరత పక్షులో ఏవో ఉండుండి కిలకిలమంటూ తుర్రుమంటున్నై. పక్కనే లాకు తెరిచిన పంట కాలవ క్రొత్తకోడలి మట్టెల చప్పుడులాగ చిన్ని చిన్ని కెరటాలతో అల్లరి చేసుకుంటూ చక్కా పోతోంది. పూజారి నరసయ్య లాకు గట్టుమీద చతికిలబడ్డాడు. ఇన్నాళ్లూ రాత్రిఅంటే నిద్రకోసం, మైమరచే విశ్రాంతికోసం, భగవంతుడు ఇచ్చాడని అనుకుంటూ వచ్చాడు. అయితే అటువంటి రాత్రిని పగటికంటే, మునిమాపు వేళకంటే, సంజకంటే కూడా అంత అందంగా, సమ్మోహనంగా ఎందుకు తయారుచేశాడో? భూదేవికి ఈ వెన్నెల రవసెల్లా ఈ రాత్రివేళ యెందుకు చుట్టబెట్టాడో.

ఈ సమస్యకి నరసయ్యకి జవాబు తోచలేదు. కాని కాలవ కావలివొడ్డున లాకు గట్టుమీద రెండు స్వరూపాలతని కంటబడ్డాయి. ఒక చిన్నవాడు, పడుచుపిల్ల. వెనక్కాల వెడల్పుగా పొలాల బయళ్లు — విశాలంగా వెన్నెల సముద్రం.—ఆ చిన్నవాడు చేతిలో ఆమె చెట్టాపట్టి వుంచాడు. వారి ముఖాలు దగ్గరవుతున్నాయి వుండుండి. ఆ వెలుతురు అద్దంలో వారిద్దరూ చిత్రించిన బొమ్మల్లా వున్నారు. ఇద్దరూ దగ్గిరగా కలిసి ఒకే వ్యక్తి ఐనట్టయి నుంచున్నారు. నరసయ్యమావకి తన సమస్యకి జవాబు ఈ చిత్రవేయేమో అని తోచింది. మానవుల ప్రణయాల పైని తనమాయని ప్రవర్తింప చెయ్యడానికి కల్పించాడు భగవంతుడీ వెన్నెల రాత్రులనీ, పడుచుపిల్లల్నీ అనుకున్నాడు, నరసయ్య. ఆ పడుచు సరస్వతి లాగే తోచిందతనికి. కాని అతను వెనుదిరిగి ఇంటికి వెళ్లిపోయాడు.

మహిళలు - సంగీతము

సంగీతం లలితకళలలో ప్రధానమైనది. ఆ లాలిత్యం వల్లనే అయివుంటుంది - మన పౌరాణిక విశ్వాసాలలో చదువులన్నీ బ్రహ్మముఖానపుట్టాయనీ, బ్రహ్మముఖాన్నే సరస్వతీదేవి వెలిసిందనీ, ఆవిడే సంగీత సాహిత్యాలు రెంటికీ అధిదేవత అనీ రూఢాభిప్రాయాలు ఏర్పడి పోయాయి. అందుకే సంగీత సాహిత్యాలలో నిధి అనిపించుకున్న పురుషుణ్ని కూడా - ఓహో ఆయన సరస్వతీదేవి అపరావతారం అండీ-అంటూంటారు. బ్రహ్మగారి కుటుంబం మొత్తంమీద పూర్తిగా చదువుల కుటుంబం. కైలాసంలో మహేశ్వరుడుగారి కుటుంబంలో పూర్తిగా అందరూ సంగీత ప్రియులే అనడానికి ఒక ప్రాచీన శ్లోకం ఆధారం :

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః

శిశువంటే కుమారస్వామి, పశువంటే నందికేశ్వరుడు, ఫణి అంటే ఆ భుజగభూషణుడి కంఠాభరణం. ఉమ లాస్యంలోను, మహేశ్వరుడు తాండవంలోను, మగ్నులై ఉన్నప్పుడు పరివారం అంతా సంగీతనేపథ్యం సమర్పిస్తారు. వైకుంఠంలో అయ్యవారికీ అమ్మవారికీ సంకీర్తన కాలక్షేపం చేసేవారు తుంబుర నారదులు. ఈ నారదుడు సరస్వతీదేవి కుమారుడే.

ఇక ఇంద్రలోకంలో అప్సరసలందరూ సౌందర్యవతులూ, నర్తకులు, అపూర్వ గాయికలేమోకూడ. అయితే, మనకు వినవచ్చే పౌరాణిక కథల్లో అప్సరసల సుందర నాట్యవిలాసాలకేగాని, వారి సంగీతానికి అంత ప్రాముఖ్యం కనబడదు. అయితే, "విమల గాంధర్వంబు విద్యమాకు" అనిచెప్పి పెద్దనగారి వరూధిని ఈ సందేహాన్ని తీసిపారేసింది. కోకిల కాకలీస్వనంతో శృంగారంలో కరుణరసం చిప్పిల్ల జేసింది కూడా. ఈ బాపతు గాథల్లో సంగీతానికి యక్ష, కిన్నర గంధర్వ, సిద్ధులనబడే జాతులవారు ప్రత్యేక ప్రసిద్ధి పొందారు. కిన్నరాంగనలు, గంధర్వ కన్యలు, యక్షిణులు, సిద్ధ పురుషులు ఆయా ప్రాచీన గాథల్లో సంగీతంపాడి మైమరపించడానికి పేరు పడ్డారు.

ప్రబంధకాలపు పౌరాణిక స్త్రీమూర్తులలో కలభాషిణి - సంగీతంలో నారదమానికి శిష్యురాలు. ఆమె పింగళసూరన్నగారి అపూర్వసృష్టి. ఇలా సాహిత్యంలో పాత్రలైన కళామూర్తులైన మహిళలు చారిత్రక వ్యక్తులా అనే విషయం నొక్కి చెప్పడానికి వీలులేదుగాని, వాళ్ళు కవిభావనలో పాఠకుల హృదయాలలో అజరామరులై స్థిరనివాసం సంపాదించుకొన్న చిరంజీవులు.

భారత దేశానికంతకూ ఆరాధ్యమైన తొలి గేయ ప్రబంధం గీతగోవిందం. దీని రచనకు భక్త శిఖామణీ, కవిగాయకవతంసుడూ అయిన జయదేవుని ప్రోత్సహించి, తన పేరుతో కలిపి భర్తకు "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి" అనే బిరుదాన్ని ప్రసాదించిన పద్మావతి సంగీత నృత్యాలలో విదుషీమణియైన తొలి చారిత్రిక మహిళ. జయదేవుని అష్టపదులను, పూరీ జగన్నాథ దేవుని సమక్షంలో, నృత్యాభినయ

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

పూర్వకంగా గానంచేసిందని, లక్ష్మణ్ణనేన మహా రాజు దర్బారులోకూడా నృత్యం చేసిందనీ ఐతిహ్యాలున్నాయి.

అటుతర్వాత అన్నివేల సంకీర్తనలు అహోరాత్రాలు రచిస్తూ గానం చేస్తూ వచ్చిన అన్నమాచార్యుల వారి భార్య తిమ్మక్క సుభద్రా పరిణయం అనే ద్విపద కావ్యం వ్రాసినట్లు తెలుస్తోంది. కాని, దాన్ని చదివితే, అంత మంచి కవిత్వం వ్రాయగల ఆమె తప్పకుండా కీర్తనలు కూడా వ్రాయగలిగిన గాయకురాలు అయి ఉండాలని పిస్తుంది.

తమిళ దేశంలో ఆండాల్, అవ్వై, మొదలైన భక్తగాయనులు ఉండేవారు. గాని, ఆంధ్ర దేశంలో అటువంటి వారి పేరులు వినపడవు.

అటుతర్వాత తంజావూరు వెళ్ళే వరకూ అంటే 17 వ శతాబ్దం వరకూ సంగీతజ్ఞులమాట టుంచి, కవయిత్రుల పేరే వినబడదు. రఘునాథ నాయకుని దర్బారులో రామభద్రాంబ, కృష్ణాజి మధురవాణి, మొదలైన సంస్కృతాంధ్ర కవయిత్రులుండేవారు. వీరి సాహిత్య విశేషాలేగాని సంగీత వైదుష్యం గురించి అంతగా తెలియదు. సంగీత సాహిత్య వైదుష్యాలు మూడూ ముప్పిరిగొన్న వాగ్గేయకారిణి పసుపులేటి రంగాజమ్మ; ఆతరువాత తరానికి చెందిన విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి. ఈమె మన్నారు దాస విలాస ప్రబంధము; ఉషాపరిణయ ప్రబంధము, మన్నారుదాసవిలాసనాటకము. రామాయణ, భాగవత సంగ్రహాలు, లలిత ఫణితిలో రసవంతమైన అనేక పదాలు రచించిన జాణ.

ఈమె మన్నారు దాస విలాసంలోని దరువులు చాలమట్టుకు క్షేత్రయ్య పదాలలోని నుడికారంతో అదే అను ప్రాసలతో, భావాలతో, ఇంచుమించు క్షేత్రయపదాలేనా అనిపించేటంత మధురంగా ఉంటాయి:

పదం 1. చెల్లబో యిందరు చెలులు గలిగిన ఫలము
ఉల్లసంబు లాడనేకాని ఒద్దిక సేయగలరా
కలలోన నేడునా చెలువుని రమ్మంటినా
నలినాక్షు లిందరు నన్ను దూరెదరు
వచ్చితినేమాయె వలపు పుట్టించవలె
మచ్చు గప్పేరుగా మగువలందరు గూడి ॥

పదం 2. ఏలరా, నేతాళజాలరా, చాలనీపై నేను
బాళితోనున్నాను.
బాల రమ్మని నన్ను లాలింప వేలరా ॥

ఈడరా నను దయజూడరా కోడెకాడా మరుండు
దాడి వచ్చినిపుడు, మోడిసేయక జోడు
కూడి చేకోరా ॥

పదం 3. పదరిదవేల వెన్నెలరాయ నీకునే పగదాన
నటరా ॥

రంగాజమ్మ పదాలలో క్షేత్రయ్య ప్రభావాన్ని బట్టి చూస్తే విజయరాఘవుని ఆస్థానానికి విచ్చేసిన క్షేత్రయ్య అక్కడకొన్నాళ్ళు మకాము వేసి, తన సంగీత సాహిత్యాలతో అక్కడివారి నందరినీ సమ్మోహితులను చేశాడని ఊహించవచ్చు. అతి సుకుమార శబ్దాలతో కూర్చిన క్షేత్రయశైలి రంగాజి వంటి మధుర హృదయియైన కవయిత్రికి అనుకరణ యోగ్యం కావడం సహజమే. క్షేత్రయ పదాలకు రంగాజమ్మపదాలలో కనబడే సామ్యం విజయరాఘవుని యక్షగాన దరువుల్లోకాని, ఆనాటి యే యితర రచయితల దరువుల్లోకాని కనపడదు. పసుపులేటి రంగాజమ్మ ఇంటిపేరు బట్టి యోచిస్తే, ఈమె కూడా క్షేత్రయ్యలాగే రాజపోషణకోసం మన ఏ కృష్ణాగోదావరుల నుంచో తంజావూరు వలస వెళ్ళి ఉంటుందని తోస్తుంది.

అటుతర్వాత తంజావూరునేలిన మహారాష్ట్ర రాజులలో ప్రతాపసింహుడు 'ముద్దుపళని' అనే నట్టువరాలైన కవయిత్రిని ఏలినవాడు. ఆమె రాధికాసాంత్వనము అనే ప్రబంధాన్ని మాత్రమే కాక, ఆండాళ్ తమిళంలో రచించిన సప్త

పదులనే భక్తి గేయాలను తెనుగులో కీర్తనలుగా రచించినదని చెపుతారు.

ఇంతకంటే సూక్ష్మ పరిశోధన చేసి పరిశీలించినా మొత్తంమీద తేలేదేమిటంటే, సంగీతం స్త్రీలకు అనువైన కోమల కళ అనే అభిప్రాయం సృష్ట్యాదినుంచీ మానవ జాతులలో వ్యాపించి వున్నా, మన దేశ చరిత్రలోమాత్రం, స్త్రీజాతి ద్వారా సంగీతంలో తగినంత కృషి జరుగలేదని కాని, ఒకవేళ జరిగినా, తగిన ప్రచార శక్తులు లేక అదంతా కాలగర్భంలో కలిసిపోయిందని అనుకోవలసి వస్తుంది. ఈ వ్యాసం స్థాలీపులాకంగా ఆ చరిత్రను చర్వణం చేయడానికి చేసిన ప్రయత్నం మాత్రమే కాదు; ఆ విషయమై తగిన పరిశోధనలు చేయగల జిజ్ఞాసువులకు కార్య తత్పరత కలిగించే ఉద్దేశంతో చేసిన సవాలు.

★

The K. C. P. Limited,

38, MOUNT ROAD, MADRAS-6.

Krishna SWEETS

Manufactured under expert supervision
from pure cane sugar.
Untouched by hand.

Factory :

THE K. C. P. LTD.,

VUYYURU, KRISHNA DT.

క్రొత్తపాట

'వాథూల్'

మొయిలునడకలఁ గ్రొత్తహొయలుతోఁచినది!
మెఱుపుచిందులఁ గ్రొత్తమిసిమి మించినది!
నా కలమ్మును గ్రొత్తనడక నేర్చినది!
హృదయమ్ము క్రొంగ్రొత్త పదము పాడినది!

సీతమ్మశోకమ్ము, శ్రీకృష్ణలీల,
శ్రీరాము సత్యవాక్పారీణతయును
గానమ్ముచేసిన కవిలోకమునకు
మునలిసీతులవలని మోసమ్ము చాలు,
మతము పేరిటి ప్రాఁతకతలు చాల్చాలు,
అని చాటు మాట, యీ నా క్రొత్తపాట!

కవిసమయాల శృంఖలములఁ దవిలి,
ఉత్ప్రేక్ష, లుపమలు, నూరకే చొనిపి,
రంభోరువులు, హేమకుంభస్తను లని,
అవయవమ్ముల నసభ్యముగ వర్ణించు
విరసప్రబంధాలవృత్తమ్ము లింక
కాలగర్భమ్మునఁ గడ తేర్పవలయు,
అను తేటమాట, యీ నా క్రొత్తపాట!
అశరీరయా సఖయాశ్లేషమునకు
పవలు రేలను దీయబాధలఁ బొగిలి,
విరహాగ్నికీలల వేఁగి, తపించి,
తనియక,— భావగీతములను వ్రాసి,
తమ పూతనలయందుఁ గుములులోకమ్ము
వారిపై విరఁజిమ్మువలనుగాదింక
అను క్రొత్తమాట, యీనా క్రొత్తపాట!

దారిద్ర్యమందు,— స్వాతంత్ర్యమ్ము లేక
కష్టజీవిక ననుక్షణము భారముగ
గడపుచు— ముక్తికై యడలెడు మనక —
జ్ఞానమ్మునకుఁ గానరాని యమూర్త
భావాలు వృత్తమా— పద్యాలవేల
అను తెల్విమాట, యీనా క్రొత్తపాట!

కనకసౌధాల సుఖాపేక్షఁ గులుకు
స్వార్థపరులును సౌహార్దహీనులును
ఊడిగము చేయింప, వాడు మొగాన
కాయకష్టమున రక్తము చెమటోడ్చి,
నవయు కార్మికుమాట, నా క్రొత్తపాట!

దారిద్ర్యతమసాన జలధిప్రళయము
తలపించు కార్మికుతన్వి కన్నీటి తేటఁ
గూర్చినమాట, నా క్రొత్తపాట!
జలధిప్రళయములోపలఁ జిన్నినావ
అనిపించు కార్మికుచినిపాప నవ్వు రేకఁ
గూర్చినమాట నా క్రొత్తపాట!

—

మాధురులు

'వాధూల్'

ఊరకే మాధురులు
ఊరిపోతున్నాయి !
ఆవైపు, ఈవైపు
అని కాదు; అందమే
అలముకొని వెలిగేటి
అన్నివైపులకూడ
అంధకారప్రభలు
ముందువైపులకూడ
ఏవైపు చూసినా,
ఎందు కీమాధురులు!

వలపుటామనిలోన
తల లెత్తు పూలతే
నెల క్రోలి సోలు ఆ
మెలజేటిపాటలో,
అల వల్లకాట, ద
య్యాలచెరలాటలో
ఊరిపోతున్నాయి !
ఊరకే, మాధురులు !

ఒక్కసారిగ నురగ
కక్కుతూ - పొంగేసి -
ఉరుముతూ విరిగేటి
కెరటమ్ము కేకలో
ఆవెన్కనే మరో
అలరాక తెలుపుతూ
ఏవైపు చూసినా
ఎందుకో, మాధురులు !

వాడిపోయినపూల
వాసనలు కాబోవు !
క్రొత్తవాసంతికల
కొమరు లనలే కావు !
మనమనస్సులె కాల
ముందు కల్పించితే
ఊరకే, మాధురులు
ఊరిపడుతున్నాయి ?

హాయి, భోగం, మనకె
ఏవైపొ దాగికొని,
'తీయరోజులె కలుగు
తాయి ముం దెప్పుడూ'
అని, కమ్మవాసనల
విరజిమ్ముతున్నాయి ?

ఏవైపు చూసినా,
ఏమి టీ మాధురులు !

ఆశలై, అందాల
రాశులై, కలిగేటి
సౌఖ్యాల ఊసులై
చిరునవ్వు మోసులై
పెరుగులో, విరుగులో,
తరుగులో, పరుగులో,
ఊరకే, మాధురులు
ఊరిపోతున్నాయి !!

జాతీయ గీతం

శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావు గారు

(కీరవాణి రాగం - రూపక తాళం)

మేలుకొనవో! నాదు జన్మభూమి!
నిద్రా జడత విడవో!
    దారిద్ర్య తమస్సు లడగెలే!
ఆర్ద్ర మనస్విని!
    ఆనందారుణ భవ్యోదయమాన! మేలుకొనవో! ॥

*   *   *

సస్యామల సుశ్యామల
    స్వర్ణ పతాకాంచలాలు
ఇంద్రకీల సింహా శైల
    చందనానిలాల తేల! మేలుకొనవో! ॥

*   *   *

గౌతమి కృష్ణా పంపా
    ఘన తరంగ గానములో
కల విహంగ వైతాళిక
    గళ శంఖారవము వినవో! మేలుకొనవో! ॥

*   *   *

చైత్ర కిసాలయ తోరణ కోమల లసనములో
యాత్రలు ముగిసిన యోధుల విజయ విహాసనములో
    ఆశల వెలుగులలో,
    నిరాశల పరుగులలో!
మేలుకొనవో! నాదు జన్మభూమి! ॥

అమరగాయకా! సైగల్!

'రజని'

వృథావ్యథిత చరితోద్గాతా!
సుధామధుర గీతోద్గాతా!

●

యుగయుగాలు జీవితపథాన
దగాపడి జీవుల హృదార్తి
ద్రవమై నీగళమున స్రవించె!
హృదయమ్మో నీకు గళమ్మో!
వ్యసనమ్మో నీకు వరమ్మో!

●

చేతలలో తలపోతలలో
గీతులలో కనుమూతలలో
ఆశలలో ఉడురాశులలో
జ్యోతులకై యెగురుతు పోతా!

●

మంగటి తెలుపే సంగీతమయి
యెగురకయే శలభై తగుల!
దిగుతూంటే జ్యోతులు రగుల!
మిగిలేదే యెదదకు దిగులు!
సగపు జీవికల పెనువోగులు!

●

"ఎగయు నీ యింటి దీపపు కోసలె
రగిలి అంటెను నీదుగృహము!
రగిలి లోలో మండే గాయమై,
పగిలి కొస్వెను నీహృదయము"

మృతజీవి సైగల్

జహాంగీరు మామిడిపండు - పొందూరు ఖద్దరు - గుంటూరు గోంగూర - గోదావరి ఆవకాయ - కృష్ణశాస్త్రి కవిత్వం - భమిడిపాటి హాస్యం - ద్వారంవారి వాయులీనం - నాగయ్యగారి త్యాగయ్య - ఒక్కసారి చవిచూచిన వాడికి జీవితంలో మరచిపోలేని అమూల్య వస్తుసంపద లివి ఒక్కొక్కటీని

సైగాల్ పాటకూడా వీటలాగే సాటిలేదు 1935 నుంచి 45 వరకు పదిసంవత్సరాల కాలం భారతదేశపు వెండితెరమీద సైగాల్ రాజ్యమేలాడు

'సినిమాల్లో సంగీతమేమిటి ఛీ!' అనే బుద్ధిమంతులు సైతం సైగాల్ పాట వినేసరికి చెవులు రెండూ అప్పగించి వెయ్యడం, బుర్రకు బుద్ధి చెప్పుకోవడం పరిపాటి

పాడనే పనిలేదు సైగాల్ 'ఆ' అంటే సంగీతం 'ఊ' అంటే సంగీతం సంగీతమే సైగాల్ సైగాలే సంగీతం

భాషకూ భావానికీ అవినాభావసంబంధం అందరికీ తెలిసిందే. గానానికీ భావానికూడా అదేవిధమైన బాంధవ్యం వుంది సైగాల్ కంటె దాన్ని ప్రదర్శించిన గాయకుడు మరొకడు పుట్టలేదు.

అభినయంలో సైగాల్ని మించినవాళ్లు అనేకమందున్నారు సినిమాతారల్లో. అయినప్పటికీ సైగాల్ నటించిన 'దేవదాస్' భారతీయ వెండితెరకు శాశ్వతమైన అలంకరణం శరత్చంద్రుడు ఆపాత్రను సైగాల్ కోసమే సృష్టించాడేమో! సైగాల్ ఆపాత్రకోసరమే పుట్టాడేమో!

సైగాల్ పాట శాస్త్రీయసంగీతమా, భావసంగీతమా అన్న చర్చకు తావేలేదు సంగీతం యొక్క పరాకాష్ఠ అతని పాటలో పండు పండింది.

నిండు చీకటిలో పండు వెన్నెల కాయించె ప్రభావం, యావజ్జీవరాశినీ ఏడిపించగల శక్తీ, అతని పాటకున్న సొత్తు.

సైగాల్కున్న గాత్రం లాంటి గాత్రం కలవాళ్లెందరు లేరు? కాని, దానిని ఉపయోగించుకోగలిన వాళ్లెందరున్నారు? భూమిలో రత్నాలెన్ని లేవు? సంద్రంలో ముత్యాలెన్ని లేవు?

చుక్కలెన్నివున్నా చంద్రుడొక్కడే పాటకులెందరున్నా సాటిలేనివాడు సైగాలొక్కడే. అమృతప్రాయమైన తన పాటలో సైగాల్ జీవించే వున్నాడు.

'రాజు'

ఒక్కడవే

'రజని'

ఒకరయినా, నీ కేకకు ఓయని రాకున్నా,
ఒక్కడవే బయలుదేరు,
ఒక్కడవే బయలుదేరు—
ఒక్కడవే, ఒక్కడవే, ఒక్కడవే॥
ఓరీ, ఓ అభాగ్యుడా,
ఊరంతా భయంచేత
గోడవైపు తిరిగిమాట
లాడకుండ నిలుచున్నా
మనసువిప్పి లోలోపలి
మర్మమేదో కంఠమెత్తి
నీకు నీవె చెప్పవోయి!
ఒక్కడవే ఒక్కడవే॥
ఓరీ, ఓ అభాగ్యుడా,
ఊరంతా నిన్నొంటిగ
కారడవిని వదలి, తోడు
గా యెవ్వరు రాకున్నా,
ముళ్ళదారి తొక్కుళ్ళకు
కాళ్లు నెత్తురే చిమ్మగ
నీ వొకడవె నడువవోయి!
ఒక్కడవే ఒక్కడవే॥
ఓరీ, ఓ అభాగ్యుడా,
ఒకరైనా నీ ముంగిట
కారుమబ్బు కాళరాత్రి
దీపమైన చూపకున్న
పిడుగుమంట కాల్పులోన
పడిమండే నీగుండెల
ఒంటిగానె వెలుగనీయి!
ఒక్కడవే, ఒక్కడవే, ఒక్కడవే॥
ఒక్కడవే బయలుదేరు,
ఒకరయినా, నీ కేకకు ఓయని రాకున్నా,
ఒక్కడవే బయలుదేరు, ఒక్కడవే
బయలుదేరు.

[రవీంద్రుని 'ఏక్లా చలో'కు అనువాదము]

నవతరింపఁజేయుచు శ్రవణద్వారమున సూటిగా సూక్ష్మముగా లోనికిఁ జొచ్చుకొని పోయి శ్రోతలకు నాద బ్రహ్మైక్యాను సంధానము గల్పించును.

ఈనాద బ్రహ్మర్షి చిరంజీవియగుఁగాక ! ఆజీవితము వీరివాద్య ప్రజ్ఞా వైభవము వన్నెలు దేరుచు వర్ధిల్లు చుండుఁగాక !

వే. ప్రభాకరశాస్త్రి.

*

ద్వారం వెంకటసామిగా ! నీ రమణీయంపుగాన - నిర్ఘరిమొాతు
ద్వారమునకు మార్గంబని 'ద్వారం' నీయింటిపేరు - దనరెనో ! సఖుడా ! 1.

ఏమి యదృష్టమో పెలువ - నేరికి సాధ్యము ! మిత్రు వెంకట
స్వామిది ! వాయులీనమున - ప్రస్తుతమున్నతమైన స్థానమా;
నా మహనీయు వాద్యము అహా! భళి!! బా!!! గని, శ్రోతలెల్లరున్
జామొక లిప్తపోలె మనసారగ విందురు తన్మయంబునన్. 2.

ఆంధ్ర, ఔత్తర, తమిళ - కర్నాటకాది
వివిధదేశంబులందు నీ - విమలగాన
సుధను ద్రావించి యెల్లర - స్తుతులనంది
భారతావని సత్కీర్తి - బడసినావు ! 3.

భవుడు, అజుడు, హరియు - వరుస పార్వతివాణి
లక్ష్మికూడి మిమ్ము - లక్షణముగ
బ్రోచుగాత సతము - భూరిసంపదలతో
నాయువొసగి నూరు - హాయనములు. 4.

భావపురి (బాపట్ల) 5-3-1949

మిత్రుడు, 'గానభూషణ' 'ఆంధ్ర, గాత్రగాన విశారద'
నోరి నాగభూషణము.

*

నీ యాశీః సుమరాశి చల్లుమా ! । ఓ సరస్వతీ కళాధిదేవతా !
ప్రతిభావంతుడు వినయ వినమితుడు, । నేతుశీతనగ విఖ్యాతుండు
శిల్పకల్పనా పారావారము, । మా అమూల్యవరమా "ద్వారము" పై
నీ యాశీః సుమరాశి చల్లుమా ! । ఓ సరస్వతీ ! కళాధిదేవతా !
తన సాధనచే తన తపస్సుచే, । తన గానకళా వైదుష్యముచే
తన రాష్ట్రమునకు తన దేశమునకు, । ఘనతనుగూర్చిన మా "ద్వారము" పై

నీ యాశీః సుమరాశి చల్లుమా! । ఓ సరస్వతీ! కళాధిదేవతా!
తానాలాపములందు స్వరములకు, । ప్రాణముపోసెడు ఘననయ ఫణితుల
మానవహృదయపు తంత్రుల తాకే, । మధురగాయకుడు మా "ద్వారము" పై
నీ యాశీః సుమరాశి చల్లుమా! । ఓ సరస్వతీ! కళాధిదేవతా!
హృదిపులకించు ధనుష్టంకారము । బ్రదుకుల చివురించే యోంకారము
రాగరసానంద పదద్వారము, । తనకు వరములో మా "ద్వారము" పై
నీ యాశీః సుమరాశి చల్లుమా! । ఓ సరస్వతీ! కళాధిదేవతా!

—రజని
7-3-49

❋

మెచ్చుపల్కు

చిన్నారి తెలుఁగింటి కన్నెబంగరుటందె, వలకారిజిలుఁగునవ్వడులు దిద్ది
గౌతమీ కృష్ణవేణీ తరంగచ్ఛటా, పటుతరార్భటి హారిత్తిటుల నింపి
తెలుఁగుభక్తులగుండియల నూరి జాల్వాఱు, తేటపాటల తీరు తీయ మరసి
ఆంధ్రగీతిప్రవం చాశేషమృదురవ, స్ఫురణ కాచార్యకంబును వహించి
లలిత కర్ణాటగానకళా సరస్వతీ సవిత్రీ సమర్చనాధీనవృత్తి
నలసిపోయిన గీతరత్నాకరునకు నేఁటి సమ్మాన మొక్క పన్నీటిజల్లు.

పోయినచూపు లోపలికిఁబోయి హృదంతర దివ్యలోక బృం
దా యమునాతటీ విహారణప్రవణప్రభు వేణునిస్వన
చ్ఛాయలఁ దెచ్చుకొన్న యొక చక్కనినాదము సొమ్ము నీ దహో!
నాయుఁడ! ముగ్ధులై మురిసినారు రసజ్ఞులు నీదుపాటకున్.

జాతిని దిద్ది తీర్పఁగల జాణలు గాయకులుం గవీంద్రు లీ
నీతి నెఱింగి ప్రాక్తనులు నేర్చిరి వీరి సమాదరింప; నా
తాతలనాఁటి ధర్మము నుదారతయుం దలయెత్తె నేఁటి కీ
రీతులు సాగి సాగి చివురించుతఁ జిక్కళలైన సత్కళల్.

—తుమ్మల సీతారామమూర్తి చౌదరి.

ముక్కోటి కంఠాలు

రజనీ కాంతారావు

ముక్కోటీ కంఠాలూ,
ఒక్క పాంగున ఊగేయీ,
ఒక్కటే జయనాదంతో,
దిక్కులూ మార్మోగేయీ //ముక్కోటీ//
ఎక్కడెక్కడి తెలుంగులూ
ఒక్కటే మేమన్నారూ,
ఎక్కడున్నా ఆంధ్ర సరస్వతి
ఒక్కటే తెలుగన్నారూ //ముక్కోటీ//
ఒక్కటే మన సాహిత్యం,
ఒక్కటే మన శిల్పకళ,
ఒక్కటే మన సంగీతం,
ఒక్కటే మన వేదాంతం //ముక్కోటీ//
భారత జననీ ప్రియపుత్రీ
ఆంధ్ర ప్రదేశ జనయిత్రీ
కొలువునకూ రారండోయ్
తలపూవులతో మ్రొక్కండోయ్ //ముక్కోటీ//

పిలుపు

(For whom the bell tolls అనే John Donne రచించిన ఆంగ్ల గేయానికి స్వేచ్ఛానువాదం)

గణ గణ ఘంటా మ్రోగిందంటే
పిలుపొక పూజారికె కాదంటూ!!
గురుసందేశము విన జనమంతా
చెర చెర వత్తురు తెరువుల వెంటా!!—గణ గణ!!

ఎన్నడు మ్రోగునొ ఏమోగానీ
ఎవరిని పిలుచునొ ఎరుగముగానీ
గణ గణ మ్రోగే ఘంటారావము
విని సాగని మనుజుని కనబోవము!!—గణ గణ!!

జగతి వీడు మానవతాలేశం
నిలుప నెవ్వరికి లేదవకాశం
సమష్టి మానవ సాగరమందు
వ్యష్టిలంక యెవ్వడు కాడెందు!!—గణ గణ!!

ఏ మనుజుడు చనినా నానాశం
ఏను మానవతలో ఒక లేశం
గణ గణ ఘంటా మ్రోగిందంటే
మానవతకె రమ్మని పిలుపంటూ!!—గణ గణ!!

—రజని

చరమగీతము
(మాతృక : రవీంద్ర)

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

అదిగో వినబడు నెవ్వారి
పదముల సవ్వడి ?
మృదుల ధ్వని విభుని దనుచు
మదిలో తోచెడి !
అదిగో వినబడు నెవ్వారి
పదముల సవ్వడి ?

తుది యాత్రకు నా మనస్సు
తొందరపడునపుడా ?
గుదులు గుదులుగా అశ్రులు
చెదరి రాలునపుడా ?
అదిగో వినబడు నెవ్వారి
పదముల సవ్వడి ?

చల్లగాలి యలల నూల
అల్లు పూలతావి తెరల !
రాగమాల చూచుక, ఎదు
రేగు వసంతరమ మరల !
అదిగో వినబడు నెవ్వారి
పదముల సవ్వడి ?

దిగంగనా ప్రాంగణమున
ఎగయు శంఖరవములో
గగనచారి విశ్వహారి
యగు నాశా పవనము !
అదిగో వినబడు నెవ్వారి
పదముల సవ్వడి ?

★

శాంతిగీతి

శ్రీ రజనీకాంతరావు

ఆది మధ్యాంత రహిత ! ఓ అక్షరాత్మ!
విశ్వసృష్టి సంరక్షణ విలయకర్త !
సగుణ నిర్గుణాతీత ! త్రిజగదధీశ !
సచ్చిదానంద లీలాప్రసన్నమూర్తి !

అతని గనియుందు వీవు, త్వదంతికమున
కొత్తగా వలసదిగె, లోకోత్తర మగు
నిత్య సారస్వతోద్యోగ నిరతి నీదు
కొలువు శిల్పుల యశమును కొల్లగొనగ !

ఆతని కటాక్ష వీక్షాచమద్దరహాస
సరసోక్తులను ద్వ్యర్థ లరయబోకు,
నినుగూర్చి తనలోనా, తనుగూర్చి నీలోనా
ఉన్నదున్నట్లన్న నులికి పడకు,
ఇహ పరమ్ములు రెంట నీ సృష్టి లోగుట్టు
పరికించి, ప్రకటింప వెరగుపడకు,
నిమ్నమించిన దీక్ష నిర్విరామ కథా వి
ధాతృత్వ మారసి తత్తరిలకు,

ఇహజగతి పాఠకుల మోద మొదరువడగ,
పరమున కకాలమున వచ్చిపడిన మేటి,
వివిధ పాత్ర మనోరంగ విపులద్రష్ట,
త్రిపురనేని గోపీచందు, అపరస్రష్ట!

ఈర్ష్యపడకో విధాత! నీ వింతదనుక
ఎదురుకొనబోని కధక విరించి అమర
ధామమున భౌతికమ్ము నాధ్యాత్మికమ్ము
కలిపి వడబోసి జీవితగాధ లల్లు!

నీ కొలువుచేరి యేడాది నిండె నేటి
కెన్ని గాధల నల్లునో, ఎన్నిలోక
చిత్తవృత్తుల తీర్చునో, చిత్ర, మతని
ఆత్మ కీయవో నిస్తులానంద శాంతి!

జోహారులు

బాలాంత్రపు రజనీ కాంతరావు

ఎంత ధన్యమయ్యావొగదయ్యా క్షేత్రయ్యా!
అంతటి మువ్వగోపాలుడాత్మేశ్వరుడై నజన్మ ॥ఎంత॥

చెంతచేరి నీతంబుర చేతమోపి నీపాటకు
వంతపాడుచుండగానె అంతలోనే తీరుజన్మ ॥ఎంత॥

బ్రదుకులోన పాటలోన కొదలులేని యనుభవమ్ము
కదిసిపొదు నీపదాల నెదుట నాలకించు జన్మ ॥ఎంత॥

ఆగరాని యమృతధార నీగళగంగోత్రిజార
రాగ భావలయలకు సరితూగ నభినయించు జన్మ ॥ఎంత॥

వలచి నిన్ను వలగొనంగ గలుగు భాగ్యరాశినొచు
పొలయల్కల కలిగియు వెన్నలలో నిన్ను కలియు జన్మ ॥ఎంత॥

లోకప్రియుడు

మనకేనా యీకనుగంతా
ఎరుగమటే యీవలవంతా

కనుమసకా చీకటిలో
తనమగనీ కనుమలపీ
పరపురుషుడు పరాత్పరుడంటూ
తరలిపోవు యీజగజంతా
తానేమో జీవాత్మయట
తనమగడు నిత్యదేహమట
తనప్రియుడు లోకప్రియుండట
తన అభిసరణ పురాణమట!

[మొవ్వలో జరిగిన క్షేత్రయ్య జయంతి సందర్భంలో చదివిన గేయాలు]

ఆంధ్రకేసరికి నా భక్త్యంజలి

శ్రీ సి. హెచ్. వి. పి. మూర్తిరాజు

"పిడికెట్టిముద్దలనుండి వీరాగ్రేసరుల నుద్భవింప జేయగల శక్తిగలవారు గాంధీజీ" అని ఒకసారి విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూరు మహాత్ముని అభినందించారు. అలాగే ఆంధ్రుల ఏకైక నాయకుడుగా అలరారిన ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు తన సింహగర్జనతో అనేకమంది నిర్వీర్యమైన యువకులను నవచైతన్యం కలిగిన వీరాధివీరులుగా తయారుచేశారు.

మాతృదేశభక్తిని ప్రబోధించి ముక్కోటి ఆంధ్రులనుఉత్తేజ మొనర్చి, ప్రత్యేకరాష్ట్ర సాధనకు సారథ్యం వహించిన మేటినాయకుడు ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశం.

ఆయన పట్టుదల, దేశభక్తి, త్యాగనిరతి, ధైర్యసాహసాలు యువతరం వారికి ఒరవడిగా రూపొందాయి. ఆయన జీవితంలోని అనేక అత్యద్భుత ఘట్టాలు జనసామాన్యానికి గాధలుగాను, కథలుగాను విలసిల్లాయి.

భారతదేశం బ్రిటిషు పరిపాలనలోనున్న రోజులలో దేశభక్తిని కలిగి యుండడం ఒక మహా నేరంగా ఉండేది. అయినా గాంధీజీ ప్రభావం వల్ల వేలాది భారతీయులు ఎన్నో త్యాగాలు చేసి దేశ స్వాతంత్ర్యోద్యమానికి కృషి చేశారు. అయితే, ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశంగారు దేశస్వాతంత్ర్య సాధనకొరకు చేసినత్యాగం అత్యున్నతస్థాయి నందుకొన్నది. అందుకే ఆయన ఆంధ్రకేసరి కాగలిగినారు. ఆ కారణం వల్లనే ఆంధ్రులకు ఏకైక నాయకుడు కాగలిగి, ఆంధ్ర దేశ చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపదగినట్టి శాశ్వత స్థానాన్ని సంపాదించు కొన్నారు. అంతేగాదు; ఆంధ్ర ప్రజల హృదయాలనే గాకుండా యావద్భారత ప్రజల హృదయాలనే తన ధీరోదాత్తత శక్తివల్ల, అనుపమ త్యాగం వల్ల ఆకర్షించుకొన్న శ్రీ ప్రకాశంగారు భావితరాలవారికి ఒక ఆదర్శమూర్తిగా వెలుగొందగల రనడంలో సందేహం లేదు.

ఎవ రేమనుకొన్నా, ఎవరు ఏ మతాతత్వం ఆయనకు ఆపాదించినా, స్వార్థప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆయనను వెనుపోటు పొడవడానికి ఎవరు ప్రయత్నించినా, అవన్నీ ఆయా వ్యక్తుల సంకుచిత దృష్టిని, స్వార్థపరత్వాన్ని వెల్లడించాయేకాని, శ్రీప్రకాశం గారి నిష్కల్మష దేశభక్తిని శంకించడానికి మాత్రం ఎట్టి అవకాశం లేకపోయింది.

ఆంధ్రకేసరి శత్రుభయంకరుడే కావచ్చు. కాని ఆయన హృదయం నవనీతం. నిండు ప్రేమతో తొణికిసలాడేది. ఆర్తులపట్ల వారు వెలిబుచ్చేవి వట్టిమాటలు కావు. కన్నీటిబొట్లు కురిపించారు. హృదయాన్ని విప్పి అర్పించారు అంతకన్నా కష్టదశలోనున్న వారికి కావలసిందేముంది. అదే ప్రకాశంగారిలోని విశిష్టత. ఆయన నోరువిప్పి మాట్లాడక పోవచ్చు, కాని ఆయనహృదయం మాట్లాడుతుంది. అవసరమైతే శత్రువులను కూడా క్షమించగల విశాల హృదయం ఆయనది

దేశ ప్రజలను "నా ప్రజలు" అని సంబోధించగల శక్తి అర్వాచీన భారతదేశంలో ఇద్దరికి మాత్రమే యుండెను. వారిలో మొదటివారు మహాత్మాగాంధీ అయితే రెండవవారు ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశం గారు. "ప్రజలే తాను, తానే ప్రజలు" అని పలవరిస్తూ, ప్రజలలో ఆయన తాదాత్మ్యం చెందిపోయారు. అందుకే ఆయన ప్రజానాయకుడు కాగలిగారు. ఆంధ్రప్రజలు కూడా ఆయన మూర్తిని అలాగే ఆరాధించారు. "ప్రజలే ప్రకాశం – ప్రకాశమే ప్రజలు" అని వారు కూడా భావించారు. ప్రకాశం మాట్లాడితే ముక్కోటి ఆంధ్రప్రజలు మాట్లాడినట్లుగానే పరప్రభుత్వమే గాకుండా, దేశంకూడా భావించింది. అందుకే ఆయన ఆంధ్రుల హృదయ పీఠాలను అలంకరించ గలిగారు.

ప్రకాశంగారు ఇంతటి మహోన్నతవ్యక్తి కావుననే, ఆయనను మరువలేని ఆంధ్రప్రజ ఈనాడు అత్యంతోత్సాహంతో ఆయన శత జయంత్యుత్సవాన్ని జరుపుకుంటున్నది. తమలో దాగియున్న దేశభక్తికి చిహ్నంగా, ఆంధ్రుడైన ప్రతివ్యక్తి ఈ శత జయంత్యుత్సవాలలో పాల్గొని, ఆంధ్రకేసరి జీవితాశయాలలో కనీసం కొన్నింటినైనా ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. ఆనాడే మనం ఈ ఆంధ్ర మహాపురుషుని పట్ల మన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించిన వారము కాగలము.

ఆంధ్రుల నుత్తేజపర్చి, ఈనాటి మన ఉన్నతికి కారకులైన ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశంగారికి ఈ సందర్భంలో నా భక్త్యంజలి సర్పిస్తున్నాను.

'ఆంధ్ర కేసరీ' ఏరీ నీ సరి?

శ్రీ ర జ ని

(రంజనిరాగం - ఆదితాళం)

ఏరీ నీ సరీ – వేరేరీ నీసరి
మాతృదేశ స్వాతంత్ర్య యోధవర
మాన్య మేరుగిరి ఆంధ్ర కేసరీ ॥ ఏరీ ॥
భారత జననీ ప్రియకుమార ఘన
వీర దేశ భక్తాగ్రగణ్య ॥ వేరేరీ ॥
స్వరాజ్య సూత్ర యజ్ఞ నాయకమణి
విరాటాంధ్ర ధరా సాధకాగ్రణి
త్యాగధనుల మానధనుల సంతత
జనహితైక రంజనీ సుకృతులం ॥ వేరే ॥
ఏరీ నీసరీ – వేరేరీ నీసరి
మాతృదేశ స్వాతంత్ర్య యోధవర
మాన్య మేరుగిరి – ఆంధ్ర కేసరీ ॥ ఏరీ ॥

లుగా దేశాన్ని విభజించి వప్పజెప్పి వెళ్లాడు. కాంగ్రెసు అదృష్టంగా భారత భూభాగంలో ప్రభుత్వాన్ని యేర్పాటుచేసి పరిపాలిస్తుంది.

24 సంవత్సరముల తదనంతరం మతైక రాజ్యంగా వున్న తూర్పు పాకిస్థాన్‌లో వివేకమైన నాయకత్వం కలిగి ప్రజా స్వామ్య, మౌలిక సిద్ధాంతాలపై బంగ్లాదేశ్‌ను, సర్వస్వతంత్ర ప్రతిపత్తిగల దేశంగా రూపొందించింది. ఆనాడుచేసిన తప్పు యీనాడు రహితమైంది.

కనుక నేడు జరుగనున్న భారత స్వాతంత్ర్య రజితోత్సవాల సందర్భమున-ఆ నాడు స్వాతంత్ర్య సాధనకు సమిధలుగా ఆహుతులైన మహావీరుల సంస్మరణ చేసుకొనుట మన విధి. యింతటి చరిత్రను సృష్టించి, అనన్యత్యాగ నిరతిని, దేశభక్తిని, సాహసాన్ని ప్రదర్శించి, స్వాతంత్ర్య సాధనకు మూలస్తంభాలుగా ఉన్న ఆంధ్రకేసరి ప్రకాశంపంతులుగారి మహిమాన్విత జీవితగాథలు జ్ఞప్తి చేసుకొనుటద్వారా నూతన ఉత్సాహాన్ని తెచ్చుకోవచ్చును.

అంతిమ స్వాతంత్ర్య సమరంలో కృషి చేసిన అమరవీరులందరికి అంజలులు ఘటించుదాం.

మాదీ స్వతంత్రదేశం

రజని

మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి
భారతదేశమే మా దేశం
భారతీయులు మా ప్రజలు

వింధ్య హిమవత్ శ్రీ నీలాద్రులు
సంధ్యా రుణిత సదాశలుచూచి
గంగా గోదావరీ సహ్యజా
తుంగ తరంగిత హృదయల్‌మావి
ఆలయమ్ముల శిల్పవికాసం
ఆరామమ్ముల కళా ప్రకాశం
మొగలు సమాధుల రసదర హాసం
మాకు నిత్య నూతనేతి హాసం

ప్రారంభించాను, కాని నా తొమ్మిదవ ఏట మా తండ్రిగారు నాకు ఇంగ్లీషు చదువు చెప్పించవలెననే నిర్ణయానికి వచ్చారు. అప్పట్లో మా గ్రామంలో మా అయ్యవారి కుమారుడు మాత్రమే ఇంగ్లీషు చదువుకొంటూ ఉండేవాడు. చుట్టుపట్ల గ్రామాలలోకూడా ఇద్దరుముగ్గురు మాత్రమే ఇంగ్లీషు నేర్చుకొంటూ ఉండేవారు. మా తండ్రిగారు నన్ను 1897 లో మద్రాసుకు తీసుకొనివెళ్లారు. నేను మా బంధువుల ఇళ్ళలో ఉండి నా చదువును సాగించాను.

మొదటి సంవత్సరం మద్రాసు గోవిందప్పనాయకర్ వీధిలో వుళ్ళుకుట్టి నారాయణయ్య అనే వారు నడుపుతున్న స్కూలులో చదివాను. ఆ వీధి ధనికులైన కోమట్లకు ప్రసిద్ధి. వారి పిల్లలుకూడా నాసహాధ్యాయులుగా అక్కడ చదివేవారు. ఆ సంవత్సరం అనేక ఇంగ్లీషు పుస్తకాలను కంఠస్థం చేశాను. మరుసటి సంవత్సరం పచ్చయప్పా కళాశాలకు అనుబంధంగా ఉండిన గోవిందప్ప నాయకర్ మిడిల్ స్కూలులో మొదటి ఫారంలో ప్రవేశించాను. అది మొదలు 1910 జనవరిలో ఎం. ఏ పరీక్షతో నా చదువు పూర్తి అయ్యేవరకు ఆ కళాశాలలోనే చదివాను.

ఆ రోజులలో చిన్నక్లాసునుండి ఇంగ్లీషు బోధనాభాషగా ఉండేది. చరిత్ర, భూగోళము, సైన్సు, లెక్కలు — అన్నీ ఇంగ్లీషుద్వారా నేర్చుకొనవలసి ఉండేది. వారానికి నాలుగైదు గంటలు మాత్రం రెండవ భాషగా తెలుగో,

తాయిలం

"రజని"

ఆటలు ఆడీ - పాటలు పాడీ
అలసీ వచ్చానే —
తియ్యాతియ్యని - తాయిల మేదో
తెచ్చీ పెట్టమ్మా॥
కుక్క పిల్లా - తోకాడిస్తూ
గుమ్మా మెక్కిందీ...
పిల్లీ పిల్లా కళ్లూ మూసీ
పీటా ఎక్కిందీ...
కడుపూలోనీ కాకి పిల్లా
గంతూలేస్తోందీ
తియ్యాతియ్యని తాయిల మేదో
తెచ్చీ పెట్టమ్మా!

* * *

గూటీలోనీ బెల్లం ముక్కా
కొంచెం తియ్యమ్మా
చేటాలోనీ కొబ్బరి కోరూ
చేరెడు తియ్యమ్మా
అటకా మీది అటుకుల కుండా
అమ్మా దింపమ్మా
తియ్యా తియ్యని తాయిలం మేదో
తెచ్చీ పెట్టమ్మా

("జేజీ మామయ్య పాటలు" నుంచి)

దివిసీమ

బి. రజనీకాంతారావు

కన్నడ రాయల కలలో
ఆవెన్నెలవున విష్ణుదేవుడే కనిపించెన్
మిన్నయగు బాస తెలుగున
నెన్నందగు కృతిని కావ్యముయిమ్మని యడిగెన్ !

అత్తింటి కరిగెడు నల్లుండు కృష్ణలో
ఆతురసన్యాస మందెనిచట !
కృష్ణుడాంధ్రులనేల విష్ణుడె పాలించె
కదలిగట్టుపయి శ్రీకాకుళమున!
గంగాధరుడు నట్టువాంగమ్మొసంగెను
పొరుగుననే కూచిపూడినిచట !
మువ్వల్ల మ్రోతల మురిపించు గోపాలు
డప్సరోభినయాల కలరె నిచట !

మునులు, దేవత, లప్సరలనవరతము
శివపితామహానందీశ శిక్షణవిధి
తరతరమ్ముల వెలయింత్రు సతత కళల
తెలియరే అట్టి దివిసీమ దివ్యసీమ !

గణనీయగురులు నారా
యణతీర్థ క్షేత్ర సిద్ధయతివర్యులు, జా
యన సేనానియు జన్మిం
చిన దివిసీమ అల దివ్యసీమ యనదగున్ !
ఏమా అభినయచాతురి
ఏమా లాస్యప్రశస్తి, ఎంతటి పాటో !
ఏమా రసపోషణ !-దివి
సీమను పొగడదగు దివ్యసీమయటంచున్ !

గోరీలతోట

వాగ్గూల్,
'మధుపాళి'

[ఆకాశంమీద రెండు మూడుచుక్కలు సుడ్డి వెన్నెల కురుస్తున్నాయి. గోరీలతోటలో గజం గజం దూరంలో వేయబడ్డ సరుగుడుచెట్లూ, వాటినడుమ గోరీలూ 'సిలుయెట్టు' (silhouette)గా కనబడుతుంటాయి. దూరాన గాలియీలయేమో, 'ఆర్గను'పైని 'పా-గా-పా' అనేస్వరాలు విడివిడిగా విరామంతో వాగుతున్నట్టు వినిపిస్తుంది.

ఎడమవైపే ఉన్న ఒక గోరీలోనుంచి వెలుగు వచ్చి, ఆవెలుగులో ఒకపురుషుని స్వరూపం బయలు పడుతుంది. అతను కళాశీనికిమల్లే రేగిన జుట్టుతో, చక్కగా — ముడతలు కనబడేటట్లు — కప్పుకున్న శాలువతో, పద్యం వ్రాయబోయే కవిలాగ, శూన్యాకాశంలో అరమోడ్పుకన్నులతో చూస్తూ, తల కొద్దిగా కదుపుతూ పాడుతూంటాడు.]

అతను:—

ప్రియా! మృదులచేలాంచలములు
ఒయారముగ ఆడగ పాడగ
అభాగ్యునికి దరిసెనమీయవో,
విభావరీవిశుద్ధవేళను!

[గోరీలో వెలుగు క్రమంగా తగ్గుతూంటే అతని మానవాకృతి మెల్లిగా చరళ్ళోలాగ జారిపోతుంది. చీకటి వెలుగులో అతని యెముకలగూడు గోరీలోనుంచి సగం లేచి, సగం పడుకుని ఉంటుంది.

ఇంతలో పక్కనేఉండే మరొకగోరీలో వెలుగు తోటికూడా ఒకసుందరీస్వరూపం తెల్లనిదుస్తుల్లో చంద మామలా మెరుస్తూ లేస్తుంది.]

ఆమె:—

ఇదేమిటి! నే నిక్కడికి ఎలాగ వచ్చాను! ఎంత ఏకాంతంగా నిశ్శబ్దంగా ఉందీ ఇక్కడ! విచిత్రం! ...ఈయేకాంతస్థలం, ఆమిన్కుమిన్కుమనే నక్షత్ర కాంతీ, ఈ చంద్రకాంతపురితిన్నీ, ఆసరుగుడు చెట్ల సంగీతం, ఈనాసౌందర్యమూ ఇవన్నీ తిలకించేటట్లు నన్ను ప్రేమించి, ప్రణయగీతిక లాలపించే నాప్రేయుక కవికుమారచక్రవర్తి ఉంటే! నాసమ్మంవద్ద పడిగాపులు పడిఉండే ఆప్రణయజీవుల్లో ఒక్కడూ కనబడడేమిప్పుడు! ఒంటరిగా నే నెందు కిక్కడ!

[అని చుట్టూ పరకాయిస్తూంటే, ఆమెగోరీలోని వెలుగూ మానవాకృతీకూడా మెల్లిగా దిగజారిపోతాయి. ఆమె యింకా తనయెముకలగూటి సౌందర్యాన్ని ఆసుడ్డి వెల్తురులో ప్రశంసాదృష్టితో చూసుకుంటూ, సగర్వంగా నలువైపులా దృష్టి సారిస్తుంటే అతనిచ్ఛాయ పొడ కట్టుతుంది.]

ఆమె:—ఎవరదీ నీడలాగ! ఎవరు వారు!

అతను:—(తలవంచుకునే, చకితుడై, గుండెలు త్రవ్వేటట్టు చూసుకుంటూ) ఆఁ? ప్రేయసీ! నాలో మిగిలి పిలుస్తున్నావా! నాహృదయమా! న న్నెరగవా? నువ్వుప్రియంగా పిల్చుకునే కవికుమారుణ్ణి! బ్రతుకు చితికినవాణ్ణి!

ఆమె:—ఆఁ? ఆఁ? ఎవరు! ఈస్థలం?

కవి:—[తలయెత్తి, ఆకులకురులు విరబోసుకొన్న చెట్లనీ, క్రింద నీడల్లోని గోరీలనీ చూస్తాడు.] ఈస్థలం? ఆహా! నాప్రేయసి నాకు కడసారి దర్శనమిచ్చి, శాశ్వతంగా విశ్రమించిన పవిత్రమైన గోరీలతోటలాగుంది.

ఆమె:—ప్రేయసా?......ఇక్కడేమి చేస్తావు నువ్వు?

కవి:—ఆఁ...! ఏమి చేస్తాను? (గద్గదికతో) పగిలిన నాహృదయశకలాలు అతుకుకొనేదాకా ప్రియురాల్ని గురించి యేడుస్తాను.

ఆమె:—ఇహ్హ! నీకు ప్రియురాలా? ఎలాటి దామె......నీకు!

కవి:—ఆమె...... (తల ఆకసంవైపె త్తి) ఆమె, దేవలోక దేవీమూర్తి, పవిత్రాదర్శశేవి! నా కోసం మర్త్యలోకాన అవతరించినపారిజాతం! నాలాటి అనేకమంది కవికుమారులా, కళాపిపాసువులా హృదయకాసారాల వికసి, మాధుర్యం చిమ్మినపద్మంకూడ!

ఆమె:—ఆఁ? ఎవరు! ఎవరిమాట లివి? (చెక్కిళ్లు లేని పలువరుసలు వికారంగా కదుల్తాయి.) ఎక్కడి మాటలు? కవికుమారుడివా నువ్వు! కళాపిపాసివా? నీకు ప్రేయసికూడానా? చాలు చాలులే. (పొడుగైన సన్నని ఎముకవేళ్లని పళ్లకి అడ్డుపెట్టుకుని, ఆపుకుంటూ ఆపుకుంటూ వికటహాసం చేస్తుంది. తనకిమట్టుకు చాలా నాజూకుగా నవ్వినట్టు, తృప్తిగా, కొంత సౌందర్యవతి రైన స్త్రీ భంగిమంలో కూర్చుంటుంది.)

కవి:—(సహించలేక, ఒక్కపెట్టున పైకి ఊగి కట్టెలాటి చేతుల్ని ఆమెవైపు విసుర్తూ,) ఎవరు నా ఏకాంతాన్ని భగ్నంచేశారు! వెటకారమా? ఏమిటా వెకిలి నవ్వు? అధర మేదీ? మల్లెపూలా, సన్నపురాలా? ఆఁ? ఆ స్వరూపం-అదేమిటి—అస్థి-కంకాళం! (పళ్లు కొరుకుతూ) ఎవరు నువ్వు పిశాచీ! స్వతంత్ర కవిలోక సామ్రాట్టుని, నిరంతర ప్రేయసీపాద పద్మానుచారణ సార్వభౌముని, నన్ను హేళనచేస్తున్నావా?......... ఇది యేదో దుస్స్వప్నంలాగ ఉంది....... పిశాచీ నువ్వు,—నువ్వు పిశాచివే. అదుగో, అదుగో ఆసమాధే నా ప్రేయసిది! పవిత్రదేవీమూర్తిది! ఏమి టీఘోరం! లే! అక్కడనుంచి లే! నాప్రేయసి పుణ్యాత్మకి ప్రశాంతత లేకుండా నువ్వు అస్థలాన్ని మైలపరుస్తున్నావా? లే! లే! (అంటూ తన గోరీపైని మోకాళ్ల మీద లేచి, మంచుని చేత్తో అదమాయిస్తున్నాడు.)

ఆమె:—ఇదేదో వెదుకలమాదిర్ని ఉంది. ఈమాటలు, ఎక్కడిమాటలో! విన్నమాట లల్లే ఉన్నాయే. (నిర్జీవాలైన కళ్లని మలుముకుంటుంది) ——ఛీ! అతను ఎప్పటికీ కాడు. ఛీ! ఛీ! నువ్వు నువ్వే,—పిశాచానివే! అతను కాదు నువ్వు! కవిలోకసమ్రాట్టువు కాదు నువ్వు! అతని మాటల్ని, చేష్టల్ని అనుకరించినా అతనివికాలేవు. నన్ను మోసపుచ్చకు.——ఇది స్మశానంట! ఔను! ఎలాగ వచ్చానో ఈ పిశాచాలతోటకి! నాకు త్వరగా మెలకువరావాలి. ఈ పిశాచం అతనిమాటల్ని అనుకరిస్తుంటే సహించలేను.

కవి:—నువ్వెవరు! నువ్వు......శాకినివా?

ఆమె:—(ఉగ్రకోపంతో ఊగిపోయి, మూలిగి) అబ్బ! ఇంతవరకూ మానవు డెవడూ నన్నలా పిలవలేదు. నువ్వు పిశాచానివే కావాలి. ఎందరు కళాశీవుల హృదయసరోవరాల్లోనో పాతుకుపోయిన పద్మానివో అని నా 'సమ్రాట్టు' నన్నంటూంటాడు! నాసమ్రాట్టు! ఇంకా ఎందరో కవికుమారులు నా అనూన సౌందర్యం గురించి ప్రణయగీతులు పాడుతూ నావాకిట పడి ఉంటారు (కవి వెటకారంగా, వికారంగా చూస్తాడు.) —నేను కవిలోకసమ్రాట్టుకి హృదయాధిరాజ్ఞిని! (కవి ఒడలంతా నవ్వు పొంగివస్తూన్నట్టు ఆడిపోతాడు.)— అటువంటి నన్ను, ఈవేళ, నువ్వు—దుష్టపిశాచమైన నువ్వు, నన్ను పిశాచమని తృణీకరించి మాయచేస్తావా? నీమాయల్లో నేను పడతానా! (కవి విరగబడి నవ్వుతున్నాడు.) టక్కరిభూతమా! పో! కథల్లో రాకొమార్తెల్ని ఎత్తుకుపోయిన భూతానివా నువ్వు! అయ్యో! నన్నుగురించి, అన్నిపాటలు పాడిన ఒక్కడూ రాడేం తోడుగా!

కవి:—(విరగబడి విరగబడి, పెద్దవికటాట్టహాసం చేసి) తమాషా! ఆఁ—? నామీదకే ఎదురు తిరిగేవూ! కామినీదయ్యానివిలా గున్నావే నువ్వు! నువ్వు లోకైక సుందరివి కదూ! హెహ్హెహ్హే! శెభాష్! త్రిలోకైక సుందరీ! ఏ దేశపు రాకొమార్తెవే నువ్వు? (ఆమె ఉడుకుబోతుతనంతో తానున్న గోరీపై తన్ని పరవళ్లు తొక్కుతుంది.) (కవి అభిమానంతో — అరుస్తూ) ఓడాకినీ, ఇదుగో, నాప్రియురాలి పవిత్రసమాధినుంచి కదుల్తావా? ఆసరుసుడుకొమ్మ విరగగొట్టనా? (అని ఎగిరి తూలుతూ, ఆమెగోరీవేపు పడతాడు.)

ఆమె:—ఓపిశాచమా! నామీద పడకు! (అని చెదురుతూ పరుగెత్తి అతనిగోరీవేపు పడుతుంది.) అయ్యో! అత నింతట్లో వచ్చేస్తే ఎంత బాగుండును! ఓకవిలోకసమ్రాట్టూ! నాప్రణయసామ్రాజ్య సార్వభౌమా! ఎక్కడున్నావు! రావేం?

[సరికొత్తగా ఉన్న ఆకవిగోరీమీద పాలరాతి స్వస్తిఫలకం (Epitaph) తగుక్కుమని ఆమెకళ్లని ఆకర్షించింది.—

కవి ఆమెగోరీమీద అత్యాప్యాయంగా ప్రాకులాడుతూ, ఏకో గొణుక్కుంటూ తనముఖాన్ని అక్కడక్కడ అద్దుకున్నాడు—

ఆమె అతనిగోరీమీది స్వస్తిని చదువుతూంది.]

"స్వతంత్రకవిలోకసమ్రాట్టూ, నిరంతరప్రణయైకజీవీ ఐన మహాకవి .... అక్షయశాంతికై —" (బరువేదో తనపైని కూలినట్లుగా క్రిందికి క్రుంగిపోయి, మూర్ఛపోబోతుంది — మూర్ఛ రాదు — చతికిలబడి, మోకాళ్లవడుమ తలని నలుపుతూంటుంది.)

[రెండు నిమిషాల నిశ్శబ్దం, ఒకబరువైనగాలికెరటం చెట్లసందునుంచి ఒడుదుడుగ్గా వచ్చి, విషమశ్రుతుల మేళనంతో ఆవేదనా అయోమయతా సూచిస్తున్న ఒక ఆరోహణస్వరం పాడేసి చక్కాపోతుంది. క్రింద మోకాళ్లమీద నుంచుని, ఒకరిగోరీని ఒకరు తల ఆనుకుని వెక్కివెక్కి ఆవేదనగా ఏడుస్తుంటారు. కొన్ని క్షణా లయ్యాక—]

కవి:—(ఎడమ అరచేయి మడిచి, కళ్లు నలుముతూ, కుడిచేతి చూపుడువేలితో శాసిస్తూ) ఓశాకినీ, నన్ను వెక్కిరిస్తున్నావా, జాగ్రత!

ఆమె:—(రెండు అరచేతులూ చాపి కళ్లు నలుముతూ —కృతజ్ఞతతో) టక్కరిభూతిగా! నువ్వే నన్ను వెక్కిరిస్తూ పైగా నన్నంటావా? (అని మళ్లీ ఏడుస్తూంటుంది.)

కవి:—అయితే నువ్వెందుకోసమలా ఏడుస్తావు?

ఆమె:—నా ప్రాణంకోసం! నాజీవాధారం నాసమ్రాట్టుకోసం! అతనిలా నన్ను వంచించి చెప్పకుండా చక్కాపోతా డనుకోలేదు.

కవి:—ఓ, ఓ, అల్లుకో! కామినీ! కథ లల్లుకో! నీమాయకథలు నమ్మే వెఱ్ఱిబట్టినిగాను! హేహేహే! ఎవడే వాడే! నిన్నట్లు వంచించిపోయిన రాజకుమారుడు?

ఆమె:—పాడుదయ్యమా! (అక్కణ్ణుంచి లేచి, అతనికి దూరంగా ఎడమవైపు చెట్లల్లో కూర్చుని, మోకాళ్లపైని తలపెట్టుక ఏడుస్తూంటుంది.) నాకవీ, నాప్రాణం ఎక్కడున్నావు! నిజంగానే నిర్గమించావా? నాకు చరకైకచారుణ్ణని చెప్పుతూ ఎన్నిగీతులు పాడేవో! ఒక్కటీ వినిపించ వేమి! ఈపాడుదయ్యం, — ఇది — నిజమే? కలా? మెళ్కువ లేవూ? కలా?... పిలుపువ రాదేం? కవీ! కవీ! కవీ! (తొందరగా వచ్చి, కవిగోరీదగ్గర కూలిపోయి, స్వస్తిఫలకాన్ని తడిమి తడిమి) కవీ! కవీ! కవీ!

కవి:—(ఆమె దూరంగా పోయిం దని మళ్లీ ప్రేయసిగోరీవద్ద తిష్ఠవేసి, ఆమె రాగానే, గంగవెఱ్ఱులెత్తినట్టు అసహ్యం పట్టలేక, తూలుతూ కుడివైపున్న చెట్లలో ఒకచెట్టుకి చేరగిలబడి పైకి చూస్తూంటాడు.) ఈపాడుక లేమిటోయి ప్రేయసీ! నిన్నుగురించి ప్రశాంతంగా తలపోసుకుందా మనుకుంటే, ఈకామినీపిశాచం నిన్ననుకరిస్తూ నామతి పోగొట్టుతూంది. ప్రేయసీ! ప్రేయసీ! దివ్యమూర్తీ! నా అంతరాంతర శాంతిదేవతా! మాధురులు కూడుగట్టిన మధుకలశమా! ప్రియా! ప్రియా!

ఆమె:—కవీ! కవీ! కవీ! ఎక్కడ! ఎక్కడ!

కవి:—ప్రియా! ప్రియా! ఎక్కడ! ఎక్కడ!

ఇద్దరూ:—(లేచి నుంచుని ఒకరినొకరు చూసుకుని) ఛీ! ఛీ! ఛీ!

[పడుగుడు చెట్ల వెనకదిక్కున చీకట్లు పల్చబడుతున్నాయి. ఆకాశంమీది రెండుమూడుచుక్కలూ క్రమంగా పాలిపోతున్నాయి. చెట్లతోపులోనుంచి పందడిగా ఐదారుకంకాళాలు బయటపడి, వాళ్లిద్దరినీ చుట్టుముట్టుతాయి. వాళ్లు కంగారుగా గంతులువేస్తారు.]

ఇద్దరూ:—(భయంగాచేతు లడ్డంపెట్టుకుంటూ) కంకాళాలు! పిశాచాలు! (కేకలేస్తారు.)

[పిశాచాలు వాళ్లచుట్టు మూగి విరగబడి, వికటాట్టహాసాలు చేస్తున్నాయి.]

ఒకవంగిన ముసలిపిశాచం:— (హేళనగా) ఏహేహే! సిగ్గు సిగ్గు! మీరో! మీరూ కంకాళాలేగా! మీరూ పిశాచాలేగా!

ఆమె:—ఆఁ! నేను కంకాళాన్నా? నేను త్రిలోకసుందరిని. ఇదుగో పిశాచం! అచ్చంగా మీ అందర లాగే......

కవి:—ఛీ! ఛీ! నేను పిశాచాన్ని కాను! కవిలోకసామ్రాట్టును! ఇది ముమ్మాట్కి ముమ్మూర్తులా కామినీపిశాచం! వాలకంలోకూడా దానికీ మీకూ భేదాలేదు.

[పిశాచాలు ఎముకచేతులు చరుస్తూ వికారంగా ఎనుదుతో పళ్లుకరుపుతో పెద్దకేకలతో గేలిచేస్తాయి.]

వంగిన:—ఏహేహే! వెట్టితండ్రీ! నీ ప్రేయసి నెరగవా? వెట్టితల్లీ! ఇతనే నీకవిలోకసామ్రాట్టు.

కవి:—ఈమా?

ఆమె:—ఇతనా?

[ఇద్దరూ అసహ్యంతో ఒకరి నొకరు ఓరగా చూసుకుని, "కాదు", "కాదు" అని గర్జించుతారు.]

వంగిన:—వెట్టినాయనలారా! ఎవరి పొంగాలు వారు చూసుకోండి. మనమంతా కంకాళాలమే. ఇందులో కొద్దీ గొప్పా, అందమూ, వికారమూలాటి భేదాలు లేవు. అంతా సమం. మనకి ఒక్కొక్కరికి ఒక్కొక్క గోరీ ఉంది. నీగోరీ అదుగో నాయనా! నీగోరీ ఇది పిల్లా! వాటిమీది అక్షరాలు చదివి, మీది పాలరాతిపలకల్లో ఎవరి పొంగాలు వారు చూసుకోండి.

ఆమె:—(స్వస్తిని చదువుతూ)"......త్రిలోకసుందరీ, కళాపిపాసువూ ఐన హృదయేశ్వరి ఆత్మ..." (తనప్రతిబింబం చూసుకుంటూ) ఇది గోరీ! నాగోరీ..? ఈస్వస్తి......అంకితం నాకే! ఆనేను నేనూ! ఈనేను ......కంకాళమే?

కవి:—(తిరిగి తిరిగి స్వస్తిని చదువుతూ)...... "స్వతంత్రకవిలోక సమ్రాట్టూ......మహాకవి...ఆత్మశాంతి......" ఛేఛీ (ప్రతిబింబం చూసుకుంటూ) ఈ రూపం? ఆస్వస్తి......బిరుదాలు నావే! నాకు గోరీయే! నేను కంకాళాన్నా? ఇంత! అంతా కంకాళాన్నే! (అని ఆశ్చర్యంగా అసహ్యంగా ఆపాదమస్తకమూ చూసుకుంటూంటాడు.)

[ఆమె పట్టరానిసిగ్గు అభినయిస్తూ, ఒళ్లంతా ముడుచుకుని, తలవంచి, పక్కగా పోబోతుంది.— పిశాచాలన్నీ నవ్వుతాయి]

వంగిన:—వెట్టితల్లీ! కంకాళ మని తెలుసుకున్నాక సిగ్గూసిగ్గూ పడనక్కర్లేదు, అలా పడితే వెక్కిరింపుగా ఉంటుంది

కవి:—(ఆమెకేసి పరీక్షగా చూసి) ఈమె... మొదట అతిలోకమోహినీమూర్తిగా, న న్నాకర్షించి, ప్రేమింపజేసుకుంది. అయినా, ఇప్పుడూ ఈనగ్న సౌందర్యం...ఈకంకాళసౌందర్యం... నాఆదర్శం...

వంగిన:—(నగంలో అడ్డి,) వెట్టివాడా! అది నీభావసౌందర్యమే; అప్పుడూ ఉంది. ఇప్పుడూ ఉంది. అది ఇప్పుడూ కంకాళఘటితమే, అప్పుడూ కంకాళఘటితమే అని కూడా తెలిసికో.

కవి:—(తన ప్రతిబింబాన్నీ, ఆమెరూపాన్నీ పరీక్షగా చూసి, చూసి)- ఓహో, ప్రేయసీ!—

ఆమె:—ఓహో, ప్రియతమా! (ఇద్దరూ వికటంగా నవ్వుకుంటారు.)

కవి:—అయితే, ప్రేయసీ, అపూర్వమైన నీ విరూపం నాకు మొదట అసహ్యం కల్గించినా, ఇప్పుడు దాని అంతరార్థం తెలుసుకున్నాను గనుక వెనకటిపాటొక టిప్పుడు సార్థకంగా పాడతాను:

" ప్రేయసిపోయెగమ్మునకు లేదు శరీరము,
లేదు మేను నా తీయని ప్రేమకేని, కలదే
మెడబాటిక మాకు—"

ఆమె:—అప్పుడూ ఇప్పుడూ, ఎప్పుడూకూడా నీరూపంకంటె, నీవాక్పుత్కృతీ, భావలోకసంచారమూ, ఆదర్శోపాసనమూ న న్నాకర్షిస్తున్నాయి కవీ! అంచేత వెనకటికవి చెప్పినట్టు నా కిప్పుడు:

"మోమున మోము జేర్చి నిను
ముద్దిడు కోరిక లేదు"

వంగిన:—స్నేహితులారా! మన వెఱ్ఱితల్లీ, వెఱ్ఱి తండ్రీ, ఇవ్వేళ తమని తాము తెలుసుకుని ధన్యులయ్యారు. మనము నిశాచరులం! అదుగో, పొద్దువెల్తురు వచ్చేస్తోంది. మన వెఱ్ఱినాయనలకి స్వస్తి పాడేసి, ఎవరిచోటికి వారు పోదాం.

స్వాగతము! సుస్వాగతము!
మా వెఱ్ఱితల్లికి! వెఱ్ఱితండ్రికి!
స్వాగతము! సుస్వాగతమోయి!!
వెఱ్ఱితల్లి త్రిలోకసుందరి!
వెఱ్ఱితల్లి కళాపిపాసువు!
వెఱ్ఱితండ్రి స్వతంత్రకవిరాట్!
ప్రేయసీచరణైక చారుడు!
వెఱ్ఱితల్లికి! వెఱ్ఱితండ్రికి!
స్వాగతము! సుస్వాగతమోయి!!

[పిశాచాలు గోరీల్లో అంతర్ధాన మవుతూంటే పాట క్రమంగా కరిగిపోగా, ఉషఃకాంతు లాకాశం పైకి వచ్చేస్తాయి. తెల్లవారుతుంది; తెరవాలుతుంది*.]

[* కావలసినవారికి క్షమాపణలు! తప్పులన్నీ వ్యాసకర్తః!]

సహజసిద్ధమైన సౌందర్యము

ప్రతిరోజు "కామినియా తలనూనె" ను వాడుట వలన వేలకొలది స్త్రీలు సహజసిద్ధమైన తమ సౌందర్యమును పెంపొందించుకొనుచున్నారు. అది కేశములను వృద్ధిపరచి, మెదడుకు చల్లదనమును కలుగజేయును.

కామినియా ఆయిల్

(రిజిష్టర్డు)

సీసా 1-కి ఒకరూపాయి. 3 సీసాలు రు 2-10-0
వి. పి. చార్జీలు ప్రత్యేకము.
ఉచితముగా ఇవ్వబడు శాంపిలుకొరకు
¼ అణా చీటిని పంపుడు.

ఆటో డిల్ బహార్

(రిజిష్టర్డు)

సువాసన కలిగినట్టియు, యావన్మందికి ఆహ్లాదకరమైనట్టియు వాసనద్రవ్యము. చాలసేపు వరకు సువాసన పోదు.

¼ ఔన్సు రు 1-4-0, డ్రాము 12 అణాలు.
వి. పి. చార్జీలు ప్రత్యేకము.

1 అణా, 2 అణాల బిళ్లలు పంపినచో సువాసన కార్డులు ఉచితముగా యివ్వబడును.

సోల్ యేజెంట్లు:

ANGLO - INDIAN DRUG & CHEMICAL CO., BOMBAY. 2.

రేడియో నాటిక

రుచిదేవి

రచయిత: శ్రీ రజనీకాంతరావు

ప్రథమ దృశ్యం

[గజపతులరాజధాని—కటకపురి : ఉద్యానవనంలో - ప్రతాపరుద్రగజపతికుమార్తె రుచిదేవి, ఆమెచెలికత్తె.]

చెలి: (దూరంనుంచి) రాకుమారీ! రాకుమారీ !యెక్కడ!

రుచి: ఆఁ ఇక్కడ-ఈ మాధవీ నికుంజంలో! ఇటురావే మధురికా !

చెలి: అమ్మయ్య! ఎంతసేపటినుంచి వెతుక్కుంటున్నానమ్మా నిన్ను! పురమంతా శత్రు గూఢచారులతో నిండిపోయిందిట. నిన్నొంటరిగా వదలకూడదని రాజాజ్ఞ!

రుచి: ఈఖడ్గము చేతనుండగా ప్రతాపరుద్ర గజపతి కొమార్తెకు ఒంటరితనపు భయమేమే !

చెలి: కాదమ్మా! మన ఉదయగిరిని, కొండవీడును కృష్ణరాయల సైన్యాలు ఆక్రమించు కొన్నవట. మనకు సమీపంలోనే- సింహాచలంవద్ద విడిశారట. సంధిసూచనలతో ఒకరాయబారి—

రుచి: (అర్థోక్తిలో) ఏమేమీ! కృష్ణరాయలు వస్తున్నారా? మనకు సమీపంలోనే?

చెలి: వెర్రిదానా? శత్రువు సమీపిస్తున్నాడంటే ఆ ఉత్సాహం దేనికి?

రుచి: చూడు- చెలీ- ఇన్నాళ్లు ఈ శిలావిగ్రహమందు కొనే పూజలు ఆ మానవోత్తముని శరీరాన్ని ఎప్పుడు స్పృశిస్తవో అని—

చెలి: ఏదీ- ఇతడు నవనీతచోరుడు—

రుచి: అవును- అతడు ఇతని అపరావతారము- నా మానసచోరుడు—

[ప్రాణరక్షకై పరుగెత్తివచ్చే ఒకగూఢచారి- వెనుక పట్టుకో పట్టుకో అని పరుగులెత్తే రాజభటుల కేకలు]

చెలి: ఏమీ కలకలం?

రుచి: ఉండు- ఆ పొదలమాటున ప్రాకిపోతున్నదెవరు?

చెలి: నే చెప్పలేదాసఖీ! శత్రు గూఢచారులు! సంధికై రాయబారిని పంపి, తోడుతో ఊరు చొరబడడము ఏమి రాజనీతో!

(గూఢచారి వీరిదగ్గరికి చేరుతాడు)

గూఢ: రాకుమారీ! శరణార్థిని. సంధికై వచ్చిన రాయబారిని బంధించు టేమిరాజనీతో!

(వెనుక రాజభటుల కేకలు)

రుచి: ఎవరుమీరు?

గూఢ: నేను విద్యానగర రాయబారిని. కటకరాకుమారి శరణార్థిని.

రుచి: విద్యానగర రాయబారులా! ఈ నికుంజములో దాగుకోవచ్చు.

చెలి: రాకుమారీ! (ఆటంకపరిచేలాగ)

రుచి: ఉష్ ష్! (రాజసైనికులు ఉద్యానంప్రవేశిస్తారు)

కటకసైనికుడు: జయము జయము రాకుమారీ!

రుచి: అంతఃపురోద్యానానికి సైనికులు రానవసరమేమి?

కటక సైని: క్షమింపుడు రాకుమారీ! శత్రు గూఢచారి ఒకడు ఈ వనము ప్రవేశించాడని—

రుచి: ఇందెవరూ ప్రవేశింపలేదు.

కటకసైని: రాకుమారి క్షమింతురుగాక.

(నిష్క్రమిస్తారు)

చెలి: రాకుమారీ! ఏమిపని యిది?

రుచి: చెలీ! నీవూరుకో! ఓయీ! శరణార్థీ! నీవు నిజముగ రాయబారివైతే నిర్భయముగ బయటికి రావచ్చు. లేదా! ఇదుగో రుచిదేవి ఖడ్గము నీ రక్తము చవిజూడనిదే వదలదు.

గూఢ: రాకుమారీ! కృష్ణరాయల ప్రేమసందేశహారునకు కూడ అదియే బహుమానమైతే కానీయి!

రుచి: ఏమీ!

మద్రాసు రేడియో కేంద్రమువారి అనుమతితో

గూఢ: రాకుమారీ! నీ తండ్రికి శాంతిదూతను. నీకు ప్రేమ దూతను. ఇదిగో రాయలముద్రిక.

రుచి: దూతా! నీవు రక్షింపబడినావు. ఇదిగో! శాంతి ప్రియుడగు రాయలకు రుచిదేవి చూడామణిని అందజేయ గలవా?

గూఢ: అవశ్యము– మీ సైనికులు దూరమైనారు–ఈ నీ విశ్వాసపాత్రున కింక సెలవిమ్ము రాకుమారీ!

రుచి: ప్రేమదూతా! సెలవు!

ద్వితీయ దృశ్యం

(కటకపురి–ప్రతాపరుద్రగజపతి అంతఃపురము)

ప్రతాప: శాంతిదూతయట– –శాంతిదూత! కోమార్తె నిచ్చిన శాంతి నిలుచునట– లేనిచో శత్రుశిక్షణ మట! ఇదేమి బాంధవ్యము! అమ్మా! రుచీ! నీ యభీష్టమెట్లో అట్లేకానిమ్ము.

రుచి: నాయనా! మీ యభీష్టము నా యభీష్టము.

ప్రతాప: ఏమీ! నాతల్లి! నాయభీష్టము నెరవేర్తువా?

రుచి: ఆ! తప్పక నెరవేర్తును.

ప్రతాప: తల్లీ! నాకొడుకులను, నీసోదరులను చంపిన పగ– మన దుర్గములను, ఉదయగిరిని, కొండ వీడును నాశముచేసిన పగ– ఎట్లు తీరుట?

రుచి: నాయనా! శాంతి వల్లనే కదా పగలడగును?

ప్రతాప: అవును– ముందు శాంతిమార్గ మవలంబించియే తరువాత పగదీర్చుకోగలము– నీవు రాయలను చేపట్టిననే– శాంతి– ఆపైన–

రుచి: నాయనా– నాఅభీష్టము– అదియే. అనుగ్రహింప బడినాను.

ప్రతా: తల్లీ! పరాభవానలంలో మ్రగ్గిన తండ్రికోరిక– నిన్ను కన్నతండ్రి కోరిక– మన్నించి– మనసులో ఉంచుకో!

రుచి: ఏమది నాయనా?

ప్రతా: ఎంతచేసినా– అది– నీకన్నతండ్రి కడుపుకాల్చిన చిచ్చు! జాగ్రత్త! ఈఖడ్గమును ఎన్నడూ విడువకు! గజపతుల ఆడుబిడ్డలు పౌరుషశీలలు అన్న మాట మరవకు! ఏకాంతము, అవకాశము దొరకిన వెనువెంటనే—దీనితో–రాయాలను– నిశ్శేషునిచేసి నీతండ్రి రుణముతీర్చుకో!

రుచి: నాయనా! నాయనా! (గద్గదికతో)

ప్రతాప: పుత్రీ! నీతండ్రి రుణము తీర్చుకో!

తృతీయ దృశ్యం

(విజయనగరము: రాయల శయనమందిరము; రాయలు: రుచిదేవి)

రాయలు: నీతండ్రి యెట్లు సమ్మతించాడో! నాడు మేము సంధిసూచనలలో ఈఉద్వాహము విషయమెత్తి నప్పుడు ప్రళయరుద్రుడై మండిపడినాడే! అవును! అది సహజమే. మీవంశమునకు మేము తీరని కష్టాలు కలిగించాము. కాని, రాజనీతి చెప్పిన అట్లు చేయక తప్పినదికాదు. పౌరుష వంతుడగు రాయలు పరుడైన ప్రతాపరుద్ర గజ పతిని క్షమింపుమనికోర నావశ్యకములేదు. కాని, కర్ణాటక మహారాజ్ఞి రుచిదేవి పాదములకడ మాత్రము మూరురాయరగండడు– అవనతమస్తకుడే!

రుచిదేవి. (వెక్కి వెక్కి యేడుస్తుంది)

రాయలు: రాణీ! రుచిదేవీ! ఈమౌనవ్రతమేమి? నాయెరిగిన రుచిదేవి యింతముద్దరాలు కాదే! ఏమిది! అశ్రుధారలు! ఈ శుభసమయమున దుఃఖమా?

రుచి: (ఇంకా వెక్కి–వెక్కి యేడుస్తుంది)

రాయలు: అప్పాజీ ఆశంకనము వాస్తవమేమో! కళింగ పుత్రీ! నీకేమికావలెను! కర్ణాట సార్వభౌముడు నీకీయలేనిది లేదని తెలియదా నీకు? ఏది?– తల యెత్తు–పుట్టినింటిని విడుచుట కిదే మొదటిసారి యనియా– ఇంతటి బేలవా?

(రుచిదేవి ఒడిలోంచి–ఖడ్గము ఒకటి జారి కిందపడుతుంది)

రాయలు: ఆఁ! ఆఁ! ఖడ్గమా?

రుచి: కర్ణాటసార్వభౌమా! నన్ను శిక్షింపుడు! అపరాధిని. (భోరుమనియేడుస్తూ పాదాలపైని పడుతుంది)

రాయలు: దేవీ! శత్రువులకడ మానరక్షకమగు ఈసాధనమునకు– ఇక్కడ పనియేమి? అక్కడ నీకు శత్రువు లెవరు?

రుచి: ప్రభూ! ప్రభూ! నన్ను చిత్రవధ చేయింపుడు! అవమానఖిన్నుడైన నా తండ్రికోర్కె కాదన లేక–

రాయలు: ఏమీ! నీతండ్రికోర్కె కాదనలేక సుకుమార మగు నీప్రేమహృదయమును చంపుకొంటివా! నాకంత మేనా దీనికెరర? నీవేనా యింతద్రోహివి?

రుచి: ద్రోహినే! చక్రవర్తీ! భర్తృద్రోహిని! రాజద్రోహిని! నన్ను శిక్షించండి–

రాయలు: నీవుకావు– ద్రోహి నీతండ్రి. అప్పాజీభయము వాస్తవమే అయినది? దేవీ! నీ యీ చిన్ని అపరాధము క్షమించుటకు మాకు వేరొక కారణము కూడ గలదు.

రుచి: సార్వభౌమా! క్షమింతురా? నన్నేక్షమింతురా?

రాయ: అవును, ఆనాడు మేము రాయబారిగ వచ్చినపుడు మమ్ము నీతండ్రి సైనికులబారినుండి రక్షించిన యుపకృతికి–

రుచి: అట్లయిన– ఆరాయబారి—?

రాయలు: మేమే! ఇదిగో! ఆచూడామణి– నీసందేశము!

రుచి: ఆముద్రిక నిచ్చిన హస్తమిదియేనా ?

రాయలు: ఆఖడ్గమును ఈ నా హృదయమునకు గురిచూచిన హస్తము నన్నురక్షించిన యీ హస్తమే కదా! రుచిదేవీ! నారాణివినీవు !

—✦—★—✦—

చిట్టితల్లి

శ్రీ జనమంచి కామేశ్వరరావు.

చుక్కలన్నిటి
తురిమిపేర్చి,
రంగవల్లిక
తీర్చిదిద్దీ,

మబ్బుపింజల
పరపు పరచీ,

దానిపై, నా
చిట్టి తల్లిని
బజ్జొబ్బె పెట్టారు.

ఇరుల తెరలో
జోగుతున్నా
దరనిమీలిత
శరచ్చంద్రుని
నిదుర లేపీ
కొండినిరాల్చి,

వొత్తినొత్తీ
వెలుగులూదీ
ప్రమిదలోనే
నివాళుంచారు.

"పాలసంద్రం
ద్రచ్చితీసిన
లచ్చివీవే
చిట్టి తల్లీ !—
జో ! జో !

"ప్రకృతి సుందరి
గరిమనంతా
జోసినవ్వుల
నొలకబోసే
స్వర్గ కళికవు
నీవు తల్లీ ! —
జో ! జో ! "

అనుచు అచ్చర
లందరూను
లాలిపాటల
డోలికూపుచు,
చిట్టి తల్లికి
చిచ్చుకొట్టీ
నిదురపుచ్చారు.

★

గాజుల బేహారి

'జానపద నృత్య నాటిక'

రచన : "రజని" : "విశ్వం" : నండూరి.

ప్రధాన పాత్రలు : చిరంజీవులు

లీల : కల్పకం

[ఒక ఊరు ఆ వూళ్లో ఒక "రెంకి" పిల్ల వుంది. ఆ పిల్లకి ఆ వూరి ఆడపిల్లలంతో స్నేహితురాళ్లే ఆట పాటలాడు కుంటూనే ఆ పిల్ల అల్లా అల్లా అందమైన వయసు కత్తె అయిపోయింది. ఆ పిల్ల తల్లిదండ్రులు హుషారుగా ఆ పిల్లకి పెళ్లికొడకని కుదిర్చారు. పెద్దలు నిశ్చయించిన ముహూర్తం దగ్గిరవుతున్నకొద్దీ, రెంకిపిల్ల మనస్సులో ఏదో కించ అంకురించింది ఆ పెళ్లికొమారుడు మరి, ఆమె వలచిన నాయకుడు బావ అవునో కాదో ?....]

ఊరి నగారా

ఘెల్లుమనే వూరి నగారా !
ఝల్లుమనే తీయని కోరికగల కన్నెమనసు,
ఘెల్లుమనే వూరి నగారా !

పెళ్లికూతురంటతానే,
పెళ్లికొడుకు ఎవరోకానీ
చిన్ననాడు తాను చెలిమి
చేసినట్టి బావకాదు !

గాయనీ బృందం.

ఈ నాటికలో పాల్గొన్న

శిశునర్తకీ దళం

నృత్యం తయారుచేసిన కూచిపూడి నర్తకులు

శ్రీ వెంపటి సత్యనారాయణగారు

★

పెళ్లి సందడి

ఆకాశమంత పందిరేసి
భూదేవంత అరుగులేసి
చిగురాకు తోరణాలు కట్టి
చిన్నా పెద్దాలు జట్లు కట్టి

పసుపూ కుంకం పప్పూ బియ్యం
వడివడిగా చెంచేవారు
ఎంపులు సరిన సతులు వింజెల
సొంపుగ నీరం తెచ్చేవారు..

వాకిట కలాపి చల్లేవారు
వయారి ముగ్గులు పెట్టేవారు

పెళ్లిపనులా తొందరలోనా
పెళ్లికూతురి బెంగను కనరు

పెళ్లికూతురంట తానే
పెళ్లికొడుకు ఎవరోకానీ ?

[అపడంగా ఆ పెళ్లి సందడిమధ్య అక్కడికి అవతరిస్తాడు, ఒక "గాజుల బేహారి" ఆకొడే మారువేషం వేసుకున్న నాయుడు బావ. గాజులకి మోజుపడి ఆడపిల్లలంతా అతగాణ్ణి పిలుస్తారు. గాజులకైన యెంకిపిల్ల కనిపెట్టకండా వుంటుందీ రహస్యం !...]

బేహారి బేరం

గాజులబేహారి ప్రవేశం :

గాజులోయ్ !

కొనరారేమె మంచి గాజులు—
గాజులోయ్ ! !
రోజా రోజా రంగువాల్కు
గాజులివిగో కొనరండోయ్,
మోజుయారే పండువెన్నెల
గాజులివిగో కనరండోయ్—
గాజులోయ్ ! !

ఆడపిల్లల అడావిడి

ఒక పిల్ల :

గాజులబేహారీ ! రావోయ్
గాజులబేహారీ !

మరొక పిల్ల .

జాజీరేకులకంటే సన్నని
రోజారంగూ గాజులుతేవోయ్ ?

ఇంకో పిల్ల .

మంకెనపూవుల జంకెనచూపుల
కెంపుల గాజుల కేమి ఖరీదోయ్ ?

యెంకి పిల్ల :

రాక రాక నేటికి వొచ్చావోయ్
ఆకుపచ్చ గాజులు తెచ్చావోయ్

అంతాకలిసి :

గాజులబేహారీ రావోయ్
గాజులబేహారీ !
పెళ్లికూతురికి తల్లోపూవులు
పెళ్లికూతురికి మెళ్లో కాసులు
పెళ్లికూతురికి చేతిగ్గాజులు
చూచేవారీ కళ్లకి మోజులు !
గాజులబేహారీ ! ! రావోయ్
గాజులబేహారీ ! !

వేషధారి వ్యంగ్యం :

ఊరి వెలుపలా వెన్నెల యేరూ
ఏరు ప్రక్కనా పొన్నల తోపూ,
పొన్నల నడుమా యిచ్చిన ఆహా
పచ్చానిగాజుల ఖరీదు యేదీ ?...

యెంకిపిల్ల ఏర్పాటు :

వెన్నెలరేడూ పొన్నా కొమ్మలను
తన్నినవేళను యిస్తునులేవోయ్ !
గాజులబేహారీ ! రావోయ్
గాజుల బేహారీ ! !

గాజులబేహారి నిష్క్రమణ :

కన్నెపిల్లకీ వెన్నెలగాజులు !
ముద్దరాలికీ అద్దపుగాజులు !
పెళ్లికూతురికి బిత్తోరిగాజులు !
గాజులోయ్ ! !
గాజులోయ్ ! !

పొన్నతోపులో ప్రియసమాగమం

["యెంకిపిల్ల" ఏర్పాటు ప్రకారం పొన్నతోపులో దాగివున్న నాయుడుబావ పిల్ల రాగానే వెనకనే పొంచుండి కళ్లుమూస్తాడు]

నాయుడు బావ .

పొన్నాతోపులో వెన్నెలలో, నీ
కన్నూమూసినా చేతులెవరివో....
చెప్పాగలవటే ?
చిన్నాదాన ! ఓ చిన్నాదాన ?

యెంకిపిల్ల :

చిన్నానాడె నా కన్నేవలపు- చే
కొన్నా చేతులేనోయ్ ! ..
ఓ వన్నేకాడ ! ఓ వన్నేకాడ ! !

నాయుడు బావ :

. మూసినకన్నులు కలువరేకులటు
ముద్దూలుగురిసే . . . .
మోమూ చూడనీవే
తెరువాని కన్నుల
ముద్దారాల ! ఓ ముద్దారాల ! !

యెంకిపిల్ల :

కన్నూమూసి నీ అందా చందములు
గాంచేది నేనెటులో...
ఓ అందాగాడ ! ఓ అందాగాడ ?

నాయుడుబావ నర్మం :

పెళ్లికూతుర : నీ కళ్లూ తెరువవే
చుట్టాల చూపుగా చూడవచ్చానే !

యెంకిపిల్ల కెంకితనం

చుట్టాల చూపుగా చూడా వచ్చినవాడ
వచ్చిన దారిని పటావచ్చోయ్ ! !

చిన్నానాడె నాకు చేసిన బాసలు
మరచిపోయినవాడ ! తరలి పోవోయ్ ! !

నాయుడుబావ సముదాయింపు .

ఇంతలోనె కోపమేల చెలియా !
నీ కిష్టాము లేని పెళ్లి
తప్పింపవచ్చానె....
ఇంతలోనె కోపమేల చెలియా !!

యుగళగానం : యుగళనృత్యం

నీతోటె వుంటాను నాయుడుబావా !
నీ మాటె యింటాను నాయుడుబావా ! !

సరకులేమికావాలె సక్కని పిల్లా
నీ మరపుమిడిసి మనసియ్యి నాయుడుబావా

సక్కాదనము కేమిత్తు సక్కని పిల్లా
నీవు నల్లగుండు పద్దాక నాయుడుబావా

ఏడనే నీ కాపుర మో యెత్తురు పిల్లా.
నీ నీడలోనె మేడకడతా నాయుడుబావా

నీతోటె వుంటాను నాయుడుబావా !
నీమాటె యింటాను చక్కని పిల్లా ! !

[శ్రీ నండూరి సుబ్బారాయకవికి " రజని : విశ్వం " క్షమాపణలు]

గాన ప్రవీణలు

మహిళాసభ వాద్యగోష్ఠి

చండీదాసు

నృత్యనాటిక : శ్రీ రజనీకాంతరావుగారు

[ప్రణయైకజీవియైన ఒక వంగకవి జీవితకీర్తనం]

చండీదాసు : ఆదర్శశీలి, రాధాకృష్ణభక్తుడు, యువకవి.

నకులదాసు : చండీదాసు సోదరుడు, విశాలాక్షి ఆలయములో అర్చకుడు.

రామిని : చండీదాసునకు ప్రేమపాత్రురాలైన రజకిని, ఆలయదాసి.

ధర్మకర్తలు, సాంఘికులు, రజకజనం.......

పూర్వరంగము

బృందగీతి

ప్రేమగానము, ప్రేమగానము !
సకలజగదభిరామగానము !
ఆదికవి వాల్మీకికోకిల
అమృతమంజుల సామగానము !
శ్యామగిరివని దివ్యవంశీ
విరహపూరిత భవ్యగానము !

నాట్యదాత్మ సఖీపదాంకిత
నవ్యతమజయదేవగానము !
రజకినీప్రియుడైన చండీదాసు
విశ్వప్రణయగానము !—
ప్రేమగానము, ప్రేమగానము !
సకలజగదభిరామగానము !

ఒకటవరంగము

[నన్నూరా గ్రామంలోని విశాలాక్షీ దేవ్యాలయం—ఆలయ ప్రాంగణంలోని పూదోట—తన్మయుడై చండీదాసు]

చండీదాసు

తలపుతెరలడోలలనూగు మనసే
చెలిమికలల జోలలతోగు సొగసే
పాడి, మనికి స్వర్గముగాక
గడిపివైతును !—
గడియగడియ మాధవుప్రేమగాథ !
ఒడలుమరచు రాధిక తీయబాధ !
పాడి, బ్రతుకె బృందావనిగ
సలిపివైతును !

రామిని

(రజకకన్య రామిని నేలవూడ్చుతూ ప్రవేశం)

తెరువరులులేని బాట,
మరపునకురాని పాట !
కరవునకునెండు నోట,
కురియునమృతంపు నూట !

చండీదాసు

(ఆకర్షితుడై)

ఓహో తరుణాశాజ్యోతీ !
నీహారసదృశమే నీగీతి ;
దీనాననవగు ఓ నాతీ !
మానసమున కలిగెనుప్రీతి.

రామిని

(మొక్కరిల్లి)

మీరెవరో మహామాన్య !
నేను పేదరజకకన్య—

వలపుబరువు తలపులచే,
మీరు తేనె పలుకులచే
భయమున నామది కలంగు,
ప్రియమున నాయెద చెలంగు!—
సరస నిలువరానిదాన,
క్షమియింపుడు పోవుదాన.

చండీదాసు

(ఆనందంతో)

మాధవమధుమురళీధ్వని
రాధాన్వేషణలో,—
యుగయుగాలు జగజగాలు
వేచివేచి తిరిగి తిరిగి,
బృందావనమందే, కాళిందీ తీరమునందే
సఫల మనోరథతకాంచె—
మాధవమధుమురళి!

(పూ వొకటి కోసి యిచ్చును)

సాంఘికుడు

(చరచరవచ్చి)

పతితజనములతోడ సంభాషణమ్మ
ధార్మికుడ! మాను, పాపసంధాయకమ్మ!
ప్రేమపేరిట మతినీతిసీమ ముడిగె
చాలు కుహనా కవిత్వసంస్కారమింక!

రామిని

(వెనుకకుతగ్గి, మెల్లగా వెళ్ళిపోవును)

సాంఘికుడు

(ఉరిమిచూచుచు నిష్క్రమించును)

చండీదాసు

(రామిని వెళ్ళినదిక్కే చూచుచు)

జ్యోత్స్నాతరళిత తరంగిణీ రజనీ!
మత్స్వప్నాశయ దివ్యరాగిణీ తరుణీ!
విజనమదీయ హృదయ గృహతారానారీ!
రజకినీరూపమాధురీ! నవకిశోరీ!

(ఆనందంతో)

ప్రణయఖేలలో ప్రేయసిరాధిక,
ప్రేమికుడే మాధవుడు!
ప్రణయశక్తిరాధిక జగన్మాత!
ప్రేమమూర్తి మాధవుడు జగత్పిత!
ఓ జగద్వ్యాపినీ! రజకినీరూపిణీ!
జగజ్జననీ! అనంతప్రేమఖనీ!
నీ శీతల చరణతలమ్మే శరణమ్మోయి దివ్యతన్వీ!

రెండవరంగము

కోతపదంతో, రేవులో, బట్టలుదుకుకొనే రజకజనం

తొలుసంజవిరిసేటి పూవా, నువ్వ
మలుసంజనే వాడిపోవా!
మురికిమడుగున కన్నువిడిచావే, సిరికి
సిరమెక్కి సివమెక్కి నడిచావే!
కతలుకబురులు సత్తెమంటావు, నువ్వ
వెతలపాలౌదు వేమంటావు!
వెలుగుచీకట్లు మరిచావా, నీకు
కలుగునిక్కట్లు తలిచావా!

(రజకజనం నిష్క్రమిస్తారు)

రామిని

(దిక్కులుచూస్తూదిగబడి, దిగులుగా)

ఈపేదపూవలపు లేపగిది చేరునో
ఆశాళలనుదాటి ఆ ప్రభాకరమూర్తి!
వలపేది, తలపేది, మరపున నశించునో
అలమునాశల వెలుతురుల ప్రబోధించునో!
పంకజాంగనకు అలంక తేజోఘనుని
అంకపీఠముకోరు టడియాసయే యేమొ!
మసలుసూర్యునిమంట విసురులో నుసియౌనొ,
ఎసగుప్రేమజ్యోతి కొసల నైక్యమెయేనొ!

చండీదాసు

(ప్రీతిపూర్వకంగా వచ్చి)

కనలేనె చెలికనలేనె!
నయనహిమదళము పయినిహిమకణము
కనలేనె........కనలేనె!
వినలేనే చెవి వినలేనె!—
మందమధురరుతియందు విధురగతి
వినలేనె....వినలేనె!

రామిని

(ఊరడిల్లి)

సరసవెన్నడుమీరు నిలిచియున్నారొ,
ఒరసిచూపులచూపు లొల్కుచున్నారొ !
చలువవెన్నెలరేని తళతళలు పొలసె,
మనసులోపలి వెతలజడివానవెలిసె !

చండీదాసు—రామిని

మనప్రేమ
కల్లోలినీ తరంగములన్
పయనించి పయనించి
శీర్ణసికతాద్రియగునో,
పూర్ణకలశాబ్ధియగునో !

మనప్రేమ
కాలగాఢాగ్నికీలలలో
తపియించి తపియించి
దగ్ధతరుకాండమగునో,
ముగ్ధమధుభాండమగునో

మనప్రేమ
దీర్ఘఝుంఝూమారుతములన్
ప్రసరించి ప్రసరించి
విరహనిశ్వాసమగునో
సరస దరహాసమగునో !

మూడవరంగము

[ఆలయాంతర్భాగము—దేవతార్చన సమయము—అర్చకుడు నకులదాసు, బ్రాహ్మణులు—పూజా తత్పరలిరువురు పువుబోడులు]

త్వాం నమామో వయం మాతరమ్ !
నళినీదళ సంస్థిత శుభళయనే !
అళినీలాలక చుంబితనయనే !—
లలిత మధుర హాసాంచితవదనే !
అసితచ్ఛవి సంకాశిత రదనే !
దిగంత సరిత ప్రణవరూపిణి !
అనంత అచల ప్రణయగాయని !
త్వాం నమామోవయం మాతరమ్ !

(తలవాల్చికొని తప్పుచేసినవానివలె దూరమున చండీదాసు ప్రవేశము)

(బ్రాహ్మణులలో కలకలము)

ధర్మకర్త

నిత్యకర్మ వ్యతిక్రామి నిందితపథ
గామి నేటితో నర్చాధికారమెడలు ;
నేటితో నాత్మసంఘ సాన్నిధ్యమెడలు !

అందరు

చండీదాసు స్వధర్మపాలనకు వెలి !
చండీదాసు స్వసంఘలాలనకు వెలి !!

(భేరి మ్రోగుతుంది, తొట్రుపాటుతో నకులదాసు)

నకులదాసు

శరణు శరణు ప్రశాంతదాంతస్వాంతులారా
శరణు శరణు
మీదుదూషణ బాషణమ్ములకేనె బాధ్యుడ !
బాలుడాత డపరిణతుండు !
ఉద్వేలమౌ భావగతి నాపగ చాలడాతడు !
బాలుడాతడు !

సాంఘికుడు

బాల్యాప్రౌఢి, వయస్సా
కల్యారూఢియ నభేదకలితంబులు దౌ
శ్శీల్యా చరణంబుల దౌ
ర్బల్యా నీతస్వకర్మ భంజనమందున్

నకులదాసు

ఎరుగమిని చేయు తప్పే జీవితమ్మెల్ల
తరిమి సాధింపగా తగవగునె ధర్మాత్మ !
పొరబడిన దుర్బలుల సరిచెయగావెరవె
కరుణింపరో కృపామహితాత్ములార !

ధర్మకర్త

కఠినదండనకాని మార్గమ్మొకటి
కలదు ప్రాయశ్చిత్త కర్మమే !

నకులదాసు

మహితసంఘ ప్రేమపాత్రుడై
నాభ్రాతమెలగు !
మాతృసేవా ప్రసవమాన్యుడై
ధన్యుడై చెలగు !
పతితదీనక్షమా సంగినీ !
ప్రేమాంతరంగిణీ ! జననీ

అందరు

దిగంతసరిత ప్రణవరూపిణి !
అనంత అబల ప్రణయగాయని !
త్వాం నమామో వయం మాతరమ్

నాలుగవరంగము

(రజకవాటిచేరువ వకుళవనంలో రామిని వియోగమున)

రామిని

దాసికానా ప్రాణబంధూ!
న న్నుదాసింతువే ప్రేమసింధూ!
ఆశలేసురిగితూలేనో, ఆకాశమే విరిగికూలేనో!
హృదయమ్ముపైరాలురవ్వ, లోకమ్ము
అదయమే వెడనవ్వు నవ్వు!
చంద్రుడే యిరులలోదాగె, జగము
తంద్రలో కనుమూసి తోగె!
బృందావనికి నీవురావో, మధుర
మందానిలము లింకలేవో!

(రామిని సఖి హడావిడిగా ప్రవేశించి)

సఖి

ప్రణయపరిశుద్ధుండు చండీదాసు ప్రాయశ్చిత్తమంట!
వలపుతాపసిమైన మాధవుమనసె కల్మషకలితమంట!

రామిని

(ఉన్మత్తురాలివలె)

ఎడద పగులునో, బ్రదుకె రగులునో!
విరహజీవికే—యేవిధినిగడచునో!—
చదివిన నరులే అదయహృదయములో—
తెలివిమరుగులో వలపుతలపరో?

....

ప్రణయమూర్తి ప్రాయశ్చిత్తమో!—
ప్రేమికార్తి లోకోత్పాతమో!!

(పరుగెత్తును)

ఐదవరంగము

(దేవ్యాలయంలో—ప్రాయశ్చిత్తమంటపం)

అర్చకులు

జయ విశాలాక్షీ! జయజయవిశాలక్షీ!
దేవ్యై నమోస్తు దివిదేవగణార్చితాయై
భూత్యైనమోస్తు భువనార్తి వినాశనాయై!
శాంత్యైనమోస్తు శరణాగతరక్షణాయై
క్షాంత్యైనమోస్తు దురితక్షయకారణాయై!

(సుదూరంలో రామిని ఆర్తనాదం)

ప్రాణాధికా! ప్రాలుమాలికా:

(అర్చకులు బిగ్గరగా, వెంట చండీదాసు మందంగా అలసంగా మంత్రపాఠం)

అర్చకులు, చండీదాసు

ధర్మప్రకాశినీ, ధర్మసంకాశినీ!
మహాపాపినం స్వధర్మచ్యుతం
మాంశోధయ పరిశోధయ!
మాంపాలయ ప్రపాలయ!
భావిసౌశీల్య ప్రతిజ్ఞాతారం
మాంరక్షయ పరిరక్షయ!

(ఆర్తంగా పరుగెత్తి వస్తూన్న రామిని గొంతు దగ్గరవుతుంది)

ప్రాణపతీ, ప్రణయైకమతీ!

(మంత్రపాఠం అర్చకులు మాత్రమే, పరధ్యానంగా వెంట అనుకరించని చండీదాసును హెచ్చరిస్తూ, నొక్కి నొక్కి చేస్తూంటారు)

అర్చకులు

భావి సౌజన్య ప్రతిజ్ఞాతారం
మాం పాలయ ప్రపాలయ!

(హెచ్చరికగా తిరిగి అదే చదువుదురు—ప్రాయశ్చిత్త రంగంలోనికి రామిని వచ్చిపడును)

రామిని

ప్రాణపతీ! ప్రణయైకమతీ!

(పళ్ళెములు పాత్రలు వదలివేసి అచార్యుల హాహాకారాలు లెక్కచేయక, చండీదాసు వచ్చి రామిని పాదాలవద్ద పడిపోవును)

చండీదాసు

ప్రణయినీ రామినీ!
స్నిగ్ధతేజోధామినీ దివ్యభామినీ!
శాశ్వతైకైక సౌధర్మ్య స్వరూపిణీ!
నిరుపమప్రేమినీ!
విశ్వసుందరి, వేదమాత! గాయత్రీ!

(సాంఘికుల ధిక్కారాలనడుమ చండీదాసు రామిని ప్రస్థానం)

ఆచార్యులు

తక్కువవెలంది వేదమాతగ నుతించు
విజ్ఞసంఘంబులోననే విప్లవంబొ
వెర్రితలలొ ఘటిల్లెడు వీనికతన
ఈక్షణమె, ధర్మపతితుడౌ నితడుజన్మ
భూమినుండ ననర్హుడై పోవుగాక !

నకులదాసు

అగ్రజుని స్నిగ్ధహృదయమ్ము ప్రీల్చితివోయి—
అనుజ, అనుజా ! పోవుదువా, పోవుదువా తండ్రి !
దేవీ, విశాలాక్షి ! ఓవిశ్వహృదయినీ !
భగ్నహృదయుడను, విభాత్మకుడ
లోగొనుమమ్మ !

(గుండెపగిలి, కూలబడును)

ఉత్తరరంగము

బృందగీతి

మాధవదేవుని మధువనము జగము
రాధారమణీ జీవనము !—
ప్రణవవికంపిత పవనాలింగిత
తరుకుంజ లతాకరము !—
ప్రణయకదంబిత మధుకరచుంబిత
ప్రసవసౌరభాకరము !—
మాధవదేవుని మధువనము జగము
రాధారమణీ జీవనము !

(మహా ప్రస్థానంలో చండీదాసు, రామిని)

చండీదాసు

నినువినా దేవి ! నాకమ్మైనవలతునే ?
క్షమింపవో ధర్మజడితుదోషము ప్రియా !

రామిని

నినువీడి మనుదునే నాథ ! నా
మనికి కనువెలుగీవె కాద !!

చండీదాసు

మనికి స్వర్గమ్మెపుడుకాదు
జగము బృందావనముకాదు
మనమె స్వర్గము సఖీ !
మనమె బృందావనము !

రామిని

నీరాధికను నేనె !

చండీదాసు

నీమాధవుడ నేనె !

ఇద్దరు

మనమె స్వర్గము ప్రియా !
మనమె బృందావనము !

....

ప్రణయఖేలలొ ప్రేయసిరాధిక,
ప్రేమికుడే మాధవుడు !
ప్రణయశక్తి రాధిక జగన్మాత !
ప్రేమమూర్తి మాధవుడు జగత్పి

రాధాకృష్ణ ప్రణయలీల

బృందగీతి

రజకినీ ప్రియుడైన చండీదాసు
విశ్వప్రణయగానము !—
ప్రేమగానము, ప్రేమగానము !
సకలజగదభిరామగానము !

(ఆల్ ఇండియా రేడియోవారి అనుమతిని)

★



లకుమాదేవి

[శ్రీ భావరాజు వేంకటకృష్ణరావుగారి కథను అనుసరించి "రజని" రచించిన సంగీతనాటిక]

[రాజులతో స్నేహము కత్తిమీది సాము. ఏ నిమిషమున నే మగునో చెప్పలేము. "నీనాట్యమహిమ నిజముగ వేల్పు చేడియలగు ఊర్వశీతిలోత్తమాదులను గూడ సిగ్గుపడ జేయుచున్నది దేవీ, లకుమాసుందరీ!" అని బహూకరించి తన ప్రేమ సామ్రాజ్య పీఠమున నధివసింప జేసిన వసంతరాయ బిరుదాన్వితుడు, కుమారగిరి వల్లభుడే ఈర్ష్యాపరవశులైన కుమతుల రహస్యవచనములకు చెవియొగ్గి ఆమె శీలమును సంశయించి, "నీవు నిర్దోషివని నిరూపించుకొనుటకై ఈ గోపుర శిఖరమునుండి నేల మీదికి దుముకవలయును" అని ఆజ్ఞయిడిన, అభిమానవతియైన లకుమ ఏమి చేయ గలదు! లకుమ తన సౌశీల్యమును నిరూపించినది; కాని, హృదయేశ్వరుని అవిశ్వాస మును సహింపగలదా ?]

—.—

బృందగానము :

హృదయమ్ముల మధురమ్ముగ
నుదయించెను ప్రణయశ్రుతు
లుదయించెను ...
ప్రణయ శ్రుతు లెగసి యెగసి
విశ్వమెల్లయెడల పరచుకొనియె
నెల్లయెడల పరచుకొనియె ... లోన
అణువణువున సొగసులూరి,
అద్భుతనాట్యాలు తీరి,
అతిలోకపు సౌందర్యము
అవ్యయమా ఆనందము—అణువణువున ఆనందము,
ఆనందము ఆనందము

... ...

ఏదో మహారాదుపద్రవమ్ము
గ్రహకూటము తారకాళిగతులు మారుసంక్షోభము
విశ్వవీధి హాహారవము
భగ్నహృదయ బాధాస్వరము.

... ...

విషాద మేఘాంబు పూరవికిర కేశపాశముతో
హృదయము చిదికిన ఏ సతి ఏదనమ్మో ఆకాశము
జగదరిష్టకారియైన ధూమకేతు వాలమో
ఛిన్నహృదయరక్తరాగ రంజితకరవాలమో

... ...

విభునిచేత శంకితయౌ విమల హృదయ ఆత్మఘాత
వినువారికి కనువారికి హృదులు కరగు ఆర్ద్రగాథ
[కొండవీటిలో, సంగీత సాహిత్యములందునూ, నాట్యశాస్త్రమునందునూ వర్ణనాతీతమైన అభిమానము గల వసంతరాయ బిరుదాంకితుడగు కుమారగిరి ప్రభువు కొలువుకూటమున - వసంతోత్సవము. వాద్యఘోష]

వందిమాగధ బృందం:

జయతు జయతు జయ రెడ్డివంశ ప్రదీపా
జయతు జయ దిగ్దిగంతకీర్తిప్రతాపా
జయతు మాణిక్యసింహాసనా ధీశ్వరా
జయతు ప్రతిదినసమారాధ్యలోకేశ్వరా
జయతు సర్వస్వదానధర్మపరాయణా
జయతు జయతు ఇమ్మడిగరుడనారాయణా.

... ...

కాటయవేమన : జయోస్తు, కుమారగిరి భూ
దయితా, మా భరతశాస్త్రతత్త్వవ్యాఖ్యల్
వయస్వినీ వసంతమధు
మయోల్లసితర్తన రత్నములమాన్యములగుతన్

కుమారగిరి : సేమమె బావా, కాటయ
వేమా, ఇదమాసనమ్ము, విబుధవసంతా
రామము త్వదాగమనమున
వేమడుగుల శోభమించె విబుధవతంసా.

కాటయ : కుమారగిరి భూవరం, ఈ
సమాగతానేక విబుధసత్కవి సభలో
సమానరహితిన ర్తకి, ల
కుమాదేవి చైత్రనృత్యగోష్ఠిని కనుడీ.
లకుమ : ఇది వసంతరాజసభాభవనమ్మో
బృందం : వసంతోద్యాన వనమో
లకుమ : ఏదెసనో కోకో
ఏదెసనో కోకోయని ఒక కేకా
బృందం : దెస దెస కోకిల బాకా
లకుమ : బాకా వెనుకనె యెఱ్ఱని పచ్చని
స్త్రీలు : రంగుల చివురుపతాకా
పురుషులు : కలకల రంగుల చివురుపతాకా
లకుమ : ఆ దెస ఈ దెస క్రమ్మెను ధిమ్మని
స్త్రీలు: తుమ్మెద ఝుంకృతి దుందుభి
పురుషులు : ఝుమ్మని తుమ్మెద హుంకృతి
దుందుభి
స్త్రీలు : తెమ్మెర ! తెమ్మెర !
పురుషులు : ఏమనె తెమ్మెర ?
స్త్రీలు : విడెను మంచుతెర !
పురుషులు : వచ్చె వచ్చెను వసంతుడని !
స్త్రీలు : అందులకా యీ యుత్సవము
పురుషులు : అందపు తియ్యని కలవరము
స్త్రీలు : ఇది వసంతరాజ శుభోదయమా
పురుషులు : నవ వసంత ఋతురాజోదయమా.
లకుమ : నిత్య వసంతా, నవ్య వసంతా
నిత్య స్వాగతమోయి ప్రభూ ॥నిత్య॥
నిత్యయౌవనా, ప్రణయార్ద్రావన
నిస్తులకీర్తి ధవళితాశాంతా ॥నిత్య॥
తరుణీ ప్రణయా రామ మనోహర
తరుణ వసంతుడ నీవె ప్రభూ ॥నిత్య॥
హృదయ కుసుమమును పదముల నుంతును
కరుణాదృష్టిని కాంచు ప్రభూ ॥నిత్య॥
వరముగా నిమ్ము పావనము, నీదు
మధువనమునందు జీవనము...నిత్యవసంతా.
జనబృందం : సాధు సాధు లకుమాదేవీ
సాధు సాధు లకుమాదేవీ
సుకుమార నృత్య సౌందర్య భావ
సంధాయినీ, అమరగాయనీ
అపరూపకల్పనా మాధురీఝరీ
అసమాన నాట్యలహరీ ... సాధు సాధు.
కుమారగిరి : బావా, కాటయవేమచ
మూవల్లభ, మహిత భరతముని వాక్యలకున్
మీవ్యాఖ్య వెలుగు దివ్వియ,
మీ వ్యాఖ్యకు లకుమనాట్యమే వెలుగుసుడీ.
కాటయవేమ : అలవసంతనృత్య మానందముగ జేసి
లకుమ సకలనయనలక్ష్మి యయ్యె
అల వసంతనృపతి కంకితమై నిత్య
యశము నందు మాదు వ్యాఖ్య జగతి.
కథాకథనబృందగానం :
ఆసుందరాంగాల, ఆ కృపాపాంగాల
నాట్యాల మురిపించిన మిటారి లకుమ
ఆ భ్రూవిభంగాల, వేణీతరంగాల
వలపంత హింసించిన కటారి లకుమ
సుకుమారుడు కుమారగిరి కోమలహృదం బుధిని
పొంగి పొరలించు శశిరేఖ లకుమ
ప్రేమాళువు వసంత భూపాలహృదనంతసా
మ్రాజ్యమ్మే నేలు దేవేరి లకుమ.

కవి

జయతి మహిమాలోకాతీతః కుమారగిరిప్రభోః
స్పదసి లకుమాదేవీ యస్య ప్రియా సదృశీప్రియా
నవ మభినయం నాట్యార్థానాం తనోతిసహస్రధా
వితరతి హుానర్ఘా నర్ఘి ప్రజాయసహస్రశః॥

రెండవ రంగము

[ప్రదేశము: వసంతోద్యానవనము]

కుమార : హృదయేశ్వరి, ఏమనిపాడెను కోయిల,
ఏ మేమని ?
లకుమ : హృదయేశ్వర, మధువని మరల పిలుచు
నామనివీవని
కుమార : నన్నామని అనెనా, అనలేదా నిన్నేమని?
లకుమ: రాజామని యగుచో, రాణీవనరమయేయనె
కుమార : కో కో యని ఆ కోయిల ఏకాన్క-
లందుకో యనె ?
లకుమ : వలపు తేనియలు, పరువపు ఫలములందుకో
యనె.

కుమార : ఓ వనరమ,
లకుమ : ఓవసంత.
ఇద్దరు : హాయిగ నేలుదుము వసంతారామము జగతి
ప్రణయ శాసనమ్ము ప్రణయ సామ్రాజ్యము
మనది.

కథాకథనబృందం

చిత్రసాహిత్యాంగణముగా
నాట్యగీతా మండపముగా
ఆవసంతావనీశుడు లకుమా సఖీ
ప్రేమాలయముగా
కట్టించె గృహరాజ సౌధమ్ము
యుగయుగమ్ముల ప్రణయబంధమ్ము.

మూడో రంగము

[ప్రదేశము: అంతఃపురము]

[అంతఃపురంలో వదంతి బృందం:]

"ఇదిగో - ఓహోయ్" "ఇదిగో, ఇదిగో
ఓహోయ్"
"విన్నావా యీ మాట?"- " అన్నట్టే మాటే
మాట?"
"ఆమాటనకూడదుగాని - అబ్బ, తలిస్తే దుర్భ
రము"
"ఊరూ పేరూ లేని నర్తకికి";-"ఉష్-ఉష్-"
"ఉష్షూ లేదూ, గిష్షూ లేదు, - ఉలుకెందుకు
ఉన్నమాటలకే"
"నే సహించలేన్" - "నే సహించలేన్"
"నే సహించలేన్, సహించలేన్"
"ఊరూ పేరూ లేని నర్తకికి - ఉన్నట్టుండగ
అందలమా?"
"వదంతి వేద్దాము-రాజు మనస్సు విరుద్దాము"
"ఇదుగో ఓహోయ్ ఇదుగో ఇదుగో
ఓహోయ్"
"విన్నావా యీమాట""అన్నట్టేమాటేమాట"
"రాజు కంటిలో కారమా?" "లకుమా దేవికి
ప్రియు లెందరు?"-"ఆఁ?"
"ఇద్దరు ముగ్గురు - ఇద్దరు ముగ్గురు "-"నమ్మిన
రాజుకె ద్రోహమా"

రాజు : (ఆగ్రహంతో ప్రవేశించి)
"ద్రోహమా" "ద్రోహమా"........
గోప్యమా, క్షమింపను, నాట్య
మోహినీ, స
రస్వతీదేవి యవతార రమ్యమూర్తి
వేమొయనిపించి, వలపించి, హృదయరాజ్య
పదమధిష్ఠించు నీవే యపాత్రమగుదో,
ఈ లకుమారమణి నడత
మాదు హృదికి తీరని వెత,
కాటయవేమా, ఇది మీ
కానుక యేనా? ఇదియే
పాటి నర్తకియో, యెంత
కుటిలబుద్ధి-కుమతి, ద్రోహి,
కాటయ : ఓవసంత భూజానీ,
ఓరిమి, ఓరిమి, ఓరిమి,
అంతటి ప్రణయాస్పదకే
అంతటి వినయగుణ వతికె
ఇంతటి యపవాదు నే నొ
కించుకయును నమ్మజాల
ఓవసంత భూజానీ
ఓరిమి, ఓరిమి, ఓరిమి.
రాజు : అపవాదకళంకిత దెస
కు పోయి చూడమికచాలు కుహనాప్రేమల్
అపూర్వ నర్తనలు, చాలు
విపరీతానుభవ వృథావేశ పరతలాన్.

బృందగీతి :

కళాసరస్వతి కాలియందియలు
ఘల్లున మ్రోగనివాయె
కలస్వనమ్ముల వీణాగళములు
తంతులు పలుకనివాయె
గృహరాజ సౌధమున దీపకలే
వెలుగులు మానినవాయె

నాలుగో రంగము

[గృహరాజసౌధమున ఏకాకినియైన లకుమ.]

లకుమ : నీపాదములు తాకు ఆపావన
రజఃకణాలె నా సుమశయ్యగాదె నాథ
ఏ తలయొలాగుత్తెనో గాని, నీలాప

నింద నా ప్రభుకే దహించు నాథ,
నీ దివ్య సన్నిధియే లేక నానింద
నేతి బొంగురో నేర్తు నాథ.

నందిమాగధులు : జయ జయ కర్పూర వసంతా
జయ వీరభోగ విజితానంతా
జయ కుమారగిరి వసంతరాయా
జయ కవిపండిత నిత్యధ్యేయా

లకుమ : దోషి కాని దాసురాలిపైన
ఏ విధాన నాగ్రహమ్ము పూని
ఎంత కఠిన శిక్ష వైచినారో
ఇంత కరుణ జూప వచ్చినారో

కుమారగిరి : లకుమా, లెమ్ము, పరీక్షిం
పకయే నిను స్వీకరింప మా కొప్పదుగా
సకల ప్రజ నకలంకత
ప్రకటించు పరీక్షగాగ పడయుము మమ్మున్.
గృహరాజ సౌధంపు
గోపురపు శిఖరమ్ము
కొసనుండి దుమికెదవ లకుమా
భువిపైకి - దుమికి తలపూవాడకయే నిల్తువేని
నిలుసంతయేని అలసత పొందవేని,
నా ప్రేమకీవు పాత్రమగుదు లకుమా.

లకుమ : నా మధురాశయములు పూజనములు నిజ
మైతే, నిజమైతే,
నా గురుసేవలు, కళాతపస్సులు నిజమైతే,
నిజమైతే,
గృహరాజ సౌధ గోపురము,
భూమాత కౌగిలియు నొకటైతే
నా ప్రభుని ప్రేమ నాదౌను,
[గోపుర శిఖరమునుంచి లకుమ భూమిపైకి
దుముకుటను సూచించు వాద్యసంగీతధ్వనులు]

బృందగీతి :
గృహరాజ సౌధవలభినుండి దుమికెను దుమికెను
రాలెడు చివురాకో,
తళ తళ మెరయు పవన బాలో
పెనుగాలి యలలు ఝల్లి పరచు
సుడిగుండములను తిరుగుచు
గిర గిర తిరుగుచు గిర గిర తిరుగుచు !!-
హరివిల్లువోలె తెరలించు వెలుగు
గొడుగుగా విరిసె పావడా !!-
వెలుగు గొడుగు పావడా
గాలిపొరలపై తేలియాడగా !!-
భూమిపై రాలిన చివురాకో,

బృందగానము : సాధు సాధు లకుమాదేవీ,
సాధు సాధు లకుమా దేవీ
సాధు సాధు అకలంక చరిత్రీ
సాధు సుకుమార గాత్రీ.

కుమార : లకుమా, మదీయ ప్రేయసి
అకలంక చరిత్ర, బహుజనారాధ్యవు ని
న్న కారణమ్ముగను బరీ
క్షకు పిల్చితి, నాదు తప్పు సైరింపగదే
రమ్ము ప్రేయసీ, నాదు అర్ధాంగలక్ష్మి.

లకుమ : దాసిని దరిజేరకుడు ప్రభూ
ప్రజావాక్యమే కర్తవ్యముగా
పాలించే ధర్మప్రభువే
విశ్వసింపరుగ మీ ప్రేయసినే,
విశ్వసింతురు వదంతులనే ||
ఈ హృదయమ్మున రగిలే
ఆ యవమానాగ్నులనే
ఈ చిరుబాకున చల్లార్పుదునో
(మొలనున్న బాకుతో పొడుచుకొని,
భూమిపై ఒరిగిపోవును.)

రాజు : గతించితే లకుమా
అవమాన ఖిన్న సుకుమార
హృదయ లకుమా, లకుమా
ఈ భూమినింక వాసంత
వైభవము లేనీ,
లకుమా విన రత్నము లేనీ,

బృందగీతి :
విభునిచేత శంకితయా 'విమలహృదయ ఆత్మఘాత
వినువారికి కనువారికి
హృదులు కరగు ఆర్ద్రగాథ.

*

[ప్రచురణ ఆల్ ఇండియా రేడియో వారి అనుమతిని]

LAKSHMI REGIONAL LIBRARY
Govt. of A. P.

శాఫో

[గేయనాటిక]

రజని

[ప్రేమకోసం జీవితాన్ని బలియిచ్చిన శాఫో - గ్రీసుదేశపు కవయిత్రి. ఆమె కవితారీతులు, విశ్వజనీనములయినే ఉన్నత భావాలు, గ్రీసుదేశపు సాహిత్యానికేకాక ప్రపంచ సాహిత్యానికే అమూల్యాలంకారము చేకూర్చాయి. ఇది ఊహగా అల్లిన ఆమె జీవితగాథ]

సూత్రధారుడు :

ఎన్నడేని నీ వొకపరి వలచి, వలచి,
వలచి వలపుతీరమి ఎద పరితపించితే

బృందగీతి :

వినవో, యీకథా! మరపించును నీవ్యథా!

సూత్రధారుడు :

నీ యెడంద, నా యెడంద
నిలిచి పిలుచు చెలిమి కలలె
ప్రణయిని శాఫో యెడంద
కలచి బ్రతుకె తపియించెను!

బృందగీతి :

వినవో, యీకథా! మరపించును నీవ్యథా!

చెలుల బృందగీతి :

విరుల కై సేయుదేని ఓ చెలియరో,
ప్రియుడు తలతాల్చునే నిన్ను వలపుతో!
కురులు సవరింపనీవో యీ విరులతో,
ప్రియుని తేలింపవమ్మ మైమరపులో!

శాఫో

ఫల నాకీ యలంకారమేల?
ప్రణయమే చాలు! ఈ సొమ్ములేల?
వచ్చునో రాడో నాప్రియుడు నేడు
ఇచ్చకపు మాటగా పల్కినాడో?

చెలుల బృందగీతి :

వినవో సఖి! వినవో!
కనవో నీ ప్రియుని!
అంగణమున నిలిచి, సుమధు
రాహ్వానము చేయునతని
కనవో నీ ప్రియుని!
వినవోసఖి! వినవో!

ప్రియుడు (ఫావో)

సఖి! శాఫో! సఖి! శాఫో!
విను నీ గీతమె పాడెద!
"వేగుచుక్క వెలుగుతోనె
వెన్నెలలూ సంజ యిరులు
కలిపికాంచి సంతసించు
కళాశీలి సృష్టికర్త
వెన్నెల నాలమందలను
తల్లుల, పాలపిల్లలను
మృదుల మధుర మోహనమై
నవెల్ల ఒక్కచో చేర్చి"
నన్ను సఖియ శాఫో యెదచేర్చె!

శాఫో

నన్ను సఖుడు ఫావో యెదచేర్చె!

చెలుల బృందగీతి :

ఓలలాడవే చెలియా, ని
న్నేలు ప్రియుని ఆలింగన డోలిక!
తోట పూలతరుల తడుపునా సెల
యేటి యూట జోలపాట పాడగ॥

కరగు వెన్నెలలల, తరుగు చీకటుల
పరచు మిణుగురుల మెరపులాశలై
ఓలలాడవే చెలియా, ని
న్నేలు ప్రియుని ఆలింగన డోలిక ॥

సూత్రధారుడు :

అదిమే హాయినొసంగిన తుదివెన్నెలరేయి!
భళ్లుమనుచు తెల్లవారె, శాఫో యెద తల్లడిలగ
శృంగారవనమ్మునుండి సౌందర్యోన్మత్త యొకతె
శాఫోనెడబాసి, యామె సఖుని రమ్మనుచు
పిలిచెను !

బృందగీతి :

వినవో, యీ కథా! మరపించును నీవ్యథా!

సౌందర్యోన్మత్త :

లేవోయీ - ఫావో - సఖా !
లేవోయీ ఫావో!
సాహిత్యము వలచెదవో, నిండగు
సౌందర్యము వలచెదవో
ప్రణయనికుంజపు పంజరమునువిడి
సౌందర్యవనికి రావో !!
మనోహరతనూ విలాసినులు నీ
కనూన సౌందర్యము నర్పింపగ
వనాంగణమ్మున కలరోయీ!
లేవోయీ ! ఫావో !

ఫావో :

సెలవొసంగుమా, శాఫో ! సెలవొసంగుమా !
నీ కవితాగరిమకంటె, నీ ప్రణయమధురిమకంటె
ఆసౌందర్యవనీ సౌఖ్యాంచిత భోగాళి వలతు
విస్మరింపుమా, నన్నిక విస్మరింపుమా !

శాఫో :

పోవుదువా నను వీడి, రావో, రావో సఖా !
క్షణికమౌ సౌందర్యమే సతమ్మా నీకు ?
నిలువనీడే లేద నిస్తుల ప్రేమ కిక ?
కన్యనై జీవితము గడపి వేయుదునోయి
నీవు నన్నేలుకో రావేని నా ప్రియుడ!

బృందగీతి :

కవితా ప్రణయడోలికా లీల చాలించి
శాఫో ప్రియుడు ప్రేమసూత్రమ్ము తెగత్రెంచి
సౌందర్యవనిచేర సుందరి ననుసరించె
శాఫో హృదయవంశి భోరుమని విలపించె !

సూత్రధారుడు :

కన్నెవలపు నీసడించి చన్నయతడు మనసుమారి
ఎన్నడేని రాకుండునో అనుచు
కన్నులు కాయలు కాయగ కనుచు
పవలు, రేలు, వత్సరాలు, నిలుచు
ద్వారమె నెలవనుచు !

శాఫో :

వాడిన గులాబిరేకలన్ని రాలె సోన నీటిలోన
పాడిన వియోగగీతి కరగిపోయె
హృదయతంత్రిపైనె !
వాకిటను ఆకో, అలమొ కదలి ఆశల నెదరేపు!
రాకయెయుంటి విన్నినాళ్లు, వత్తువో యిక రేపు?
ఆశాసుమాలు త్రుంచివిసరివైచితి దెసదెసల !
ఈశోక జీవితము ముగించివైతు కడలియలల !

సూత్రధారుడు :

హతాశ శాఫో నిరంతరాశలతో పేర్చిన-
ఉన్నతాద్రిశిఖరమ్మునుండి యురికె జలధిగర్భమ్మున
హృదయవేణు శకలమ్ములు నదించె
శాంతి శాంతి యని !

[మద్రాసు ఆలిండియా రేడియో కేంద్రమునకు, దీనిని ప్రథమమున ప్రచురించిన నవ్య సాహిత్య పరిషత్పత్రిక "ప్రతిభ"కు మా కృతజ్ఞత—సం॥

★

స్త్రీకి పురుషులతో పాటు సభా ప్రవేశానికి అవకాశ మెంతమాత్రము లేదను 1 వ శతాబ్దంనాటి అభిప్రాయానికి బలియయిన నారీమణి త్యాగగాథ.

రచన
|
రజని

వరాహాచార్యుడు సామ్రాట్ విక్రమాదిత్యుని ఆస్థానంలో జ్యోతిశ్శాస్త్ర పండితుడు. మిహిరాచార్యుడు అతని కుమారుడు. ఖనా మిహిరుని భార్య.

వరాహ : మిహిరా! మిహిరా!...ఖనా, మిహిరుడు రాలేదు?

ఖనా : రాలేదింకా. సంధ్యాజ్యోతి యిదిగో! మీరీ సాయంత్రం నక్షత్ర మంటపానికి వెళ్లలేదా? తొందరగా యింటికి వచ్చేశారు?

వరాహ : సంధ్యాజ్యోతిః పరబ్రహ్మ! వెళ్లలేదమ్మా ఖనా... అప్పుడు తొందరే...మిహిరుడింకా రాలేదేమి?

ఖనా : ఇంత తొందరగా ఎలా రావడం? నక్షత్ర మంటపములో ఈ నడుమ నూత్న పరిశోధన ప్రారంభించారేమో?

వరాహ : అప్పుడప్పుడు- ఏయే రాశిలో ఎన్ని తారకలో, ఏఆకారముగలవో వాటి చరిత్రంతా పరిశీలిస్తున్నాడు... ఖనా...ఖనా...

ఖనా : మామగారు? ఏమికావాలి?

వరాహ : మిహిరుడు కావాలి.

ఖనా : మామగారెందుకో ఆరాట పడుతున్నారు? ఏదో చింతాగ్రస్తులై వున్నట్టున్నారు- కారణం నేను తెలిసికొనవచ్చునా?

వరాహ : ఆరాటము- చింత. జీవితమే చింతామయం. శంకాభయసంకులం. పంచభూతాలలో కలసిపోయే వరకు...ఖనా...నా పరిశోధనాసర్వస్వం...మాత్ర రత్నావళి...నా గ్రంథాలు కనబడలేదమ్మా...

ఖనా : అయ్యో! వాటికోసం మీరు వెదికారా? నాకూ కనబడలేదు. ఆస్థానంలో ఏమైనా నూతన చర్చలా? సప్తర్షుల నడుమ వచ్చిన ధూమకేతువును గురించిన చర్చ పూర్తి అయిందా?

వరాహ : అయ్యో! సప్తర్షుల నడుమ కాదమ్మా, మన నడుమనే ధూమకేతువు వచ్చిపడింది.

ఖనా : మామగారి ఉద్దేశ్యము బోధపడలేదు.

వరాహ : నా గ్రంథములు దొరకకపోతే ఈరాత్రి తెల్లవార కూడదు. తెల్లవారితే నాకు మీఅందరితోను ఋణము తీరిపోతుంది.

ఖనా : పాపము శమించుగాక. మీ మనస్సు ఎందుకో చెదరినట్లుంది. కొంచెము విశ్రాంతి తీసికోరూ! నేనుకాని అబ్బాయికాని, ఏమీ అపరాధము చేయలేదుగద!

వరా : అపరాధములు మీకెందుకమ్మా! నాపాపము పండి చక్రవర్తి శాసనముగా పరిణమించినది. ఏమి శాసనమో! రాజుల ఆగ్రహానుగ్రహాలు ప్రళయప్రభంజనాలు!

ఖనా : ఊరడిల్లరా! ముందు కొంచెమూరడిల్లండి. విక్రమా దిత్య చక్రవర్తి శాసనమేమని...

వరా : బిడ్డా ఖనా!! అదృష్టమేమని చెప్పను. యవన దేశపు జ్యోతిష్కుడెవడో అన్నాడని మహారాజు ఎంతటి తిక్క ప్రశ్న వేశారనుకొన్నావు? ఆకాశమునగల తారా గణమును లెక్కించి ఆసంఖ్య నుచ్చాటించాలెనట. లేదా తెల్లవారునసరికి నా శిరస్సు వారిది కాదు. బిడ్డా! ఖనా! మిహిరుడీలోపున వస్తాడా? ప్రాణము లేనైన...

ఖనా : మామగారు! మామగారు! ఈ ప్రశ్నకు తగినయుత్త రము చేసిస్తాను. మీరు వెళ్లి మహారాజుకు చెప్పండి.

వరాహ : ఆఁ. ఆఁ. ఖనా! నీకు సరియైన ఉత్తరము తెలుసా? ఎందుకు తల్లీ నన్ను పసివాణ్ణిచేసి ఆడిస్తావు.

ఖనా : మామగారు, నేను అల్పజ్ఞురాలినైనా - నన్ను మన్నించి-ఇది వినండి. గుప్పెడింత ఇసుక పట్టుకొని అదివొక పళ్ళెములోపోసి చక్రవర్తిముందుకు పెట్టండి! ఆపళ్లెములో ఇసుక రేణువులెన్నో ఆకాశములో నక్ష త్రములన్ని అని చెప్పండి.

వరాహ : ఖనా! ఖనా! నీవు మాపాలి దైవతానివి. మా కల్ప వృక్షానివమ్మా.

ఖనా : సంఖ్య కావలిస్తే చెప్పండి- తొమ్మిది కోట్ల తొం బది తొమ్మిది లక్షల ఇత్యాదిగా మీ యిష్టం వచ్చిన సంఖ్య చెప్పి- లెక్కించి చూడమనండి.

వరాహ : ఖనా! ఖనా! అఖండ మేధాశాలినివి నీవు! మా భాగ్యదేవతవు. ఈ క్షణమే చక్రవర్తి దర్శనము చేసి వస్తాను.

౨

మిహిరుడు : (మెల్లిగా) ఖనా! ఖనా! నాయనగారింట్లో లేరుగదా!

ఖనా : ఇప్పుడిప్పుడే ఆస్థానానికి వెళ్ళారు. ఏమి?

మిహి : ఏమీలేదు. కొన్ని దినముల క్రిందట- ఒక యవన స్నేహితుడు చూచి యిస్తానంటే, నాయనగారి జ్యోతి శ్శాస్త్ర గ్రంథాలు...

ఖనా : ఏమిటీ? మీరు తీసియిచ్చారా? నేనడుగుదామనే అనుకుంటున్నాను. మామగారు [illegible]దా ఎంతో...

మిహి : నాన్నగారికి కనబడకపోతే కష్టపడతారని తెలుసు. ఇంతలో వాటికోసం వెతుక్కుంటారనుకోలేదు.

ఖనా : ఇంతకీ, ఆగ్రంథాలమటికి యవనుల కెందుకిచ్చారో మీరు?

మిహి : అదేమిటీ? మనదేశపు ప్రజ్ఞా ప్రభావములు ఇంతటి వని తెలిస్తే వారు మనయెడల విధేయులై సంచరిస్తారని.

ఖనా : అయ్యో... అదే మరొకలా పరిణమించింది.

మిహి : ఎలాగ?

ఖనా : మీ యవనస్నేహితుడు మహారాజుతో ఏవో ప్రగ ల్భములు పలికినాడు. మహారాజు ఆకాశ గర్భమునందలి తారకాగణము సంఖ్య తెల్లవారు లోపున నిర్ణయింప వలెను. లేదా, మరణదండనమని శాసించారట.

మిహి : యవనుడెంత ద్రోహి- అందుకేనా, నన్ను ఎంతకీ వదలక గ్రంథము లెంతసేపటికీ ఇయ్యక వేధించాడు. నాయనగారికి సమస్యకు తగినసమాధానము లభించిందా? ఎలా వెళ్ళారు, మహారాజుమందిరానికి.

ఖనా : సమాధానముతోనే మహారాజుల విలాసమందిరానికి వెళ్ళారు.

మిహి : అయితే, నేను వెంటనే మహారాజు విలాసమంది రానికే వెడతాను.

౩

మహాకాళేశ్వరుని ఆలయంవద్ద

మిహి : యవన జనుల దుర్బోధలు విని సామ్రాట్టు స్వీయ జనాన్ని కష్టపెడుతున్నారన్న మాట - నాయనగారూ! ఇది భరించడమెలాగ?

వరా : నాయనా! వారు పాలకులు, మనం పాలితులం.

మిహి : నాయనగారూ! పాలకుడే సదాచారమును పాలిం చకపోతే ప్రజకింక వేరే పట్టుగొమ్మ దుర్లభంకదా! శక

యౌవన బర్బర సామంతరాజులు పరివేష్టించిన సభకు మీ కోడలిని తీసుకొని రమ్మనే మీ అనుజ్ఞ?

వరా : నా అనుజ్ఞ ఏమిటి నాయనా? రాజాజ్ఞ అది. తప్పితే వంశోచ్ఛేదనము.

మిహి : శాస్త్రకమున అందరికీ యుక్తాయుక్త పరిజ్ఞత సదలు చేసెను.

వరా : నాయనా-దురుసుతనం మాను-

మిహి : మీరే- అయుక్తి మీ కోడలికి తోచినదని యెందుకు సభలో అంగీకరించారు?

వరా : అశక్యశ్రామలు మనయింటయూ వంటయూ వుండా నాయనా ఎప్పుడైనా.

మిహి : అయితే, రండి యింటికి, మీరే కోడలిని అలంక రించి రాజసభకు స్వయముగా......

వరాహ : మిహిరా! నన్ను మాటలతో చంపుటకంటె, ఆమెను సభకు తీసుకపోక రాజుచేత చంపించుటకంటె నీ చేతితోనే చంపివెయ్యరాదూ?

మిహి : రాజ ధిక్కారము, పితృవాక్య ధిక్కారము, పితృ ఘాత-ఇన్ని పాపములా-నాయనగారు! మీపాదాల కన్నుల కద్దుకొనిండి. నన్ను మన్నించండి. మీకోడలి తో మాటాడి మీ అజ్ఞకు, రాజాజ్ఞకు, భంగము లేకుండా కార్యము చక్కబెడతాను.

వరాహ : సర్వనాశనానికి సిద్ధపడిన వాణ్ణి నేను- కాశీశ్వ రుని సన్నిధి వదలను.

౪

వరాహాచార్యుని ఇంటిలో ఖనా, అనాతర్త మిహిరుడు.

మిహిరుడు : ఖనా! ఖనా!

ఖనా : ఇదిగో! మీకోసమే చూస్తున్నాను. మొన్న సప్తర్షి మండలంలోకి వచ్చిన ధూమకేతువు తిరిగి నా నంత త్సరాలకి రావచ్చునని గుణించాను. ఇదిగో గణితము.

మిహి : ఇప్పుడుకాదీ గణితము.

ఖనా : అన్నట్టు ఆస్థానానికి వెళ్ళారా?

మిహి : ఆస్థానం నించేవారాక.

ఖనా : మామగారు కనబడలేదూ?

మిహి : కనబడినారు.

ఖనా : చక్రవర్తి అడిగిన ప్రశ్నకు ఉత్తరమిచ్చారా?

మిహి : అన్నీ అయినాయి!

ఖనా : చక్రవర్తి ఏమన్నారు?

మిహి : ఇంతటి మేధావంతమైన యుత్తరమిచ్చిన వ్యక్తి ఎవ్వరయినా సరే, ఆస్థానానికి తోడ్కొని రావాలని చక్రవర్తి ఆజ్ఞ.

ఖనా : ఏమిటి? నేనా! ఆస్థానానికా!

మిహి : అవును. ఏం వెడతావా, ఆస్థానానికి? శకయవన సామంతరాజ పరివేష్టిత సభలో పురుష పండిత ప్రకాం డుల నడుమ ధాటిగా నిల్చొని శాస్త్ర చర్చ చేస్తావా?

ఖనా : (భయపడుచూ) నాథా! మీఆజ్ఞ ఏమని?

మిహి : చక్రవర్తి ఆజ్ఞ ఆస్థానానికి రమ్మని-వెడతావా, ఖనా?

ఖనా : నాథా! మన్నించాలి. నాకు ఆస్థానము, సభ, పరిషత్తు, సర్వస్వము మీరే! నేనాఆస్థానానికెందుకు వెడతాను?

మిహి : ఖనా! చక్రవర్తి ఆజ్ఞ-ఆస్థానానికి నీవు పోవలెను. లేదా మేము చావవలెను.

ఖనా : నాథా! ఏవాక్శక్తిని వినగోరి చక్రవర్తి ఇటువంటి చండశాసనము చేశాడో-ఆవాక్శక్తి నాజిహ్వ-ఇదిగో దీనిని చక్రవర్తికి చూపండి.

మిహి : ఆఁ. ఆఁ. ఖనా! ఖనా! జిహ్వను ఖండించు కొంటివా? ఇంతటి త్యాగమా! ఖనా! ఖనా! ధన్యజీవివి.

—అలిండియా రేడియోవారి అనుమతిని.

★



[ఒక సంగీతసభలో సభాసదుల చప్పట్లు, హర్షధ్వానులు వినిపిస్తాయి. ఆ ధ్వానుల్లో నుంచి చల్లగా మెల్లిగా ఆహిరిరాగంలో “ఏల తెల్లవారెనయ్యో” అనే పదం పల్లవి మాత్రం కొంతసేపు వినిపిస్తుంది. క్రమంగా కరిగిపోయి సభ అయిపోయిన తరువాత్రి కలకలం వినిపిస్తుంది.]

సభాసదుడు : ఎంత చక్కగా పాడింది? ఆహిరి రాగంలో ఆ పదం!

శశిభూషణ్ : ఆ పదం క్షేత్రయ్యగారిది. వారి కవనం రసభావాల పుంత.

సభా : శశిభూషణ్‌గారూ! మీరన్నది సరే కావచ్చు. కానీ ఆ రసభావాలను తాను అనుభవించిన గాయకీమణి తిరిగి మనచేత అనుభవింపజెయ్యడం వుంది చూశారూ- ఏది——

శశి : కాని, మీరెన్ని చెప్పండి, సాహిత్యం ఏమైనా ఆరాగంలోనే మిమ్మల్ని కదిలించే రసపట్టు ఉందండీ.

సభా : క్షమించాలి. ఈరాగం పగలు పాడితే ఆపూట పాడినవాడికీ విన్నవాడికీ కూడా అన్నం ముట్టదంటారు.

శశి : మీ కట్టా తోచవచ్చుగాని నాకు మాత్రం ఈరాగం, అన్నానికీ ఉదరానికీ సంబంధించింది కాదనీ, హృదయానికీ జన్మజన్మాంతర స్నేహాలకీ సంబంధించినదనీ తోస్తుంది.

[శశిభూషణ్ ఇంటివద్ద- ఆరాత్రి- శశి ఒక నవల వ్రాస్తూంటాడు- అతని భార్య రేవతి ‘ఆ దయ శ్రీ రఘువర, అను త్యాగరాయకృతి వయొలిన్‌పై నేర్చుకొంటూంటుంది.]

రేవతి : ఏమండీ- నవల వ్రాయడం పూర్తయిందా?

శశి : ఇంక ఆఖరి అధ్యాయం ఉంది రేవతీ. నీ వయొలిన్ సాధకానికి నా వ్రాతేం అడ్డా?

రేవతి : అందుకాదుగాని, అదేవిటండోయ్ ఆహిరి అధ్యాయం ఏమిటి?

శశి : ఏవిటన్నావు? ఆహిరి అధ్యాయమా?

రేవతి : చిత్రం! నేనన్నానా? మీరన్నారా?

శశి : నే నన్నదీ ఆ-ఖ-రి అధ్యాయమూ అని. నువ్విప్పుడు వయొలిన్ మీద వాయిస్తున్నది ఆహిరి రాగమేనా?

రే : మీకెలా తెలుసూ? ఆహిరిలో త్యాగరాజ కృతి- ఆ దయ శ్రీ రఘువర నామీద ఏ దయా అని——

శశి : నే ననుకున్నదే సరి. దూరాన్నున్న ప్రేయసి ప్రియుణ్ణి గురించి అనుకునే భావాలు సరిగ్గా ఇట్లాగే ఉంటాయి.

రే : మీ పిచ్చి మీదే. ఇవి భక్తుడు దేవుణ్ణి గురించి అన్న మాటలు.

శశి: ఎవరిపిచ్చి వారిదే కావచ్చుగాని - ఏదీ కాస్సేపు హాయిగా వాయించు ఆహిరి!

[వయొలిన్పైని ఆహిరి రాగాలాపన వింటూవుండగా శశికి కునుకుపట్టి స్వప్న ప్రపంచంలో పడతాడు—సంగీతం క్రమంగా మారి స్వప్న ప్రపంచాన్ని సూచిస్తూంటుంది. శశికి వచ్చే స్వప్నంలో స్వర్గమర్త్యాల్ని కలుపుతూ ఒక ఏటవాలు మెట్లవరుసల మీది రైలుదారిపై పోయే రైలులో తనూ, రేవతీ]

శశి : రేవతీ! అప్పుడే నిద్రపట్టిందా?

రే : ఊహుఁ.

శ : చూడు. మనింటో మన గదిలో ఉన్నట్టుండగానే మనగది ఒక రైలుబండి అయిపోయింది. కలియుగంపోయి కృతయుగం వచ్చేసిం దనుకుంటాను.

రేవతి . ఊ.

శ : మన రైలిప్పుడు గగనసీమలవైపు ఏటవాలుగా ప్రయాణిస్తోంది. ఆహాహా! నీలగిరులు... డార్జిలింగ్... కాంచనగంగ... పామీర్స్....దా టేశాం, లేచిచూచో రేవతీ!

[శశి ఈ మాట లంటుండగానే తన పక్కనున్న రేవతి అతని చిన్ననాటి స్నేహితుడైన పార్వతీశంగా మారిపోతుంది]

పార్వతీశం : (నవ్వి) ఆదేవిటోయ్ ! రేవతేవిటి? కలవరిస్తున్నావేవిటి?

శశి ; ఏవిటి? నువ్వు...నువ్వు రేవతివి కావూ? కావే...పార్వతిగాడు!

పార్వ : అవును పార్వతీశాన్ని. ఇంతట్లో పరధ్యానమా?

శశి : (నవ్వుతూ) ఇంతసేపూ నువ్వు నా భార్య రేవతివే అనుకున్నానోయి!

పార్వ : అనుకుంటావు—నీకింకా పెళ్ళికాందే, మనం అనుకున్నాంగా వచ్చే జన్మలో భార్యాభర్తలం అవుదామని—అందుకోసం అలా కలవరించావేమో వెర్రాడా!

శశి : ఎంత అఖాతపులోయో, అబ్బ! కళ్లు తిరుగుతున్నాయి కిటికీలోంచి చూస్తే ! ఇంతకీ మన ప్రయాణం ఎక్కడికిరా పార్వతీ!

పార్వ : మానససరోవరం పక్క షాపానో పురికి.

శశి : షాపానోపురి! స్వప్నపురికి! ఒరేయ్ పార్వతీ-రైలు దారిమీద మెట్లవరుసలు వేశారేవిట్రా తిరుపతికొండకి మల్లే!

పార్వ : కాదురా-ఇది మెట్లవరుసమీది రైలు దారి—ఇక్కడిట్టాగే.

శశి : ఒరేయ్ పార్వతీ! ఈ మెట్లవరుస లేం చిత్రంరా! అడుగున పాతాళంనుంచి పైని స్వర్గలోకందాకా అంతులేకుండా వ్యాపించి నట్టున్నాయి?

పార్వ : ఒరేయ్! శశీ! నాకు పాటొస్తోందిరా!

మెట్లవరుసలు! మెట్లవరుసలు!
మెట్లవరుసలు! మెట్లవరుసలు!
గగనసీమలు కాలపరిధులు
గడచిపోయే మెట్లవరుసలు!
....
....
జీవితమునకు మరణమునకూ
ఈవలావల కదలు వరుసలు!
మెట్లవరుసలు! మెట్లవరుసలు!
కుడి యెడమలే కానరాని
తుది మొదళ్లే తోచబోని
మెట్లవరుసలు! మెట్లవరుసలు!
స్వప్నమధువుల జడులలోపల
స్వాంతమున జ్ఞాపకపు షారలు!
షారలలోపల తెరలు తెరలుగ

పూర్వజన్మల ప్రేమకథలు!
మెట్లవరుసలు! మెట్లవరుసలు!

[ఈపాట పూర్తయేసరికి రేవతి ఎవరో హిందూస్తానీవాళ్లలాగ వేషమూఅదీమారి వాళ్లపక్కగానే కూచుంటుంది.]

రేవతి : (కూనరాగంగా) మెట్లవరుసలు! మెట్ల వరుసలు!

శశి : ఒరేయ్! పార్వతీ! ఎన్ని తమాషాల్ చేస్తున్నావ్రా! చూడు! మనపాట ఆ అమ్మాయి కూడా పాడుతోంది. ఎవ్రరా ఆ అమ్మాయి.?

పార్వ : ఎవరో హిందూస్తానీల్లే వుంది.

శశి : మన తెలుగుపాట పాడుతోందే చిత్రం!

(రైలు ఆగిన చప్పుడు.)

పార్వతి : ఒరేయ్! శశిభూషణ్! ఇదే వూరురా?

శశి : ఈ రైలుదారికిదే ఆఖరి వూరల్లే వుందేం! ఇదేదో టిబెట్ భాషల్లె వుంది మాడు.

పార్వతీశం : ఊహు. పోనీ- ఆ అమ్మాయినడిగి చూద్దామా?

శశి : దేఖోజీ. యే గాంవ్ కా నామ్ క్యాహై- అంటే యీ వూరు పేరేవిటి?

రేవతి : (పకపకనవ్వి) మాకూ మీభాష వొచ్చు, మీరిక్కడే దిగాలి. మీ గమ్యస్థానం ఈవూరే.

శశి : నీకెలా తెలుసు? మే మేవూరు వెడతామని నీ వుద్దేశం?

రేవతి : షాపానోపురి-

శశి : ఒరేయ్ పార్వతీ- మనం ఈ పూరుగూరిలో ఇబ్బంది పడక్కర్లేకుండా మన భాషా అదీ తెలిసిన ఈవిడతో --

[పార్వతీశం మనిషి మారిపోయి గొంతు శశిభూషణ్ తండ్రిగొంతులా ఐపోతుంది-]

తండ్రి : అబ్బాయీ!శశీ! ఎరగవుట్రా ఈఅమ్మాయినీ!

శశి : (పకపక నవ్వి) అవున్నాన్నా. ఎంత మందమతిని! చిత్రమేమిటంటే ఇంతసేపూ నిన్ను మా స్నేహితుడు పార్వతిగాడనుకున్నా నాన్నా!

తండ్రి : అమ్మాయ్! రేవతీ! వాడంతేనమ్మా యెప్పుడూను- పట్టి పిచ్చమాలోకం!

రేవతి : నాకు తెలియదేవిటి మావయ్యా- ఆయన సంగతి?

శశి : ఎవరూ- రేవతా! ఎంత అసందర్భం! వెంకన్నమావ కూతురు రేవి- మా ఆవిడే- మరి హిందూస్తానీలా నటిస్తుందేం? ఈ ప్రయాణం తనూ నేనూ కలిసే ఆరంభించాం నాన్నా అసలు.

తండ్రి : నీ మొహం. మొదటినుంచీ నిన్ను తీసుకొస్తున్నది నేను. అది యీమధ్య దారిలో కలిసింది. ఆవిడట ఆవిడ! ఆవిడే కావొచ్చు! ఆ బుల పాటం దేనికి? -- వీణ్ణి మీ బసలోనే వుంచి జాగ్రత్తగా చూస్తుండవే అమ్మాయి! నేను పట్నానికి వెళ్లొస్తా.

శశి : నేను రాను- నేను కిందికి దిగి పోతాను. మెట్లవరుసలు కావాలి నాకు. అరె! ఇంతలో మాయమైపోయాయే- ఒరేయ్ పార్వతీ పార్వతీ- ఆ పాటపాడి మెట్లవరుసలు తెప్పించరా! --ఏడీ!

రేవతి : అంతకంటె మంచి పాటలూ చిత్రమైన పాటలూ వింధురుగాని మాయింట్లో- రండి- రండి- ఊం.

[అని చెయ్యిపట్టుకుని చెరచెర లాగుకు వెడుతుంది.]

శశి : నాన్నా! నాన్నా!

[చిత్రమైన సంగీతం ఆహిరిలో విని పిస్తూంటుంది]

రేవతి : ఇదిగో ఇదే మా భవనం-

శశి : మీ కింత మేడ వున్నట్టు ఎప్పుడూ చెప్పలేదే- చెప్పవే మోలే- పద-

రేవతి : మీ చేతిలోని ఆ గ్రంథం ఏమిటి?

శశి : అంతిమయాత్ర-

రేవతి : కాదు- ఆహిరియాత్ర! అవునా!

శశి : అంటే-

రేవతి : ఆఖరియాత్ర-

శశి : ఇది ఆఖరియాత్రే కావొచ్చు- కాని ఆహిరియాత్రేమిటి? అదేంపేరు? - నా పుస్తకం పేరు నువ్వు దిద్దడమేమిటి?

రేవతి : ఆహిరంటేనే ఆఖరు.

శశి : ఆహిరంటే రాగంకాదూ!

రేవతి : ఆహిరంటే మనిషి- నీకోసం తపించే హృదయంతో యుగయుగాలు ఈ భవనంలో వేచి ఉన్న మనిషి.

[పెద్ద చప్పుడయి చప్పుడులోంచి ఆహిరి రాగంలో ఆహిరి అనే అమ్మాయి పాట.]

ఆహిరి :

వమ్మటోయీ! నాదుసౌందర్యమ్ము,
నా యీ యౌవనమ్ము!
రమ్ము రమ్మికనైన !వేచితి
రాకకొరకై యుగయుగమ్ములు!
నాదు తొంగలి కన్నురెప్పల
నీదు తీయని పెదవులెప్పుడో!...

శశి : ఆ పాడేది ఎవరు?

రేవతి : (పకపక నవ్వుతూ) నేనే.

శశి : నేనంటే.

రేవతి : నేనంటే నిత్యజీవితంలో మీ అణచి వేసుకున్న కోరికలన్నీ రూపుదాలిస్తే మీ భార్యగా నైనా, లేకపోతే కలల్లో రకరకాల ప్రియురాళ్లగా నైనా మారగలిగే శక్తిని!

శశి : చాల్లే నీ మెట్ట వేదాంతం. ఆ పాట పాడేది నీ వెట్లాగౌతావు.

రేవతి : మీజాగరిత హృదయంపై అధికారం మీ భార్యనైన నాది-అట్లాగే మీ స్వప్న హృదయంపై అధికారంపాటపాడే సుందరినైన్న నాదే.

శశి : ఆ పాట ఆహిరిరాగం. అది నువ్వు పాడలేవు. నీకంత సంగీతం రాదు. నాకు తెలుసు. ఆ పాడే సుందరి పేరు చెప్పు.

[ఈ క్రింది వాక్యా లంటూనే రేవతి ఆహిరిగా అంటే ఆహిరిరాగంలో పాడు తున్న సుందరిగా మారిపోతుంది.]

ఆహి రి: ముందేచెప్పాను—నా పేరుఆహిరిఅనీ,ఆహిరంటే మనిషనీ, నీకోసం పరితపించే మనిషనీ- - -

శశి : నువ్వే ఆహిరివన్నమాట- నువ్వు యింత సేపూ మాటాడిన రేవతివి కానేకావు!

ఆహిరి : నేను ఆహిరిని.

శశి : లోపలనుంచి ఆహిరి రాగంలో నన్ను పిలుస్తున్నదీ నువ్వేనా?

ఆహిరి : అవును.

శశి : ఇవతలింతసేపు రేవతిగా మాట్లాడు తున్నదీ నువ్వే?

ఆహిరి : అవును. రకరకాల వేషాలతో అనంత కోటి విధాలుగా నీతో ఆనందించడం నాఅభీష్టం.

శశి : ఆహిరీ! ఎన్ని యుగాల బెంగబరువో మోస్తూ నీ కంఠం మోగుతూంటే నీ సుందర తను లతంతా మెరుపు తీగల కాంతుల్లో కోటిచేతులు సాగి నన్ను పిలుస్తూన్నట్టుంది- ఏవీ నీ కోటి చేతు లూ ఇలాగియ్యి.

ఆహిరి : నేనంతా నీదాననే! శశీ! నన్నుమాత్రం వదిలి వెళ్లకేం!

శశి : ఊఁహుఁ—వెళ్లను.

తండ్రి: అబ్బాయీ శశీ! తల్లిలేనిపిల్ల- రేవతిని బాగా చూస్తూండు.

శశి : ఆఁ?—ఆఁ?

ఆహిరి : వద్దువద్దు-నన్నువదిలి వెళ్లకు సుమా!

శశి : ఆహిరీ! సౌందర్య సముద్రానివి నువ్వు-నేనో చిక్కుబిక్కుమనే నావికుణ్ణీ— నిన్ను వదిలి ఎక్కడికీ పోను.

పార్వ : (దూరంనుంచి) ఒరేయ్ శశిభూషణ్! నీ పార్వతిగాణ్ని మర్చిపోయావా? రేవతి నెక్కడ వదిలేశావ్!

శశి : ఆఁ? ఆఁ-? (ఉలిక్కిపాటు)

ఆహిరి . అబ్బా-శశీ-ఏవిటా పరద్యానం—

శశి : అబ్బే! నీకంఠ మాధుర్యాన్ని-ఊహించు కుంటున్నాను రేవతీ!పోనీ-ఆహిరీ! నువ్వెవరికే మాట లాడుతూండు-ఆగకుండామాట్లాడుతూండాలి-ఏదీ-

ఆహిరి : ఊఁహుఁ. నేను ముగ్గురు వ్యక్తులుగా ఐపోయి,నీతో ఆడుకోనా శశీ!—

శశి : అవునవును-ఏదీ-ఎట్లా! ఆహిరీ—.

ఆహిరి : రా-నాతో ఈ తోటంతా పరుగు లెట్టు.నీ హృదయస్పందన గట్టిగా వినాలనుంది నాకు. ఊఁ—

[ఆహిరి ముగ్గు రమ్మాయిలుగా మారి పోయి ముందు పరుగులు పెడుతూంటే వెనక శశి పరిగెడు తూంటాడు.]

శశి : ఉండాహిరీ-అంత వేగమే!

ఆహిరి (౧) : శశీ! శశీ! వేగిరం! వేగిరం! పరుగెత్తు, నీ హృదయస్పందనం ఎంత గట్టిగా వినపడు తూందో. వేగిరం పరుగెత్తు- ఇంకా వేగిరం!

ఆహీరి (౨): ప్రణయ విహంగాల మైపోయి ఆకాశం అంచులుదాటి పైపైకి యెగిరిపోదాం, రా శశీ! ఇంకా పైకి—ఎగురు-ఇంకా పైకి!...

ఆహీరి (3): ఓహోయ్-నా ప్రణయవిహంగం రా! రా శశీ! ఇటు! మానస సరోవర జలాల్లో వాలి...ఈదులాడదాం రా శశీ.

[ఆహీరి ముగ్గురమ్మాయిలుగా అయిపోయి శశితో విహరిస్తూఉంటుంది]

శశి : ఆహీరీ! ఆహీరీ! ఆగు-నేనూ వొస్తున్నా!

ఆహీరి (౧): వెనక పడిపోకు-బార వడిగా వెయ్యి—ఊఁ!—మానస సరోవరజలాల్లో ఐక్యమైపోవాలి!

ఆహీరి (౨): ఎన్నాళ్లు కాచుకుని ఉన్నానో ఈ తియ్యని ఘడియకోసం. ఎంత హాయిగా వుంది!-శశీ!

[మానస సరోవరజలాల్లో ఈదుతూ ఉంటారు]

ఆహీరి (3): శశీ! శశీ! కళ్లు మూసుకో- మనం ఈమానస సరోవర జలాల్లో ఐక్యమైపోతున్నాం.

శశి : ఆహీరీ! ఊపిరిసలపటం లేదు- ఆహీరీ! ఊపిరి! ఊపిరి!

[మానస సరోవర జలాల్లో ఆహీరి ప్రణయ వాగురలో కరిగిపోతున్న శశికి—ఊపిరాడని తబ్బిబ్బవుతూ, కల కరిగి మెలకువ వచ్చేస్తూ వుంటుంది. జాగ్రత్ ప్రపంచంలో.]

రేవతి: ఏమండీ!ఆహీరిఅధ్యాయంముగిసినట్టేనా?

శశి : అమ్మయ్య! రేవతీ! యిదేమిటి! నేనెక్కడున్నాను! ఆహీరేదీ! మానస సరోవరం? మెట్టవరసలు?

రేవతి : చాల్చాలు. లేవండి. ఏవిటా కలవరింతలు! ఆహీరి అధ్యాయమో ఆఖరి అధ్యాయమో అన్నారే అదేదో పూర్తయిందా?

శశి : ఆ. ఆహీరి అధ్యాయమే— అమ్మయ్య! పూర్తయింది రేవతీ! స్వప్నపురిలో మానస సరోవర తరంగాల్లోను.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యమున)

మహాత్ముని తలుచుకుని—

ఇ. సీతారామలక్ష్మి

హంతకుని పిస్తోలున కెరయై మరణించితివన్న దారుణవార్త విని పట్టరాని పరితాపమందిన వారిలో నే నొకతెను. భారతావనికి స్వతంత్రము సంపాదించి పెట్టిన పితృతుల్యుడు పదికాలముల పాటు బ్రతుకడాయె గదాయని యెంతో బాధపడితిని. నీవు గతించిన పిదప నీ యుద్యమము కోటి గుణితముగ వృద్ధికాగలదనియు, ఆ వృద్ధి పురస్కరించుకొనియే దైవము నిన్ను తన సాన్నిధ్యమునకు తీసుకొనిపోయినాడని పెద్ద లెందరో నొక్కి వక్కాణింప నిజమే యని భావించి కొంత యూరట చెందినాను. కాంగ్రెసు గోత్రీకులందరు నీ యడుగుజాడలలో నడిచి నీవులేని లోటు తీర్చెదమని బాసచేయుట చెవులార విని కండ్లార చూచుటచే, బ్రతికి సాధింపలేనిదికూడ చనిపోయి సాధించుచుంటివి గదాయని ఆనందపడి దుఃఖము తొత్సాహముగ మార్చుకొంటిని. మరణాత్పూర్వము నీవు వ్రాయుచున్న వీలునామా అక్షరాలా ఆచరణలో పెట్టబడునని, కాంగ్రెసువారందరు గాంధీలై దానిని పాలించెదరని హృదయపూర్వకముగ నమ్మినాను. నీవు పోయినను ఇందరు కాంగ్రెసు భరతుల నిల్పిపోతివి గదాయని సంతోషించితిని.

నీవు కలలుగన్న రామరాజ్యము భారతభూమిలో ప్రత్యక్షమగునని భావించితిని.

సంగీత రూపకం

"ఆషాఢస్య ప్రథమదివసే"

"రజని"

సూత్రధారుడు

ఆషాఢస్య ప్రథమదివసే
మేఘమాశ్లిష్టసానుం
వప్రక్రీడాపరిణతగజ
ప్రేక్షణీయం దదర్శ.

బృందగీతి :

అరుదెంచె మిందిపై
ఆషాఢ మేఘము
ఆవేయికలతో
శేషాహి రీతితో!

ఆ
రామగిరులపై
ఆ
తపోవనులలో
ప్రియ
కాంతను దాసి
యే
డాది ప్రవాసి
ఆగాను మనియెను
ఆషాఢ మేఘమున్

సూ : ధూమజ్యోతిస్సలిలమరుతాం సన్నిపాతః క్వ మేఘః
సందేశార్థాః క్వ పటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః

(ఉరుములు)

బృం : నీరు నిప్పు గాలి పొగల చేరిక
నీరదమది యెక్కడ?
ప్రాణులచే నగు సందేశమ్ముల
భారవహన మెక్కడ?
ప్రణయార్తికి చేతనాచేతన
వ్యత్యాసమ్మెక్కడ? (ఉరుము)
ఆగుమా ఓ మేఘమ

యక్షుడు: అమృత మధుర జీవనదా! జలదా!
అలకాపురి చనవోయీ! నా
చెలికి ప్రణయ సందేశము గొనవో!
అలకాపురి చనవోయీ!

(ఉరుము

బృం: అలకాపురి చనవోయీ జలదా!
అలకాపురి చనవోయీ!

య: నర్మదహృదిపై ధర్మదీప్తులా
చంద్రశిలల విహరింపుమా
సాంధ్యరాగముల వింధ్య సానువుల
చల్లదనము గ్రహియింపుమా!

బృ: అలకాపురి చనవోయీ జలదా
అలకాపురి చనవోయీ

య: గంగావిమలతరంగ భంగ రుతి
గళగంభీర మృదంగ మొలయనీ!
హిమశైలముపై కిన్నెర కన్నెల
నరనర్తనముల, మంజీరవముల
గంగాధరు హృదయంగమ గాథల
గళగంభీర మృదంగ మొలయనీ!

బృం: అలకాపురి చనవోయీ, జలదా
అలకాపురి చనవోయీ!

య: పూలతరులపై తీవలపై, గీ
తాలు పాడు మధుపావళులు
తండతండముల తామర కొలనుల
తారెడు తరుణమరాళములు!
నిండుగళముతో, పురివిడ పాడుచు
ఆడెడు మత్తమయూరములు!
నిత్యవసంతము, నిత్యశారదము
అమరధామము అలకానగరి!

బృం: అలకాపురి చనవోయీ జలదా
అలకాపురి చనవోయీ!

సూ : హస్తేలీలాకమలమలకే బాలకుందానువిద్ధం
నీతాలోధ్ర ప్రసవరజసాపాండుతా
మాననశ్రీః!

బృం : కరముల లీలాకమలాలు!
అలకల తెలిమొల్ల సుమాలు!
శిరములపై లోధ్రరజాలు
శిఖలను విరియు కురవకాలు
చెవుల కోమలశిరీషాలు!
సీమంతముల కడిమిపూలు!
తలపగలమె అలకానగరి అలసావళి
చక్కదనాలు!
వలపులోలులకు తియ్యదనాలు!

(మేఘపు రొదలు)

య : అలకాపురి చనవో ఓ జలదా
ఓ జలదా!
ధనపతి గృహమున కుత్తర
మున నా యిలు కలదు!
చెలిపెంచిన మందారము
కలకల హరివిల్లయి
ముంగిట తోరణమై నిను
చెంగట రమ్మనదో!

బృం : అలకాపురి చనవో, ఓ
జలదా, ఓ జలదా!

య : తన్వీశ్యామా శిఖరిదశనా
పక్వబింబాధరోష్ఠీ
మధ్యేక్షామా చకితహరిణీ
ప్రేక్షణా నిమ్ననాభిః

బృం : అశ్రుసిక్త హరిణనేత్రి
విరహతప్తశ్యామగాత్రి
అలసగమన సుమకోమల
అతని ప్రేయసిని గనుమా!

ప్రేయసి .
ఏ దూరసీమనో
ఏ విపిన భూమినో
ఈ విరహమెన్నాళ్లు
ఎటు సైచునో విభుడు?
ఇంత తపియించి కృశియింతునే నేనింక
పరవాసియౌ ప్రాణపతి సౌఖ్యమెటులుందు!

మలయానిలుడు నేడు కలగి తిరుగాడునే
మదిని పాలిన యాశలకు రెక్కలాడునే!
శాపావసానమ్ము సరిగ నేడే నేమొ
గోడపై పాగాణి గురుతులిక చాలేమొ!
ఏ దూరసీమనో
ఏ విపిన భూమినో

బృం : ఈ విరహమెన్నాళ్లో
ఎటు సైచునో విభుడు!

(మేఘపు రొదలు)

ప్రే : జలదా! ఓ జలదా!
ప్రియవాక్యము కలదా!
మలయానిల చలిత విమానముపై
నీ యాత్ర!
కలదా రామగిరి వనుల ప్రియుని
కుశల వార్త!
జలదా! ఓ జలదా!
ప్రియవాక్యము కలదా!

మేఘుడు :
ఓ చిర సౌభాగ్యవతీ!
ఓ శాపార్త విరహిణీ!
కనుమివిగో, కైకొనుమివిగో!
నీ ప్రణయాశా విద్యున్మాలలు
నీసఖు సందేశామృతధారలు!
రామగిరి వనుల ప్రేమతాపసిగ
నీవలె సగమై కరిగి గడపెడు

బృం : నీసఖు సందేశామృత ధారలు
నీ ప్రణయాశా విద్యున్మాలలు
కనుమివిగో కైకొను మివిగో!

య : తీరిపోవునిక మనపాపము
చేరవత్తునిక నాప్రియతమ!
గిరగిర తిరగే చక్రనేమివలె
క్రిందుమీదులౌ సుఖదుఃఖమ్ములు
ఊరడిలుము నా ప్రియతమా
చేరవత్తునిక ప్రియతమా

సూ : కస్యైకాన్తం సుఖముపనతం

బృం దుఃఖమేకాన్తతో వా
నీచైర్గచ్ఛత్యుపరిచదశా
చక్రనేమిక్రమేణ!

(ఆలిండియా రేడియో సౌజన్యంతో.)

శ్రవ్య రూపకం

శ్రీనాథ కనకాభిషేకము

బాలాంత్రపు రజనీకాంతరావు

(శ్రీనాథ కవిసార్వభౌముని జీవితములోని కొన్ని సంఘటనలతో కూర్చిన రూపకం)

సాలివాహన శక 1327 అనగా క్రీస్తుశకం 1405వ సంవత్సరానికి సరిఅయిన పార్థివ నామ సంవత్సరమున మాఘ బహుళ అమావాస్యా శివరాత్రి పుణ్యకాలము. శ్రీశైల పర్వతము పైని సపరివారముగా పెదకోమటి వేమారెడ్డి ..... కొండవీటి ప్రభువు.

(నాగస్వరాది మంగళ వాద్యాలు)

వందిమాగధులు: జయ నృపాల చూడామణీ, వీరనారాయణాభిధానా, జయీభవ!జయ సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటి వేమభూపాలా, జయీభవ!

వేత్రహస్తు: అవధారు! రాజగురువులు వేంచేస్తున్నారు!

శ్రీశ్రీ పెదకోమటి వేమభూపాల కుటుంబ గురు స్వాములు.... శ్రీశ్రీ శంకరదేశికులు.

(కలకలము)

ఒక కంఠం: అరుగో వారి వెనుకనే విద్యాధికారి శ్రీనాథ మహోపాధ్యాయులు.

వేత్ర: వేమభూపాల పరిపాలితాంధ్రావనీ విద్యాధికారి, సకల విద్యాసనాథులు శ్రీ శ్రీ శ్రీనాథ మహోపాధ్యాయులు!

ఒక కంఠం: ఓహో....కవిత్వము, పాండిత్యము కలిసి మూర్తీభవించిన బృహస్పతి లాగున్నారు.

స్త్రీ కంఠం: నిండు యౌవనం ఒలికిపోతూ నవమన్మధుడులాగున్నాడీ కవీశ్వరుడు.

వేత్ర: సద్దు చేయకండయ్యా .... మహారాజు సెలవిస్తున్నారు. (నిశ్శబ్దం)

మహారాజు. గురుదేవా .... యీ శివరాత్రి పుణ్యకాలమున ప్రతి వత్సర పూజలకుగాను తమ శిష్యవరమాణు వర్ణించుకొను పినపాడు గ్రామసీమను మాన్యములతో సహా స్వీకరింపుడని మా ప్రార్థన. ఇదే భక్తి పూర్వక ప్రణామము.

శంకర: అభ్యుదయ పరంపరా ప్రాప్తిరస్తు. శివార్పణం. మీ గురుభక్తి అనదృశం. నా ఆనందాన్ని వర్ణించడానికి మీ ఆస్థాన కవిరాజే సమర్థుడు.

మహా శ్రీనాథ మహోపాధ్యాయులవారు.. శాసనం చదివింపించండి.

శ్రీనాదు ౧. తాతా కోమటి వేమనామ
నృపతిః పాత్రం గురుః శంకరః
స్థానం చేత్ పినపాడు రత్రతు
కవిః శ్రీనాథ భట్టారకః
కాలశ్చేత్ శివరాత్రి పుణ్యసమయః,
సాక్షీ మహాన్ శ్రీగిరిః
శ్రేయః కిం నతువర్ణ్యతే సుకవిభిః
శుణ్యంతు తచ్ఛాసనమ్....

౨. శాకాబ్దే గిరినేత్రమూర్తి విధుకే
సంవత్సరే పార్థివే
మాఘే అస్మిన్ శివరాత్రి పుణ్యదివసే
శ్రీవీరనారాయణః
తస్మై శంకరదేశికాయ విదుషే
భద్రానదీ ప్రాక్తమే
గ్రామం శ్రీ పినపాడు ముత్తమ
మదాత్ ఆ చంద్రమా తారకమ్..

(డోలు, తాళాలు, నాగస్వరాది వాద్యాలు)

వంది. జయ వీరనారాయణాభిధానా! జయీభవ! జయ సర్వ చక్రవర్తీ, జయీభవ! జయ పెదకోమటి వేమభూపాలా, జయీ భవ!

* * *

క్రీ. శ. 1420 ప్రాంతమున పెదకోమటి వేమభూపాలుడు రాచకొండ వెలమ రాజుల తోటి యుద్ధములో మరణించాడు. అతని తర్వాత కొండవీడు రాజ్యానికి రాచ వేమన రాజయ్యాడు. తన తండ్రికి జరిగిన పరాజయమునకు ప్రతీకారము చేయడానికి రాచవేమన శ్రీనాథకవిరాజును రాచకొండకు రాయబారిగా పంపెనని ఒక ఐతిహ్యం. రాచకొండలో రాజకుటుంబమునకు చెందిన సేనాని లింగమనాయని గృహమువద్ద

శ్రీనాథ: లింగమనాయనివారున్నారా?

వెంకయ్య: ఉన్నారు, మీరెవరు? ఏమి కావాలి?

శ్రీ: నాయనా, పరదేశి బ్రాహ్మణుడను. పద్మనాయక ప్రభువుల దాతృత్వకీర్తి దశదిశలూ ప్రాకుట కర్ణాకర్ణిగా విన్నాను. ఇప్పుడు స్వయంగా ప్రత్యక్షం చేసుకుందామని వచ్చాను

లిం: వెంకయ్యరావుగారు, గుర్రాలు సిద్ధమేనా వాహ్యాళికి? వారెవరు?

వెం. గుర్రాలు సిద్ధమే. వీరెవరో పరదేశులట.

లిం· పరదేశులా? దాతృత్వమూ, స్వయముగా కనడమూ అంటున్నారే....యాచకులా?

శ్రీ: అవును దొరవారు, యాచకుడనే. అయితే—

ధనము కాదు గోవులు కాదు ధరణి
కాదు
మనసు కలిసి భాసించు సన్మైత్రి
వలతు....

లిం: ఎంత మధురవాక్కు! ఆ మెడలోని పతకముపై రెడ్డిరాజుల ముద్ర కాబోలు. మీరు కొండవీటి ఆస్థాన కవీశ్వరులు కాదు గద.

శ్రీ. నాయనివారు సరిగా ఊహించినారు. బుధజన విధేయుడ, శ్రీనాథ నామధేయుడను.

లిం· శ్రీనాథకవిరాజా! నమోవాకం..... వెంకయ్యరావుగారు, ఇది అపూర్వ సందర్శనము. వీరి గౌరవార్థం మనము వాహ్యాళి ఆపు చేయవలసి ఉంటుంది.

శ్రీ: అక్కరలేదు. ఆ రెండవ గుర్రము నాకిప్పించండి. ఇది నాకే అపూర్వావకాశము.

లిం· కవిశేఖరా, బ్రాహ్మీ ఉపాసకులనీ, పరమ మహేశ్వరులనీ విని ఉన్నాము; మిమ్మల్ని గురించి. ఈ నడుమ మీవలన క్షాత్రధర్మావలంబన మేమీ జరుగలేదు గద.

శ్రీ: (నవ్వి) స్వధర్మమువలన కానిండు క్షాత్రధర్ములతోడి మైత్రివలన కానిండు, పల్యంకికారోహణమో, అశ్వారోహణమో, గజారోహణమో తప్ప, అంతకు మించి పై పర్వముల పారము జరుగలేదు.

లిం· దయచెయ్యండి, నా అశ్వాన్ని మీరు తీసుకోండి. వెంకయ్యగారు....

వెం· దొరవారి సెలవు....నన్ను ఇంకొక...

లిం: మీరు వుండండి వెంకయ్యగారు.... మేము వెళ్ళివస్తాము.

(గుర్రాలు మెల్లగా నడుస్తున్నవి.)

లిం: కవిరాజులు ఏదో రాచకార్యముపై వచ్చినీ యాచకులమై వచ్చామనడము వాక్చాతుర్యము కోసమే అనుకుంటాను.

శ్రీ: మనసులోని మాటనే వాగ్దేవి అట్లు పలికించినదిగాని, అందులో చాతుర్యమేమీ లేదు నాయనివారూ....

లిం: ఆకస్మిక దర్శనమువలన కొంత తబ్బిబ్బయి, కుశలవార్త లడుగ మరచాము. ఆ తబ్బిబ్బుకు రెడ్డివంశముతో మాకుగల వైరమే కారణమని కవీశ్వరులకు వేరుగా చెప్పబనిలేదనుకొంటాము.

శ్రీ: అది దేశప్రసిద్ధమే. నా రాకకు కారణమును అదే నా యాచన తదుపసంహారమే.

లిం· శ్రీనాథయ్యవారు, మాది అగర్భ వైరము....వంశ పరంపరా గతము. మా సోదరుడు పినవేదగిరిని చంపించినాడనియే కదా మేము కోమటి వేమారెడ్డిపై పగతీర్చుకొన్నది.

శ్రీ: అవును. ఆంధ్రభూమి ఒక సాహిత్య కళా ప్రియుడైన ధర్మప్రభువును కోల్పోయినది.

వైరి ప్రశంసను నాయనివారు మన్నింతురు గాక. మీ రెండువంశములు అట్టివే....

లిం: స్తోత్రార్హమైన గుణములున్న వైరి యైనను మెచ్చుకొనలేనట్టి కాఠిన్యము మాకు లేదు కవిగారూ....

శ్రీ: నేను మనవిచేసినదికూడ అదే దొర వారు. రెడ్డిరాజులు, పద్మనాయక ప్రభువులు ఇరువురు కూడ సరసజ్ఞ చక్రవర్తులే. పండిత కవిరాట్టులే. ధర్మ ప్రభువులే. అట్టి ఇరువురు పరస్పర మైత్రితో ఆంధ్రభూమిని భువన సీమగా చేయుట మాని శ్మశానభూమిగా చేయ బూను టేపాటి వివేకమని.

లిం. పరస్పర మైత్రియా? అసంభవము. ఎవరికి వారు తమ రాజ్యమును చతుస్స ముద్ర పరీతము చేసికొను ప్రయత్నములో పరస్పర మైత్రి యెలా పొసగుతుంది?

శ్రీ మీ ప్రశ్నమందే గర్భమై యున్నది నా ప్రత్యుత్తరము. తమతమ రాజ్యపరిధులు చతుస్సముద్రపరీతము కావించు యత్నము నాపి, ఇరువురు మైత్రితో రెండు రాజ్యముల ప్రజలకు హితమగు రీతిని పాలించుటే ఒప్పు కాదా....

లిం· కవిగారూ! ఇది కలియుగ ధర్మ మేనా?

శ్రీ: దొరవారు, మన మనుసరించు ధర్మ మునుబట్టి ఆ యుగము పేరొందును గాని, ఏ యుగమును బట్టియైనను ఆ ధర్మ మాచర ణీయము కాదు. రెడ్డి నాయకులుకాని, పద్మ నాయకులుగాని ఎక్కడివారు? ఒకే కోవలోని వారు. తొలుత కాకతిప్రభువుల దండనాథులు కాదా వీరు. వేర్వేరు ధ్వజము లెత్తినంత మాత్రమున తెలుగు వారు కాకపోయిరా? తా మేలు ప్రజలందరు రెండు రాజ్యముల వారు తెలుగువారలే కదా? మీతో మీరు పోరాడుకొన్న, పక్కనున్న కర్ణాటకులకు బహమనులకు, గజపతులకు చుల్కనకారా? మీకులేని ఐకమత్యము మీ శత్రువులకు కలిగిననాడు మీ రాజ్యములు పరతంత్రము లైపోవా?

లిం: కవిగారు, కోమటి వేమునినాడు మీకీ నీతులు తోచలేదా?

శ్రీ: మీరడిగినది న్యాయమే. ఏమిసేతుము? కోమటి వేముడు గతించెను. మీ సోదరుడు గతించెను. వారితో ఇరుప్రక్కల ప్రజలు వేన వేలు నేలకూలిరి. ఇప్పుడు మిగిలినవారైన క్షేమ ముగా ఉండి, ఉభయ ప్రజలకు శాంతి శ్రేయ స్సుల గూర్చుట కోరదగినదికాదా దొరవారూ?

పగ వృద్ధి బొందించు భ్రష్టులే కాని
ఆడగించు నేర్పరు లవనిలో లేరు...
పోరు మంచిదికాదు భూమి నెక్కడను
పాడౌను దేశంబు వగమించెనేని....
మేకొని మీలోన మీరు పోరాడ
చూచెడువారికి జులకనయౌను
దేశంబు పరనృపాధీనమౌ సుమ్ము
పారతంత్ర్యంబు మీపై బడగలదు
ఉభయవాదులు మీర లొక్కటైయున్న
సకల కార్యంబులు సమకూర్పవచ్చు
ప్రజలకు సుఖమౌను పంటలు పండు
సత్కీర్తి జగముల సాంద్రమై నిల్చు....

లిం: శ్రీనాథకవీ మీరు సామాన్య కవికాదు ఋషికల్పులు. (గుఱ్ఱం ఆపి) మీకు పాదాభి వందనం చేయనీండి. మీ ఉపదేశముతో నా హృదయములోని వైరభావము పటాపంచ లైనది. ఏమైనా కోరండి....మిమ్మల్ని సంతృప్తి పరచడం నా విధి.

శ్రీ: మీ ఉభయులమైత్రి తప్ప వేరేమియు నా కక్కరలేదు దొరవారూ!

లిం: కాదుకాదు, రాచ వేమయ్యగారితో మా మైత్రి చిహ్నముగా మీకేమైన బహూకరింప నిండు.

శ్రీ: మీ ఉభయ వంశములకు వైర చిహ్నము, రెడ్డిరాజుల ప్రాతసొమ్ము అయిన నందెకంత పోతరాజు ఖడ్గమొకటి మీయొద్ద కలదు. దాని నిప్పించండి.

లిం. ఇదిగో, ఆ నాటినుండి విజయ చిహ్న ముగా సగర్వముగా నా మొలనే ధరించి యున్నాను. దీనిని రాచవేమునికి మా మైత్రి చిహ్నముగా సమర్పించండి.

శ్రీ: దొరవారిప్పించిన అమూల్యావకాశము నకు సదా కృతజ్ఞుడను, నాకు సెల విప్పించండి.

లిం: కాదు, యీ నాటికి మా ఆతిథ్యము స్వీకరించి రేపు బయలుదేరవచ్చును. ఇంటికి పోదము రండు.

* * *

కొండవీటి రెడ్లకును, రాచకొండ వెలమలకును మైత్రిని ఆ విధముగా శ్రీనాథుడు సాధించుకొని, కొండవీడు చేరుసరికి రాచవేమన మరణించెను. వారసులులేక ఆ రాజవంశము అంతరించెను. ఆశ్రయములేని కవిరాజు అయా ప్రాంతముల సంచారం చేసి, వేమ వీరభద్రారెడ్లు పాలించు రాజమహేంద్ర వర రాజ్యము చేరుకొన్నాడు. తనకు బంధువు, రాజమహేంద్రవరరాజ్యమంత్రి అయిన బెండపూడి అన్నయ్యగారి ఆదరమునకు పాత్రుడయినాడు. ద్రాక్షారామంలో తూర్పు గోపుర ప్రాంగణమందు సప్త గోదావరి సరోవరము ఒడ్డున అన్నమంత్రి మంటప నిర్మాణము చేసిన సందర్భము...

శ్రీ. అరబీ భాష తురుష్కభాష గజకర్ణా
టాంధ్ర గాంధార ఘూ
ర్జర భాషల్ మళయాళ భాష శక
భాషా సింధు సౌవీర బ
ర్బర భాషల్ కరహాటభాష మరియుం
భాషా విశేషంబు ల
చ్చెరువైవచ్చు నరేదియన్ననికి గోష్ఠీ
సంప్రయోగంబులన్.

రాజమహేంద్ర దుర్గమున గావించె శ్రీ
వీరభద్రునకు ప్రాకార రేఖ,
నిలిపె మార్కండేయ నీలకంఠుని ద్రోల
రామేశు తమ తల్లి నామకముగ,
సంగమేశ్వర దివ్య శంభులింగమునకు
కల్పించె కళ్యాణ గర్భగృహము
దక్షవాటికయందు తరుణేందు మౌళికి
మొగలివాకిట ధామమును రచించె
ప్రాగ్దిశా వప్రగోపుర ప్రాంగణమున
సప్తముని సింధు సోపాన సరణి కెలన
తీర్చె భవనము భీమదేవు నగర
మంత్రి దేవయ్య యన్నయామాత్య
నరుడు.

అన్న: పారిషదులారా, యీ మహాకవి ఆంధ్రభూమి కపరిచితుడు కాదు. పెదకోమటి వేమారెడ్డిగారి యాస్థానమున విద్యాధికారియైన మహోపాధ్యాయుడు. విద్వదౌషధమైన హర్ష నైషధ కావ్యమాంధ్రము గావించి గణుతి కెక్కినాడు. మన రాజ్యమున కివ్వ డీయన విచ్చేసి నవ్య ప్రబంధ నిర్మాణమునకు పూనుకొన్నాడు. ఈ శుభదినమున, ఈ పుణ్యక్షేత్రమందు మీ సమక్షములో ఈ కవిరాజును సత్కరించి నూతన కావ్యమును మా కంకితముచేసి ప్రారంభింప గోరుచున్నాము.

(సభాసదుల హర్షము)

శ్రీనాథకవీ, కృత్యాదిని మా సంప్రార్థనముగా మీరు కూర్చిన పద్యముల నిటు లిప్పించండి. ఏవీ ఆ తాళపత్రములు.

శ్రీ: ఇదిగో, యీ పేటికలో కలవు.

అ: మహాకవీ....యీ తాంబూలము యీ చందనాది సత్కారములు స్వీకరించండి.

వినుపించినాడవు వేమ భూపాలున
కఖిలపురాణ విద్యాగమములు,
కల్పించినాడవు గాడపాకం బైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష,
భాషించినాడవు బహుదేశ బుధులతో
విద్యాపరీక్షణ వేళలందు,
వెదచల్లినాడవు విశదకీర్తి స్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు.

పాకనాటింటి వాడవు,బాంధవుడవు,
కమలనాభుని మనుమడ వమలమతివి.
నాకు కృపసేయు మొక ప్రబంధంబు
నీవు,
కలిత గుణగణ్య శ్రీనాథకవివరేణ్య.

అరవిందాప్తకృతప్రతిష్ఠుడగు దక్షా
రామ భీమేశ్వరే
శ్వరు మాహాత్మ్యము తోడగూడి, భువ
నశ్లాఘాస్పదంబై యభం

గురమై స్కాంధపురాణ సారమగు శ్రీ
గోదావరీ ఖండమున్
పరిపాటిన్ రచియింపు మంధ్రజగతీ
భాషా ప్రబంధంబుగన్....
(హర్షధ్వానములు)

శ్రీ: వీరభద్రేశ వేమ పృథ్వీధవులకు
ననుగుమంత్రి మహా ప్రధానాగ్రగణ్యు
బెండపూడన్న జగనొబ్బ గండబిరుద
సచివ దేవేంద్ర కృతి కధీశ్వరునిజేసి.

శ్రీ మహాస్కాందంబను నాది పురాణంబు నందు గోదావరీ ఖండంబు శ్రీమద్దక్షారామ భీమేశ్వర మాహాత్మ్య సంయుతంబగుటంజేసి భీమేశ్వర పురాణంబనంబరగు. అది యాంధ్రభాషా ప్రబంధంబుగ జెప్పందొడంగితి....

ఆంధ్రభూ భువన మధ్యము పుండరీకంబు
సప్త గోదావరజలము తేనె
బ్రహ్మసంవేద్యాది బహుతీర్థములు రేకులు
ఆకరులు చారు దివ్యస్థలములు
నాళంబులవణాబ్ధి వేలావిభాగంబు
కళ్యాణభోగ మోక్ష బలుతావి
దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక
హంసంబు భీమనాయకుడుశివుడు

గౌతమీ సింధుకౌంతేయ కణ్వ నదులు
తుల్యభాగయు నేలేరు తుమ్మికొనలు
భువన సంభావ్యమైన ఈ పుణ్యభూమి
అనఘ,సంసార తాపశాంత్యౌ షధంబు.

ఇక దక్షవాటీ ప్రశంసలోని ఒక పద్యము.

దక్షారామ విలాసినీ తతుల సౌందర్యంబు
వర్ణింపగా
చక్షుశ్శ్రోత్రకులాధి నాయకునకున్
శక్యంబె? తచ్చారు పా
ల క్షేత్రంబును పోలలేక మునిగెన్
లజ్జాభరక్రాంతుడై
నక్షత్రేశుడు శంభుశేఖర సుధాంధసిందు
ప్రవూరంబులన్....

సభాసదులు: సెభాష్ శ్రీనాధకవీ..సెభాష్.

పండి: (నకిలించి) కవీశ్వరులు ఒక సందేహము నివర్తింపగలరా?

శ్రీ: చిత్తము శెలవిండు.

పం: సకల విద్యానసనాధులు సావధానులై వినవలె. తచ్చారు పాలక్షేత్రం, శంభు శేఖర సుధాంధస్సింధు ప్రపూరం, ఇత్యాదిగా ప్రకటమయే తమ కవిత ఏ భాషా అని శంక పొడమినది.

పం: సకల విద్యానసనాదులు తాము పాఠము చేసిన సంస్కృతమునకు మసిబూసి మాదీఫలముచేసి ఆంధ్రమనుచున్నారని మా అనుమానము....కాదనగలరా?

శ్రీ: ఖండితముగ కాదనగలము. పూజ్యులారా, నేను సకల విద్యానసనాదుడనే కాదు. బుధజన విధేయుడ గూడ. ఇంక నా భాష యేమందురా?

ప్రౌఢిబరికింప సంస్కృతభాష యంద్రు
పలుకు నుడికారమున నంధ్ర భాష
యంద్రు
ఎవ్వరేమన్న నంద్రు నాకేమి కొఱత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష

ఒకరు: ఓహో....చెవులలో మ్రోగు భాషయనా?

మరొకరు: కర్ణే ఆట తీతి కర్ణాటః కదయ్యా మరి?

శ్రీ: మరి దీని కేమందురు?

పూబోణులకును విటులకు
వేబోకల దలరుసొంపు వీడ్కొలుపు
పురిన్
వేబోక పోక తోటల
పూబాలల కమ్మతావి పొదవినగాడ్పుల్!
(హర్షధ్వనులు)

ముడువంగ నేర్తురు మూలకమ్మని తావి
గలుగు క్రొవ్విరులుతో గందకుండ
ముఱియంగ నేర్తురు మోహనాస్పదమైన
మొగలివాకిటి చాయ నగరవీధి
వలపింప నేర్తురు వలరాజు గెలిచిన
పెద్దకాలము వేల్పు బీమనాధు
పలుకంగ నేర్తురు పాటలాధరముల
మొల్కలేనగవులు ముద్దుగురియ

చందురునితోడ కల్ప వృక్షమ్ముతోడ
తారతో లక్ష్మితో, నమృతంబుతోడ

కౌస్తుభముతోడ, మున్నీట గలిగినారు
విభుధ గంధర్వ జాతులవ్వీటి సతులు.
(హర్షధ్వనులు)

అందరు: సాదు సాదు కవీశ్వరా, సాదు సాదు!

అన్న: కవీశ్వరా! నీవు కలుగుటచే మా యాంధ్రభూమి పుణ్యభూమి యైనది!

(హర్షధ్వానములు)

* * *

అన్నమంత్రి ఆదరము బడసిన శ్రీనాధునకు పాలకులైన వేమ వీరభద్రా రెడ్ల ప్రాపు దొరకుటకు మరికొంత కాలము పట్టినది. ఈ లోపున అతడు ఊరకుండక దేశసంచారము చేసెను. విద్యానగరమున పేదరాసి పెద్దమ్మ సత్రమున...

శ్రీ: ఎవ్వనితో నెచ్చోటన్
చివ్వకు చే సాపవలదు, చే సాచినచో
ఇవ్వల నవ్వల నెవ్వరు
నవ్వక యుండంగ వగ నణంగింప
వలెన్ ...

పెద్ద: ఏం నాయనా! మహారాజులు పిలిపించారా?

శ్రీ: లేదమ్మా పెద్దమ్మా, ఎంత పడిగాపులు పడినా ఎన్ని విన్నపములు చేసినా....

పె: పోనీ డిండిమ కవి దర్శనమైనా కాలేదూ?

శ్రీ: ఆ. అయినది. ఆయనతోనే చేతులారా కయ్యము తెచ్చుకుంటిని.

పె: ఇంకేమి. గెలుపునకు కయ్యమే కదా నాయనా కావలసినది ఏదో దిగ్విజయము చేయుదమని వచ్చినావు. సరియైన ఉజ్జీ దొరికినప్పుడు పోటీ ఎంత సొగసుగా నుండును? ఆ డిండిమయ్య కెంత పొగరని. ఆయన కంచు ఢక్కను నువ్వే పగలగొట్టించాలి.

శ్రీ: ఏం పగలగొట్టించడమో, అష్ట కష్టములు మన పాలాయెను. ఈ కన్నడ రాజ్యలక్ష్మికి నాపై దయలేదాయెను.

కుల్లాయెట్టితి కోకచుట్టితి మహా
కూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్
విశ్వస్త వడ్డింపగా
చల్లాయంబలి ద్రావితిన్ రుచులు
దోసంబంచు పోనాడితన్
తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి! దయ లేదా
నేను శ్రీనాధుడన్!

(గుర్రాల డెక్కల చప్పుడు)

ఒక కంఠం: శ్రీనాధ మహాకవి ఎక్కడ?

పె: ఎవరు నాయనా? ఎవరు వారు?

గొం. పెద్దమ్మా, నీ సత్రువులో శ్రీనాధ కవి యను వారున్నారా?

శ్రీ: ఉన్నారు. నేనే. ఏమి కావలెను?

గొం: నమస్కారం. కర్ణాట సార్వభౌములు శ్రీ ప్రౌఢదేవ మహారాయల సెలవైనది. తాము గౌడ డిండిమ కవిసార్వభౌములతో వివాదమునకుగాను కొలువుకూటమునకు దయ చేయవలెను.

శ్రీ: ఇదుగో బయలుదేరితిని.

* * *

ప్రౌఢదేవరాయల కొలువుకూటము

ము: దయచేయండి. దయ చేయండి. శ్రీనాధులవారు....రాయలవారు వేంచేసే వేళ ఆయింది.

శ్రీ: తా మెవరో, ఎరుగవచ్చునా?

ము: నేను ముమ్మట కవిని

శ్రీ: శ్రీనాధశర్మా అహం భో అభివాదయే!

(ఢక్కానాదము)

గొం గౌడ డిండిమ కవిసార్వభౌములు వేంచేస్తున్నారు....బహుపరాక్.

(తూర్యరావాలు)

గొం: శ్రీశ్రీశ్రీ కర్ణాటక రాజగురు చంద్రభూషణాచార్య బిరుదాంకిత క్రియాశక్తి రాయరు....బహుపరాక్. (తూర్యరావములు)

గొ: శ్రీశ్రీశ్రీ కర్ణాట రాజ్యరమా రమణ, మూరు రాయరగండ, అరిరాయ విభాళ విరూపాక్ష సేవానిరత, చంద్రభూషణాచార్య బిరుదాంకిత క్రియాశక్తి గురువరచరణ ప్రసాదా

సాధిత మహిత సార్వజ్ఞ సామ్రాజ్యవైభవ ప్రౌఢదేవ మహారాయలవారు విజయం చేస్తున్నారు. బహుపరాక్! (తూర్యనాదము.)

ప్రా: కవి పండిత ప్రకాండులంతా విజయం చేసి కన్నులపండువ సేయుచున్న మా సభాంగణము, విద్యావివాదముతో కర్ణపర్వము సేయ గోరుచున్నాము. ఆగంతుకులగు ఆంధ్ర కవి పుంగవులు సభారంభము సేయుదురు గాక....

శ్రీ: జననాథోత్తమ దేవరాయ నృపతీ,
చక్రీశ శ్రీవత్స లాం
ఛన సంకాశ మహాప్రభావ హరి
రక్షా దక్ష నాభోటికిన్
కున్నృపస్తోత్ర సముద్భవంబయిన
వాగ్దోషంబు శాంతంబుగా
కనక స్నానము చేసికాక పొగడంగా
శక్యమే దేవరన్....

ప్రా: ఆంధ్ర కవిరాజుల ఆశయమును గుర్తించాము. అరుణగిరినాథ డిండిమ కవి సార్వభౌములు దీని కేమందురో....

అరుణ: మహారాజా, విద్యావివాదము సమానులమధ్య పొసగునుగాని, ఉన్నతులకు హీనులతో పొసగజాలదు. ఆంధ్రకవి పుంగవుల యౌన్నత్యము దేవరవారికి నిరూపించుకొనుట కేమేని యాధారములు గలవాయని మా ప్రశ్నము....

ము: శ్రీనాథకవీ మీరు కొండవీటి రెడ్డి రాజుల కొలువున విద్యాధికారులుగ నుంటిరి గద. మీ బిరుదులేవో తెలుపుదురా....?

శ్రీ: తరువున గాండివంబిడదె ధర్మజు
నాన గిరీటి, యేను వా
క్సరసిజ నేత్రయానతిని విచారము
చొప్పన గర్వహీనతన్
మరలి తెనుంగు భూమిక సమాన
గతిన్ గొనిపోవువాడనై
బిరుదులు సారివాగుకడ బెట్టితి
సత్కవి సార్వభౌముడన్....

అ: ఈ ప్రగల్భములు దేవర యాస్థాన దిగ్గజముల కంగీకార్యములు కాజాలవు. మా తోటి వివాదమున విజేతలైననే ఆ సార్వభౌమత్వమున కంగీకరింతుము.

ము: మహాప్రభూ యీ విద్యావివాద గోష్ఠికి రాజగురువులు శ్రీ చంద్రభూష క్రియాశక్తి రాయలవారు మాధ్యస్థము వహింతురుగాక యని మా ప్రార్థనము.

క్రి: రాయలవారు, డిండిమ కవిసార్వభౌములును చిత్తగింపవలెను. ఈ యన ముమ్మటకవి కడ తాను సంస్కృతాంధ్రముల నసమానశేముషీ మహితుడనని చెప్పకొన్నాడు. ఒక దుష్కరమగు పరీక్షకు లోను జేసి అరుణగిరినాథు లీయన వాక్కులు ప్రగల్భములని నిర్ణయింతురుగాక.

అ: రాజగురువులకు ప్రణామములు. శ్రీనాథ కవీ, యీ శ్లోకము వినుడు:

ధూర్ధ్వస్తాగ్ర్య గ్రహాణి ధ్వజపటశకలాం
దోళితేందూనిదూరం
రాహౌ గ్రాసాభిలాషా దనుసరతి పున
ర్దత్త చక్రవ్యథాని
శ్రాంతాశ్వ శ్వాసహేలా ధుతవిబుధధు
నీనిర్ఘరాంభాంసి భద్రం
దేయాసుర్వోదవీయో దివి దివసపతే
స్స్యందన ప్రస్థితాని....

ఈ శ్లోకమునందలి భావమును ఇంత[illegible] పటిష్ఠముగను ప్రౌఢముగను నుండునట్లు ఆంధ్రమున దాకిణాత్య జాతిచ్ఛందో రీతులలో అల్లగలరా శ్రీనాథకవీ?

శ్రీ. మాధ్యస్థము వహించు చంద్రభూషి క్రియాశక్తి గురువరులకు అభివాదములు.... అవధరించండి.

దూర్దండ ఘట్టన త్రుటిత గ్రహాగ్రావ
ధూళిపాళీ మిళద్ధ్వ్యస్థలములు
ధ్వజపటపల్ల వోద్ధతమరుత్సంపాత
పరికంపమానోడు పరివృధములు
గ్రాసాభిలాషానుగత విధుంతుదపునః
ప్రాప్తచక్రవ్యదోపద్రవములు
శ్రాంతాశ్వ నిబిడనిశ్వాస ధారాధుత
స్వర్ధునీ నిర్ఘర జలచరములు
గగన పదలంఘనైక జాంఘాలికములు
పద్మవనబాంధవునిరథ ప్రస్థితములు

సాగె నది దక్షిణాయన సమయమగుట
దుర్దురముమీద మలయభూధరముమీద

క్రియా. శభాష్....శ్రీనాథకవీ....
ప్రౌఢ శభాష్....కవిరాజా శభాష్....
ముమ్మ సాదు సాదు...శ్రీనాథకవిరాజా....

అరుణ. అట్లయిన పురఃపఠిత శ్లోకము ఏ కవి రచన? ఆయనదే మధురమైన రీతిగల మరి ఒక శ్లోకము నదే శయ్యలో తెనుగు సేయగలరా....

శ్రీ. మహాప్రసాదము. మయూరభట్టస్సూర్య శతకం విరచయ్యమహారోగాన్ విముక్తవాన్. అను జనశ్రుతి తెలియని అక్షరాస్యులుందురా మహాప్రభూ! ఆ మహాకవి శ్లోకము నింకొకటి వినిపింప సెలవా....ఇదిగో....

జ్యోత్స్నాంశాకృత్య్య పాండు ద్యుతి తిమిర
మషీ శేషకల్మాషం ఈష జ్జృంభోద్భూతేన
పింగం సరసిజ రజసా సంధ్యయాశోణరోచిః
ప్రాతః ప్రారంభకాలే సకల మివ జగచ్చిత్ర
మున్మీలయంతీః కాంతి స్తీక్ష్ణత్విషోక్ష్ణాంముద
ముపనయతా త్తూలి కేవాతులాంవః

ఇదిగో....దీనికి మా తెలుగు సేత...
తరిపి వెన్నెలలోని ధావళ్య మొక కొంత
నవసుధాకర్దమద్రవము గాగ
జిన్నారి పొన్నారి చిరుత చీకటి ఛాయ
యసలు కొల్పిన మషీరసము గాగ
నిద్ర మేల్కాంచిన నెత్తమ్మి మొగడల
పరువంపు బుప్పొళ్ళు హరిదళముగ
దొగరు వన్నియ లేత తొలుసంజకెంజాయ
కమనీయ ధాతురాగంబు గాగ....

వర్ణములు గూడి యామినీవ్యపగమ
మున
జగము చిత్రింప దూలికచంద మైన
గొమరు బ్రాయంపు నూనూగు గొదమ
యెండ
ప్రాచి కభినవ మాణిక్యపదక మయ్యె..

ప్రౌ. భళీ భళీ. సాదు సాదు శ్రీనాథకవీ..
ము: సెభాష్ కవిరాజా.
క్రి: సెభాష్ కవిరాజా.

అ: మహాప్రభువులు రాజగురువులు చిత్త గింతురు గాక. బలవంతుడు పైకొనిరా వంగిన వానికి మేలుగలుగు. అనదృశ శేముషీ మహి తుడు, అనర్గళ ధారాప్రవాహ కవితా ప్రతిభా వంతుడు అయిన యీ శ్రీనాథ మహాకవి ముందు నేను సగౌరవముగా నా బిరుదములు విసర్జించు చున్నాను.

క్రి: అట్లయిన కవిసార్వభౌమ బిరుద మిక నుండి శ్రీనాథకవిరాజుకే చెందవలెను.

అ అవును. మా బిరుదములతో పాటు డిండిమాది వాద్యపటాటోపమునుకూడ విడిచి పెట్టుచున్నాను. శ్రీనాథకవిసార్వభౌమా! బిరుద ములతో పాటు గర్వమునుకూడ విడిచి మీకు రాయల సభాస్థలిని పాదాభివందనము చేయు నిందు.(సభాసదుల హర్షధ్వానములు)

శ్రీనాథకవిసార్వభౌమా జయీభవ....

ప్రౌ. శ్రీనాథకవిసార్వభౌమా! మీ పాండితీ పటిమ అకుంఠితము, మీరు సరస్వతీ వర ప్రసాదులు. కారణజన్ములగు మహాపురుషు లకు తప్ప యింతటి శక్తిసామర్థ్యము లుండ టరుదు. మీకు మా ధన్యవాదములు.

క్రి: సభా ప్రారంభమున యీ మహాకవి ఒక కోరికను వెలిబుచ్చినాడు. దేవరవారి ప్రసన్నతకు మా ఆదరాభిమానములకు, యీ మహాకవిసార్వభౌముని విద్యా విజయమునకు గుర్తుగా యీతనిని మన మౌక్తిక శాలలో కనకాభిషేకము చేసి గౌరవింపవలెను.

ప్రౌ. అట్లే యగుగాక (మంగళవాద్యాలు)

[ఆలిండియా రేడియో ప్రసారితం]

సుభద్రార్జునీయం

రచన : శ్రీ రజనీకాంతరావు

నృత్యనాటికలో
సుభద్రార్జునులు

నృత్యనాటిక :

ప్రథమ దృశ్యం - ఉద్యానవనం

(చెలికత్తెల ప్రవేశం)

బృందగానం :- మాధవునకు తోబుట్టువు. మా సుభద్ర
విజయువలచె
(ఝుంజురిటి) పూచి. నవమధూనయమ్ము వేచు
మాధవీ వల్లిక !!
తలచునో తలపడో కాని, తనదు మేనమామ
సుతను !!
ఏ దేశమునందుగలడో, ఎపుడు వచ్చునో
విజయుడు !!

(మరికొందరు చెలులతో సుభద్ర ప్రవేశం)

చెలులు : కనవెసఖి వసంతశోభ ! వినవెసఖి ! ప్రశాంత
పికగీతి !
(కాపి) కనవెసఖి వసంతశోభ !- కూ..కూ .కూ .కూ..
కూహూ కూహూ కూహు కుహూయనుచును
కొమ్మ కొమ్మ రెమ్మ రెమ్మ చాటున వినవెసఖి
ప్రశాంత పికగీతి !
ఝుంఝుం ఝుంఝుం ఝుంఝుం ఝుంఝు
మ్మనుచును
కుంజము కుంజము కొనలను విరిసేనవలను
వినవేసఖి హాయిగ భ్రమరరుతి, కనవెసఖి వసంత
శోభా !

సుభద్రఆశాగీతం :- హృదిలో తీవరించేకోరిక, ఈ
డేరుట కందునో నేడిక !! నా హృదిలో !!
చల్లగాలి. పిల్లలేకోల్లలై ; ఉల్లము రంజిల్ల దెసలల్లెగా
మెల్ల మెల్లా పారు నేరువెల్లువై. హరివిల్లుగా
మిన్నంటు రంగవల్లియై !!
ఆకులచాటున మధువనిలో కోకిల పిలిచె కలస్వనిలో
నాకోరిక కొండంతయౌచు పిచునే నాజీవిక సఫ
మయి తీరునే !
నా హృదిలో !

(పల్లవి)

(కృష్ణమందిర ప్రాంగణదృశ్యము-
(కృష్ణుడు- యోగివేషమున నున్న అర్జునుని ఆహ
నిస్తూ ప్రవేశం

శ్రీ కృష్ణుని స్వాగతగీతం : యోగివరా స్వాగతము

(కమాసు) మా గృహాంగణము మాన్యమైనదో, యోగి
వరా స్వాగతము ! !
జగతిలోని పుణ్యతీర్థములగని అగణితమహిమలు
గనవో
కొనవో మా చెలి సేవాంజలులను- కోర్కెలు సఫ
లములనవో ! !
॥ యో ॥

చెలియా ఈ మునిశేఖరునకు నీ, సేవలొసగు
మదితనియా
మహా తపస్వుల మనసులు నిండిన, మన కోర్కులు
పండునె గాదె
॥ యో ॥

ద్వితీయదృశ్యం

(కృష్ణ మందిరాంతర్భాగము- అర్జునుడు మౌని రూప
మున ఉపవిష్టుడై ఉండగా
పూజాద్రవ్యాలతో సుభద్ర ప్రవేశం)
సుభద్ర ఆరాధనగీతం :

తాపసాకార ! సుకుమార ! తరుణోదార !
నీ పదమ్ముల సేవ, నా పుణ్య ఫలమోయి ! !(తా)

(బేహాగ్) చలువ తెమ్మెర పీవనలను పులకింపగా
చందన సుగంధమిదె- సుందరశరీరా ! !- (తా)
మా విరుల తోటలో నాచెలిమి కలలలో
తావులీనిన పూలు నీకు మా కానుకలు ! !-
మృదుల సౌరభములో హృదయమే విప్పారి
మౌనివర, ఇదిగో కర్పూర- నీరాజనము ! !-
వలపు లీడేరగా, వాంఛలు ఫలింపగా
వరములీయగ- వచ్చిన రతీధవుండవో ! !-

(సుభద్ర అర్జునుడికి పుష్పాంజలి సమర్పించి ప్రణమిల్లు
తుంది
(అర్జునుడు పూజలందుకుని ఆమె నభినందిస్తాడు.)
యుగళ గానం :-

అర్జునుడు :- ఆనందించితిమి సుందరీ ! పూజలకానం
దించితిమి సుందరీ !

(నాట) దేశ దేశముల తిరిగితి గానీ, ఈ సౌహార్దము
కానమెందు, మే
మానందించితిమి సుందరీ !

సుభద్ర :- దివ్యజ్ఞానులు యోగివరా ! దయతో నాకిది
తెలుపుదురా ?
దేశ దేశముల తిరిగితిరే- కురు దేశములకు మీ రరి
గితిరా ?

అర్జునుడు :- కురుభూములు పురుభూములు మొదలుగ
ధరనంతయు గా తిరిగితిమి,
పుణ్యతీర్థములపూర్వస్థలములు భువియంతయు
మేమరసితిమి

సుభద్ర :- కురుదేశమ్మున కలినగరమ్మున కుంతీదేవిని
కాంచితిరా?
కుంతీదేవికి ముద్దుల కొమరుడు అర్జునవీరుని
అరసితిరా?

అర్జునుడు :- కురుదేశమ్మున కుంతీదేవికి సుతులు దూర
మై సౌఖ్యములేదు
ప్రతిజ్ఞాపరుడు పార్థుండిప్పుడు తీర్థయాత్రలను
తిరుగుచునుండె
నిను తనమనమునకూరిమిచెలిగా అనునిమేషమును
తలచుచునుండు !

సుభద్ర :- తీర్థయాత్రికుడు పార్థవీరుడే నామనోహరుం
డగుట పొసగునా
దివ్యజ్ఞానులు యోగివరా, దయతో నాకిది తెలుపు
దురా?

అర్జునుడు :- పార్థుడుసఖి నిను బడయుటకై యతివేష
మ్మున నీ, యెదుటనిలిచెనే
రావెసఖి హాయచాలనమున నిను- రయమున
తోడ్కొని పోయెదనే!

రావెసఖి- రా రావెసఖి-
రావెసఖి- రా రావెసఖి-

(నిష్క్రమింతురు)

తృతీయ దృశ్యం

గోవర్ధనోత్సవం- సుభద్రార్జునుల పలాయనానికి అనుకూలించడానికి గాను శ్రీకృష్ణుడు బలరాముని, గోప గోపీజనాన్ని తనతో గోవర్ధనోత్సవానికి తీసుకుపోయి వారిని ఆ ఉత్సవ సంరంభంలో పరవశులనుగా చేస్తాడు.

బృందగీతం :- గోవర్ధనా ! ఓ గోవర్ధనా !
వాన జల్లులుకురిసి ప్రేపల్లెలు ముంపవా

పంటలు పండింపవా పూగాదులు నింపవా
గోవర్ధనా ! ఓ గోవర్ధనా !
ఈ వెన్న మీగడలు, మేమిచ్చు కానుకలు
గైకొని తరుగని సిరి సంపదలీయవ దేవ !
గోవర్ధనా ! ఓ గోవర్ధనా !

యాదవుడు :- యాదవ నాయకులారా;
మీకిదె హెచ్చరిక;
మాధవ బలరాములార ! చాలు నుత్సవమిక !
కుంతీసుతకురుహాతకుడు కుహనాయతి వేషముతో
యాదవులను మోసపుచ్చి మాధవు చెల్లెలి హరించె!

బృందం : ఎదుర్కొనుండర్జునుని ! మార్కొనుడు
కౌరవుని !

బలరాముడు :- తెండి నాధనుర్బాణాలె, తెండి
నాదు హలాయుధం
ముగ్ధ సుభద్రను విడిపింతు, మ్రుచ్చగుపార్థుని
వధింతు !

బృందం :- ఎదుర్కొనుండర్జునుని ! విడిపింపుడు
యాదవిని !

బల :- ఒరే బంధువిద్రోహీ ! నిలు, నాపాదముల
త్రాహి
త్రాహి పాహి పాహి యనుచు పడరా పార్థ !
అపార్థా !

అర్జును :- బీరములెందుకు బావా ! సారయున్న
జగమెందుకు?
పోయి త్రాగి మైమరవక !
చెల్లెలి విడిపించుటో ! నాచేతి బాణముల పడుటో
యెందుకులే యెందుకు !

బల :- హలాయుధమ్మెత్తితి ! నీతల సహస్రభిన్న
ములుగ
మొత్తుచునిక చస్తువులే ! ఎత్తినగాండివముదింపు !

శ్రీకృష్ణుడు :- ఇంత పంతమేల సోదరా ! నీ కింత
పంతమేల సోదరా ! మన
కుంతి యత్త కొమరుడు పార్థునితో ఇంత
పంతమేల సోదరా ! !-
చెలియలు వానినే వలచెనుగా ! జగతిని వీరుడై
వెలసెనుగా ! ! నీ॥
బావమరది కలకానుకలో బహుమానములో
బాణములో?

కల్యాణి : చెలియలి చేతిని, చేత నేర్పవో
చందనాదులను సత్కరింపవో॥ఇంత॥

(శ్రీ కృష్ణుని సాంత్వనవాక్యాలతో బలరాముని క్రోధాగ్ని ఉపశమిస్తుంది శ్రీకృష్ణుని అనుమతితో సుభద్ర అర్జునుని కంఠమును పుష్పమాలాలంకృతం చేస్తుంది. బలభద్రుని అంగీకారంతో అర్జునుడు సుభద్ర కంఠాన్ని పుష్పమాలతో అలంకరిస్తాడు.)

చెలికత్తెల మంగళ గానం :-

పాడరే చెలులారా ! పరిణయమంగళగీతి
హాయిగా !

పరిణయ మంగళ గీతి ! !-
మాధవు చెలియలు మన సుభద్రనే
పరిణయమాడెను పార్థ వీరుడే ! ! పాడరే ! !
దవ్వు దవ్వులను తావుల పూవులు
చల్లరే - వెదజల్లరే ! !

చందన రసమో వసంతరజమో
చిమ్మరే - విర జిమ్మరే ! ! —పాడరే ! !
నవ వధువును సాధించిన విజయున
కీయరే జయ హారతి !
కోరిక తీరిన పెండ్లికొమార్తెకు
ఈయరే శుభ హారతి ! ! పాడరే !

ఆంధ్ర మహిళా సభ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య నాటికలో

వాసవదత్త :	ఉపగుప్తుడు .
గజలక్ష్మి.	లక్ష్మీపున్నమ్మ

వాసవదత్త
ఉపగుప్తుడు

అతిలోక సుందరి వాసవదత్త సర్వసంగ పరిత్యాగి ఉపగుప్తు అనుగ్రహించి బౌద్ధమతము ఇప్పి చిన మధురగాధ.

. శ్రీ చింతామణ్ దేశ్ ము గారి మరాఠి రచనకు శ్రీ ర కాంతరావుగారి ఆంధ్రానువా

సన్యాసి ఉపగుప్తుడు - ఒకనాడు
ప్రథిత మధురాపురీ ప్రాకారపార్శ్వాన
పవళించినాడు నిర్లిప్తుడు——— నగరాన
మారుతాహతి దీపతోరణము లారినవి,
తలుపుగడెవడె గేహములు నిదురకూరినవి.
పడికిగయిని శ్రావణాభ్రమండలి చుక్క

ఇంతలోనచటతోచె నెవ్వరో
మరుగువడినది కారుమబ్బులో నక్షత్రము——
చెంతనే చరణనూపురార్భటి——
లేచెసగము సన్యాసి చకితుడై
త్రోసి కునుకుకుప్పసపు సొప్పటి,
ప్రకాశించినది కుమారమ్యానే
తకోణముల దీపకాంతి సొంకటి——

అభిసరించునదె నగర నర్తకి వ
యోవిలాస భాసిత మదమత్త !
తనువుపైని నీలిమేలి పారతో
ఝుణఝుణ మను చరణ కింకిణులతో
యోగివరునిపై అడుగు తడబడగ
ఆగిపోయినది వాసవదత్త !—

కరదీపిక నెత్తికాంచె
క్రమగొంచ దేహకాంతి.
స్వచ్ఛ కపోలమున మెరయు
చంద్రశీతల మగుశాంతి,
కరుణావికసిత దృగంత
సౌమ్యహాస ముద్రనింతి !
కనులనామె బిడియమొలుక
కలకంఠమున నిటుపలికె—
"కుమార తమింపవో మా
గృహము పావనము సేయవో
ఎటులు యోగ్యమౌశయింప
కఠినశిలాతలమునీకు !"
యోగి జాలిపలుక పలికె
"ఓ త్రిభువన సుందరీ !
ఇంకాసమయము రాలే
దీడేర్పగ నీకోర్కె !
రాగలవాడను సమయము
రాగానే నీకడరికి ! !"

లేచె హఠాత్తుగ వర్ష మేఘములు
తోచె తటిత్తులు వడివడిగా,
ధరిత్రి ఝుంఝా మరుత్తులలమెను
తరుణి భయముతో కంపిలగా:
ఆకాశంబున వజ్రనాదఘో
రాట్టహాసములు జడిగొనగా ! - -

వానలు వెలిసిన కొన్నాళ్ళకు పురి
లోన చైత్రసంధ్య మెరసెను
పవన పోతములు పరువులెత్తినవి,
పదతరుశాఖలు చివురులొత్తినవి,
వకుళ మల్లికా జాతులుగముతై
నగరవనమ్ములను విరిసెను ! —

మ్రోగె మురళి యెక్కడో దూరముగ
మృదంగ పణాధ్వనులు మంద్రముగ
సంతత కుసుమోత్సవరతి మధువని
జనము తేలి రానందముగా ? —

నిర్జననగరిని కనుగొని నవ్వగ
నిశ్శబ్దముగా నిండు చందురుడు
సాగునెవడో - జనశూన్య పథమ్ము
చంద్రికారాత్రయాత్ర !
తరుశాఖలను ముఖరింప పికములు
తగుసమయమ్మని మనసున తోపగ
ఇపుడె సాగెనో అభిసరింపగా
ఇదియేనా యతిచెప్పినరాత్రి ! --
పేటను దాటీ కోటను దాటీ
వెడలుచుండె సన్యాసి,
కడచి కందకము నిలిచెనొక్క యెడ
చుట్టునమర కాంతి సుడివడ !
ఎవతె యీలలన- చరణపార్శ్వము
ఇటనున్నది స్పృహబాసి !
దారుణ రోగపు పొడలతో తన శ
రీరమంతయును నిండిన దాని,

నఖశిఖాంతమును నల్లని బొగ్గయి
నగరి జను లువెలివెట్టినదాని,
లావణ్యము కోల్పోయి, కటిక నే
లను కదలక పడియుండిన దాని,....
కని యతి మెల్లగ నామె శిరమ్మును
తన యంకమునకు చేర్చి,
వడలిన పెదవుల తీర్థమిడి మంత్ర
పఠనమున సేదతేర్చి,
తనువునిండ నిజహస్తమ్మున చం
దనలేపమ్మును తీర్చె ! !

విరులొక్కుమ్మడి వికసించె,
కోకిల పాటలతిశయించె !
రాత్రిచంద్రికలు రహించె
రమణిమేలుకొని భాసించె !

"ఎరిగింపరో తామెవరో
కరుణాన్విత చిత్తా !" ....

"నే తెలిపిన ఆ సమయము
నేడేసుమి నేడేసుమి :
అందుకె నేనేతెంచితి
ఓ వాసవదత్తా !"

సంగీత రూపకం

జ్యోతి రైక్యము

(గౌతమబుద్ధుని జీవితపు ఉత్తరార్థంలోని సంఘటనలతో)

బాలాంత్రపు రజనీకాంతరావు

బృందగానము.

స్త్రీలు హింసాయుతము సంసారమిది
ఆశాతృషామిహికా పథం
సంసార బంధములేని శ్రమణులు
సాగునదె స్వేచ్ఛా పథం
తరుణులకు సంతరణ మార్గము
తెరువవో కరుణానిధీ

పురు వలిపములు త్యజియించి జేగురు
వల్కలముల ధరింతురో
కఠిన నిష్ఠుర నియమములతో
కాననముల వసింతురో
లలనలకు సన్యాస మెటు
లవలంబనీయము సోదరీ ...

స్త్రీలు రోసి సంసారబంధము
తలమోసెదము అష్టాంగ మార్గము
వలపు వంతలులేని బ్రదుకుల
నిలిపెదము భూతల స్వర్గము
శాంతి దాంతులె మా నగలు
నిర్వాణకాంతులె పూలమాలలు

పురు నడకచే నలిగిన పదాలు
వంతచే వడకు వాతెరలు
బడలినది గురువరుని పాలకజనని
వాకిట వేచియున్నది
తడియు చెక్కుల పౌరనారీ జనము
పరిజన మొదిగియున్నది
పడయరో సంతరణ మార్గము
పద్మతులింక దయానిధీ

ప్రజాపతి ఆనందా, నీవైనా భగవాన్‌కి ఒకసారి చెప్పిచూడు నాయనా

ఆనంద మహారాణి ప్రజాపతి మాటను భగవాన్ కాదన రనుకుంటాను... సెలవియ్యండి...

ప్రజా ఆనందా, నారీ జానానికికూడా ధర్మపథము దయచేయమని, సంసార జీవితంనుంచి విముక్తి హృదయశాంతీ కలిగించమని ప్రార్థించాము ఈ ప్రార్థన మానందని స్వామి శాసించారు మాగతి ఏమికాను నాయనా

ఆనం అమ్మా, అదివారి మనోనిశ్చయమై, ఆజ్ఞ అయినప్పుడు మనం ఏమి చేయగలం?

ప్రజా ఇదిన్యాయమేనా? జీవకోటికంతకు సర్వసమాన దృష్టి శాసించిన స్వామికి నారిజనాన్ని పరిహరించడం ధర్మమేనంటావా ఆనందా ...? ఆ దయానిధి యీ విషయమై తీవ్ర జిజ్ఞాస చేయలేదు నిత్యమూ అంతేవాసివైన నీవే ఆయనకు ఇదినచ్చజెప్పగలవు

ఆనం అమ్మా మీరుచెప్పనది సమంజసమే అని నాకు తోస్తోంది నేను వారిని అడుగుతాను ఇప్పుడే వెళ్లి అడుగుతాను

పరిక్రమణ సంగీతం

బుద్ధు ఆనందా ... రాకూర్చో తీవ్రమైన ధర్మసందేహమేదో తీర్చుకొందుకు వచ్చావు .

అనం అవును గురుదేవా ...

బుద్ధు అడుగు నాయనా ...

ఆనం మాతృదేవి మహారాణి ప్రజాపతి, దేవి యశోధర, ఇతర కపిలవస్తు మహిళలూ ప్రాచీరంలో వేచి వున్నారు పాదాలు వాచి, విషాదంతో ముఖాలు బరువెక్కి అణచుకోలేని ఆవేదనతో అడుగుతున్నారు మీరు నారీలోకానికి సంసారమునుండి విముక్తి ప్రసాదింపమని అన్నారట భగవన్, వారికోసం నేనుతిరిగి ప్రార్థిస్తున్నాను వారి విన్నపం ఆలింపండి ...

బుద్ధ చాలు ఆనందా .. ఆ విషయ మడుగవద్దు ..

ఆనం భగవన్ .. మీ ఆజ్ఞ అనుల్లంఘనీయమే, అయినా అవినయమని భావింపకపోతే అదే విషయం గురించి చనువు తీసికొని ఇంకొక విధంగా అడుగుతున్నాను మీరు కరుణాసముద్రులు .. కారణంలేకుండా యీ సమస్యను ఆలోచించనిదే త్రోసిపుచ్చరు

బుద్ధ నీ వన్నది నిజం ఆనందా

ఆనం జీవకారుణ్యము, భూతదయ, సర్వమానవ సమానత బోధించిన సద్గురువులు, తోడిమానవలోకానికి ఐహిక బాధావిముక్తి కలిగించు ధర్మపథాన్ని ప్రసాదించిన వారు, ఈ మార్గం పురుషులకు మాత్రమే అని నిర్దేశించి సహజీవనులైన స్త్రీలను విడువడం న్యాయమేనా భగవన్...

బుద్ధ ఆనందా ... అదిస్థూలదృష్టిలో అన్యాయమే కాని, బహుదూర పర్యవసాన మాలోచించితే నీవలాగనవు...

ఆనం ఒకటి సెలవియ్యండి భగవన్... స్త్రీలు సంసారదూరులై ప్రవ్రజ్యావ్రతంసాగిస్తే జన్మరాహిత్యానికి ఒక్క సోపానం సమీపానికైనా రారంటారా? ఆశాపాశావ్యథా విదూరులైతే నారీమణులు యోగినిత్వాని కర్హత పొందరా

బుద్ధ అవును నాయనా ... అదిసాధ్యమే ...

ఆనం మానవోత్తములైన మిమ్మల్ని కన్న మహారాణి మాయాదేవి, ఆమెతరువాత స్వయం స్తన్యమిచ్చి మిమ్మల్ని సాకిన మహారాణి ప్రజాపతి మనధర్మానికెంత మహోపకారిణులో యోచించండి భగవన్ ... సాధ్యమైతే వారికి మనసంఘ ప్రవేశంద్వారా సంసార దుఃఖప్రశాంతి లభిస్తే దానికి తమసమ్మతి దయచేయడం ధర్మమే కాదా ...

బుద్ధ సమ్మతింపకతీరదా నందా ... .. సమ్మతిస్తున్నాను సంఘప్రవేశానికి పురుషులకు నిర్ణయించిన అష్టాంగ సూత్రములేకాక స్త్రీలకు మరి ఎనిమిది నిష్ఠుర నియమాలను విధిస్తున్నాను వాటినికూడా వారు పాలిస్తే వారికి సంఘప్రవేశం కలిగించవచ్చు ...

ఆనం మహాప్రసాదం

పరిక్రమణ సంగీతం

ఆనం స్వాగతంబమ్మ సుస్వాగతంబమ్మ
స్వామి మీ కోరికను మన్నించిరమ్మ
సంసార దుఃఖాబ్ధి హింసచాలింక
సంఘ ప్రవేశమే శరణు మీ కింక ...

స్త్రీలు ఆనంద నీవల్ల నానందమాయె
నారీ జగతికెల్ల నవ జన్మమాయె
సర్వ సమదర్శియౌ శాక్యర్షి కరుణ
నర నారులకు సంఘ శరణమ్ము దొరకె ...

స్త్రీపురుష బృందగానం
అదె మా ఆనందం అదెమా ఆనందం
మాపై పగ గలవారంటే పగ పూనము మేము
పగపూనినవారికి చిరునగవున హృదయమ్మిత్తుము...అదె
అమయ భరిత జగాన
నిరామయ జీవుల మేము
శ్రాంతాలసజగతిని
సేవా విక్రాంతుల మేము . అదె
ఆశా తృషిత ధరాతలి
అతి నిర్లిప్తుల మేము
తాపత్రయ పరులనడుమ
స్వతంత్ర యోగులము మేము
సమదర్శి తథాగతుండు
భువి చూపిన స్వర్గం

మనుజావళి కందరకూ
    మోక్షప్రద మార్గం
అదె మా ఆనందం
    అ దె మా ఆ నం దం

. .... .

ఆనం భగవన్, సోదరీమణుల ఆనందానికి మేరలేదు తమ అంగీకారానికి వారెంతో కృతజ్ఞురాండ్రు సామాన్యాష్టాంగ సూత్రాలనేకాక ప్రత్యేకాష్టాంగ విధులను వారు కఠోర నియమాలతో పాటిస్తున్నారు

బుద్ధ భవతు కాని ఆనందా ... జరుగరానిదే జరిగిపోయింది దీని ఫలితం వెంటనే తెలిసిరాదు స్త్రీజనమే సంసార జీవిత విమోచనం కోరివుండకపోతే పురుషులకు నేను విధించిన నిష్ఠుర నియమాలతో మన యీ ధర్మం యీ దేశంలో వేయి సంవత్సరాలకు మించి నిలచేది ఇప్పుడు నా విధించిన యీ కఠోర నియమాలూ యీ ధర్మమూ కూడా యీ దేశంలో అచిరకాలంలోనే క్షీణింపడానికి కావలసిన అంకురారోపణ జరిగింది తీరమొరసి పారే వెల్లువను ఆపడానికి పదిలమైన గట్టుకట్టినట్లు స్త్రీలకు ఎనిమిది ప్రత్యేక సూత్రాలను విధించానేగాని, వారి రాకడవల్ల ధర్మక్షైణ్యము తప్ప దానందా

ఆనం మీరు విధించిన కఠోర నియమాలవల్ల మనధర్మం శాశ్వతముగా సాగగలదనే నా ఆశ భగవన్ ..

శిష్యు ఆనందా, వత్సగోత్రుడగు మునీశ్వరుడు భగవానుని దర్శనాపేక్షతో వాకిట వేచివున్నారు

బుద్ధు ఆనందా రమ్మను

ఆనం మాధురా, వారిని సగౌరవముగా తీసికొనిరా .

వత్స పూజ్య గౌతములకు ప్రణామాలు ... ఒక ధర్మసంశయ నివృత్తికై మీ వద్దకు వచ్చాను సెలవియ్యండి మనుజునిలో అహంకార మనేది ఉన్నదా?

బుద్ధు. (నిశ్శబ్దం)

వత్స కనుపించేదల్లా భ్రమ అని తమ ఉపదేశంగదా చెప్పండి మరి ..మనుజునిలో అహంకారమనేది ఉన్నదా...?

బుద్ధ (నిశ్శబ్దం)

వత్స ఈ సంశయం నివృత్తిచేయరా మౌనవ్రతంలో ఉన్నారా

బుద్ధ (నిశ్శబ్దం)

వత్స మరొకసారి కలుసుకొంటాను సెలవు (పరిక్రమణ)

బుద్ధ .. . .. ఆనందా విన్నావా వత్సగోత్రుని ప్రశ్న . ?

ఆనం విన్నాను భగవన్ తామెందులకు ప్రత్యుత్తర మీయ లేదు ,

బుద్ధ ఆనందా, నేనని ఉంటే, అహంకారం ఉన్నదని చైతన్య సహితమై అనేక వాసనా సంయుతమై నేననీ జీవాత్మ అనీ అనబడే అహం ఉన్నదని నా అభిప్రాయంగా అతడు గ్రహిస్తాడు. అది నా అభిప్రాయంకాదు. ఆ అహం ఆభాసమాత్రమే కాని వాస్తవంకాదు అహంకారం లేదని నేనని ఉంటే మరణాంతరం అంతా శూన్యమే అనే శూన్యవాదిగా నన్ను అర్థం చేసుకుంటాడతడు లోకంలో ఈ రెండువాదాలకు చెందినవారూ ఉన్నారు వారికిగాని వత్సగోత్రునికిగాని, అతడు నన్నడిగిన ఆ అభాసమాత్రమైన అహానికి, శాశ్వతమైన జీవాత్మలోని అహానికీగల వ్యత్యాసం అగమ్యగోచరం ఆ ఆభాసమాత్రమైన అహం భౌతిక దేహంతోపాటు నశిస్తుంది వాస్తవమైన శాశ్వత జీవాత్మలోని అహం జన్మజన్మాంతర ప్రయాత- .. ఈ విచక్షణా జ్ఞానంలేక ఆ ఆభాస ప్రపంచమే వాస్తవ మనుకునే వత్సగోత్రునిముందు నేనునిరుత్తరుణ్ణి కావలసి వచ్చింది

మాధు గురుదేవా...పూర్ణముని తమ ఆజ్ఞకై వేచివున్నారు .

బుద్ధ, రమ్మను ...

పూర్ణ నమో వాకం ..

బుద్ధ హింసపరుల రాజ్యానికి వెళ్లి ధర్మోపదేశం చేయడానికి సిద్ధంగా వున్నావా పూర్ణమునీ ...

పూర్ణ చిత్తం స్వామీ.

బుద్ధ వారు నిన్ను దుర్భాషలాడి నొప్పిస్తే నీ వేలా సహిస్తావు? ఏమని భావిస్తావు?

పూర్ణ వారు చాలా మంచివారు కనుక, నన్ను తిట్టి ఊరుకొన్నారు గాని కొట్టలేదని భావిస్తాను స్వామీ ...

బుద్ధ వారు నిన్ను ప్రహరిస్తే ...

పూర్ణ ప్రహరించి ఊరుకున్నారు గాని కత్తులతో పొడవనంత వరకూ మంచివారే అని భావిస్తాను భగవన్ ...

బుద్ధ ఖడ్గం ప్రయోగిస్తే?

పూర్ణ ప్రాణాలతో వదలినందుకైనా మంచివారే కదా ... అని

బుద్ధ ప్రాణాలు హరిస్తే

పూర్ణ నా శోక మహాభారం తప్పించినందుకు అప్పుడు కూడా వారుమంచివారే అనిభావిస్తాను స్వామీ .

బుద్ధ పూర్ణా చక్కగా చెప్పావు నీవు విముక్తుడవే, పోయి విముక్తిమార్గం బోధించు సత్యశాంతిని చూరగొన్న నీవు వారికి శాంతిమార్గము చూపించు, పోయిరా ...
పూర్ణా నీవూ నీ పరివారమూ ధర్మయోధులు ధర్మ విజయం సాధించుకొని రండి ...

... ...

పురుష బృందగానము

యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం
వినయ సహనయుత భేరి ప్రమోగించి
జ్ఞానకాంతిమన్నారి సారించి
జగత్రప్రణయ చాపమును బిగియించి
శాంతి కలిత సమరమున సాధించు
...యోధులం...

ఉదాత్తభావుకత, పూర్ణసజ్జనత
దివ్యబోధ, నిష్పాప పావనత
అంధలోకమున కక్షిసంపదా
అస్వతంత్ర జగతికి స్వతంత్రతా
శాంతికలిత సమరమున సాధించు
యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం

అహంకార పైశాచ మూర్తులను
ఇహ జగంపు మదలోభ రక్తులను
వ్యథా ప్రచోదక వృథాసక్తులను
హింసా నృతవిద్వేష శక్తులను
త్యాగదీక్షతో దృఢ విరక్తితో
నియత దృష్టితో నిర్లిప్తతతో
శాంతి కలిత సమరమున సాధించు
యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం ...

(నిష్క్రమణ)

. . . ..

బుద్ధ ఆనందా ...

ఆనం చిత్తం గురుదేవా ...

బుద్ధ పూర్ణముని రాకకుముందు అహంకారాభాసమును గురించి వాస్తవాహమును గురించి చెపుతున్నాను నీకు అవగాహనయిందా ...?

ఆనం పునశ్చరణ చేసుకొంటున్నాను భగవన్ ...

బుద్ధ ఇదే సమస్యపై నీ సచ్ఛాత్రులు యమకునికీ శారిపుత్రునికీ యీ మధ్యనే వివాదం వచ్చింది

ఆనం సెలవియ్యండి భగవన్ .

బుద్ధ భౌతిక దేహంతోపాటు ఆ జీవికి సంబంధించినదంతా నశిస్తుందనీ ఆ పైనఏమీ ఉండదనే శూన్యవాద సిద్ధాంతానికి యమకుడు అనుకూలుడుగా మారాడని విన్నాడు ఒకనాడు శారిపుత్రుడు

(ఫేడిన్)

శారిపు సోదరా యమకా, సర్వశూన్యవాదం స్వీకరిస్తున్నావని విన్నాను నిజమేనా . ?

యమక నిజమే శారిపుత్రా...భగవన్ తథాగతుని బోధలకు అదే పరమార్థమని గ్రహించాను

శారి అయితే శాక్యముని భౌతికకాయానికి ఋషిత్వార్హత వుందంటావా ... ?

యమ లేదు సోదరా ...

శారి పోనీ ఆ దేహపు జ్ఞానేంద్రియానుభూతులకు గాని, కర్మేంద్రియచేష్టలకుగాని అవస్థలకుగాని ఋషిత్వం ఆపాదింపగలవా?

యమ ఊహుఁ ... అపాదింపలేను

శారి అయితే భౌతికరూపమూ జ్ఞానేంద్రియానుభూతులూ కర్మేంద్రియ చేష్టలూ అవస్థలూ వీటికి కాక ఆ వ్యక్తిలో మరిదేనికి ఋషిత్వం అపాదింపగలవో చెప్పగలవా?

యమ చెప్పలేను.

శారి అవన్నీ చేరిన సమాహారం ఋషిత్వం అవుతుందంటావా?

యమ ఉహు!

శారి దృశ్యమానములైన భౌతిక రూపాలతో నిండివున్న యీ ప్రపంచంలో ఋషిత్వముదేనికో రుజువు చెయలేని వాడవు, మరణానంతరం ఆ ఋషికూడా నశిస్తాడనే సర్వశూన్యవాదాన్ని ఎలా సమర్థించగలవు చెప్పు యమకా ... ?

యమ శారిపుత్రా ... నా అజ్ఞానాన్ని క్షమించు, గురుబోధలోని యదార్థాన్ని నీవే నిరూపించు .

శారి విను సోదరా ... ఇంద్రియాను భూతులూ, చేష్టలూ, అవస్థలూ చైతన్యమూ ఇవన్నీ ఆత్మాభాసములే .. వీటికంటే వేరుగానే ఉంటుంది వాస్తవమైన జీవాత్మ, ఋషిత్వం పొందిన వ్యక్తితన జీవితంలోనే యీ అవస్థా ద్యనుభూతులు తానే అనే అహంకారానికి అతీతుడు కాగలడు. భౌతిక కాయం నశించినపుడు దాని మెదడుతో పాటు ఆత్మాభాసములైన అవస్థాద్యనుభూతులకు నాశం ఉంటుందికాని, విశ్వజనీనమైన ప్రధాన జీవాత్మ నశిస్తుందనుకోవడం ఎలాగ? అది సత్యం కాదు ..

యమ గురుదేవుని బోధల ప్రకారం బోధిసత్త్వుడనిపించుకొనే ఋషిమరణానంతరం కూడా అస్తిత్వం కలిగఉంటాడా

శారి సోదరా...గురుదేవు లావిధంగా ఎన్నడూ చెప్పలేదు

యమ అయితే అస్తిత్వం కలిగిఉండడా ... ?

శారి. ఆ విధంగానూ చెప్పలేదు ...

యమ అస్తిత్వం ఉండీ లేకుండా ఉండడం ఎలా పొసగుతుంది శారిపుత్రా ?

శారి యమకా, గంగానదిలోన్ని ఇసుక రేణువులను ఏగణకుడైనా లెక్కపెట్టగలడంటావా?

యమ అసాధ్యం

శారి పోనీ సముద్రంలోని జల బిందువులను లెక్కపెట్టడం?

యమ దుస్తరం

శారి ఎందుకనుకున్నావు? సముద్రం అగాధం మహాగభీరం అమేయం, అపరిమితం, అలాగే బోధిసత్త్వులై ఋషు లనిపించుకొన్న మానవోత్తముల అస్తిత్వాన్ని మానవ సామాన్య ప్రమాణాలతో ఋజువు చెయ్యలేం.. అట్టి మహాత్ముల భౌతిక రూపానికి సంబంధించిన సిద్ధాంతా లన్నీ వ్యర్థం మహాగభీరుడై సాగరంవలె అమేయ ప్రమాణుడై ప్రాపంచిక దృష్టిలోని అస్తిత్వనాస్తిత్వ శంకలకు అట్టి మహాత్ముడు అతీతుడై ఉంటాడు

స్త్రీ బృందగానం

అది అమేయ మది యగాధమగు మహాత్మతా
అస్తినాస్తి విచికిత్సా నిస్తులాత్మతా ॥అది అమేయ॥
జన్మపరంపరల పుణ్యాకర్మల పెరిగే
ఉత్తరోత్తరమగు జన్మ లొదవుట నెరిగే ॥అది అమేయ॥
మహాబోధి సత్త్వుడగుట మనుజమాత్రుడే...
మహర్షి మానవోత్తముడు మనుజ ప్రియుడే
॥అది అమేయ॥

ఆనం మాలుక్యా . ఆగు, ఆగు, నే చెప్పిన మాట విను, గురువర్యుని ఆ ప్రశ్న లడుగవద్దు

మాలు నన్నాపకు ఆనందా నే నడిగి తీరుతాను భగవాన్ ముందు నా సందేహాలు తీర్చండి జగద్విఖ్యాతుడైన బోధిసత్త్వుడు మరణానంతరం అస్తిత్వం కలవాడేనా? జగత్తు శాశ్వతమా కాలపరిమితమా? దయచేసి యీ ప్రశ్నలకు సమాధాన మియ్యండి, భగవాన్ తెలియక పోతే తెలియదని స్పష్టంగా చెప్పివెయ్యండి...

ఆనం, మాలుక్యా! ఎంతటి అవినయం.. వద్దని నే . .

బుద్ధు, ఆనందా .. అడుగనీ . మాలుక్యా! సావధానుడవై నే నడిగేది విను నీకు జగత్తు శాశ్వతమో అనంతమో జీవచైతన్యం భౌతికకాయం కంటే వేరైనదో లేక

రెండూ ఒకటేనా — బోధిసత్త్వుడు మరణానంతరం కూడా జీవిస్తాడో లేదో—యీ విషయాలన్నీ బోధిస్తాను రావయ్యా అని వాగ్దానంచేసి అందుకే నా శిష్యుడవు కమ్మని రమ్మని పిలిచానా చెప్పు—

మాలు, లేదు భగవాన్—లేదు—

బుద్ధు విషదిగ్ధమైన బాణం తగిలి గాయపడిన నా గాయాన్ని మాన్పవద్దు—ముందు నన్ను బాణంతో కొట్టిన దెవరో తెలిసికోనీండి అని అడిగితే వాడు ఉత్తముడా అధముడా—

మాలు అధముడే—

బుద్ధు ఇంకా ఆ బాణంతో కొట్టినవాడు పొట్టా పొడుగా వాని బాణాలు ధనస్సు ఏ మూల పదార్థంతో చేశారో అని యీ విధమైన జిజ్ఞాసచేస్తూ ఉంటే వాడే మవుతాడు?

మాలు వృధాకాలయాపనమయి విషంవల్ల వాడు మరణిస్తాడు—

బుద్ధు అదే విధంగా మీకు కలిగిన ధర్మసంశయాల చర్చలవల్ల వృధాకాలయాపనమయి, జీవిత కాలం పూర్తయి పోతుంది వాటి పరిజ్ఞానంవల్ల పావనత్వంకాని నిర్లిప్తత కాని శాంతీ మనోవికాసమూ కాని కలుగవు అందుకే బాధాజాలపు వాస్తవ స్వరూపము, దాని కారణమూ దానినుంచి తప్పించుకొనే మార్గమూ వీటినే నేను బోధిస్తున్నాను నేను బోధింపని విషయాల జోలికిపోవద్దు బోధించిన వాటినే అనుసరించండి—

మాలు గురుదేవా క్షమించండి ఎన్నడూ ఇటువంటి సందేహాల జోలికి పోము

(సంగీత విరామం)

ఆనం భగవన్—వశిష్టవేదాంతి తమ దర్శనాన్ని అపేక్షిస్తున్నారు

బుద్ధ రానీ—స్వాగతం వశిష్టమునీ—

వశి నమోవాకం గౌతమమునీ—

బుద్ధ ఆసనం అలంకరించండి—

వశి అద్వితీయ విజ్ఞానవంతమైన మీ మేధాశక్తి నన్ను జేతవనానికి తిరిగి రప్పించింది

బుద్ధ మీ సహృదయతే మిమ్మల్ని తిరిగి రప్పించింది

వశి గౌతమా, జీవాత్మ విశ్వరూపియైన పరమాత్మతో ఐక్యమొందే స్థితి మా వల్ల తెల్లమవుతుందని విన్నాను మీ ముఖతః విని ధన్యుణ్ణి కాగోరుతున్నాను

బుద్ధ వశిష్టా, పరిపూర్ణజ్ఞానియై, సత్యస్వరూప మెరిగిన ఆనంద మూర్తియైన బోధిసత్త్వుడు తడవ తడవకు ప్రపంచంలో జన్మలెత్తి బుద్ధత్వము పొందినందువలన విశ్వమును గురించిన సర్వజ్ఞానమూ కరతలామలకముగా తెలిసిన వాడవుతాడు ఇంద్రియానుభూతులవల్ల కలిగే భ్రమావరణం అతన్ని బాధించదు సామాన్య మానవులకు మాత్రం వారి భావనా సంసారం ఒక మిధ్యా ప్రపంచం ఏర్పడి వారు అంధులై దాన్నే విశ్వసిస్తారు బోధిసత్త్వులైనవారు యీ భ్రమావరణ అతీతులు గనుక వాస్తవ రూపమును చూడగలిగి సృష్టి స్థితి లయములలో సౌందర్యసమన్వితమయి, సర్వ వ్యాప్తియైన విశ్వాత్మ స్వరూపమును దర్శింపగలుగుతారు పావనత్వంవల్లను పరిపూర్ణతవల్లను జ్ఞానమనిపించుకొన్న ఆదర్శ జీవన పథానువర్తులైన వారికే ఇది తెలుస్తుంది.

వశి సెలవివ్వండి భగవన్—వింటున్నాను

బుద్ధ ఈ ఆదర్శ జీవన పథం రెండు తెరగులు ఒకటి యతులైన వారికి ఇంకొకటి గృహస్థులకు ఆపథానువర్తియైనాడు ఆంతరికంగా బాహిరంగా సత్ప్రవర్తన సాధించి తన మనస్సును పంజరం నుంచి తీసిన పిట్టనువలె ప్రేమతో కరుణతో లోకం నాలుగు మూలలకూ వ్యాప్తింప జేస్తాడు మహావైతాళికుని శంఖం లోకం అన్ని మూలలా ప్రతిధ్వనిస్తుంది అతడు నిర్లక్ష్యము చేసే ప్రాణి ఒక్కటీ ఉండదు జీవకోటి నంతనూ తన అమేయ ప్రణయంతో అవరిస్తాడాతడు ఆ అమేయ ప్రణయం సాధింపగలిగిన నాడు ఆ స్థితే విశ్వరూపియైన పరమాత్మకు అత్యంత సన్నిహితము తన ఆత్మజ్యోతి పరమాత్మ జ్యోతితో కలియడానికిదే మార్గం.

వశి ధన్యోస్మి భగవన్—మీ జ్యోతిరైక్య కధనంవల్ల నా అజ్ఞానాంధకారం పటాపంచలయింది బుద్ధం శరణంగచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి

బృందగీతి విన్నావటోయి యీ విజ్ఞాన గీతి
కన్నావటోయీ కాంతి ప్రసూతి
అజ్ఞానులకు దూరమై యుండవోయి
విజ్ఞానులను గౌరవింపంగదోయి
ప్రాగ్జన్మ సుకృతుల పాటింపవోయి
సజ్జనావళి మైత్రి సలుపంగదోయి
పీనుల కన్నుల విప్పారనిమ్ము
సద్వృత్తి సద్భావ జ్ఞానమ్ము కొనుము
జననీ జనకులకు సలుపు పూజనము
దార సుతులకిమ్ము తగిన రక్షణము
దానాలు చేయుముదార ప్రసిద్ధి
బంధుమిత్రులకు తోడ్పడు ధర్మబుద్ధి
సర్వథా పాపమ్ము సలుపగాబోకు
పుణ్యకార్యమ్ముల పొల్లుగా నీకు
విజ్ఞుల సన్నిధి వినయమే భూష
జిజ్ఞాస సంతృప్తి చిరధర్మ ఘోష
ఓరిమి తాలిమి ఉత్తమ గోష్ఠి
సాధు స్వభావమ్ము శమదమ నిష్ఠ
ఆనందమయముగా అఖిలమ్ము కనుము
నిత్యశాంతి జ్యోతి నీలోని గనుము .

విరామం

బుద్ధ, పాడిపశువులతో కలకల్లాడుతున్న యీ పచ్చని పైరుచేను తృప్తికీ ఆనందానికీ నెలవు ఏ పుణ్యమూర్తి ఈ పంటకు నోచుకున్నాడో మాధురా

మాధు భగవన్ యీ పొలాలు ధనియా అనే గోపాలకుడివి. నిత్య సత్కర్మపరుడై దయాళువు నిరాడంబరుడు అయిన ఇతడు భగవానునకు అత్యంత ప్రియతముడై అంతేవాసి కాదగినవాడు,

బుద్ధు ఆ వచ్చే అతనేనా?

మాధు; అవును స్వామీ , .

ధనియా మహాపురుష, స్వాగతం నా పురాకృత పుణ్యం రూపుతాల్చిన పురుషోత్తముడవు నీకు స్వాగతం, మా కృషి క్షేత్రాన భాగ్యవర్షం కురిపించే వరుణదేవుడవు నీవేనా ? రండి రండి వరుణదేవుడికి గీతాంజలి అర్పిద్దాము

ధనియా బృందము
అన్నాలు వండాము అందరికీ పెట్టాము
ఆవుల్ని పిదికాము దూడలకు వదిలాము
మాహీతీరంలోన మా క్షేత్రమున్నది
వరుణ దేవా వానకురవావయ్యా ..

బుద్ధ
లేవు శరమును క్రోధమ్ము లేశమేని
ఒక్క రాత్రి మాహీనది యొడ్డునందు
విడిసితిని, లేదు స్వగృహ మార్పితిమదాగ్ని
ఇచ్చగించితే వరుణి వర్షింపుమింక

ధనియా బృందం
పచ్చని పైరుచేల పశువులు పొరాడుతాయ్
వాకిట గాదెల్లో వడ్లూ పొర్లాడుతాయ్
కల్లా కపటంలేని యిల్లాలూ పిల్లలూ
ఇష్టానువర్తులూ ఇంటీ దీపాలూ
వరుణదేవా వానకురువావయ్యా. . ,

బుద్ధ
ఆత్మ సంబుద్ధి తరణిగా అందుకొంటి
శాంతితీర మాశాతృషా జలధి గడచి
ఇల్లు రాజ్యమ్ము ఇల్లాలినెల్ల వదలి
ఎల్లలేని లోకమ్మెల్ల ఏల చనితి
ఇచ్చగించితే వరుణ వర్షింపు మింక

ధనియాబృందం
కోటి పరివారంతో కూడిన క్షేత్రమ్ములూ
కొట్లాలో పదిలంగా కట్టిన మా సొమ్ములూ
నా పూర్వ పుణ్యమునా నా యింటి కెందరో
అతిథులూ వస్తారూ ఆనందిస్తారూ
వరుణదేవా వానకురువా వయ్యా

బుద్ధ

పలుపుత్రాడు త్రెంచిన వృషభమ్ము వోలె
వ్యూహా పుటభేదనము సేయనోపు మత్త
గజమువలె జన్మజాలపు గట్టి త్రాళ్లు
ముడి ముడకి త్రుంచివైచి విముక్తుడైతి
ఇచ్చగించితే వరుణ వర్షింపు మింక

గాలీ వర్షమూ ధ్వనులూ

ధని ధన్యోస్మి భగవన్ తథాగతా ధన్యోస్మి మీ దివ్యదర్శనం వల్ల మా జన్మలు పావనమైనాయి మహానుభావా మాకు గురువులై ఉపదేశం చెయ్యండి మనస్సుకు బాధ్యతలులేని ప్రశాంతి ఎలా గలుగుతుందో సెలవియ్యండి

బుద్ధ నాయనా పశు సంపద కలవానికి వాటి పోషణ గురించి తాపత్రయం ఉంటుంది సంపదలనుంచి బాధ్యతలనుంచి విముక్తుడైనవాడు స్వేచ్ఛాజీవి ఆ శాంతపరిస్థితియే నిర్వాణం

ధని చెప్పండి వింటున్నాను మీరు నిర్వాణ సిద్ధిపొందారని విన్నాము అది యెటువంటిదో సెలవియ్యండి

బుద్ధ ధనియా, విను సామాన్యంగా అజ్ఞులైనవారు నిర్వాణ మంటే మృతి అని భావిస్తారు కాని అది సరికాదు

నిజమైన నిర్వాణము ఇది నిత్య జీవితంలో నిత్యాభాసములుగా అనిపించే కోరికలు, ఆశలు, ఈర్ష్యాసూయాది భావాలతో కూడిన అహం అంతర్హితం కావడమే నిర్వాణం ఆ ఆభాసరూపమైన వ్యక్తిగతాత్మ భౌతిక దేహ విచ్ఛిత్తి కాకుండానే విశ్వాత్మగా పరిణామం పొందడమే నిర్వాణం అన్నమాట

ఇది సజీవుడై ఉండగానే సాధించే అమరత్వం యీ స్థితి పొందినవారికి జన్మ జరా మరణ దుఃఖములులేవు అట్టివారి ఆత్మ శాశ్వతమై లోకమునంతనూ ఆవరించ గలదు.

స్త్రీ పురుష బృందగానం

అందరూ

లేదు జన్మదుఃఖం రాదు జరా దుఃఖం
నీ దయచే మాకు కలుగ దింక మరణ దుఃఖం.

ఒక గొంతు

బ్రదుకను సెలయేటి నీట పదము లంట నిలిచి
మానసాశ్వమునకు వేగయానము నలవరచి
నా గుహాంతరాళమునకు ఏగుదు నొక దివ్వెతో
కించపడక దివ్వె నూనె ముంచివైతు నవ్వుతో

ఇంకొకడు

చిన్ని వెలుగు దీపమ్మది పెద్దది అగుచే
ఉన్న ఆత్మ వాస్తవ రూపము నెరుంగుచే
ఉన్న ఆత్మ స్వేచ్ఛాపద మొందును తానే
చిన్ని దివ్వె నిర్వాణము చెందుటతోనే

మరొక గొంతు

రక్త మాంసముల పరుగులు రిత్తవోవగా
అహంకార భావమ్మది అంతరింపగా
జన్మ పరంపర నిలిచే జ్ఞానముతోనే
జ్యోతిరైక్య పరినిర్మాణమ్మగు తానే
లేదు జన్మ దుఃఖం రాదు జరా దుఃఖం
నీ దయచే మాకు కలుగ దింక మరణదుఃఖం

ఆనం ఆత్రింతో — గురుదేవా, భిక్షుకు బైలుదేరి నా కన్నుల ముందు నడిచేవారు వెనకబడి పోయా రీవేళ, ఏదో శారీరక బాధ-అజ్ఞాపించండి ఏం సేవచేయను

బుద్ధ (నీరసమైన నవ్వు) ఆనందా ఏమీ లేదు. ఇదేమీకాదు

ఆనం వేలువనంలో యీ వర్షాకాల నివాసం మీ శరీరానికి ఆయాసం కలిగించింది. నాకు తెలుస్తోంది

బుద్ధ ఆనందా, సహించుకోవాలి నువ్వూ సహించుకోవాలి. మానసిక శక్తిద్వారా శారీరక అశక్తిని లొంగదీసుకోవాలి

ఆనం నేను కళ్ళారా చూశాను భగవన్ మీ మానసిక శారీరక శక్తుల సంఘర్షణను చూస్తూనే ఉన్నాను మీ యీ

బాధను చూసి, నా ఒళ్లు తీగలా వణికిపోయింది కాని తగిన సమయం చూసుకొని, సంఘ శ్రమణుల నందరినీ పిలిపించి వారి వారి విధులను మీరే ఆనతిస్తారని ఆశిస్తున్నాను నేనే కాదు.

బుద్ధ అదేమి ఆనందా బౌద్ధ సంఘం నా ఆజ్ఞలకోసం ఎదురు చూడాలా ఇంకా? ఉఁహుఁ, యీ సంఘానికి తాను నాయకుడనిగాని మార్గదర్శి అనిగాని సంఘం తనపైనే ఆధారపడి ఉండాలనిగాని ఆశించడం వివేకంకాదు జ్ఞాని ఆ విధంగా యోచింపడు నా శరీరానికి వార్ధక్యం వచ్చింది వయస్సు పైబడింది నా యాత్ర తుది ఘట్టానికి వస్తోంది ఇప్పటి యీ యాత్ర ప్రారంభమై ఎనుబది పండ్లు కావస్తోంది భౌతిక విషయాలపై చింతలు మాని, కీళ్లు సడలిన యీ శకటాన్ని జాగ్రత్తగా నడుపుకోవాలి,

ఆనం, భగవన్, మీ మాటలు వింటుంటే నాలో చీకటికమ్ముతూ వెలుగు చిమ్ముతూ తిరిగి చీకటి కమ్ముతోంది చీకటి కావల ఏముందో చూడడానికి భయం కలుగుతోంది.

బుద్ధ ఆనందా. ప్రాజ్ఞత నిలబెట్టుకో. బౌద్ధ సంఘంలోని మీరంతా మీ వెలుగు మీరే కావాలి నిన్ను తప్పించి వేరే ఎవనినీ శరణు వేడకు దృఢమైన ఆత్మవిశ్వాసం అవసరం. నా అనంతరం వేరెవ్వరినీ ఆశ్రయింపక తనకు తానే జ్యోతిర్మూర్తియై, సత్యదర్శి కాగలిగిన వాడు ఉత్తమ గతి పొంద గలుగు తాడు. నా భిక్షాపాత్ర ఇటు తే ...

ఆనంద ఇదిగో పాత్ర .. ఇదిగో ఉత్తరీయం ...

బుద్ధ ఇప్పుడు వైశాలి నగరంలో భిక్షాటనం ... సాయంత్రం కపిలకేతియానికి వెడదాం ...

(విరామ సంగీతం)

బుద్ధ బోధిసత్వ సిద్ధులు పొందిన జీవి ... లోకోపకారాని కావశ్యకమైతే మరొక జన్మలో గడప వలసిన వ్యవధిని కూడా కలుపుకొని తన అయుర్దాయాన్ని పొడిగించు కోవచ్చు విన్నావా ఆనందా ...

ఆనం (తనలో) భగవానుని భౌతిక కాయం కృశించిపోతోంది నా నాటికి మానసిక శక్తులు ఉంటవో ఉడుగుతవో ఊహ కందడం లేదు ...

బుద్ధ ఆత్మవిశ్వాసంతో బోధి సత్వాంశ గల జీవి ఇచ్ఛగిస్తే మరొకజన్మలోని ఆయుఃపరిమితిని ఈ జన్మలోనే పెంచుకోవచ్చు ... విన్నావా ఆనందా ...

ఆనం (తనలో) గురుదేవు లేమేమో అంటున్నారు ... ఆయన మమ్మల్ని విడిచి వెళ్ళిపోతారేమో అనే భయం తప్ప ఆయన అనేదేమీ నా మనస్సు కెక్కడం లేదు

బుద్ధ ఆనందా ... నీవు కొంచెంసేపావలికి వెళ్లు ...

(మారాగమన సంగీతం)

మారుడు భగవన్ ... దయ చేయాలి .. జీవితం నుంచింక నిష్క్రమించాలి ... బౌద్ధసంఘం స్థాపించి యతులకూ గృహస్థులకూ సత్యబోధ చేసిన వెనుక నిష్క్రమిస్తానని చేసిన వాగ్దానం మరవవద్దు అన్నీ జరిగాయి ... సమయం ఆసన్న మయింది. దయచేయాలి ప్రభూ ...

బుద్ధ మారా ... సంతోషించు ... మూడుమాసాలు కాగానే నీ కోర్కె నెరవేరుతుంది ...

(భూకంప సంగీతం)

ఆనంద (సంభ్రమంతో) భగవన్ ... భగవన్ ఏమిటీ విపరీత భూకంపం ... ?

బుద్ధ నిర్వాణ మందిన బోధిసత్త్వుడు అప్రతర్కితంగా తన ఆయుఃపరిమితి ముగించుకొనే నిశ్చయానికి వచ్చినప్పుడిలాటి విపరీతాలు జరుగవచ్చు ...

ఆనం ఆఁ ... ఏమంటున్నారు భగవన్ ...

బుద్ధ ఆనందా ఇక మూడు మాసాలు గడువు ఆపైని నీకీ కంఠం వినబడదు

ఆనం భగవన్ ... ఏమిటీ నిర్ణయం, శిష్యగణం, మానవ లోకం, బోధిసత్వ పరంపర ... వీరందరి సంక్షేమం కోసం మీ ఆయుర్దాయం పెంచండి మహానుభావా ...

బుద్ధ సమయం మించిం దానందా ...

ఆనం అయ్యో గురుదేవా ... మీరులేనిదే లోకం అంధకారమయమై పోతుంది మీమహిమ గ్రహింపలేకఘుందుగా కోరుకోలేదు నా అజ్ఞత మన్నించండి మీ జీవితపరిమితి పెంచండి

బుద సర్వార్థ సిద్ధి వచనానికి తిరుగులే దానందా ... లే ... మహావనానికి వెడదాం ... వైశాలి నగరం చుట్టు ప్రక్కల యతులను గృహస్థులను అందరనూ అక్కడకు పిలుచుకొనిరా (విరామ సంగీతం) (శరణత్రయం) శ్రమణ సోదరులారా .. పాంచభౌతిక పదార్థా లన్నిటికీ జరా మృతీతప్పదు .. అజరామరమైన మోక్షానికి మీరంతా అర్హులు కావాలంటే యీ జరామృతుల వలననూ జీవితంలో ప్రలోభాల వల్లనూ కలిగే దుఃఖానికి అతీతులు కండి అదే నిర్వాణం ఇక మూడు మాసాలకు యీ కంఠం మీరువినరు దృఢ సంకల్పులై మీ మనస్సులను అదుపులో ఉంచుకోండి ధర్మాన్ని అనుసరించి దుఃఖకారణాలను నిర్మూలించండి ఉత్తమ వర్తన, ఉత్తమ ధ్యానం, ఉత్తమ జ్ఞానం, ఉత్తమస్వేచ్ఛ వీటిని ఆచరణలో వుంచుకొని జీవిత వాంఛలను మూలచ్ఛేదం కావించుకొంటే జన్మరాహిత్యం లభిస్తుంది ..

(సంగీత విరామం) (మూడునెలలయాక)

చుండుడు ఆనందా ... భగవన్ తథాగతులకు నా విన్నపం మనవి చెయ్యరూ .

ఆనం చుండా . . నీవే విన్నవించుకో ...

బుద్ధ ఏమది చుండా ...

చుండు మహాత్మా .. శ్రమణ సోదరులతోసహా తాము మా గృహాన్ని పావనంచేసి భిక్ష స్వీకరించాలి ...

బుద్ధ అవును ... స్వీకరించాలి ... అలాగేకానీ ... (సంగీత విరామం)

ఆనం భగవన్ .. కుశినగరానికి ఇంకా క్రోశం దూరం ఉంది. మీరు వెనుకపడు తున్నారు ఇక్కడాగుదామా ...

బుద్ధ శాలువను మడిచి యీ చెట్టుక్రింద పరు ఆనందా... కొంచెం విశ్రాంతి కావాలి

ఆనం, దయచెయ్యండి .. విశ్రమించండి

బుద్ధ ఆనందా . దప్పికవుతోంది .. మంచి తీర్థం కావాలి...

ఆనం స్వామీ . ఇప్పుడే యీ యేటిలో ఐదు వందల బళ్ళు వెళ్ళాయి నీ రంతా కదిలి బురదగా ఉంది నీరు తేరుకొన్నాక తేనా .

బుద్ధ ఉహు . ఇప్పుడే ఇదిగో కమండలువు తీసుకురా ..

(నీటి చప్పుడు)

ఆనం ఆశ్చర్యం అవతార మూర్తి దప్పిక తీర్చడానికి యీ నదిలో నీరు వెంటనే తేరుకొంది భగవన్ మీరు మహా మహిమాన్వితులు .. ఇదిగో స్వచ్ఛమైన తీర్థం త్రాగండి.

(విరామ సంగీతము)

బుద్ధ (దగ్గుతూ) ఆనందా కుందకా, ఆగండి ఇక్కడ యీ రసాలం దగ్గర కాస్త విశ్రమిద్దాం ..

ఆనం ఆ చుండుని ఇంటి విందుకు తర్వాత నానాటికి మీ శరీరం మరీ అవశం అయిపోతోంది గురుదేవా

బుద్ధ, చూడు ఆనందా, అలాగనవద్దు ఇప్పుడే కాదు, నువ్వే కాదు, నా అనంతరం నా శిష్యులెవరూ కూడా చుండుని అలాగనవద్దు ఇలా మాత్రం అనండి అతడు బోధిసత్త్వానికి అతిథ్యం ఇచ్చినందుకు అతనికి సత్కర్మఫలము మోక్ష సామ్రాజ్యం లభిస్తుందని నామాటగా చెప్పండి లేవండి వెడదాం

ఆనం సెలవివ్వండి గురుదేవా .

బుద్ధ కుశినరంలోని మల్లవంశీయుల సాలవనానికి పదండి. చూడు నందా, ఈ రాత్రి అక్కడి సాళవృక్షద్వయానికి నడుమ నాకు శయ్య ఏర్పాటు చెయ్యి .

ఆనం గురుదేవా ఇది నిజంగా చివరి రాత్రేనా . (గద్గదికతో)

బుద్ధ అవును ఆనందా . ప్రాణోత్క్రమణకు తరువాత యీ భౌతిక కాయానికి గౌరవాలుచేస్తూ మీరు కాలయాపన చేయకండి. మల్లగణంవచ్చి దానికి కావలసిన అపర క్రియలు చేస్తారు .. ఏడీ—ఆనందా...

ఆనం (విలపిస్తూ) మీ వంటి కరుణాసముద్రుడైన గురుదేవు డస్తమిస్తూంటే నేనింకా పరిపూర్ణత పొందని విద్యా

ర్థిగా మాత్రం ఉండిపోయాను యీ ప్రపంచం అంధ కారమై పోతుంది మీరే అస్తమిస్తే అయ్యో ..
(బారుమిని విలపిస్తాడు)

బుద్ధ కుందకా మాధురా.. ఏడీ ఆనందు డేడీ ..?

మాధు ఆనందా రావోయి భగవన్ పిలుస్తున్నారు .

వశిష్ఠ సోదరా ఆనందా ఏమిటిది ఊరడిల్లు భగవాన్‌కు తెలిస్తే మందలిస్తారు

బుద్ధ ఆనందా .

ఆనం అయ్యా ..

బుద్ధ చాలు . నువ్వలా బాధపడవద్దు విచారింపకు నాయనా ఎన్నిసార్లు చెప్పానో జ్ఞాపకం లేదూ అత్యంత ప్రియములు సన్నిహితములూ అయిన వాటినుండి దూరంగా పోవడం నేర్చుకోవాలని దారపుత్రులు, తలిదండ్రులు, సోదరులు, గురుశిష్యులు ఎవరికైనా వియోగం తప్పదు ఒక వస్తువు నశింపక తప్పనిసరి అయినప్పుడు దాని అంతాన్ని ఆపడం సాధ్యమా ఆనందా నువ్వు చాల కాలం నాకు సన్నిహిత సహచరుడవై అనురాగంతో దయతో చాలా మంచి సేవ చేశావు మనోవాక్కాయ కర్మలచే నా యందు అనురక్తుడవై ఉన్నావు ఎప్పుడో ఒకప్పుడు నీ ముక్తిని నిశ్చింతగా సాధించకోవలసిన వాడవు కాదూ . శ్రమణ సోదరులారా ఆనందుడు నిశ్శబ్దంగా ఉన్నప్పటికంటే నిత్యమూ బోధిస్తున్నప్పుడూ పరిస్తున్నప్పుడూ సంఘానికి ఆనందదాయకుడని మీకు తెలుసు... నాకూ తెలుసు ఆనందు డిప్పుడు పట్నం లోకి వెళ్ళి మల్లులను పిల్చుకొని వస్తాడు .

(సంగీత విరామము)

బుద్ధవాణి

ప్రాకృతం
సహి వేరేన వేరాని సమ్మన్తీధ కుదాచనం
అవేరేన చ సమ్మన్తి ఏ సధమ్మో సనన్తన ..

(తెలుగు)
పగచేత నేనాడు పగ తీర్పలేము,
మైత్రిచే సాధ్యము, మాన్య ధర్మమిది .

ప్రాకృతం
సాధు సంబహుళా ఇతీ అపిరుఖ్ఖా అరణ్ణజా
వాతో వహాతి ఏకరం బ్రహాంతంపి వనస్పతిం

(తెలుగు)
సహజీవనము మేలు బహుళ జాతులకు
పెనుగాలి వనతరులను కూల్చలేదు...

ప్రాకృతం
మాతా పేత్తి భరం జంతుం కులం
జేట్ఠాపచాయినం
సణ్హాం సఖిల సంభాసం పేసుణ్ణేయ్యప్పహాయినం
మచ్ఛేర వినయే యుత్తం సచ్చం కోధాభిభుంనరం
తంవే దేవా తావతింసా ఆహుసప్పురిసో

(తెలుగు)
జ్యేష్ఠోపచారము, ఇష్టమృదూక్తి
తలిదండ్రులకు సేవ
సలిపెడివాడు పరుషోక్తిలేని మత్సర బుద్ధి కాని
వినయుడు ఋతభాషి విగత కోపుడును
అగు సత్పురుషు మెత్తు రమరులుకూడ

ప్రాకృతం
నతం జితం సాధు జితం యంజితం అవజీయతి
తం ఖోజితం సాధు జితం యంజితం నావజీయతి
యో సహస్సం సహస్సేన సంగామే మానుసేజినే
ఏతం చ జెయ్య మత్తానం న వే సంగామజుత్తమో.

శిష్యులు —

నమోభగవతో అరహతస్సమ్మా సంబుద్ధస్స

బుద్ధ ఆనందా, మీలో కొందరు తథాగతు డంతరించాడు. కనుక మనకింక గురువు లేడని అనుకోవచ్చు కాని అది సరి కాదు ధర్మమూ సంఘ నియమాలు సత్యాలూ నా అనంతరం అవే మీ గురువులు మీ మార్గదర్శులు

(శరణ త్రయము)

బుద్ధ సోదరులారా, బుద్ధుడేమిటి? ధర్మ మేమిటి? ధర్మమార్గ మేమిటి? - అని ఈ విషయాలలో ఏమైనా సందేహా లుండిపోయి అయ్యో తథాగతుని సమ్ముఖాన ఉండీ ఈ సందేహాలు తీర్చుకొన్నాముగామే అని తర్వాత చింతింప వద్దు ఏమైన ఉంటే అడగండి ..గురుభక్తి వలన అడగ టానికి మోమాటమైతే మీలో మీరు చెప్పుకోండి

ఆనం ఇక్కడ సమావేశమైన శ్రమణ సంఘంలో అటువంటి సందేహా లున్నవారు ఒక్కరూ లేరని సగర్వంగా చెప్ప గలను గురుదేవా—

బుద్ధ నీ పలుకుల వెనుక విశ్వాసం నాకు తెలుసానందా ఆ విషయం నాకూ ముందుగానే తెలుసు మీ రందరూ బాధా విదూరులై శాశ్వత శాంతిపొందగలవారే, శాశ్వత శాంతి! సోదర లోకం వినండి, పాంచభౌతిక మైన జీవపదార్థాలన్నిటికీ నాశం తప్పదు మమత విడనాడి మీ మోక్షానికై మీరు కృషిచెయ్యండి... శాశ్వత శాంతికై.

వశిష్ఠ భగవన్ భగవన్ ఇది వైశాఖ పూర్ణిమ, ఇది మీరు జన్మించిన శుభదినం మీరు నిర్వాణము నందిన పావన దినం ఈనాడు మహాపరినిర్వాణమందు పవిత్ర దినం కూడాను

ఆనం భగవన్ ..భగవన్...భగవన్!...
వైశాఖ పూర్ణిమా వర్ధిత జ్యోతి
నిర్వాణ పథమందు నిస్తుల జ్యోతి
విశ్వమ్ము నంతటి వెలిగించు జ్యోతి
ఈశ్వరత్వమ్మంది భాస్వంత మాయె

బృందగానం

నిత్యమైనది సత్యమైనది నిస్తులాత్మ జ్యోతి ఒకటే
భువనమంతట వెలిగే తాపస పూర్ణిమా మధుర ప్రశాంతి
ఇంద్రియపు చెరసాల గోడలు ఎదుగుటకు కారణమ్మెవరో
జన్మపై జన్మల పరంపర సాగుటకు కారణమ్మెవరో
ఆశలను స్వప్నాల వలలను వన్ని విరజిమ్మినది యెవరో
అసద్రూప పుటహారికార మె ఆత్మ యనిపించినది యెవరో...
సురిగ తన ఆత్మావభాసం
వెలిగెను సదాత్మ ప్రకాశం ॥నిత్యమైనది॥
కాలావకాశాల వేలలు కరగిపోయిన చిదానందం
కాంతి శబ్దావసానమ్ములు కదలిపోయిన బృహదనంతం
ప్రణయపారావార మనుభవసారమౌ కరుణార్ద్ర చేతం
పారహీన వృథావ్యథాంబుధి సంక్రాంత విరామ గీతం
వెలిగెను సదాత్మ ప్రకాశం
సురిగె తన ఆత్మావభాసం ॥నిత్యమైనది సత్యమైనది॥

పరుసవేది

బాలాంత్రపు రజనీకాంతరావు

(కర్ణాటక సంగీత పితామహుడు, భక్తాగ్రేసరుడు అయిన శ్రీ పురందరదాసులవారి జీవిత సంఘటనలను కొన్నిటిని చిత్రించే సంగీత రూపకం.)

(గుర్రపు బండ్లు, గుర్రాలు-రాజవీధిలో ఎదురెదురుగా వస్తూ పోతూ వున్న సవ్వడులు)

వ్యాపారి, హానుమప్ప— ఎవరా గుర్రంపై వస్తేది? సేనాని బసప్పగారు కాదుగదా

సేనాని బసప్ప— బసప్ప నే-అహంభో అభివాదయే-వ్యాపారి హానుమప్పగారనుకుంటాను చాలా కాలమైంది మాసాలు-ఏండ్లు-పూండ్లు.

హానుమప్ప ఆ— హానుమప్పనే. అభివాదాలు. అభివాదాలు మీరూ యిక్కడే గుర్రం దిగేటట్టున్నారు!

బసప్ప ఈ పక్కకి వచ్చినపుడు ఇక్కడి విరలస్వామిని దర్శనం చేసుకోవడం వాలాయితి మీరూ శకటం దిగుతున్నారు అందుకే అనుకుంటాను—

హానుమప్ప అవును విద్యానగరానికి వచ్చినప్పుడల్లా నాలుగు వీధులలోని నలుగురు దేవతా మూర్తులనూ దర్శనం చేసుకొని, ఆ మీదట కృష్ణదేవరాయలవారి దర్శనం చేసుకొని, వెళ్ళటం పరిపాటి—

బసప్ప ఎక్కడినించి రాక- ఎలా సాగుతోంది వ్యాపారం?

హానుమప్ప పడమటి తీరం-గోవా రేవులో బుడతకీచులకీ అరబ్బీ వర్తకులకీ మన రత్నాలు మంచిగంధమూ అమ్మి, వాళ్ల సరకులు సుగంధద్రవ్యాలూ పట్టించుకు వస్తున్నాను

బసప్ప రత్నవర్తకం చేసి కోటికి పడగెత్తినవాణ్ణి నవకోటి నారాయణని చూశాన, మళ్ళీ మిమ్మల్ని చూశాను హానుమప్పగారూ—

హానుమప్ప నవకోటి నారాయణా? మా శీనప్ప— వరదప్ప నాయకుడిగారి కుమారుడు శ్రీనివాస నాయకుడు— ఇప్పుడిక్కడే ఉన్నాడని విన్నాను. అతను మా బంధువు కూడాను.

బసప్ప ఆ, ఇక్కడే వున్నాడు —అయితే ఆ శీనప్ప వేరు, యీ శీనప్ప వేరు.

హానుమప్ప వ్యాపారమూ, వాణిజ్యమూ అంతా వదిలేశాడని విన్నాను నిజమేనా?

బసప్ప ఆ- వదిలేశాడు ఐహిక సంపదలన్నీ వదిలేశాడు. ఇప్పుడు కేవలం పారమార్థికమైన భక్తిమార్గమే ఉండండి -మీ బంధువును చూద్దురుగాని ఇదే సమయం— విరల స్వామి దర్శనానికి అతను వచ్చే వేళయిందే—

శీనప్ప పాట

(పురందరదాసు)

శీనప్ప పిచ్చి యెక్కినది పిచ్చి యెక్కినది నాకు
అచ్యుతనామం బనెడి మరులొల్కు మచ్చుమందు
తలకెక్కి మైసొక్కి
॥పిచ్చి యెక్కినది॥
వాసుదేవయను వరనామంబును వాయి పగుల
వదరవలె, మాయా
పాశమనెడి అంగీని తునియలుగ పరపరా చింపవలె

క్లేశమనెడి శిఖపైని విరిచెండు రేకురేకు తుంపవలె,
దోష
రాశి యనెడి గోడ బెల్లుబెల్లుగ రక్కిరక్కి తుక్కు
రేపవలెనని
॥పిచ్చి యెక్కినది॥

హానుమప్ప శీనప్పా—శీనప్పా—పలకడే

బసప్ప: పలకడు—అదే, తన్మయత్వం తాదాత్మ్యం—భక్తి పారవశ్యంలో పాడుకుంటూ చిందు వేసుకుంటూ అలా వెళ్ళిపోతూంటాడు

హానుమప్ప ఎంతమార్పు? అసలు శీనప్పేనా అనిపిస్తోంది! ఏమిటా ముష్టివేషమూ పిచ్చిపాటాను

బసప్ప: అది ఉంచవృత్తి వేషం. బ్రాహ్మణపుటక పుట్టినవాడికి ఇంతకంటె మరోటి వృత్తి కాదంటాడు భుజాన జోలె వేసుకుని పాడుకుంటూ చిందులు తొక్కుకుంటూ పోతుంటే, తలో ఇంటా తలో గుప్పెడూ బియ్యమూ పప్పో జోలెలో వేస్తే అది తీసుకుని అపరాహ్ణం దాటాక ఇంటికి చేరుకుంటాడు

హానుమప్ప అయ్యో! కోటికి పడగెత్తిన వాడికి ఇదేంకర్మ బసప్పగారూ? ఎలా ఎక్కింది యీ పిచ్చి

బసప్ప ఇది పిచ్చి అని మీరు అనుకుంటున్నారు కాని, ఆమధ్య మఠంలో ఈయన చుట్టూ చేరిన స్వాములవారే చెప్పారు—ఆయనకు జ్ఞానోదయమయిన కథ

హానుమప్ప రండి, ప్రదక్షిణంచేస్తూ చెప్పుకుందాము— ఊఁ, నడవండి— ఏమిటీ— జ్ఞానోదయం కథా—

శీనప్ప, మీకు తెలిసే ఉంటుంది శ్రీనివాసనాయకుడు కోటీశ్వరుడుగా వ్యాపారంచేసే దినాల్లో పిల్లికికూడా బిచ్చం పెట్టనిలోభి అని

హానుమప్ప. అవును అతనిభార్య సరస్వతమ్మ మాత్రం మంచి దానధర్మపరాయణ బంధువులు మిత్రులు ఇంట దిగితే ఆమెచేసే మర్యాదలు ఎన్నటికీ మరచిపోలేదు.

శీనప్ప ఒక పేదబ్రాహ్మడు ధన సహాయంకోసమని ఎన్నిసార్లు ప్రార్థించినా శీనప్పగారు మర్నాడు రమ్మని పంపేసేవాట్ట

హానుమప్ప ఇంకా నయం ఎందుకిన్నిసార్లు వస్తావని తన్ని తరిమెయ్యడం కూడా అతనికీ అపరూపంకాదు.

బసప్ప ఆ బ్రాహ్మడు సరస్వతమ్మ అవుదార్యం గురించి విని— శీనప్ప అంగడిలో వున్నవేళ ఒకనాడు ఇంటికివెళ్ళి ఆమెని ఎలాగైనా తన దారిద్ర్యం తీర్చమని వేడుకున్నాట్ట

హానుమప్ప ఆ మహాతల్లి వట్టిచేతుల్తో ఎవర్నీ పంపదు

బసప్ప ఇంటిలోఉన్న నగదూ, నగలూ అన్నీ ఇనపపెట్టెల్లో తాళం వేసేసి, తాళాలగుత్తి తనరొంటిదే దాచుకున్నాడు శీనప్ప అప్పుడు సరస్వతమ్మ మరి చేసేదేమీలేక ఆ బ్రాహ్మడిని వట్టినే పంపడం ఇష్టంలేక, తనకు అందుబాటులోఉన్న ఒకపెట్టెలో వజ్రం తాపిన ముంగెర ఉంటే యిచ్చి అమ్ముకొని ఆ డబ్బు తీసుకోమన్నది

హానుమప్ప, శీనప్పకు తెలిస్తే ఊరుకోడే—

బసప్ప వినండిమరి ఆ బ్రాహ్మణుడు ఆ ముంగెర తీసుకుని వెల కట్టించడానికి తిన్నగా శీనప్ప అంగడికే వెళ్ళాడు

హానుమప్ప వెళ్ళాడూ-కొంప మునిగింది,

బసప్ప శీనప్ప అగ్గిరాముడై పోయాడు, ఆ ముంగెర తనభార్య తనకు చెప్పకుండా ఆ ముష్టిబ్రాహ్మడి కెందుకిచ్చిందని— తన అంగడిలోని వ్రాయసంగారిని చీటీయిచ్చి వెంటనే యింటికి పంపాడు

హానుమ, ఈ చీటీయా

బసప్ప అవును ఇంటిలో ఫలానా చందుగా పెట్టెలోని ముక్కు-ముంగెర పంపించమని భార్యకు చీటి వ్రాశాడు

హానుమప్ప అది చదువుకుని ఆవిడ బెంబేలు పడిపోయుంటుంది.

బసప్ప. మూర్ఛపోయింది " లేని ప్రాణంమీద నిరాశ చేసుకుని ఒకపాత్రలో విషం పోసుకుని, దేవతార్చనగదిలో విఠల స్వామికి సాష్టాంగపడి భర్తకు ఇష్టంలేకుండా తాను చేసిన దానానికి ప్రాయశ్చిత్తంగా ప్రాణాలు హరించుకోడానికి సిద్ధమయింది

హనుమప్ప: ప్రాణాలు తీసేసుకుందా (ఆత్రంగా)

బసప్ప ఆమె ప్రార్థన పూర్తయి కన్ను విప్పేసరికి ఆ విష పాత్రలో మెరుస్తూ ఒకవజ్రం తాపిన ముక్కుముంగెర పడి ఉంది

హనుమప్ప చిత్రం—ఎలా వచ్చింది

బసప్ప అప్పుడామె విఠలస్వామికి వందనాలర్పించి, విషపాత్ర ఒలకపోసి ముంగెర శుభ్రంగా కడిగేసి, బ్రాహ్మణుని చేత అంగడికి పంపింది,

హనుమప్ప ఎంత చిత్రం-శీనప్ప అదిచూసి ఏమన్నాడో—

బసప్ప శీనప్ప నిర్ఘాంతపోయాడు రత్నపరీక్షకుల్లో అతన్ని మించినవారు లేరుగదా ఆ వజ్రం తాపిన ముంగెర బ్రాహ్మడు తెచ్చియిచ్చినది తనచేతిలో అంగడిలోఉండగా ఇంటిలో ఉన్న సరస్వతమ్మ ఇంకో ముంగెరకు అచ్చంగా అలాంటిదాన్ని ఎలా సంపాదించి పంపిందని అతని ఆశ్చర్యానికి అంతుపట్టలేదు

హనుమప్ప ఆశ్చర్యమూ-పరమాశ్చర్యమూ—

బసప్ప వెంటనే బ్రాహ్మణుడికిచ్చిన ముంగెరకి వెలకట్టి పంపేసి, రెండో ముంగెరతో ఇంటికివచ్చి భార్యని, ఎలావచ్చిందీ ముంగెర-ఇది ఒకదాన్నే చేయించి యింట్లో వుంచేనే అచ్చంగా అలాటిది ఇంకోటి ఎలావచ్చింది చెప్ప మన్నాడు,

హనుమప్ప పాపం ఆ అమాయకురాలు విషపాత్ర పుచ్చుకోవడం, అదంతా చెప్పి ఉంటుంది

బసప్ప చెప్పింది హనుమప్పగారూ— విఠలస్వామి అనుగ్రహం ఆమెకి కలగడం ఆమె దానధర్మ పరాయణతవల్లనే అని అని అతనికి తెలిసి ఆ క్షణమే అతనికి జ్ఞానోదయమైంది దానం తీసుకున్న బ్రాహ్మడే విఠలస్వామి అయి ఉంటాడని ఆయనకోసం వెదికాడు. ఆయన మళ్ళీ దొరకలేదు. అదిమొదలు విఠలస్వామికి పరమభక్తుడై, తన సంపాదనంతా దానాలు చేసేశాడు

హనుమప్ప సరి, సంపద ఉంచుకొనీ, పెంచుకొనీ దానాలు చెయ్యాలికాని, అంతా వదులుకుని ముష్టిలో పడితే దానాలేం చేస్తాయయ్యా బసప్పగారూ?

బసప్ప అడుగో గరుడ స్తంభంవద్ద. చిందుతొక్కుతూ శీనప్ప.

శీనప్ప . పాట

కమలనయను పదకమలమ్ముల పడి కుమిలి కుమిలి
పొరలవలె, తా
పముల కుంభమును ముక్కముక్కలుగ
పగులగొట్టి వేయవలె
కంటబడిన పెద్దల నిష్టాత్ముల వెంటవెంట
తగులవలె? నిత్యము
తుంటరు లెదురైన రాయిరప్పలు చూసిచూసి
విసిరి కొట్టవలెనని॥
॥పిచ్చియెక్కినది॥
మందమతులు తారసిల్లగమ్మని మౌనమే
వహియించవలె హరి
నిందా పరుల పయిని దుమ్ము ధూళియు
నిలువకుండ చల్లవలె
అందరకును తండ్రియైన యా శ్రీహరి
పురందర విఠలు పాదములను
పొంద జేయు జనులచేరి కీర్తన పాడిపాడి చిందు
తొక్కవలెనని॥
॥పిచ్చి యెక్కినది॥

హనుమప్ప పిచ్చి బాగా యెక్కింది

బసప్ప వెళ్ళిపోతున్నాడు ప్రతిదినం-ఉదయం కమలాపురంలోని మధ్వమఠంనుంచి బయలుదేరి, నడుమ యిళ్ళూ వీధులూ దాటుకుంటూ, హజార రామస్వామి ఆలయంలో. రాములవార్ని సేవించి మతంగమహర్షి కొండెక్కి నరసింహస్వామి కొలువు చూసుకుని—ఆ తర్వాత విఠలస్వామి దర్శనం చేసుకుని యిలా యీ పక్కగా తుంగభద్ర అవలి వొడ్డుదాకా పోతూవుంటాడు

హనుమ: నాకేమో ఇదంతా పిచ్చిలాగే ఉంది సుమా బసప్పగారూ-అంగీ చింపుకుంటానంటాడు, పూలచెండు తుంపుకుంటోంటాడు, గోడ బెల్లులు రక్కుతానంటాడు. కుండ పగులగొడతాట్ట, దుమ్ము ధూళీ చల్లుతాట్ట-పిచ్చి చిందులు తొక్కుతాట్ట.

బసప్ప భక్తికీ, పిచ్చికీ ఏదో అవినాభావ సంబంధం వుందేమో?
హనుమప్పగారూ—

హనుమప్ప ఇంతకీ, మా వేలువిడిచిన అక్కగారు సరస్వతమ్మను
చూడాలి రాజవీధిలో ఉన్నా మా ఆవిడను తీసుకుని
శీనప్ప యింటికివెళ్ళి అక్కగారిని చూదామనిపిస్తోంది

బసప్ప ఆ మహాతల్లి తప్పకుండా దర్శనీయురాలే రండి - విఠల
స్వామిని దర్శించి ప్రసాదం తీసుకుని వెడదాము

(నైవేద్య ఘంట)

(గుర్రాలు-గుర్రపుబండి చప్పుడు)

హనుమప్ప శ్రీనివాస నాయకులు ఉండేదిక్కడేనా-

సరస్వతి ఎవరు వారు-

హనుమ, పరదేశులం

పద్మ. బంధువులం-అత్తిగా, నేమా మీ తమ్ముడుగారూ వచ్చాం

సరస్వతి ఎవరూ- పద్మా- హనుమప్పగారూనా— ఎన్నాళ్ళకి
రండి రండి!

హనుమ ఊ సిద్ధప్పా! ఆ మూటలూ పెట్టెలూ అక్కడపెట్టి
చెరువుగట్టున బండివిప్పేసి, గుర్రాలకు నీళ్లు పెట్టవోయి

పద్మ ఎంత మారిపోయారమ్మా-అన్నయ్య ఇంట్లోలేరా?

సరస్వతి నగర సంకీర్తనమూ నాలుగు దేవరల దర్శనమూ
చేసుకుని అపరాహ్ణానికీ ఇంటికి చేరుకుంటారు

హనుమప్ప అంతటి ధనవంతుల్లో ఐశ్వర్యంతో గడిపి, ఇలాంటి
మఠంలో ఎలా ఉండగలుగుతున్నారమ్మా

సరస్వతి మీ బావే అంతగా మారిపోయినప్పుడు నాకివన్నీ ఒక
లక్ష్యమా నాయనా,

పద్మ పిల్లలేరి అత్తిగా-నలుగురనుకుంటాను

సరస్వతి ఐదుగురు

పద్మ, పెద్దబాబు వరదప్పది మామగారి పేరే-

సరస్వతి, అవును వాళ్ళంతా అప్పగారు కూర్చే సంకీర్తనలను
పలకలమీద వ్రాసుకుని విఠలస్వామి కోనేటిలో స్నానం
చేసి, అక్కడే ఆ కీర్తనలు పాఠం చేసుకుని వస్తారు

హనుమప్ప, బావగారి పిచ్చి వాళ్లకీ పట్టిస్తున్నారన్నమాట.

పద్మ ఏగూటి చిలకకి ఆ గూటి పలుకన్నారు అన్నగరు వ్యాపా
రం చేస్తున్న ఆనాడే వాళ్లు కళ్ళు తెరిచుంటే వాళ్ళకీ
ఆ వ్యాపకాలే వచ్చేవి

సరస్వతి- అలా అంటావు గాని పద్మా, ఎన్ని జన్మలో పుణ్యం
చేసుకుంటే గాని భగవంతుడిపై భక్తీ, నిత్య సంకీర్త
నమూ అబ్బుతాయా.

హనుమప్ప- అవునక్కా నువ్వు అలాగినక ఇంకేమంటావు?-
మొదట బావగారు మారిపోవడానికి కూడా నువ్వే
కారకురాలవని విన్నాను

సరస్వతి - ఎవరు మారడానికి ఎవరు కర్తలు నాయనా అన్ని
టికీ ఆ జగద్భర్త విఠలస్వామే కర్త

'వరదప్పా, రుక్మిణీ మొదలైన వారు సంకీర్తన
చేస్తూ వస్తారు'

(కేదార రాగం – ఆదితాళం)

నాపై ఆన, రంగా నీపై ఆన
నాపై నీపై మన ఇద్దరిపై 'భక్తవరుల ఆన'

పద్మ— అరుగో పిల్లలు వచ్చారు

సరస్వతి— తండ్రి చేసిన సంకీర్తనమే పాడుకుంటున్నారు.
బాబూ వరదా, రుక్కూ, ఇరుగో హనుమప్పమామా,
పద్మత్తయ్యావచ్చారు వాళ్ళకి మీనాన్న చేసిన సంకీర్త
నలు వినిపిస్తూ ఉండండి నేనిప్పుడే పొరుగింటికి వెళ్ళి
వస్తాను.

వరదప్ప, రుక్కు— 'పాట'

నిన్ను విడిచి అన్యుల భజించితే నాపై ఆన, రంగా
నన్ను నీవు కైవిడి పుచ్చితే నీపై ఆన—
తను మన ధనముల వంచన చేసిన నాపై ఆన, రంగా
మనసు నీపయిని నిలువకున్నచో నీపై ఆన
కాపురుషుల సంగాత మొందితే నాపై ఆన, రంగా
ఆ పయి లౌకిక మెడయకున్నచో నీపై ఆన
శిష్టమైత్రినే పొందకున్నచో నాపై ఆన, రంగా
దుష్టమైత్రి నే విడువకున్నచో నీపై ఆన
హరి నీ శరణమునందకున్నచో నాపై ఆన, రంగా
పురందర విఠల నన్నేలకున్నచో నీపై ఆన

సరస్వతి పద్మా పెరటిలో కాగుతో వేడి నీళ్ళు పెట్టాను. నువ్వూ మీవారూ స్నానాలు చేసి రావచ్చు.

పద్మ అయితే లేవండి మరి

హనుమప్ప ఎందుకమ్మా- అంత శ్రమపడ్డావు కోనేటికి వెళ్ళి స్నానంచేసి వచ్చే వాళ్ళమే

సరస్వతి మేము మారాముగదా ఆని, మావల్ల మీ అలవాట్లూ, మర్యాదలూ మానడమెందుకని,- అన్ని ఏర్పాట్లు చేశాను స్నానాలు చేసిరండి బావగారు వచ్చే వేళకి భోజనాలకీ కూడా లేవొచ్చు

హనుమప్ప నువ్వు సాక్షాత్తు సరస్వతీదేవి వమ్మా అక్కయ్యా.

పద్మ వచ్చింది మొదలు అక్కగారిని స్తుతించడమే- లేవండి స్నానానికి

'వాద్య సంగీతం'

వరదప్ప అమ్మా ఈ బంగారు పాత్రిలూ, ఈ పప్పులూ, భక్ష్యాలూ ఇవన్నీ ఎప్పుడు తెచ్చావమ్మా-

సరస్వతి పొరుగింటి శ్రీదేవమ్మ గారి నడిగి వరుసవేది ఎరువు తెచ్చాను దానితో కొన్ని ఇత్తడి పాత్రలూ పళ్లేలూ బంగారంగా మార్చి, వాటితో అంగడికి పోయి ఈ సామానులు తెచ్చాను

వరదప్ప ఎందుకు ఇవన్నీ తేవడం?

సరస్వతి మరి వచ్చిన చుట్టాలు కోటీశ్వరులు మనంసంపదలతో తులతూగేటప్పుడు మనింట్లో ఏ మర్యాదలు చేసే వారమో ఆ మర్యాదలన్నీ జరగొద్దూ వారికి.

వరదప్ప ఏమోనమ్మా- అప్పగారివన్నీ చూస్తే ఎమంటారో-

సరస్వతి అరుగో- మాటలోకే వస్తున్నారు వెళ్ళి చేతిలోని తంబురా అందుకో.

శీనప్ప అప్పా- ఈ పొద్దున మనింటికి చుట్టాలు వచ్చారు,

శీనప్ప భాగవతులా

వరదప్ప కాదు ఆ తాళపు చిప్పలు కూడా నాకే యివ్వండి

శీనప్ప ఏమర్రా- తమ్ములు గురురాయడు మధ్వప్పా ఏరీ.

సరస్వతి చుట్టాలతో ఉన్నారు జోలె ఇటివ్వండి.

శీనప్ప, ఊఁ విఠ్ఠల విఠల- చుట్టాలెవరూ ఇంతకీ ఎవరైనా యోగీశ్వరులా-

సరస్వతి కాదు- ఇవిగో నీళ్లు- కాళ్ళు కడుగుకోండి

శీనప్ప ఓహో ఇదేమిటి- ఎత్తిచ్చి కరగిపోసిన ఇత్తడి బంగార మాయె ఈ బంగారు చెంబు ఎక్కడినించి వచ్చింది

వరదప్ప మన యింట్లో చెంబే-మీరన్నట్లుగా నే ఇత్తడి బంగారమైంది

శీనప్ప హరిపురేందర, హరిపురేందర- ఇంతకీ చుట్టా లెవరు చెపుమా-

హనుమప్ప నమస్కారాలు శీనప్ప బావా- చాలా కాలానికి దర్శనం

పద్మ నమస్కారం అన్నయ్యా- అత్తిగనీ మిమ్మల్ని చూచి పోదామని వచ్చాం

శీనప్ప పురందర విఠలా పురందర విఠలా

హనుమప్ప వర్తక వాణిజ్యాలు వదలి నువ్వు భక్తిమార్గంలో పడిపోయావు బావా- నవకోటి నారాయణ మా బావ గారు అని చెప్పుకుని మీ ఆశీర్వచనంవల్ల నేను వ్యాపారము వాణిజ్యాలలో ఇటీవలే నవకోటి హనుమప్ప బిరుదం పొందాను బావా

పద్మ ఒక్కనాడు కూడా మీ పేరు తలవని క్షణం ఉండదన్నయ్యా, మీ బావకి

శీనప్ప పురందర విఠల పురందర విఠల! వరదా, రుక్మా- సరస్వతీ- ఈ పాత్రలు, ఈ పళ్ళేలు, ఈ పీటలు చెంబులు, ఇవన్నీ బంగారపువి ఎలా వచ్చాయి మనింటికి?

సరస్వతి. నేనే- పొరుగింటి శ్రీదేవమ్మగారి వరుసవేది తెచ్చి,

శీనప్ప శ్రీదేవమ్మగారి పరుసవేదా?- పాండురంగ- పాండురంగా- ఇదేవటి- ఈ భక్ష్యాలు భోజ్యాలు ఇవెక్కడివి? మన వంటిల్లంతా ఆ వరుసవేదితో బంగారం చేసేశావా సరస్వతీ-

సరస్వతి అవును కొన్ని పాత్రలను అంగడిలో ఇచ్చి, విందు సామగ్రి అంతా తెచ్చాను

శీనప్ప· విందు సామగ్రి? మనం ఎందుకు చెయ్యాలి అంత గొప్ప విందు? మన ఉంఛవృత్తి సంసారానికింత గొప్ప విందేమిటి?

సరస్వతి మీ బావ కోటీశ్వరులు కదామరి. వారికి తగిన అంతస్థులో విందు చెయ్యవద్దా అని అలా చేశాను.

శీనప్ప మన అంతస్థు మాటేమిటి? ఎంతపని చేశావు సరస్వతీ నన్ను మరచావు నా నియమ నిష్టలు మరిచావు— నన్నూ నీ అంతస్థునూ మార్చిన పరసువేదివి నువ్వు— నిన్నునువ్వే మరచిపోయావా సరసూ.

సరస్వతి (దగ్గదికతో) మీ మనస్సుకింత నొప్పి కలిగిస్తాననుకోలేదు అపచారమైపోయింది మన్నించండి అదేవిటీ- ఆ పాత్రలు, ఆ వంటకాలు, అన్నీ, అన్నీ ఏం చేస్తున్నారు

హనుమప్ప క్షమించాలి బావగారు— మా రాక మీ నియమ నిష్టలకి భంగం కలిగించిఉంటే— అయ్యో, అదేవిటి, అక్కగారు శ్రమపడి వండినవన్నీ-అపాత్రలూ పళ్ళాలూ అన్నీ మూటగట్టి— ఏం చేస్తారు

పద్మ ఏం చేస్తారన్నయ్యా, ఎక్కడికీ ఆ మూటతో-

సరస్వతి ఇదిగో— ఎక్కడికీ ఆ మూటతో- అయ్యో- అది- ఆ రాయి అదే పరుసవేది- అది మనదికాదు ఇలా తెండి.

శీనప్ప ఏది మనదికాదు భక్ష్యాలు, వంటకాలు, పాత్రలు, పళ్ళాలు, పరుసవేదీ— అన్నీ పురందర విఠలస్వామి కోనేటికి అర్పించి వస్తాను

సరస్వతి ఇదిగో— ఏమండీ

హనుమప్ప బావా శీనప్పా,

పద్మ అన్నయా, అన్నయ్యా,

వరదయ్యా, రుక్కు· అప్పగారూ అప్పగారూ!

(శీనప్ప మూటతో వెళ్ళిపోతాడు)

వీణాతానం

శీనప్ప హరిపుందరా హరిపుందరా— అర్పించి వచ్చాను కోనేటికి,

సరస్వతి· మన వస్తువులు మనం ఏమైనా చేసికోవచ్చు. పరాయి వారి పరుసవేది వారికి ఇచ్చివేసి ఉండాలి.

శీనప్ప ఓహో అలాగా. అయితే సరే. నాయనా వరదప్పా, విఠలయ్య కోనేటిలో దిగి నీ దోసిటితో దోసెడు తీసుకు రా- పరుసవేదిరాళ్ళు. అన్నీ ఆ శ్రీదేవమ్మ కేయిచ్చిరా.

వరదప్ప, ఇప్పుడే ఇచ్చివస్తా నప్పగారూ.

శీనప్ప సరస్వతీ, చుట్టాల్నిలా తీసుకురా— రండి పద్మా, హనుమప్పా, పిల్లల్ని అందర్నీ పిలు రుక్కమ్మా గురురాయము మధ్వపతీ అంతారండి. ఇలవేల్పు విఠలయ్య మందిరంలో కొలువున్నాడు- రండి— అంతా కొలువు దగ్గరకి.

బావా హనుమప్పా. మీకు నవకోటి నారాయణగా పేరు పడిన శీనప్పే బాగా తెలుసు. ఆ నవకోటి నారాయణ పనికిమాలిన ఇత్తడి వంటివాడు. ఆ యిత్తడికి బంగారం చేసిన పరుసవేది విఠల నామం ఆవిఠలకీర్తనమనే బంగారాన్ని నాకందించిన పరుసవేది యీసరస్వతి— నాసరస్వతి—నా సరస్వతే నాపాట నాసంకీర్తనం— నా రక్తి, నా భక్తి, నా ముక్తి, విఠలనామమే సరస్వతి 1 నా సంగీతం నా సాహిత్యం అదే— అలలేని పరుసవేది వేరేది?

పాట

దేవగాంధారి-ఆది

వెలలేని పరుసవేది- వేరేది- యింకేది

నలిన నాభు భజనముకంటెను పరమేది ప్రియమేదీ,
ఏదీ, ఎదీ, ॥ వెలలేని॥

హీనలోహసమ మానవ జన్మను, పైనిలోన
పైడిసేయు నేది

కలుషరాశి కూలద్రోసి కాంచన కహిగరిమ కలుగ
జేయునేది ॥ వెలలేని॥

ఆకులేని అలరులేని మ్రోడగు మ్రాకునేని
చివురించి విరియించి
పాటరాని భక్తిలేని మూగకు పాట ఆటభక్తి
నేర్పు నేది ॥వెలలేని॥
ఉపనిషత్తుకంటె సులభమయి పరమ పవిత్ర
పచోభి రామపదమై
అపరిమితానంతధామమైన హరిపురందర
విఠలకీర్తన వినా ॥వెలలేని॥

వెలలేని పరుసవేది. వేరేది 1

(విఠ్ఠలస్వామి దేవాలయ ఘంటానాదం)

(వేద పఠనం)

ప్రకటన విఠలస్వామి సన్నిధిలో వ్యాసరాయగురు పీఠాధిపతి
సత్యధర్మాచార్యులు తీర్చిన సభాస్థలి

ప్రవచనం అల్లదకర్మవ ఆచరిసిదవకెట్ట
ఎల్లరొళగె విరోధిసిదవకెట్ట
బల్లిదరొడనె సెణసాడువవకెట్ట
లల్లె మాతిన సతియనంబిదవకెట్ట
ఫుల్లనాభనమ్మ పురందర విఠలన
మెల్లడి నంబిదవ కెట్ట నరగేడి—1

తాత్పర్యం కూడని పనులాచరింప ఒనగూడును వినాశమ్ము
ఎల్లరతో విరోధింప నెసయు వినాశమ్ము
బల్లిదులగు వారితోడ పోరాడుట వినాశమ్ము
కల్లవలపు తొలికే సతి కామించుట నాశనమ్ము
ఫుల్లకమల నాభుడయిన పురందర విఠలుని మెల్ల
మెల్లని యడుగులిసుమంత నమ్ముకున్న వినాశమ్మే

ప్రవచనం గురియ నెచ్చవనె బిల్లాళు
హరియ భజిస లరియదవనె మూసాళు
హరియందు ఒదిదెల్లవు హోళు
పురందర విఠల ప్రార్థన మనెయాళు॥

తాత్పర్యం గురితప్పక కొట్టువాడు గొప్ప విలుకాడు
హరి భజన మెరుగని వాడు మోసగాడు
హరిని గూర్చి చెప్పని చదువు గోలపాడు
పురందర విఠలుడు ప్రార్థని ఇంటి పనివాడు.

ప్రవచనం నరవృంద ఏంబ కాననదల్లి శ్రీ
హరి నామె వెంబంధ కల్పవృక్ష హుట్టితయ్యా
నెరళు సేరలుంటు ఫలవు మెల్లలుంటు
నాలిగెయలి నామత్రయ గళుంటు
ఇదే మనుజర మనద కొనెయరావు
ఇదు బ్రహ్మాది గళ సదమల హృదయ పీఠ
ఇదే ద్వారక, ఇదే క్షీరాంబుధి, ఇదే పురందర
విఠలన మందిర॥

తాత్పర్యం నరబృంద మనెడి కాననమందు- శ్రీ
హరినామ కల్పవృక్షము పుట్టెనయ్యా
చేర చల్లని నీడ, ఆరగింపగ పండ్లు
నాల్కపై కలదందు నామత్రయంబు
ఇది మనుజ హృదయముల కంతిమాశ్రయము
ఇదియె బ్రహ్మాదులకు సదమల హృత్పీఠి
ఇదియె ద్వారక ఇదియ క్షీరాంబునిధి—ఇదియె
హరిపురందర విఠలు ఆనందమందిరము

సత్యధర్మ శ్రీనివాసా! శ్రీ పురందర విఠల స్వామి పూర్ణాను
గ్రహము నీ కీనాడు లభించింది

తీర్థులు సహస్రాధికములయిన నీ సంకీర్తనములను స్వామి అప్యాయముగా స్వీకరించారు. నేటి నుండి నీవు పురందర దాసను పవిత్ర నామముతో ప్రసిద్ధుడవవుతావు. సంకీర్తనాత్మకములైన నీ బోధలు పురందరోపనిషత్తుగా చిరస్థాయులు కాగలవు మూగపోయిన గొంతులు నీ సంగీతములో పల్లవించి మధురగానమును వెలార్చగలవు కరకు రాతి గుండెలు నీ సాహిత్యమున

కరిగి మధుర భక్తి మకరందములో ఓలలాడగలవు.
ధన్యుడవు పురందరదాసా ధ్యన్యుడవు—

బృందగీతి

ఉపనిషత్తుకంటె సులభమయి పరమ
పవిత్ర వచోభిరామ పదమై
అపరిమితానంద ధామమైన హా
రిపురందర విరలకీర్తన వినా
వెలలేని పరుసవేది, వేరేది, యింకేది,
నలిన నాభు భజనముకంటెను పరమేది
ప్రియమేది ఏదీ !

పద్మప్రాభృతకము

సంస్కృత మూలము :
మహాకవి శూద్రకుడు

తెలుగుసేత :
శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

[‘చతుర్భాణీ’ అనే పేరుతో పాట్నాలోని శివపురీ ముద్రాక్షరశాలవారు 1922లో నాలుగు సంస్కృత భాణాలను కలిపి ఒక పుస్తకంగా ప్రచురించారు. భాణం సంస్కృతంలోని దశవిధరూపకాలలో ఒకటి. ఒకే పాత్రతో సాగే ఏకాంక రూపకం భాణం. కథ చిన్న ఏకాంకనాటికకి సరిపోయేదిగా ఉండే ఒకే సంఘటన. కథలో వచ్చే మిగిలిన పాత్రలకు సంభాషణ లుండే, రంగంమీద కనబడేపాత్ర ‘ఓహో అలా అంటున్నావా?’ అని ఆ మాటలను తిరిగి చెప్పాలి ఆ పాత్రలలాగ అభినయించడంకూడా ఉంటుంది. ఈ ‘చతుర్భాణీ’లో శూద్రకుడు రచించిన పద్మప్రాభృతకమూ, వరరుచి రచించిన ఉభయాభిసారికా, ఈశ్వరదత్తుని ధూర్తవిటసంవాదమూ, శ్యామిలకుని పాదతాడితకమూ—అనే నాలుగు భాణాలు ఉన్నాయి. ఈ నాలుగింటిని పరిష్కరించి సంపాదకులుగా ఉపోద్ఘాతం వ్రాసిన వారు మాననీయులూ కీర్తిశేషులూ అయిన మానవల్లి రామకృష్ణకవిగారు. ఈ నాలుగింటిలో దేనినీకూడా ఇంతవరకూ ఎవరూ అనువదించలేదు.

వసంతసేన నాయికగాగల మృచ్ఛకటికం నాటకంద్వారా దానిని రచించిన శూద్రకుడిపేరు మన దేశంలోనే కాకుండా సంస్కృత సాహిత్యం ప్రచారం పొందిన రష్యా, అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ మొదలైన పాశ్చాత్య దేశాలలోకూడా చాలా ఘనంగా ప్రసిద్ధి పొందింది. ఈ పద్మప్రాభృతకంతప్ప శూద్రకుడిపేరుమీద మరొక రచన ఏదీ లేదు.

శూద్రకుడే సాహసాంకుడు లేక విక్రమార్కుడు అనే బిరుదుగల ఒక మహారాజు అనికూడా కొన్ని ప్రాచీన సంస్కృత గ్రంథాలలో కనబడుతుంది. శూద్రకుడి సాహస గాథలను చారణులు గానం చేసేవారట. ఇతడు భాసమహాకవికి కొంచెం తరవాతివాడూ, కాళిదాసుకు పూర్వుడూ అయి ఉండాలని పరిశోధకుల నిర్ణయం. దండి అవంతిసుందరికథలోను, సోమదేవుడి కథాసరిత్సాగరంలోను, శూద్రకుడి కథ, ప్రశంసా కనబడతాయి. పాశ్చాత్య పండితుడు ఎ. బెరిడేల్ కీత్‌గారు తన గ్రంథంలో శూద్రకుడు అనే పేరు పుక్కిటి పురాణాలుగాను, జానపద గాథలుగాను చెప్పుకునే కథలలోని ఒక ప్రాచీన మహారాజుదనీ, భాసకాళిదాసులకు మధ్యకాలంలో వెలసిన ఒక అజ్ఞాతకవి తనకు ప్రాచీనత్వం ఆపాదించుకోడానికి శూద్రకుడనే పేరు పెట్టుకున్నట్లు తోస్తుందని వ్రాశారు. భాసుడు వ్రాసిన దరిద్రచారుదత్తము అనే కథలోని చారుదత్తుడు, వసంతసేన, సంస్థానక శ్యాలకుడు మున్నగు పాత్రలను తీసుకుని ముఖ్య కథకు ఉపాంగముగా, పాలకరాజు చెరలో ఉంచిన ఆర్యకుడు ప్రజావిప్లవంద్వారా పాలకుని రాజ్యాన్ని ఆక్రమించుకోడమూ, చారుదత్తునికి సహాయం చెయ్యడమూ అనే సంఘటనలను జోడించి, మృచ్ఛకటికాన్ని శూద్రకుడు సొంత నాటకంగా దిద్ది తీర్చాడు. ఇది చాలా ఉదాత్తంగా చెయ్యడంచేత గ్రంథచౌర్యం అనడానికి మొహమాటపడ్డారు పండితులు. వసంతసేనవంటి సౌజన్యవతియైన వేశ్యలు, తరుణ వేశ్యా తపస్వినులు ఒకరిద్దరి ప్రశంస పద్మప్రాభృతకంలో ఉంది. అందుచేత అతని పేరు శూద్రకుడు అయినా, కాకపోయినా మృచ్ఛకటిక రచయితే పద్మప్రాభృతకంకూడా రచించి ఉండవచ్చని చెప్పగలం. పద్మప్రాభృతకంలో ఒక తరుణ వేశ్యాతపస్విని ప్రేమించిన మౌర్య రాకుమారుడు చంద్రోదయుడు సామంతులపైకి దండయాత్రకు వెళ్లిన ప్రశంస ఉంది. అప్పటికి, బౌద్ధసన్యాసులలో సాంఘికంగా నైతికంగా ఒక క్షీణదశవచ్చి, సమాజంలో తిరిగి ఆర్య సంప్రదాయాలవైపు మొగ్గుదల కనబడుతున్నట్లు పద్మ

ప్రాభృతకాన్నిబట్టి తెలుస్తుంది. వీటినిబట్టి, మృచ్ఛకటికమూ, పద్మప్రాభృతకమూ రచించిన కవి శూద్రకుడైనా, ఎవరైనా, క్రీస్తుకు సుమారు ఒక శతాబ్దం అటో ఇటో ఉండినట్లు ఊహించవచ్చు

మిగిలిన ప్రసిద్ధ సంస్కృత నాటకాలలోలాగ ఏ పౌరాణికగాథో, ఏ ధీరోదాత్త రాజకుమారుని కథో కాక, ప్రకరణమూ, ప్రహసనమూ, వీధి, భాణమూ అనే రూపకాలలోని ఇతివృత్తము మధ్యతరగతి మనుష్యులకుచెంది, సాంఘికమై ఉంటుంది. గ్రంథకర్త కాలపు సాంఘికజీవితం అందులో ప్రతిబింబితమౌతుంది. మృచ్ఛకటికం ప్రకరణం అనే రూపక రీతికి చెందినది. పద్మప్రాభృతకం భాణము.

భాణాలలో రంగంమీదికి వచ్చే పాత్ర విటుడు. వీడు కథానాయకుడుమాత్రంకాడు. కథానాయకుడికీ, నాయికకీ, ఆబాల్యమిత్రుడు; నర్మసచివుని వంటివాడు. కథానాయకుడు ఎటువంటి వాడంటే—

'పెద్దయింటివాడు, పేరుపడినవాడు,
వింతలేక నవ్వు వెలయు మోము,
మాట, రూపు, వయసు, మంచివై ఒడలెత్తు
మరుడు'.........

అయిఉంటాడు అయితే నడతచేత ధూర్తాచార్యుడూ శఠుడూ అనిపించుకుని, సకల కళా శాస్త్రపారంగతుడయికూడా, వేశ్యాస్త్రీలోలుడూ, పైగా, ఒకతె తర్వాత ఒకతెగా అందమూ చందమూ యౌవనమూ వన్నెవాసిగల కొత్తనాయికలను (అంతా సామాన్యలే) ప్రేమించి ప్రేమింపజేసుకునే ధీరలలితుడు. అతడుకాని, నాయికగాని, రంగంమీదికి రాకుండానే విటుని సంభాషణద్వారా వారికథ ద్యోతకం అవుతుంది. పాత్ర—విటుడూ; రంగం—రాజవీథీ; రాజవీథిగుండా పూలబంగిదాటి, వేశ్యావీథిలోని నాయికగృహోద్యానందాకా ఈ భాణంలోని దృశ్యం సాగుతుంది. అసలు కథ ప్రారంభించడానికి ముందు ప్రస్తావన - దానిలో సూత్రధారుడు వచ్చి, శివప్రార్థనచేసి, శృంగార రసానికి ఉద్దీపనకారియైన వసంత ఋతువును వర్ణించి, నిష్క్రమిస్తాడు. ఆ తర్వాత అసలు భాణం.]

(నాందికాగానే సూత్రధారుడు ప్రవేశించి)

(నాంది కాగానే సూత్రధారుడు ప్రవేశించి)

తనయనుగ్రహమున క్రోధధాటిచేత
కాంతల విలాసమూర్తియు, కామదేవు
కాంతతర తను వొదవంగ కారణమగు
నట్టి దైవమ్ము రుద్రున కగుత జయము!

అంతేకాదు.,

(గేయం) పూయునవే కురవకాలు, కూయును కోకిలలు,
చివురులతో పూవులతో చెలగు నశోకాలు,
అదె అళిరొద, అదే మావిపూలతావి మోయు గాలి,
కదలునదే ధనుర్ధారి, మదనమూర్తి కాననాల!

మరీ యేమంటే,

(గేయం) తరురసాల మత్తిలినకోకిలలు
పక్షిసంఘముల వాద్యగోష్ఠితో పాటపాడు నదిగో!
వనములోని అంతఃపురనారి
వాతాచార్యోపదేశమున లత నాట్యమాడు నదిగో!
పల్లవాగ్రతర్జనుల కొనలతో
ప్రసవ ముదితతరుపంక్తి నర్తకిని తిద్దితీర్చెడు నదే!
అదె వచ్చె వసంత శ్రీమంతుడు
అలముకొన్న నీహారతుషారము లంతరించిన వదే!

వేరు చూచినా, నడుమ చూచినా,
చివురు చూచినా, మాకు చూచినా,
శోభిచాని లోగుట్టు పోలికను
విరియబూచిన దశోక మంతటా!

ఓహో ఇది—

కొసరి కూయు పుంస్కోకిలాలతో,
కుంద చూతముల సిందువారముల కుసుమరాజితో
మదన మదముతో, మలయ వీచితో
యౌవన హృదయరంజని వసంతము.

(నిష్క్రమిస్తాడు.)

—(ఇది స్థాపన)—

(అప్పుడు విటుడు ప్రవేశిస్తాడు.)

విటుడు: బలేబలే! ఎంత బాగుంది! సంవత్సరం అనే విలాస పురుషుడికి చలికాలపు ముసలితనంలో సర్వమూ ఉడిగిపోయాయి; అయినా, హిమరసాయనం సేవించడం చేత మళ్ళీ వసంతకిశోరత్వం లభించింది! ఇప్పుడెలా ఉందంటే,

పద్మప్రాభృతకము

(గేయం) చివురుకొన లల్లాడ చెట్లు నృత్తముసేయ
పూచిన తీవలు పొందు జవ్వనము!
తిలకతరు శిరసుపై కోకిలే క్రొమ్ముడి,
కుంద కుసుమముపైని కూర్చున్న తుమ్మెద
సుందరి క్రీగంటి చూపు తలపించు!
అప్పుడే తలసూపు అరుదు గుబ్బలకన్నె
అనిపించు ఆకుపచ్చని తమ్మి మొగ్గ!
వలపు చెలగాటాన అలిసి చెమర్చిన
జవరాలిస్తనముల సంస్పర్శవోలె
కొంటెగా వీచు ఆమని కోడెగాలి!

ఈలాగే మన్మధ బాణాలు తగిలి తగిలి మోటువారి బలిశాడీ వసంతుడు. ఏమంటే, దేవదత్తతోపాటు యవ్వనోత్సవం జరుపుకున్న కర్ణీపుత్రుడైన ఆచార్య మూలదేవుడికి ఆమె చెల్లెలు దేవసేన అప్పుడే కుర్రతనం వదిలి,వయస్సు పొంగి పుష్పవతియైన లేమావికొమ్మగాను వసంతుడు తనలాగ ఆకొమ్మను దాటిపోయే మదనభ్రమరుడుగాను కనిపిస్తున్నారు. లేకపోతే కర్ణీపుత్రుడికి తప్పుతుందా ఋతుప్రభావం? నెయ్యీ తేనే కలిపిన అన్నం కూడా పక్కని నంచుకోడానికుంటే బాగా రుచిస్తుంది. అందుచేతనే దేవదత్తతో సాంగత్యం అనే మధుపానానికి పక్కనంజుడు కూరలాంటిది దాని చెల్లెలి పొత్తు. కుర్రవయస్సు మూలాన నవ్వూ, నవనవా, అందమూతప్ప అది ఏ కూరాలేని కూడులాంటిదయినా కన్నె పిల్లతో కలయికంటే మరో విలక్షణమైన ఆనందాన్నిస్తుంది కదా అని కోరుకుంటున్నాడేమో అనిపిస్తోంది నాకు.

అమ్మబాబోయ్! ఈ మదనజ్వరం అనేది అంత తేలికగా కనబడుతున్నా మహాచెడ్డ బలమైనది. ఏమంటే,దాని మూలాన్నే కదా, అనేక శాస్త్రాల్లో గడితేరిన మహాబుద్ధిశాలీ, అన్ని కళలలోని మంచీ చెడ్డా ఆకళించుకొన్నవాడూ, నెరజాణలైన యువతులతో కామతంత్రానికి సూత్రధారిత్వం నెరపగలవాడూ అయిన ఆచార్య మూలదేవుడికి కూడా ఎటువంటి అవస్థ పట్టిందంటే

కునుకు పట్టక వాడి కను లెర్రబారినవి;
ప్రత్యూషశ్శశివలె పాలిపోయెను మొగము;
ఇంద్రియములన్నింట ఎడతెగని తాపమ్ము;
తలపుల ఆవులింతల పొరలు దేహమ్ము;
ఆమని, జాబిల్లి, పూమాల, సంగీత
చందనాదుల తనకు సంతాపమే హెచ్చె!

పోనీ, దేవసేనను గురించి గనక, దీనికంత ఆశ్చర్య పడనక్కరలేదు. శ్లాఘ్య మన్మధ మనోరథ క్షేత్రం ఏదయ్యా అంటే ఆ పిల్లే! దాని రూపయవ్వన లావణ్యాలు కర్ణీపుత్రుడికి పిచ్చెత్తించడానికి అన్ని విధాలా తగినవే! అదెలాగంటే,

ఇర్రి చూడ్కులు, కొరుకు డొక్కింత వడక
కోరికల రేపు పెదవులు, చేరెడేసి
చెంపల మొగమ్ము, కొనలూరి చెలగుంరొమ్ము;
పూలతీవ జంటనుబోలు కేలుదోయి;
కనియు కనరాని నూగారు మొనయు కడుపు;
ఎచటనుండి ఏర్పడె శ్రోణి యెరుగరాదు
తలపు తీపెక్కు నైజమ్ము దాపలేక.,
ఇన్నిటికి పిచ్చియెత్తదో యెవరికైన!

(ముందుకి సాగి)

అతని కిప్పుడు దేవసేనవల్ల ఒళ్లు హూనమయేటంత మదనజ్వరం వచ్చింది. అందుకని ఆమెని కలుసుకునే ఆశతో హార తాలవృంత చందనాది శైత్యోపచారాలద్వారా ప్రాణాలు నిలబెట్టుకుని పడుకుని ఎలాగో కాలక్షేపం చేస్తున్నాడు. ఈనాడు తెల్లవారకముందే పుష్పాంజలికుడనే దేవదత్త పరిచారకుడు వచ్చి, నమస్కరించి కర్ణీపుత్రుడితో ఇలా అన్నాడు.

"అయ్యా, నమస్కారం, మాయక్క దేవదత్త తమతో ఇలా మనవి చెయ్యమంది! 'తరచు వస్తూండక పోవడం చేత అయ్యవారు నామన్ననకి దూర మవుతున్నారు. మా చెల్లెలు దేవసేనేమో ఎందుకో సుస్తీగా ఉంది. దాని మీది యావకొద్దీ నాకు బెంగగా ఉంది. అయినా,ఇదిగో ఇప్పుడే వద్దామనుకుంటున్నాను' అని."

అప్పుడు పుష్పాంజలికుడికి జవాబుచెప్పి, వాణ్ణి సాగనంపిన కర్ణీపుత్రుడు నన్ను పట్టుకుని ఇలా అన్నాడు. 'ఒరేయి శశా, నువ్వు కూడా విన్నావు కదా — ఇప్పుడే వద్దామనుకుంటున్నానన్న దాని సందేశం? క్షేమం తెలిసికోడానికి నాదగ్గరకి దేవదత్త వచ్చినప్పుడు ఒంటరిగా ఉండే దేవసేన ఆంతర్యం కనుక్కొని దాని బెంగకి కారణం ఏమిటో తేల్చుకోడానికి ఇదే సమయం! అందు కిదే నీకు నా నమస్కారం, దేవసేన మూలాన్ని గుండెలో పిడిదాకా దూసుకుపోయిన కామబాణశల్యాన్ని పైకి లాగివేయడానికి దేవానాంప్రియుడవైన నీవే అన్ని విధాలా తగుదువు' — అని.

నవ్వుతూ వెంటబడ్డ నే నన్నాను గదా: 'ధూర్తాచార్యా, పగటి దివిటీ వెలిగిస్తావెందుకోయ్? నాకు తెలియదనుకున్నావా మీయిద్దరిమధ్యా చూపుల్లో నడిచిన మూకరాయబారాల సంగతి? అదీకాక నేనెవ రనుకున్నావు? మూలదేవుడిమిత్రుడైన శశుడిని. దాన్ని బుట్టలో వెయ్యకుండా తిరిగిరావడమేనా' అని చెప్పి బయలు దేరాను.

అందుకని, రాజమార్గాన ఎదురయ్యే స్నేహితులను పలకరించుకుంటూ వెళ్లాలి. దేవదత్తపక్కని లేకుండా ఒంటరిగా ఉన్న దేవసేనను కలుసుకోడాని కిదే మార్గం!

(ముందుకి సాగి)

ఓహోహాహా! వసుంధరావధువుకి జంబూద్వీపం వదనకపోలం అయితే ఆ కపోలం మీద చిత్రించిన పత్రలేఖనమూ అనిపించే అవంతిసుందరి యీ ఉజ్జయిని అపరలక్ష్మీదేవిలా విరాజిల్లుతోంది.

(గేయం) వీనులవిందగు వేదపాఠములు,
వీథులరథాశ్వగజధనుర్ధ్వనులు,
విద్వచ్చర్చల శ్రావ్య దృశ్యములు,
చతుస్సాగర ప్రోత్థిత విపణులు,
గీతవాద్యములు, ద్యూత హాస్యములు,
సకల కలానురక్తవిటగాథలు
క్రీడా పక్షుల ఆకలి కేకలు,
గలగలమను గాజుల గృహపంక్తులు!
(ముందుకు సాగి)

సరే, వెళ్ళేపని పర్యవసానం ఎలా ఉంటుందో తెలియడానికి ఏదైనా శకునం పరిశీలిద్దాం. (అంటూఇటూ చూసి.)

ఆఁ. ఇడుగో—కవిత్వకండూతిగల కాత్యాయనగోత్రుడు, శారద్వతపుత్రుడు, సారస్వతభద్రుడు, తనయింటి ముని వాకిట్లో ఆలోచిస్తూ కూచుని, పాలిపోయిన చెయ్యి ముందుకు చాపి, ఒళ్ళూ, చూపులూ, బొమముడీ అదేపనిగా కదుపుతూ, తన్మయంగా తకిలీ తిప్పడంలో మునిగిపోయి ఉన్నాడు. ఈరోజుల్లో తమ తెలివి తేటల ప్రవాహానికి అడ్డు తగిలే కాస్త బుద్ధి ఉన్న స్నేహితుడిమీదకూడా కవులు అసూయ పడడం కద్దు కనుక ఈసరస్వతీలతను పూచిన వాక్పుష్పాలను నాచెవుల్లో చెరివికోకుండా వెళ్ళడమే నాకర్తవ్యం. అయినా, వీణ్ణి ఒకసారి పలకరించి చూస్తాను.

ఏమోయ్, కాత్యాయన, ఎందుకో గాలినెమరువేస్తున్నట్లున్నావేం? ఏఁవిటంటావు? 'నన్ను కవిత్వపు దయ్యం పట్టుకోలేదులే' అనా! అలా అనకు. పూర్వ కవులు లొడిగిపారేసిన చెప్పుల లాటి పాతమాటలతో గొడారి పని చేసి చేసి గుడ్డివాడవై, దారితప్పిన ఆలమంద పాలికాపులాగా కొత్తమార్గం ఎలా తొక్కుతావు? అయితే నువ్వు కూర్చిన గేయానికి వస్తువేమిటి? ఏఁవిటంటావు? 'ఇదిగో ప్రస్తుతం ఇలా రమణీయంగా వ్యాపించిన వసంతఋతువును గురించే వ్రాశా' ననా? ఏదీ వినిపిస్తావూ? 'ఆఁ. ఆ గోడమీద వ్రాసిఉంది చదువుకో' అంటావా! సరే!

(గేయం) 'పకపక నవ్వే పువ్వులతో మరి
మదమెక్కిన మధుకరాలతో,
తెగకూసే కోకిలతో సిరియై
చెమటలోడు అవతారముతో,
చల్లగ సాగు సమీరముతో
కర్కశుడై పైకొను కామునితో,
మైమరపించుచు ఈకాలము
వగలేమి యెరుంగని ముద్దరాలినే
త్రోయగలదు కాముని కౌగిలికి
చేయగలదు నెరజాణ దూతికల
వేయిమంది ననునయ నిపుణులుగా!'

బలే బాగుందోయ్! నీకుశుభం! మిత్రమా, సత్పుత్రుడిలాగ ఈ గేయం నీకు కీర్తిని ప్రసాదించుగాక. వాగ్దోషాలను కెలికే విమర్శకుల బారినుండి నీకు శ్రీరామరక్ష!... ఆఁ. ఎవరా నవ్వింది? ఓహో! పీఠమర్దుడయిన దర్దరకుడు కూడా ఉన్నాడే యిక్కడ? ఏవిటోయ్ దర్దరక నీకు నవ్వు తెప్పించే విషయం? ఏవంటావు? 'వాగీశ్వరుడిని వాక్కులతో అర్చించడమేమిటి? సముద్రుడికి నీళ్ళతో అర్ఘ్యం ఇచ్చినట్లు?' అంటావా? హోరి నీకు జ్ఞానం లేనట్లుంది. 'పూవులఋతువైన వసంతుడికి పుష్పోపహారం ఏమిటని నీవిమర్శ' అవునా? ను వ్విదెప్పుడూ వినలేదా?

'దీపికలతోడ సూర్యు, నబ్ధిని జలమ్ము
తోడ, పూజింత్రు, పూవులతో వసంతు;
నటులె భగవాను వాగీశు నర్చనమ్ము
వాక్కులను పేర్చి సేయగా వలయు మనకు!' అని.

సరేలే– తెలిసింది. నీస్వభావం పోనిచ్చుకున్నావుకావు. ఇంతకంటే యేవిటోయ్ నీకు కావలసిన మర్యాద? నీవంటి పరభృతాల ప్రలాపాలకు వసంతకాలమే తగును. నువ్వలాగే వర్థిల్లు నాయనా! నేను వెడతాను. (ముందుకు నడిచి, చూసి) ఇదిగో—ఇక్కడ సిడోకడు - విపులామాత్యుడు—కామదత్తు ప్రఖ్యాతకావ్యం ద్వారా పేరుపడ్డవాడు. వేశ్యయింటి నుంచి బయట పడ్డం మూలాన్ని కాబోలు ముఖం దించుకు చక్కా పోతున్నాడు. ఆఁ తెలిసింది. మూలదేవుడికి దేవదత్త సౌభాగ్యం సంక్రమించడం తన శిష్యురాలు విపులకి పెద్ద అవమానంగా భావించి, చిన్నపుచ్చుకుని కోపంతో దహించుకు పోతున్నాడు. కానియ్యి, వీడిని కాస్త ఏడిపిస్తూ పలకరించాలి.

ఏఁవిటోయ్ – కలువపూవేస్తాలను మేలుకొలపని పగటి చంద్రుడిలాగ దాటుకు పోతున్నావేం? నిన్నొక టడగనా?

కళలు, విజ్ఞాన సంపత్తి, కలిగి గర్వ
శీలయౌ విపులమతి నేడేల సఖుడ,
అంత అత్యంతధీర కాసట్లు మిగుల
దిగులుతో విన్నవోయిన వగను దోచు?

ఏఁవి టంటున్నావు? 'నష్టపోయినసొమ్ము ఎవడికి దొరికింది; ఆచార్యమూలదేవుడు నీకు తెలుసు కదా' అనా? ఆ దేవదత్త పొందులో చిక్కుకున్న తనకు కూడా హృదయం నీశిష్యురాలు విపుల మీదకి పోయింది. అవునా? ఏవిటంటావు? అది కూడా అతని మోసఁవేనంటావా? సరేలే, ప్రణయకోపం తీర్చడానికి అతని దగ్గరికి పోయిన నీశిష్యురాలు విపులని మందలింపక పోయిన నీపెద్దమనిషితరహా నేఁ వనాలో!

వాన, బురద, చేరి వరదయౌ నది శుభ్ర
పరచుటకు శరత్తు వచ్చునెట్లు?
విసరునట్లు కాదె వెర్రిగా నడిచలి
వేళ వ్యగ్రముగను విసనకర్ర?

ఏఁవిటంటావు? అదెలాగనా? మిత్రమా—విను. మొన్ననే కదోయి నాతో కలిసి కర్ణిపుత్రుడు విపులను అనునయించ

దానికి వెళ్ళాడు? అప్పుడు తను గుమ్మం ఇవతల నిలబడిపోయి దానికోసం అంచనా వెయ్యడానికి నన్ను పంపించాడు. అప్పుడు నేను ఆమెని చేరి ప్రియవచనాలతో ఒక ఉపన్యాసం దంచాను. ఆమె అసూయవల్ల అందగించిన చూపులతో ‘ఎందుకీ ప్రయాస’ అంటూ ముఖం అవతలికి తిప్పు కుంది, నేను నవ్వుతాలుగా ఇలా అన్నాను:

(గేయం) ‘నీతో యెవ రేమన్నారో నీ ప్రత్యుత్తర మెవరిమాటకో—
అది స్మరించి వెన్నెల లొలుకవె నీవదనచంద్రుద్వారా కలికీ!
ప్రసన్నురాలగు నిన్ను చూడ నా ప్రణయ మ్మతివేలమ్మగునే
క్రుద్ధభుజంగిని నీదు భ్రుకుటి నా గుండియ గగ్గోలు
పరచునే!’

—ఆ తరువాత ఆ అవంతిసుందరితో ఆమెసఖి ఇలాఅంది:

(గేయం) కనుబొమ్మ లలలౌచు కదలాడు నెందుకో
కందు రోషాన ముఖ మెందుకో!
పెదవి వేడెక్కు నిట్టూర్పుతో ప్రియసఖుడు
పజ్జ చేరిన కూడ పలుకాడ వెందుకో!
కలికి ప్రోడతనంపు గరువమ్ముతో నేల
శత్రుత్వము వహింతు సౌభాగ్యమునమించి!
మానవే కోపమ్ము మానినీ సర్వమ్ము
హెచ్చులాగిన తంతి యెరుగవే తెగు నంచు!

అటుపైని కర్ణిపుత్రుడు కూడా అక్కడికి చేరుకోడంతో ఆ సమావేశం సార్థకం అయింది. అప్పుడు సానునయంగా కాళ్ళ మీద పడిన కర్ణిపుత్రుడు గడగడలాడేట్లుగా ఆమె యిలా అంది:

(గేయం) ఆడిజగడము, వచ్చినాడవీడకు, నిన్ను
తరిమివేయుటె మిగుల తగు నామెకు!
మే మెంతసేపు నీకు విరామ సమయాల
మెరమెచ్చు మాటల వినోదమునకె!
ఆశ, కుతుక మ్మణగి, ఆకులవొమ్మ మన
స్వల్లకల్లోలపరుపంగ దగునా?
ఇంత యేద్దైన చేదగుమందు సేవింప
ఈడ సుస్వాగత మ్మియనగునా?

ఏమంటావు? ‘అటయితే మరి దాని పొగరుకు తగ్గట్టు చివాట్లు పెట్టాలి-వెడతా’నంటావా? నీ యిష్టం. అది చెప్పినట్లు వినాలని దీవిస్తున్నా! నేనింక బయలుదేరతాను. (పరిక్రమించి) చచ్చాంరా దేవుడా! మళ్ళీ మనం పోయేపనికి విఘ్నం వచ్చేట్టుందే!

ఇదుగో— వీడు పాణిని తమ్ముడూ నాగజాతివాడూ అయిన దత్తకలశి నామధేయుడైన వైయాకరణి నా యెదుట పడ్డాడు. వీడి వ్యాకరణ శబ్దాల వలలో నుంచి ఏ చిక్కూ లేకుండా బయటపడాలి. ఏదో తొందరలో ఉన్నట్టున్నాడు. వాదంలో చావు దెబ్బ తినడమే వీడికి తగ్గ శాస్తి. ఏమంటే వాదపుకండూతి గల వీడి వాక్కు ఏమాత్రం తట్టినా కోవెల ఘంటలాగ మోగుతుంది. గణికాప్రియుడు ఈ ఆసామి. వీడు నూపురసేన కూతురు రశనావతికను పిలుస్తున్నాడు. పాపం! ఏనుగు గున్న నోట చిక్కిన వీణ అనిపిస్తుంది నాకు ఆ కోమలంగా ఉండే రశనావతికను చూస్తే! ఆఁ. ఇదిగో— గట్టిగా ఏదో నాతో అనబోతున్నాడు... ఏమిటన్నావ్— (అపి సుఖ మశయిష్ఠాః) ‘సుఖంగా పండుకొంటివా’’ అనా?— వ్యాకరణ పాండిత్యం వెలగబెడుతున్నాడు— ఏంగతి?— సరే కానీ, నేను తిన్నంతా పెట్టాలి వీడికి! స్వాగతం అక్షరాలబందెలదొడ్డికి! మిత్రమా దత్తకలశి! తొందరలో ఉన్నట్టున్నావు. ఏదో కుశలమే అనుకో. ఏమిటి అంటున్నావు? ‘బలిభుక్కులయిన కాకులచేత సంఘాతబలివలె— కాతంత్ర వ్యాకరణ పండితులతోటి వివాదంలో దెబ్బ తిన్నవాణ్ణి నేను’ అనా! పాపం, కాకీ గుడ్లగూబల సంవాదం అయిందన్నమాట. మిత్రమా చూస్తే నీ రెక్కలేమీ దెబ్బ తిన్నట్లు లేనందుకు సంతోషం! ఏమిటంటావ్?— ‘‘ఇప్పుడు నాకు వైయాకరణ కులటాపుత్రులైన కాతంత్రికులపై కక్ష యేమిటో’’ అంటావా! నువ్విలాగే ఉండు, నే వెడతాను— ఏమంటావు? ‘‘ఆగు అక్కడ— ఎక్కడికోయి — నీ సంచివీర్స?— ఏం దుర్దూషువై పోతావా? (అంటే ‘‘ఎక్కడికి వెడదామని నీ ఉద్దేశం? ఏం పారిపోదామని చూస్తున్నావా?’’) అనా!— పుత్రోయి— నన్ను రక్షించు. ఈ కాష్ఠ ప్రహార నిష్ఠుర వాక్కుల పిడుగులతో నన్ను చంపడం తగదు నీకు! వ్యావహారిక భాషలో మాటాడు నాయనా! చెవుల్లో పడినంతనే విషమయి పోయి ఏనుగులు కూడా మింగడానికి వీలులేని నీ వైయాకరణ వాక్పిండాలపాలు చెయ్యకు నన్ను. ఏమిటీ?— ‘‘అనేక వాచాల వృషభాలను చిత్తు చేసి సముపార్జించిన అనేక ధాతు శతఘ్నియైన ఈ వాక్శక్తిని విడిచిపెట్టి, మాధుర్య కోమలమైన స్త్రీ శరీరంలాగా ఎలా చెయ్యను’’— అంటావా? ఎంత దిక్కుమాలిన వాడి వయావు?

‘‘స్త్రైణాలాపమునన్ వరప్రణయినీ
సమ్మోహనంబందు కా
ర్యారంభంబుల యందు, ప్రాకృత జన
వ్యాహారమందెన్నడే (న్)
స్వారస్యశ్రుతిసౌఖ్యఘాతుకములౌ
శబ్దాక్షరాల్ గూర్చుచో
హారంబౌ ప్రసవాలు జుట్టుముడి ము
ళ్లు గుచ్చు చందంబగున్’’

ఏమిటంటావ్— ‘‘ఆ సానికూతురుందే, దాని మీద నా శబ్ద కుఠారాలు ప్రయోగించేసరికి దానికి వల్లమాలిన కోసం వచ్చిం’’దంటావా! ఎవతె ఆ సానికూతురు?— ‘‘ప్రియురాలి పేరు ఎవడు చెపుతా’’ డంటావా! (ఆలోచించి) ఆఁ. తెలిసిందిలే. రశనావతిక కాదూ! ఎంత కష్టం! మామిడి చెట్లలో తిరిగే కోకిల మోటయిన మారేడు చెట్టు నాశ్రయించిందంటే కష్టం కాదూ? నవ్వుకోడాని కింతకంటె పరిహాస విషయం ఉంటుందా? నవ్వుకుందాం.

మిత్రవరా దత్తకలశీ! స్వభావం చేత దక్షిణ నాయకుడివైన నీకు ఈ కామినీవిరక్తి యెలా కలిగిందో వినాలనుంది నాకు. కాస్త విపులంగా చెపుతావూ?—ఏమన్నావూ? "పర్వదినం నాటి తెల్లవారుఝామున హవిస్సులను వ్రేలుస్తున్న నా దగ్గరకు ఆ సానికూతురు సాభిప్రాయంగా చేరుకుని హవిస్సుల కమ్మదనం వాసన చూస్తున్నదానిలా పక్కనే కూర్చుంది. అప్పుడు నేను దానితో అన్నాను గద. 'వోసి కులం తక్కువదానా, హవిస్సులను వ్రేలుస్తున్న నన్ను ముట్టుకోకుమా'' అని.

బలే, ఇదే కాబోలు దుష గాంధర్వం అంటే! కామినీ సంపరిగ్రహణం చాలా సుకుమార కార్యం లే. ఈ కలహం కూడా ప్రయోజనకారే. తెలివి తక్కువవాడా, నిన్ను కామించి వచ్చిన ఆడదానికి విరక్తి పుట్టించడమా? కష్ట శబ్ద నిష్కురాలలా, వ్యాకరణవిస్ఫురింగాలలా అయిన నీ మాటలతో ఆడవాళ్లు పారెత్తిపోతారు. నువ్విదివరకు ఇది వినలేదా?—

"పొత్తు కోరిన సుకుమార చిత్త, తీయ
నగు నుడుల లాలనీయయౌ మగువ చెవుల
నింపు నేకాంతమున పల్కు నిష్ఠురవల
కొరవితో రక్తి వీణ మీటు రసికుండు!

రచనావతిక ఎప్పుడూ అసాధ్యమైన పనులే చేస్తూంటుంది. అది వీణ్ణి భక్తుణ్ణి చేసుకుందా సరి, లేదా దాని కర్మ!! ఆ! మిత్రవరా దత్తకలశీ! చెవుల తుప్పు వదిలించేశావ్!— నీకు శుభం! నేను పోతాను. (పరిక్రమించి)

ఇడుగో ఇక్కడ మరో ఆడివి మాలోకం దాపరించాడు. వీడు ధర్మాసనికుడి కొడుకు; పేరు పవిత్రకుడూ, చేసేవి చాటుగా దొంగి తిరుగుళ్లు! రాజమార్గాన్న పోయే యెరుగున్న వాళ్ల కంట పడకుండా ఉండడానికి కాబోలు తడి బట్టలు కట్టుకుని, అవయవాలన్నీ ముడుచుకుని, రెండు వేళ్ళతో ముకుపుటాలను మూసుకుని, నాలుగు దారుల కూడలిలో శివాలయపు అరుగుమీద కూచున్నాడు. వీడి తపస్సు చూస్తే నవ్వొస్తోంది. ఏమంటే మత్తకాశిని కూతురు వారుణిక అనే బంధకి బాహుబంధాలలో చిక్కాడని విన్నాను. అందుకే కాబోలు వీడిప్పుడు దిగులుగా ఉన్నాడు. కుండ పగల గొట్టినట్లు వీడి నడతి బట్టబయలు చెయ్యాలి.

ఏమోయ్ పవిత్రకా, ఏమిటలా ఉక్క నేలపై తాబేలులాగా తిష్టవేశావ్! ఏమంటావ్? 'రాజమార్గంలో సులువుగా గుర్తుపట్టే వాళ్లని తప్పించుకోడానికి''— అంటావా? అయితే పాపం, గుర్తు పట్టలేని వాళ్లని మాత్రమే తప్పించుకుంటున్నావనుకుంటాను. వారుణీ జఘన పాత్రమైన గంగాతీర్థంలాగ పరమ పవిత్రమైన వాడవు కదోయి?

ఏమిటీ?— "అదేం కాదనా?" గొల్లపేటలోనటోయ్ పెరుగమ్మడం? దొంగల మధ్యనే దొంగతనమా? ఏమంటావూ? 'క్షమించు బాబూ, నీ వేగుల వాళ్ళు బలే నేర్పరు'లంటావా! ఎవరి వేగుల వాళ్ళు? వేగుల వాళ్లెక్కడ? సూర్యుడు చీకట్లోచొచ్చుకు పోవడానికి దీపంతో పనేమిటోయ్? నాకు వేగుల వాళ్లతో పనిలేదు. ఇటువంటి వ్యవహారాలలో నేను సహస్ర చక్షువునే! కనక, నీ కపటప్రచారకంచుకం తీసి అవతలపారెయ్. ఆకారానికి పెద్ద మనిషి, చేసేదంతా అనాచారం! ఏమోయ్ సజ్జనసహపాఠీ! విటవృత్తి పేరుతో పిశాచంలా ఇతరుల్ని హింసించడమూ— వేశ్యాసంగమూ ఇవి విరుద్ధాచారాలుగానూ నిషిద్ధ వస్తుభోజనంగానూ అనిపిస్తాయి నాకు. పరహింసకి అలవాటు పడిపోయి, పట్టుకారుతో విరజాజి పూలు కోస్తున్నావు. ఏమిటంటావు? "విభ్రమాల కన్ని విధాలా దూరంగా ఉంటున్నా" నంటావా? పేరుకి ఉపవాసమూ, చాటున తినేది పాయసమూ అన్నట్టు ఎవడోయి ఇవన్నీ పాటించేది? ఆ — ఏమిటీ? "నీ కిష్టమైతే నన్ను నీ శిష్యుడుగా తయారు చేసుకో" అనా! సంతోషం., అలా దారిలోకి రా! విటత్వం స్వీకరించడానికే నిశ్చయించుకుంటే, వేశ్యాస్త్రీని ప్రణయంతో బాధించడం అనే అబద్ధపు ముసుగు చించిపారెయ్! విట శబ్దానికి గొంతెత్తి జయం పలుకు!

ఏమిటీ— 'ప్రణామాలా?' ఇయ్యవలసిందేదో ఇయ్యడం అయింది. ఇంక స్వేచ్ఛగా ఏ నిర్బంధమూ లేకుండా మసులుకో. ఇప్పు డిదిగో నీ కాశీర్వాదం!

'జోడు వసనమ్ము పైకెత్తి యొడలు కప్ప;
సడల మొలనూలు; విడకోక ముడి జడిమను
బడయకేల్; దాచు రొమ్ముల నడిమిలోయ,
వళుల యెడమున గల నాభిదళము, రెండు
చేతులను జాపి; సిగ్గున చేష్టలుడుగు;
వద్దు వద్దోయి వదు లంచు వనరు వనిత
శయ్య జేర్చి సుఖోదిత సస్య భాగ్య
మందగదవోయి నిర్భరానందసిద్ధి!'

ఏమిటంటావ్— 'నా వెర్రి కుదిరింది; ఇది నా మందికే' — అనా? అయితే యిప్పుడు ఆచార్యుడు కోరే దక్షిణ కూడా ఇదే! ఆ? 'ఇదిగో అంజలి' అంటావా? అదన్నిసార్లు వెచ్చపెడితే యెలా? సరే లే. ఇప్పటికి శిష్యులు సిద్ధం ఆయారు మాకు. నువ్విప్పుడు ఆచార్యుడివే కాని శిష్యుడివి కావు. సగర్వంగా, నిరాటంకంగా నీ యిష్టం వచ్చినట్లల్లా తిరుగు. నే వెడతాను.

హాయి హాయి, పువ్వు లంగడిలోగిటిలో నుంచి వెలువడుతూ, రకరకాల సువాసనలు మేళవించి, వసంత మధ్యాహ్న స్వేదావతారమైన నన్ను తాకి, స్వాగతం చెపుతున్న విపణి వాయువు ద్వారా పుష్ప వీధి చేరుకున్నా నన్నమాట. నానా కుసుమ సముదాయం అంగప్రత్యంగములుగా రూపుదాల్చిన వసంత వధువులాగ ఉంది ఈ పుష్పవీధి.

(గేయం) విరిసిన తామర సిరిగల మోము,
విరజాజి మొగ్గలే పలువరుస,
కలువలే కన్నులు!
ఎర్రమదిపూ వదరు వాతెర,

తుమ్మెద రొద పలుకు తేనె తేట,
విరిచెండ్లు రొమ్ములు!
సిగముట్లు దండలే నగలు,
పేర్చిన ప్రసవాలే వసనాలు,
మాలలు మేఖలలు!
ఈ రీతిగ పూవులతో అమరిన
నారీ రూపు ధరియించు సుమవిపణి
వసంతుని రాణియే!

ఈ రకరకాల కుసుమపరిమళాలకు లొంగిపోయిన హృదయంతో నేను చూసి చూసి ఈ పుష్ప వీధిని దాటిపోలేక పోతున్నాను కాబోలు! (పరిక్రమించి)

ఇదిగో మరొక పరిహాస వస్తువు. వీడిపేరు మృదంగ వాసులకుడు — వీడు పురాణ నాటకాలలో విటుడు. 'భావ జరద్గవుడు' (అంటే ముసలి ఆబోతుబావ) అని గణికాజనం ద్వారా బిరుదు పొందినవాడు; సుకుమార గాయకుడైన ఆర్య నాగదత్తుడి ఇంట్లోంచి బైలు దేరాడు. తలంటుకోసం నూనె రాచుకుని వణుకుతున్న వీడు చింకిపాత చుట్ట బెట్టుకున్నాడు.

ఈ ఆసామికి 'సర్వసఖు'డనే బిరుదు కూడాను. పలకరించకుండా వీడిని దాటి పోడానికి వీలులేదు. వీణ్ణి ఎగతాళి చెయ్యాలి. ఏం బావ, జరద్గవా, ముసలితనం బాగా పంట పండుతోంది గదా.... ఏమిటన్నావ్? 'ముదిసిన పాములాగ ముసలి తనపు కుబుసం వదల గొట్టు కుంటున్నాను' — అనా? ప్రాణాలతోసహా యేమో, అని పిస్తోంది నాకు. ఏ మయినా, బావది కొత్త యౌవనంలే! ఏ మాయచేతోగాని యౌవనకాయకల్పం సిద్ధించింది నీకు! ఎలాగంటే —

వర్ణలేప ప్రభూతయౌవ్వన వికాస
వస్తుసంఛన్న కృతకము మస్తకమ్ము,
గొరగని కపోల పాళిని, కొరుకుడువడి
తరుగు నోష్ఠమ్ము మీదను, నెరయు మోము
కలిగి నీ దేహ మీ స్నాన కళ వెలుంగు
వెల్లచే ప్రాతయిల్లు శోభిల్లునటులు!

ఏమిటీ అంటున్నావు? 'పాతకల్లు బాగా నూరాలి' అనా? అదీ బావగారి మనోరథం! సర్వధా — త్రిఫలగోక్షుర లోహచూర్ణ సమృద్ధి రస్తు! నే వెడతాను. (పరిక్రమించి)

అరే- వీడెవడు? అనుకోకుండా నేను కనబడ్డానని, ద్యూతగృహందేవిడీముందు వంగి, రాతి స్తంభం వెనకాల నక్కాడు. (చూసి) సరే — తెలిసింది; వీడు శైషిలకుడు. నా కంట బడకుండా ఉండడంలో వీడి ఉద్దేశ్య మేమిటో! మాలతిక చెలికత్తెను తాను పట్టుకున్నందుకు ఇదవుతున్నాడా? ఐతేకానీ! ఎగతాళి చేసి వీడిలోతు కనుక్కోవాలి.

ఏమోయ్ బ్రాహ్మణబ్బాయి! వెన్నెల్ని తప్పించుకుని గొడుగులో తలదాచుకున్నట్లు స్నేహితుణ్ణి తప్పించుకుని స్తంభం చాటున చేరా వెందుకు? — బయటపడి నవ్వుతున్నాడు— ఏమిటంటావ్? 'సుహృత్కర్ణధారికి స్వాగతం' అనా? ఎక్కడి కర్ణధారిత్వమోయ్- నీ ద్వంద్వ సాహసాల నుంచి నన్ను బహిష్కృతుణ్ణి చేశాక? ఏమంటావ్? 'అలా కాదు' అనా? ఎంగిలి మెతుకుల వేట వద్దొద్దు సుమా! శైషిలకుడి యింట్లో శాక్య భిక్షుకి యెలా తిష్ఠ వేసిందో అంతా తెలిసిపోయిందిలే. నీ మీద మరులుగొన్న పూలదండలల్లేవాడి కూతురు మాలతిక దాన్నే కాదూ దౌత్యానికి పంపింది? దానికి కూడా అప్పటికి నువ్వు రుచి చూడని రూప యవ్వన లావణ్యాలు గల కమ్మని మాంసం కుతి దీరడానికి నువ్వే కావలసి వచ్చావు-ఏమంత లాభసాటి కాదా? ఏమిటంటావ్? 'అందని కోరికలు పొందేలోగా అందిన సుఖాలను త్యాగం చెయ్యడం ఏమంత పురుష లక్షణం కాదు; నిప్పు వెదకడానికి దీపం కావాలా?' అనా? బలే బాగాచేశావ్. ఇది కొంచెం వివరంగా చెప్పకపోతే ఈ రహస్యం కాస్తా బట్ట బయలవుతుంది. ఇప్పుడే వివరంగా చెప్పాలి. ఏమిటన్నావు?

'తన అనాచారాన్ని ఎవడు బట్టబయలు చేసుకుంటాడు! క్లుప్తంగా విను మరి. నన్ను చటాలున పట్టుకుని అదే ఇలా అంది.

'నేల విడిచి యెగురు నీ స్వభావమ్ముచే
శఠుడ మోసగింప జాలు దీవు;
మాన్యమైన బ్రదుకు మాది, దూతికనోయి,
స్థిరత లేనివాడ తెగువ వలదు;
చుట్ట బెట్టునొప్పి; చొచ్చితి విజనమౌ
చోటు; వద్దు; కరుణ చూడుమోయి,
ప్రియుడ వదలు మోయి, వేరెవ్వరో అదే
వచ్చువారు లోన చొచ్చువారు!'— అని'

బలే! మృదంగం లేకుండా భామకలాపం! ఇలాంటి సంధిచ్ఛేదాలను పురస్కరించుకునే వాసిష్ఠీపుత్రుడు విటశబ్ద లక్షణాన్ని స్థిరంగా నిర్ణయించాడు. మిత్రమా, నీ సౌభాగ్యం వర్ధిల్లుగాక, నే వెడతాను. (పరిక్రమించి) — ఓహో! సర్వాతిథి సన్నివేశ స్థలమైన వేశ్యాగృహం సమీపించాను.— ఇది -

పంచశరు నిల్లు, జూదరి పాఠశాల,
మాయలకు నిక్క, వంచనామయుల చక్కి,
ద్రవ్యహీనులకిట స్వాగతము హుళక్కి,
వెతలు కూడ రమ్యమయేటి వేశ్య గృహము!

(ముందుకు సాగి)— వీ డెవడో మాసిన దుప్పటి ముసుగులో సర్వాంగాలూ ముడుచుకుని వేశ్యాగృహంలో నుంచి త్వర త్వరగా నిష్క్రమిస్తున్నాడు. అరే, తొందరలో ముసుగుచాటు నుంచి కాషాయపు కొంగు బైటపడింది. ఆ. వాడే. ధర్మారణ్యంలో ఉండే సంఘిలకుడు అనేదొంగ సన్యాసి. ఛ్చ. ఛ్చ. ఇటువంటి అర్థంలేని బోడిగుండ్ల దొంగ సన్యాసులచేత మైలపడిపోతున్న 'బుద్ధ ధర్మాని కెటువంటి దుర్గతి పట్టిందో! కాకుల యెంగిలికి తీర్థ జలం మైలపడటం లేదూ? అలాగే! ఊఁ. వీడు నన్ను చూసి కూడా ముసుగు ముఖంపైకి లాక్కుని చక్కా పోతున్నాడు. సరే— నా వాగ్బాణాలు తగులకుండా ఎలా వెడతాడు? — చెప్పు

తాను! (పాత్రను ఉద్దేశించి) ఏహోయ్ విహార భేతాళ! పగటికి ఇంకే గుడ్లగూబలా ఇప్పుడు పోతున్నా వెక్కడికి? ఏ వంటావు? 'ఇప్పుడే విహారం నుంచి వస్తున్నా'ననా? భదంతుల వారి విహార శీలం భూతకాలానికి చెందిందని మాకు తెలుసులే. వేశ్యా వాటిక లోని దిగుడు బావి దగ్గిర ఇప్పుడే వాలిన కొంగలాగ దొంగ అడుగులువేస్తూ పోతావేం? ఏదో చీకటితప్పు చేసి చెంబ్యు కడుక్కోడం కాదుగదా?

ఏఁ వన్నావు? 'తల్లి పోయి యేడుస్తున్న సంఘదాసిని బుద్ధవచనాలతో ఊరడిద్దామని' వచ్చానంటావా? మదన భ్రమ చేత శుద్ధాచమనం లాగ నీ వల్ల బుద్ధ వచనం భ్రష్టం అయింది. ఎంత కష్టం!

కాంక్షచేగాని యాదృచ్ఛికముగగాని
వేశ్యయిలుసొచ్చు సౌగత భిక్షుకుండు
జైన సూత్రాల నోంకార శబ్దము ఎలె
విఫలుడే గాని సుంతైన వెలుగబోడు!

ఏఁవిటన్నావు? 'క్షమించు బాబు, సకల జీవులయందూ ప్రసన్న చిత్తంతో వుండాలికదా మరి'అనా! ఆ! ఆ! తగినట్లుగానే నిత్యప్రసన్నుడైన భదంతుడికి అనగా నీకు తృష్ణావిచ్ఛిత్తి ద్వారా పరినిర్వాణం లభిస్తుంది...వీడు చేతులుజోడిస్తున్నాడు··· ఏఁవిటంటావ్? 'మంచిది, దాన్ని వదిలిపెడతా'ననా! సరే వృథా శ్రమెందుకు గాని, నీకు మోక్షం ఏనాడూ దుర్లభమే. ఏఁవిటీ? 'వెడతా న్నేను, అకాలభోజనం కూడా మానుకోవలసి వస్తుం'దనా! హి, హి, అంతా ముందే అయింది. ఈఅవ శిష్టమే పంచశిక్షాపరుడైన భిక్షువుగారి కాలభోజనాన్ని దాట బెడుతోంది. నాశనమయిపో నాకేం! వ్యర్థంగా తల గొరిగించు కున్న వాడికి పై తిరుగుళ్ల వల్ల సిగ్గేఁవిటి? సాక్షాత్ బుద్ధుడవు! చెడ్డావుపో—......ఇప్పుఁడీ చెడిపోయిన శాక్య భిక్షువుదర్శనంవల్ల మైలపడ్డ కళ్ళు కడుక్కోవాలి.

(పరిక్రమించి).

బలేబలే! దీన్ని చూడడానికి విటజనులకళ్లు పుణ్యం చేసుకున్నాయని చెప్పాలి. ఇదిగో వసంతవతి కూతురు వన రాణి—అందానికి అచ్చంగా వనరాణే! ఒంటినిండా పూలతో ముస్తాబయి, పూజాసామగ్రితో కామునిగుడిలోనుంచి దిగు తోంది. శ్రద్ధగా పుష్పాలంకరణ చేసుకు దిగడంచూస్తే ఇది ప్రియుణ్ణి కలుసుకోడానికి వెడుతోందనుకుంటాను. దీనికి ఇచ్చకాలతో ఎదురుకో లిస్తాను. (పాత్రనుద్దేశించి) పిల్లా వనరాణి! వసంతకుసుమాలంకరణ చేసుకున్న నీకు అతిథిలోపం ఉండదులే. ! ఏఁవిటి నువ్వంటావ్? 'అయ్యవారికి స్వాగతం, చేమోడ్పు' అనా! దాక్షిణ్య పల్లవుణ్ణి అనుగ్రహించావన్న మాట! మరి అయితే, ఇప్పుడే వచ్చిన వసంతఋతువు నీవంటిపైని కొలువు తీర్చినట్లుంది. 'ఏఁవిటి? ఎలా'గనా! విను:

(గేయం) 'కుంద కురవకము లందందు గురువిందలును,
పొందించి జడపాయలందు,
అందముగ ధమ్మిల్లమం దశోకము, సిందువార
హార మురమ్మునందు,
మొనదేరు మావిమొగ్గలను కదలాడుకెంజివ్వురు
లను చెరివి చెవులందు,
నిండుదోసిట పూలదండతో సుందరీ
నిలుతు వామనిగ నాముందు!'

ఏఁవిటన్నావ్ ? 'ఇదిగో బహుమాన'మనా! సరి. నువ్వి చ్చేది నీ వంటిమీదనే ఉండనీ, సమయం వచ్చినప్పుడు తీసుకుందాం. నీకు సుఖమౌగాక — వెడుతున్నాను.

ఓహో! ఇది శ్రీహరమ్యుడి ప్రియురాలు తాంబూలసేన యిల్లు. వాడు ఎప్పుడూ దాని పక్కనే తిష్టవేస్తాడు. లోపలికి వెడదామా? (ఆలోచించి) పలకరించకుండా వెళ్లలేనే! లోపలికి వెడతాను. (వెళ్లి) ఎవరైనా ఉన్నారా లోపల? —నేనూ శశుణ్ణి. ఈ యింటి నేస్తాన్ని. అరే అదిగో తాంబూలసేన—నన్ను మర్యాద చెయ్యడానికే కాబోలు త్వరత్వరగా అంగలు వేసు కుంటూ తొందరలో జారే పైట సర్దుకుంటూ పెద్దగుమ్మం దాటివస్తోంది. అంత పెద్ద మర్యాదెందుకో! కాదుకాదు—నేను లోపలికి రావడం ఇష్టంలేక బైటినుంచే మర్యాదచేసి పంపేద్దా మని ఇవతలికి వస్తోంది. ఆ వచ్చే తీరు చూస్తే ప్రణయ కలాపంలోనుంచి అప్పుడే బయటపడ్డట్టు తోస్తుంది. ఈ శ్రీహరమ్యుడు పట్టపగటి ప్రణయ కళాపట్టభద్రుడు. కానీ. దీ న్నేడిపించాలి. ఏం తాంబూలసేన! ఏకంగా అంత దయ చూపించేస్తున్నావ్. ఏఁవిటి? ప్రణయకలాపపు సందిటిలోనుంచి బయటపడ్డ ఆయాసంతోనా 'స్వాగతం ప్రియవ్యాయ స్యుడికి' అంటున్నావు? విసుగు లేకుండా ఉంటే విసనకర్ర తీసుకురా! వ్యాయామం వల్ల అలిసినట్లు కనబడుతున్నావు! పిల్లా కుశలమేనా? ఏవంటావు? 'ఏం చిక్కిపోలేదు లేండి.' అనా? అదిగో ప్రియజన పరిష్వంగంలో కట్టుబడి కరిగిపోయిన వక్షస్థలం! నిష్కర్షగా అడుగుతాను. మావాడు శ్రీహరమ్యుడి నిరం తర నిశావిహారాలతో తనివితీరకనా పగలు కూడా వాడిని, విశ్రాంతి తీసుకోనియ్యవు? పొద్దుటా సాయంత్రమూ హోమాలు సాగుతున్నట్లేనా? ఏఁవిటంటావు? 'అదేం లేద్దు పోదురూ! ఎప్పుడూ ఎదటివాళ్ళని ఎగతాళి చెయ్యడమే బావ గారి పని' అనా! ఓసి అతితెలివిదానా—వినలేదా – అకారంపైని వేసిన ముసుగుకూడా ఆ ఆకారాన్నే ధరిస్తుందని? 'ఎలాగో చెప్పం'డంటావా! విను, కథలో తేడా ఉంటుందనుకోను — ఎలాగంటే,

తునియలై రాలు పత్రలేఖనపు ననలు,
కరగి తరిగెడు తిలకమ్ము కాటుకయును
చెవులలోలకులం జిక్కు చెంపకురులు
కందు పెదవులు, అలసిన కనులుచూడ,
ఇంతి పగటికాలక్షేప మెవ రెరుగరు?

ఏఁవంటావు? 'ఇప్పుడే నిద్రపోయి లేచాను. ఇంకా యేమేమి ఊహించుకుంటున్నారు బావగా'రనా? సరే! జ్ఞాపకం

వచ్చింది. ఇందులో తెలిసిపోకుండా ఊహించుకోవలసింది కొంచెమైనా ఉంటేగా? ఏమంటే?

ఎట్టి తీయని కల ప్రసాదించె నీకు
కాయ మందిట్టి దంతనఖక్షతాల?
ప్రీతు లగుదురు స్వర్గస్థ పితరులైన
వెలది, అపసవ్యముగ పైటవేయు కతన!
ఎట్టితొందరలోనొ గుర్తింప డెట్టి
మూఢు డాశిల్పి నీపాదములను రెంట
నెడమకాలి పాదుకలనే తొడగజేసె!

పిల్లా, పెనిమిటితో సహా దొరికిపోయావ్, ఎక్కడికి పోగల వింక? అరే, (విని) ఇది లోపలికిపోయి మొగుడితో పగలబడి నవ్వుతోంది. (చెవి అటుపెట్టి) అడుగో శ్రీహారమ్యు డేదో అంటున్నాడు. 'ఏమోయ్, ధూర్తాచార్య, లోపలికిరావచ్చు' అని! అబ్బాయి, నడుస్తున్న కామరథంకాడికోడగాడతాడా యెవడైనా? ఇదేవిధంగా అవిరతకామోత్సవోస్తు! గార్గి గారబ్బాయి, వెళ్లొస్తాను. (పరిక్రమించి)

ఆఁ? వీధి గుమ్మంముందు నిలబడి ఎవరుచెప్మా దేవతలకు ఉపాహారా లిస్తోం దీవిడ?

బరువగుమోము, వంతవసి
వాడెడు, కాటుకలేని కళ్ళు,దు
మ్మురలెడు కట్టుచీర, పెన
యున్చమురంటనికేశపాశమున్,
అరచెయివైపు జారు వల
యాల్, పువులెండిన దండతోరమున్
తరుణ వియోగినీ తపన తన్వి
తనుత్వముపెంచు తద్దయున్!

ఓ ! ఈవిడ ఆ భాండీరసేన కూతురు కుముద్వతి! పాపం! ఈమె తపస్సులో పడిపోయి, పోల్చడానికి వీల్లేకుండా మారిపోయింది. లేకపోతే, వేశ్యవాటికకి విరుద్ధమైన వియోగినీ వ్రతం మరెవత్తెకి సాగుతుంది.? ఆఁ తెలిసింది. ఈమెకి మౌర్య కుమారుడైన చంద్రోదయుడిపై ప్రేమ అని విన్నాను. ఆ బుద్ధిశాలి సామంతుల్ని దండించే ప్రయత్నంలో ఉన్నాడు. పాపం! సరిగ్గా సరిపోయింది. చంద్రోదయ విరహంవల్ల కుముద్వతి శోభ తగ్గిపోయింది. కులవధువు లీమె దగ్గర ఎంతైనా నేర్చుకోవాలి. ఆమేడ చాందినీ మదురుపై నిలబడి రాలే బలిపిండాలవైపు అపేక్షగా చూస్తున్న కాకిని ఆవిడ సాదరంగా పిలుస్తూ అంటోంది!

'మేడ చాందిని మదురుపై మెడను చాచి
నిలిచి శ్రద్ధగా ఉపహారముల భుజించు
అతిథివర! కాకమా! భద్ర మగును గాక!
ఇందు నే జీవము భరించి కుందుచుండ
అరిగె నాప్రియు డెటకొ నిత్యప్రవాసి—
తా దిరిగి వచ్చువరకును తదితరమగు
ద్వారతోరణమును చేర దగదటోయి!
ప్రియతముని గూడి శోకమ్ము వీడి నీకు
పెట్టగలనోయి తృప్తిగా పెరుగుబువ్వ!'

ఆహాహా! ఎంతకపటంలేని అనురాగం! రాజప్రేమకు పాత్రురాలైన ఈమెను అపహాస్యం చెయ్యడానికి కుదరదు. ఈవిడకు మహారాణి మేలిముసుగు సంప్రాప్తించునుగాక, నేనిలా కనబడకుండా తప్పించుకుపోతాను. (పరిక్రమించి)

ఏమిటీ—ఇప్పుడీ కుడివైపు తోటలో నగలసవ్వడికి బెదరిన పక్షుల కలకలంలాగ వినబడుతోంది. సరే, ఇదిగో! తోటద్వారం తెరుచుకుంది. చూస్తాను. (చూసి) హాయిహాయి! కన్నుల పండువుగా ఉందే! అదుగో పాంచాలదాసి కూతురు ప్రియంగుయష్టిక! తమ నితంబ సౌభాగ్యగర్వంతో యవ్వనం వచ్చిన రాకుమారుల నెందరినో వలలో వేసికోగల నానాహావభావ విలాసాలుగల సఖీజనంతో కలిసి ఈ ప్రియంగుయష్టిక కందుకకేళిలో మునిగి ఉంది. ఎలాగంటే—

ఆడు కెంజాయవ్రేళుల హస్తములను
యెఱ్ఱమణిశిలబంతి పైకెత్తు నాతి
తన చివురు కొనలతో గోయ తన విరులనె
ఎత్తరగు నీపలత వోలె ఎసక మెసగె!

ఈమె సందర్శనం వల్ల కలిగిన లాభం ఇంతాఅంతా కాదు. సరే, అసలే సంతుష్టులై ఉన్నవారికి అమృతంవల్ల ఎంత తృప్తి అని అడగడఁవేమిటి? ఇక ఆమెతో మాటాడతాను. (చేరుకుని)

పిల్లాఁ, ప్రియంగుయష్టికా, ఏమిటిలా కందుక క్రీడ పేరు చెప్పి, నీ చెలికత్తెల నృత్తకౌశలాన్ని ప్రదర్శిస్తున్నావే! ఎలా నిల్చున్న పాటున మాటకు జవాబు చెప్పి మరీ ఆడుతోందో! ఓహో, బంతి ఉత్పాతాలను పరిచారికలు లెక్కించడం బట్టి ఆమె చెలికత్తెలతో ఏదో పందెం వేసి ఆడుతోందనుకుంటాను. పందెం వేస్తే ఎంత రంజుగా ఉంటుందో ఆట! అదే పనిగా వంగడం, లేవడం, గిర్రున తిరగడం, ఎగిరి పడడం, ఇంకొకళ్ళున్నచో టాక్రమించడం, పరుగులెత్తడం— ఇలాటి చిత్రమైన కదలికలతో మనోహరమైన దృశ్యం మావంటివాళ్లకి యాదృచ్ఛికంగా లభిస్తుంది. అదంతా, యెందుకు? ఆ వాయువు చేష్ట లెలా ఉన్నాయి? ఆ సుడి తిరగడం, వెనక్కి మళ్లడం, పైకీ కిందకీ యెగిరెగిరి పడడం, పదేపదే వీచడం, లోపలికి చొరబడాలని బట్టల్ని ఎగరగొట్టడం ఇవన్నీ చూస్తే వాయువుకి కూడా వీళ్లంటే పిచ్చెక్కి వెంటబడ్డట్టు తోస్తుంది. వాయువయితే మహాబలుడు. అందుకే యౌవనం పీట వేసుకున్న పయోధరాల బరువు చేత సన్నబడిన ఆమె నడుమును పోల్చాలంటే, అది ఒక్క పిడికిట్లో చిక్కేదయినా స్వతహాగా దుర్బలుడి నయిన నాకు భయం! అయితే, ఆమెను చూస్తూ ఉపేక్షించి ఊరుకోలేను. చెపుతాను. ఏమోయ్, యౌవనోద్రేకంలో నీ సౌకుమార్యానికి విరుద్ధమైన పని చేస్తున్నావు. ఆపు ఆపు అంతటితో! అరే వీకే చెపుతూంట!

పాపం! ఆమె ఉత్సాహం ఎలా తగ్గిపోయిందో! ఇలా ఊరడిస్తాను:

(గేయం)

కుండబంతిలా యెగిరెగిరి పడే
కుండలాలుకలదానా
బలముగ వెలువడు బంతిపాటులో
వ్రెయెత్తు నెరజాణా,
విసరి పరచు కేల్దోయిదాన,
తూలిపడే కురుల విరులదానా
గిరగిర సుడితిరిగే వేగములో
కదలుమొలనూలు కలదానా,
ఉరుకు రొమ్ములకు జడిసి సన్నగిలు
నడుముదాన, క్షేమ మగుత నీకు!

ఈమె పూర్తిగా నూరుసార్లు కొట్టింది. పిల్లా, ప్రియంగుయష్టికా, సఖులపై విజయం సాధించినందుకు సంతోషంతో వర్థిల్లు! ఏమంటావ్? 'అయ్యగారికి స్వాగతం, శుభంగా వచ్చి నన్ను గెలిపించినందుకు—' అనా! పిల్లా, నీ దర్శనం వల్ల ఎంతో లాభం కలిగింది. మమ్మల్ని మరిచిపోకు, వెళ్ళొస్తాం. (పరిక్రమిస్తాడు)

ఇదిగో మరొక సుహృద్వినోదగృహం. ఇది చంద్రధరుడి ప్రియురాలైన శోణదాసి, నాగరికకూతురిల్లు. లోపలికి వెడతాను. పలకరించకుండా వెళ్ళడానికి వీల్లేదు. (చూసి) అరే, ఇదుగో శోణదాసి, ఏదో ఆలోచిస్తూ వీధి గుమ్మం మీదే కూచుంది. ఇది ఏంచెప్మా ఇప్పుడిలా నగలన్నీ తీసేసి శరీరలావణ్యం బోసిగా కనబడుతూ, మాసిన చీర సగం వంటిని మాత్రం చుట్టబెట్టుకుని, నుదుటి పైని రక్తచందనం పూసుకుని తలపైని తెల్లని గుడ్డ పట్టీతో, ముఖం దించుకుని, తొడపై ఉంచిన వీణ మీద వేతులతో కాస్త కాస్త మోగిస్తూ, కాకలీమంద్రమధురస్వరంతో కైశికాశ్రయ గీతి ఆలపిస్తూ కూచుంది. ఇది యెందుకో బెంగ పెట్టుకుని ఉండాలి. కైశికాశ్రయగానానికి పర్యాయపదం శోకగీతం! ఏమిటిది—చంద్రోదయం అయాక దీని దగ్గర ప్రణయ కలహం అన్నమాటే వినలేదే యెన్నడూ! ప్రియుడి రాక ఆగి పోవడంతో విరహతాపంలో పడి ఉంటుంది. సరే, ఎగతాళి చేస్తాను దీన్ని. పిల్లా, శోణదాసి, ఏమిటిది? వేశ్యాతపస్విని వేషం ధరించావు? చంద్రధరుడేమైనా అపరాధం చేశాడా? ఏమిటలా కన్నీళ్ళేనా జవాబు? కన్నీళ్ళాపుకో, అంతా చెప్పు. ఏమిటంటావు? 'పట్టుదలతో కోపంతో ఒక స్నేహితురాలే నాకు కష్టం కలిగించింది.' అనా? ఏమిటీ అందరి కంటే నీకు ఇష్టురాలైననేస్తం, నీకు, శోణదాసికే ఇబ్బంది కలిగించిందా? ఏమిటీ అంటావు? 'దాని దురాలోచన మూలాన్నే ఈ ఆపదను ఎదుర్కోవలసి వచ్చింది' అనా! ఎంత తెలివి తక్కువదానివి? ఇలా చెప్పలేకపోయావా?!

'చలికి గురితప్పె కాబోలు, క్షణముకూడ
కోప మోదూతి, సైపగానోప సుమ్ము!
ఇట్టి ఘోరమ్ము నాకు కల్గించి మదను
పోల్కినెట్టు లనార్యవై కుల్కెదిపుడు?
జాలి కరవైన నీ స్వాతిశయపు సందుల
కడరి వ్రీలు మేఖల హస్తమందుదాల్తు!'

అని చెప్పాలిసింది.

ఏమంటావు? 'ఇప్పుడా స్వాతిశయానికి మన్మథుడే ఓడిపోయాడు; ఆ సౌభాగ్యం పులుముకుని నీ స్నేహితుడే ఇప్పుడు స్తంభించాడనా? అయితే మరి యిప్పుడు అతని దగ్గరికి పరుగున పోవేల? సుందరి—చాల్చాలు నీ సిగ్గు;

(గేయం)

ఊర్చి తలవాల్చి ఊహల సంచరింతేల
పర్యాకులములాయె బాష్పలతో కనులు!
నగల తొడుగుల వీడినను సుందరీ నీవు
సహజ లావణ్యమున చక్కగా తోచెదవు;
ఏ పక్షమునకు చెందని యిచ్ఛకములతో
వలపించుకొననేల నిమిరి ప్రియతము కేల!
ముద్దరాలా వలపు ముమ్మరవమ్మె వేళ
మానావమానాల మాట తలపగనేల?

ఏమిటంటావు? 'స్త్రీకి పురుషుడు అనునయింప తగ్గవాడే. అయితే పౌరుషం ఇంతా అంతా కాదు' అనా? అలాకాదు. మంచి మనస్సు దానవు, గంగా సాగరానికి పోవడం లేదు గద. చాల్చాల్లే నీ సిగ్గు. లేదా నీ ఆశతో నువ్వుండు. నేను చంద్రధరుడినే దారికి తీసుకొస్తా. ఇన్ని మాటలెందుకు. మీ యెడబాటుచేత రగుల్కొన్న మదనాగ్నిహోత్రాన్ని నా సాయశక్తులా ఎగసన తోస్తాను. సరేనా!... ఆగకుండా వచ్చే కన్నీళ్ళలో ఆమె నవ్వెలా ఉందో! వర్షర్తు జ్యోత్స్నా దర్శనం అంటే ఇదే! అమ్మాయి, చాల్చాలు—ఏడవ్వద్దు. దగ్గరలోనే శుభం అవుతుంది. ఏమిటంటావు? 'బావగారి ప్రతిజ్ఞ నెరవేర్చుకోవాలి' అంటావా! పొద్దుటే తెలుసుకుంటావులే! కన్నీళ్ళు ఆగిపోయాయి కదా!..సరే, వెడతాను.

(పరిక్రమిస్తాడు)

ఓహో! ఇక్కడ మరో శృంగార ప్రకరణం సిద్ధంగా ఉంది. ఈమె నాగరిక కూతురు. మగధసుందరి అనే గణిక. శరచ్చంద్రికలాటి చల్లని ముఖం. నల్లగా మెత్తగా ఉంగరాలు చుట్టుకుని, పరిమళంతో మెరిసిపోయే కేశపాశంతో, విచ్చిన కలువ పూవుల్లా కదలాడే కనోయితో, పగడం కంటె యెర్రనైన పెదవుల సంపర్కం వల్ల లేత కెంజాయ విరజిమ్మే పలుకుదుర్లుతో, జాజి మొగ్గలలా తెల్లనై తిన్ననైన పలు వరుసతో, ఊరిన చెక్కిళ్ళతో, ఉరువైన పిరుదులతో, వీధి గుమ్మపు తలుపుని సగం ఆవరించిన శరీరంతో కుడిచేతి రెండు వేళ్లతో తెరకొంగు పట్టుకుని, ఎడమ కాలి పాదంతో నేల మీద తాళం వేస్తూ, రక్తి కలిగే స్వరాలతో మధురమైన తంత్రీ వాద్యం పైని అసంకీర్ణ వర్ణాలతో ప్రమోగించే ఆలం

కారాలతో, చెవుల కింపైన షడ్జగ్రామంలో ప్రియుడి మీద చతుష్పద గేయాన్ని పాడుతూ, కళ్ళా కనుబొమలూ కదిలిస్తూ, ఊహించే భావాలను అభినయిస్తూ ఎవడో అదృష్టవంతుడి రాకను ఎదురు చూస్తూ నుంచుంది. ఓహో! ఎవడయ్యా అతడు – దేవేంద్రుడి లాగ ఆహూతుడవుతున్నాడు, ఈమె ప్రణయ యజ్ఞానికి! సరే, ఆమెనే అడుగుతాను! వేశ్యాగగనంలో విద్యుల్లతలా మెరిసే ఓ అమ్మాయి! నిన్నొకటడగనా?

‘తెల్లనై నల్లనై చివరలందెర్రనై
వాలురెప్పల కొనల వికసించు దృష్టితో
ఈ చంద్రముఖి ధన్యు డెవని రాకను గోరి
నిలిచియున్నది బహిర్ముఖియై?’

అరే, పాపం, చెదరగొట్టిన లేడిపిల్లలా బెదరు చూపులతో ఆమె నావైపు చూస్తోంది. ఏమిటంటావు? ‘వద్దు వద్దులాగ. నేను బ్రహ్మచారిణిని. వసంతుణ్ని ఉపాసిస్తున్నాను.’ అనా! ఈమాట పాటించవలసిందే మరి. అయితే, ఇప్పుడా పెదవులపై మెరుస్తున్న దంతక్షతాల మాటేమిటి?ఏమన్నావ్? మిగిలిపోయిన మంచుతుంపరలతో సహా దాడి చేసిన వసంత వాయువు అడుగుజాడ లవి’ అంటావా! కానియ్యి కానియ్యి నాకేదో జ్ఞాపకం వస్తోంది.

‘దంత చిహ్నాల నలుగు పెదవులదాన,
నీకుగా చేసికొనెడి ఈ నియతిచూడ —
వ్రతము భంగమ్ముకాని చాంద్రాయణమున
ముద్దు లుద్యాపనమ్మగు సుద్దితోనె!’

ముఖానికి తలుపు చాటు చేసుకుని నవ్వుతోందీమె! అమ్మాయి, నీ తపస్సు వర్ధిల్లుగాక! వెళ్ళొస్తాను. (పరిక్రమిస్తాడు)

అమ్మయ్య! ఇదిగో ఎలాగోలాగ వేశ్యాస్త్రీ ప్రలాపాల సంకెళ్ళ నుంచి విముక్తుణ్ణై దేవదత్త యిల్లు చేరుకున్నాను. ఈపాటికి దేవదత్త వెళ్ళి పోయి ఉంటుందేమో. ఏమైనా అడిగి చూద్దాం. (చూసి) ఆ! ఇదుగో తోట పక్క గుమ్మం దాటిపోతున్నాడు, భావగంధర్వుడి దత్తుడు—నాటికాచార్యుడి శిష్యుడు దర్దురకుడనే చిల్లర పాత్రధారి (నాటేరకుడు). వీణ్ణడుగుతాను. ఏమోయ్ దర్దురక, ఎక్కడినించి వస్తున్నావు? దేవదత్త ఏం చేస్తోందో తెలుసా! ఏమంటావ్? ‘ఆర్యమూలదేవుడి క్షేమం కనుక్కోడానికి ఎప్పుడో వెళ్ళింది దేవదత్త. నేనయితే, దేవసేనని చూడడానికి ఆచార్యుడు పంపితే వచ్చాను’ అనా! ఎందుకని? ఏమిటంటావు? ‘కుముద్వతి పాత్ర వాచకం వ్రాసిన పత్రాలను ఇచ్చి రావడానికి’ అనా! మరి పత్రాలు తెచ్చావా? ఆమె తీసుకుందా! ఏమన్నావ్? ‘ఆచార్యుల పైని గౌరవం కొద్దీ తీసుకుని ఆ పత్రాలను ఆపక్కనున్న సఖి చేతిలో పెట్టింది. అంతేకాదు, ‘కుముద్వతికో నమస్కారం, నా ఒంట్లో బాగాలేదూ అంది.’ అనా! పాపం! గొప్ప తర్కమే ఇది. దీన్నిబట్టి ఆమె తదేకలగ్నమైన మనస్సు విరహబాధలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దర్దురకా ఈ పత్రంలో ఏం వ్రాసి ఉంది? ‘ఆ ? ‘నువ్వే చదువుకో అంటావా!’ (తీసుకుని చదువుతాడు):—

‘చిత్తహారి, కామునివిరి, యెత్తు రొమ్ము
గట్టుపై శశి, రాగవృక్షపు పవడము,
పడక పోరున గాయమ్ము; ప్రణయ రథము
బడలు తరి వేయు చేగోల పలుపు దెబ్బ;
కులుకులకు ప్రోది, గాఢపు వలపు గుర్తు,
చేయి పూయని కానుగు చెట్టు రంగు
చిన్నె, నెన్నడుము పిరుంద స్వీకరించు
గాక వలగొన్న కర్కశస్త్రీకిశోరి!’

బలే బలే! కర్కశ స్త్రీకిశోరికి తగిన పాఠం చెప్పాలని బయలు దేరిన నాకు ఈపత్రం శుభప్రదమైన అర్థసిద్ధిని సూచిస్తోంది. ఓయి దర్దురక, అయితే నీకు తెలుసా. దేవసేన ఎక్కడుందో! ఏమిటీ? తోటలోకి వెళ్ళిందా! అబ్బా! తోటంటే మదనకర్మాంత భూమి! సరేలే, నువ్వు వెళ్ళు. నేను తోటలోకి వెడతాను. అరే ఇదిగిదిగో దేవసేన—

తేజమే లేక కృశియించి తెల్లనయ్యె
వేకువనె వెలవెలంబోవు వెన్నెల వలె,
అరుదయిన గాఢవేదన నతివ్రమింగు
నదె మనోవ్యాధి మాన్పెడు నౌషధముగ!

ప్రియవాదనిక పరిచారికయినా రహస్యాలన్నీ చక్కగా దాస్తుంది. స్నేహం చేత ఎక్కువ సన్నిహితంగా ఉంటుంది; అందుకే, అదుగో దేవసేన మిగిలిన పరిజనాన్ని రానీకుండా ప్రియవాదనికతోనే తోటలో వాయుసేవనానికి వచ్చింది. కానియ్యి, ఆమె— విరహంలో ఏకాగ్రత కోరుకుంటోందనడానికి ఇది కూడా తార్కాణమే. ఏకాంతం కోరే వారందరూ మనసా కాముకులై ఉంటారు. నా సంగతేదో అంటున్నట్టుందీమె, దగ్గిరికి వెడతాను. (వెళ్ళి)

ఏం పిల్లా దేవసేనా, నీ విరహాలాపాలకు విఘ్నం కలిగించామని మా మీద విసుగుకోవుగద. ఏమిటంటావు? ‘స్వాగతం బావగారికి, నమస్కారాలు’ అనా! కానియ్యి, నీ స్వాగతానికి సంతోషం. చాల్చాలు, లేచి యెదురు రానక్కర్లేదు. ‘దయ చెయ్యండి ఈ ఆసనం పైకి’ అంటావా. మా బాగా కూర్చుంటాము కాదూ! పిల్లా, బంధువు లందర్నీ కంగారు పెడతున్నా వేమిటి? అదేమిటే, కంటికి కనబడని గాఢవేదనా లేక స్వయంగా ముందు అందరికీ తెలిసిన కేవల వ్యాధియా? ఏమిటంటావు? ‘ఏదీ కా’దనా! నువ్వు అన్నీ తెలిసిన దానివి అలా దాస్తే యెలా? ఎప్పుడూ నువ్వు మా చిన్న నాటి ఆటపాటల నాటి నుంచీ నెచ్చెలివి కాదూ! మూల దేవుడి సఖుడైన ఆనాటి శశుడినే నేను. నువ్వు మంచి దానవుగా, చెప్పు, నీ బెంగకి కారణం. నీ స్థితి యెలా వుందంటే-

చెక్కిలి చేరియున్న దరచేత, శరీరము నెట్టి వ్యాధి యున్
చిక్కగ జేయు; దార్ద్రమగు చేత; మనారత మావు లింతలో
దృక్కులు ధ్యానమగ్నములు, దేహపు వర్ణము మార్పు చెందు, నిం
పెక్కడు దేని చూచినను నింద్రియ తాపముచేత, వేసటన్
గ్రక్కును వేడి యూరుపులు., రమ్య మగమ్య మదెట్టి వస్తువో
అక్కున జేర్పగోరు నటులాయె నిదేటి వికారమే చెలీ!

ఎలా నిట్టూరుస్తోందో! పాపం, తాపం రేపినట్టున్నాను. ఇప్పుడు ఈమె మనస్సులో భావమేమిటో తెలుసు కుంటాను; నీ విరహానికి కారణం మేంకాకపోయినా నీకు మాత్రం త్వరగా స్వస్థత చేకూరాలని కోరుతున్నాను. నే వెడతాను మరి. ఏమి టంటావు? 'బావగారిది వట్టి చపలబుద్ధి' అనా? ఓహో తెలిసింది. రహస్యం తానే చెపుతోంది. పిల్లా, నీ వాళ్ళిలా ఉంటే నాకు ధైర్యం ఎలా ఉంటుంది చెప్పు. ఈ డొంక తిరుగుడు వ్యవహారం వల్ల ప్రసంగ విషయం మారిపోతుంది. ఇంతకీ నీ బెంగకి కారణం ఏమిటో చెప్పావు కావు. ఏమిటంటావు. 'బావ గారి దగ్గిర నాకు దాపరికం లేదు. ఇదంతా వసంత ఋతు స్వభావం—గురువుగారు పెట్టిన నియమంవల్ల ఒంటరిగా ఉన్న నా మనస్సు ఈ ఏదో ఇష్టమైన పని చెయ్యాలనే కోరిక అకారణంగా ప్రబలం అవుతూ వచ్చింది'— అనా! మంచిది. ఇంతకీ ఇదేమీ జబ్బు కాదన్న మాట. అమ్మాయి, దేవసేన మంచి మనిషి అని కూడా తెలుసుకదా. ఇంక మరి బెంగా గింగా చాలు. ఋతుపరిణామంచేత నువ్వు స్వస్థురాలివి కాగలవు. ఏమిటీ సిగ్గు పడుతోంది. ప్రియవాదనికా, ఏమిటా తాళపత్రం మీద వ్రాసి ఉంది? ఆఁ? 'నాటక భూమిక' అంటావా! ఏదీ చూస్తాను. (తీసుకుని చదువుతాడు.)

'కుముద్వతీ ప్రకరణమున అప్పుడే పెద్దమనిషయిన రాజకుమారిని దాది రహస్యంగా ఇలా మందలిస్తోంది—

'రొమ్ము లేర్పడనే లే దురమ్మునందు,
పిచ్చిదాన, నూగారు ప్రాప్తించ లేదు.,
ఎక్కడిది తెల్వి, ఈడు మించేటి పరుగు
లెత్తి విర్రవీగెదవు; విద్వత్తు నెరుగు
సఖుల కవినయగ్రంథముల్ చదువనేల,
ఏల బాల పక్వపు కామకేళి తేల?'

ఏమిటన్నావు దేవసేనా, 'అదంతా నేను వినలే'దనా! ఇది ఆమె పెంకి తనపు స్వభావం. 'నేను కూడా అలాగేసుమా' అని చెప్పినట్లు భావించాలి. ఏమన్నావు దేవసేనా? బావగారికి ఎదిరి మనిషి ఊహ ఇట్టే పోల్చుకోగల తెలివి తేట లున్నాయి.' అనా! అమ్మాయి, చాలు చాలు. విషయం మార్చు. మబ్బు చాటున దాగిఉన్నా చంద్రుని ఉనికి కలువలు విచ్చుకోవడంవల్ల తెలిసి పోతుంది. నీకు మగవాడంటే పడదుపో. నువ్విపు డార్తిలో ఉన్నావని నాకు తెలుసు.

కొంచెముగాక తెల్పితివి
గూఢ మనోగత మిప్పుడీవు ప్రే
మించుట లేదటంచు;
కృశియించుట కెవ్వడు హేతువో యెరిం
గించుము, చేత చెక్కిలియు,
నిల్పక జారెడుకంకణాల్, ప్రకో
పించెడు వేడి యూర్పులు
సహించెడు నా శఠుడున్ తపించడో!

ఏమిటంటావు ప్రియవాదనికా! 'కామతంత్రప్రకరణం చదువుతూ మాయజమానురాలీమధ్య ఒక విశిష పురుషుడిపై అనురక్తురాలయింది. మామూలు మగవాడుకాదు' అనా! అయితే ఈ అవంతినగరంలో విశిష్టపురుషు డనతగినవాడెవరు చెప్మా? ఏమిటన్నావు? 'ఎవరయితే మీద్వారా పొందతగిన వాడో అతడు' అనా! ఇంకెవరు. నిశ్చయంగా కర్ణిపుత్రు డైన మా మూలదేవుడే! అతడే–

పెద్దయింటివాడు, పేరుపడినవాడు,
వింతలేక నవ్వువెలయుమోము,
మాట, రూపు, వయసు, మంచిదై ఒడలెత్తు
మరుడెకాదొ, లేదు చెరకువిల్లె!

ఏం దేవసేనా! అలా తలవంచుకున్నావు? వాళ్ళెళ్ళే అందరికీ కనబడేలా పైట చెంగు వేలికూరికే చుట్టపెట్టు కోడం ఆపు. అంతా చెప్పు. అంత చెప్పతగ్గవాళ్ళంకామా? ఏం మాటాడవేం? ఓహో, ఈసిగ్గన్నది యుక్తవయసు వచ్చిన ఆడదానికి పైసెచ్చు ప్రౌఢ కానిముద్దరాలికి అరణపు సొమ్ములాటిది. అలాంటప్పుడు నోరార ఎలా చెపుతుంది గనకను. విశిష పురుషుడనే లక్షణానికి అన్నివిధాలా అర్హుడు కర్ణి పుత్రుడే. అందుకని పయిపయి గాంభీర్యం నటించి దీనితో మాట్లాడాలి. అమ్మాయి, దేవసేనా, ఇతరులరహస్యాలతో మాకేంపని ? ఈవ్యవహారంలో మేం తటస్థులం! అందుకని నీకు ఒకసంగతి చెపుతాను. కర్ణిపుత్రుడు పాటలీపుత్రంనుంచి ఈ అవంతినగరం వచ్చేసినందుకు తనప్రియజనంకోసం బెంగ పెటుక్కుని అస్వస్థుడై ఉన్నాడు. ఈవేళో రేపో అతనువెళ్ళి పోతాడు. మళ్లీ చూస్తాన్లేనిన్ను. ఎందుకంటే ఈలోపున నువ్వు స్వస్థురాలివి కావచ్చు. మమ్మల్ని మర్చిపోకుసుమా. (లేచి వెడతాడు, వెంటనే తిరిగి వచ్చి) 'అయ్యో - ఇప్పుడెంత కష్టంఅని యెవరన్నారు? ఆఁ? దేవసేన యెందుకు ఏడుస్తోంది? అమ్మాయి, ఏమిటిది? వద్దువద్దు ఏడవకు. కానియ్యి. తెలిసిం దిలే. నీ కోరిక అనువైనదే. కర్ణిపుత్రుడికి కూడా నీమూలంగానే మనోవ్యాధి. ఇతరేతరములయిన చికిత్సలన్నీచేశాక అలా ఊహించ గలిగాం. ఏమిటంటావు? 'అంతగా చెప్పాలా? భావగారి బెంగ నాకు తెలుసు' అనా! అయితే దాన్నింక అణిచి పెట్టుకోడం చాలించు.—

పద్మప్రాభృతకము

దక్షసుత లిర్వదేడ్గురుతార లేక
గర్భజాతలు చంద్రు సంగతినెనయరె?
ప్రాకవో అట్టులే మావిమ్రాకుపైని
రెండు తీవ లోకే వేరునుండి లేచి?

ఏవిటంటావు? 'అయితే యిప్పుడు ఇద్దరికీ క్షేమం జరిగే ఏర్పాటు కావాలి' అనా? మరేవిటి? ఏర్పాటు కాకేం? రేపే కదా మీ అక్క దేవదత్త యథాప్రకారం నృత్యశిక్షకై ఆచార్య మూలదేవుడి యింటికి వెడుతుంది? అదే నీ విరహం పోగొట్టుకునే అవకాశం. కుశలప్రశ్నవేసేమిషపైని నువ్వువెళ్ల వచ్చు, లేదా అతనే ఇక్కడికి రావచ్చు. ఏవిటలా తటపటా యిస్తావు? ప్రియవాదనిక ఏవంది? 'అయ్యవారిక్కడికి రావడం నాకిష్టంలేదు. అంటే మా యజమానురాలుండే చోటికి రావడం నాకిష్టంలేదు. లేనిపోనికథలు అల్లడం కులంతో పుట్టిన విద్య మావేశ్యాజాతికి. అందుకని తగినట్లు అంతా నేనే ఏర్పాటు చేస్తాను. ఎలాగంటే నృత్యశిక్షణకై వెళ్లే దేవదత్త తనతోపాటు, ఆచార్యమూలదేవుల క్షేమంఅడిగే మిషపై మాదేవసేనని స్వయంగా తీసుకువెడుతుంది.” అనా! బాగుబాగు, ప్రియవాదనిక, నీపేరు సార్థకం అయింది. ఈమంచి మాటలతో ఈమె అక్కడికి వెళ్లడమే బాగుంటుంది. ఈమెకు స్వస్థత చేకూరుతుంది. ఏవన్నావు దేవసేనా? 'బావగారిదర్శనం వల్ల ఇప్పుడే స్వస్థత చేకూరిందంటావా?' సంతోషం. మన్మథుడిపని పూర్తయింది. కర్ణీపుత్రుడి ప్రాణాలు నిలబడేందుకు జ్ఞాపకంగా ఉంచుకోతగ్గదేదైనా ఇయ్యాలి నువ్వు. ఏవిటీ? 'ఏవియ్యను' అనా! ఉండుచెపుతాను.

కొసలను లీలగా కొరుకు కోరికపుట్టెడు దాని, రొమ్ముల్
మసలి సలుంగుదాని, ముఖమండలచిత్రకమొత్తుదాని, ని
శ్వసనముతాకి సన్నమయి, చందననీరముసోకి కేసరాల్
ఖుసితరుగన్ ప్రభాతమున కొప్పున నుండి తెమల్చుదాని, ప్రే
యసివి తపించుకాంతునకుపాయనవిమ్ము స్వహస్తజీర్ణవకౌ
బిసముగలట్టి పద్మమును ప్రీతిగ పద్మవినిర్మలాస్యవై!

క్రీగంటి చూపుతో పద్మాన్ని తీసుకోమంది పాపం! ప్రణయప్రతిజ్ఞ చేసిన మిత్రుడి కోసం పద్మప్రాభృతం స్వీకరించాము. ఈ ఔషధం కర్ణీపుత్రుడైన ఆచార్య మూలదేవుడికి సంజీవిని ఔగాక! (తీసుకుని లేచి నుంచుని) వెడుతున్నాను. నీకు సుఖమవుగాక, అమ్మాయి, ఆశీస్సిదిగో!

భయమునకరంగి, సడి వినంబడని రీతి,
కంకణాలును మేఖల కదలియాడ,
శంకచే పరిష్వంగము సడలిపోవ,
విడియు పీడక్రీల నీనీపథమ్ము,
ఈ యుదాత్త రాగాయుధు నీ మదనుని
సకియ నీ తొలిప్రణయంపు సాహసముగ
నీకు నీవె ఆహ్వానింప నేర్తుగాక!

(విటుడు నిష్క్రమిస్తాడు)

ఇది మహాకవి శూద్రకునిచే సంస్కృతమున విరచితమైన పద్మప్రాభృతకమను భాణమునకు బాలాంత్రపు రజనీకాంతరావు ఆంధ్రీకరణము సమాప్తము.

"ఉభయాభిసారిక"

భాణం

సంస్కృతమూలం : వరరుచి

తెలుగుసేత : శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

చిన్నిమున్నుడి

శూద్రక మహాకవి సంస్కృతంలో రచించిన పద్మ ప్రాభృతకం అనే భాణానికి ఈ రచయిత తెలుగు అనువాదం 1969 ఏప్రిలు సంచిక భారతి ద్వారా పాఠకులకు పరిచితం అయింది. అది తరువాత 'తామరపువ్వుకానుక' అనే పేర రేడియోలో ప్రసారం ద్వారా కూడా శ్రోతలకు పరిచయం అయింది. శూద్రకునిలాగే ప్రాచీన భాణకర్తలలో ప్రసిద్ధి పొందిన మరొక కవి వరరుచి. కీ. శే. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు పరిష్కరించి, ఉపోద్ఘాతంతో సహా పాట్నాలో ప్రచురించిన 'చతుర్భాణీ' అనే నాలుగు భాణాల సంకలనంలోనివే—ఈ శూద్రకుని పద్మ ప్రాభృతకమూ, వరరుచి రచించిన ఉభయాభిసారికా అనే రెండు భాణాలూను. వరరుచి— ఇప్పటికి తెలిసిన భాణకర్త లందరిలోనూ ప్రాచీనతముడు. విక్రమార్కుని ఆస్థానంలోని నవరత్నాలు అని ప్రసిద్ధి పొందిన తొమ్మిదిమంది కవులను గూర్చిన శ్లోకంలో చివరిపేరు వరరుచిదే అయినా, ఆ తొమ్మండుగురి సమకాలికతగాని, వారికి ఏ విక్రమార్కుడు పోషకుడో అనే విషయంగాని ఇదమిత్థం అని చెప్పడానికి పరిశోధకులలో సమాధానం కుదరలేదు. కథా సరిత్సాగరాన్నిబట్టి వరరుచి పాణినికి సహాధ్యాయి అనీ, మగధ నేలిన నందరాజులలో చివరి రాజుకు సమకాలికుడనీ, బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన వరరుచితో వ్యాడి అనే యువకుడు స్నేహంచేసి, అతనిని ఉపవర్షోపాధ్యాయులకు పరిచయం చేశాడనీ తెలుస్తుంది. దండి రచించిన అవంతిసుందరికథాసారంలోకూడా వరరుచి కథ కనబడుతుంది. అతని జన్మస్థానం గోదావరీ తీరం. అతనితల్లి కాత్యాయనుడి కొమార్తె అయిన సాత్రాయణి. అతడు వ్యాకరణ గ్రంథాలూ, జ్యోతిష శాస్త్రమూ, ధర్మశాస్త్రమూ, కంఠాభరణం అనే కావ్యమూ రచించాడని రాజశేఖరుని కావ్యమీమాంస చెపుతోంది. చారుమతి అనే ఇంకొక కావ్యంకూడా వరరుచిదే అని, అందులోని శ్లోకం ఒకటి సుభాషితావళిలోను, భోజదేవుని శృంగార ప్రకాశికలోను కనబడడాన్నిబట్టి చెపుతారు.

ఈ భాణం కూడా శృంగారరసప్రధానమే. రంగంపైని ప్రవేశించే ఒకేఒకపాత్ర విటుడే. ప్రణయ కలహం మూలాన ఎడబాటు చెందిన తన మిత్రుణ్ణి అతని నెచ్చెలినీ రాయబారం జరిపి కలుపుదామని రాజవీధిలో బైలుదేరి వేశ్యావీధివైపు వెడుతూఉంటే నాయికానాయకులిద్దరూ ఒకరికోసం ఒకరు బైలుదేరి, ఇద్దరికీ నమ్మకస్తుడైన మరొక మిత్రుని ఇంట్లో కలుసుకోడం, విటమిత్రుడు వారిని ఆశీర్వదించడమూ ఇందులోని ఇతివృత్తం. స్థలం—ఆనాటి కుసుమపురపు రాజవీధీ, వేశ్యావాటికకు దగ్గరగాఉన్న మిత్రగృహమూ. — ఈలోపల మరికొందరు స్త్రీ పురుషులు విటుని కంటపడగా అతడు వారి వారి చరిత్రలనూ శీలమునూ నర్మోక్తులతో విమర్శిస్తాడు,

సుమారు క్రీ. పూ. నాలుగవ శతాబ్దినాటి కుసుమపురం (పాటలీపుత్రం) నాగరకతా, అక్కడి సాంఘిక జీవనంలోని కొన్ని దృశ్యాలూ, కొందరు వ్యక్తులూ, వారి ఆచార వ్యవహారాలూ ఈ భాణంలో మనకు కళ్లముందు దృశ్యం కడతాయి. ఆనాటి సంస్కృత సాహిత్యం అంతటా ఉన్నట్లే, శృంగారం ఇందులో అక్కడక్కడ—ఈనాటి హద్దులను కొంత వరకు మీరిఉంటే, సహృదయులైన పాఠకులు సరసంగా స్వీకరింప ప్రార్థన.

—రజనీకాంతరావు.

(నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశిస్తాడు.)

'నాకేమవుతావు నువ్వు
నీకేమవుతాను నేను
దయచేయవోయ్ దగాకోరు;
ముద్దంటె మొహం వాచా?
దిగులుపడను తెలిశాయోయ్
పెదవులపై పలునొక్కులు
ప్రేయసియిచ్చిన కాన్కలు—
నీవయి కోపగించినది
నేనుకాను వేరెవ్వతో
కుదురులేనివాడా, పో,
కోరిన జవరాలి కడకు'
అంటూ భాషింత్రుగాక
మరులుగొన్న పరస్త్రీలు,
ప్రణయకోపమున పలుకుల
ములుకుల తమ ప్రియుల గూర్చి.

నేను పెద్దలకు విన్నవించుకొనే దేమనంటే—అరే, శ్రద్ధగా నేనేదో విన్నవించుకోబోతుంటే వేరే ఏదో గొంతు వినిపిస్తోంది.

(తెరలో)

పేరుపడిన ఈ ఆమని కారులోన
మెరుగు తరిగిన లొద్దుగ తరువు మిత్ర
విషయమున మైమరచియున్న విటునివోలె
దీనముగ నిల్చియున్నట్టి తెరగుతోచు.

(ఇది స్థాపన)

(సూత్రధారుడు నిష్క్రమిస్తాడు.)

(అంతట విటుడు ప్రవేశిస్తాడు.)

విటు : ఓహోహో! వసంతం ఎంత సమృద్ధిగా ఉంది, ఎందుకంటే—

'పూయు మామిడి, అశోకము, ఊయెల,
కూయు కోకిలయు, వారుణి, జాబిలి,
తీయదనమ్ముల పెరిగెడు శోభ
చేయు మరునికూడ వగల మారిగ.'

ఓహో—ఈ కాముకులు ఒకరితో ఒకరు ఇచ్చకపు మాటలు ఎంత నచ్చేటట్లు చెప్పుకుంటారో. అబ్బ! ఈ దూతికలు తమ శాసనానికి అడ్డు లేదన్నట్లు తిరుగుతున్నారు. ఎంత జోరుగా ఉందో ఋతువు ప్రభావం. పగడాలూ, ముత్యాలూ, రత్నాలూ గుచ్చిన దండలతో, మొలనూలుతో, దుకూలాలు, అంశుకాలు, చందనం మొదలైన సరంజాముతో సౌభాగ్యం వర్ధిల్లుతోంది. జనులందరిలో కోరికలు రేపుతూ లోకం అంతటినీ ఆకర్షిస్తూ వసంతం ఇలా విజృంభిస్తుంటే సాగరదత్త శ్రేష్ఠికొడుకు కుబేరదత్తుడికీ అతని ప్రియురాలు నారాయణదత్తకీ నడుమ ప్రణయకలహం సంభవించింది. అందుకని కుబేరదత్తుడు తన పరిచారకుడు సహకారకుడిచేత నాకు ఇలాగని సందేశం పంపాడు: 'విష్ణుదేవుని ఆలయంలో మదనదేవుని ఆరాధనకై ఏర్పాటయిన సంగీత నాటకంలో రసానుగుణంగా అభినయిస్తున్న మదనసేనను మోహించానని అనుమానించిన నారాయణదత్త తనకంటె మదనసేన నటనే నాకు ఎక్కువయిష్టం అని అపోహపడి, కాదని, కాళ్లమీద పడబోయిన నావైపు చూడనైనా చూడకుండా కోపంతో ఇంటికి చక్కాపోయింది. ఆమె అంటే అనురాగంతో నా హృదయం తపించిపోయి, నాకు ఈ రాత్రి వెయ్యి రాత్రుళ్లలా తోచి ఎంతకీ గడవకుండా ఉంది.

అందుకని ఈ నగరంలో నిత్యమూ వసంతుడిలా తిరుగాడే మా బావగారు వైశికాచలుణ్ణి కలుసుకోగోరుతున్నాను' – అని.

అది విని, పాపం వాడి మదనబాధ భరించ రానిదని తెలిసినవాణ్ణిగనక పొద్దుటే బైలుదేర బోయానుకాని, తన యౌవనం సంగతేగాని నా వయస్సింత అని పట్టించుకోని మా ఆవిడ అనుమానంవల్ల ఆగిపోవలసి వచ్చింది. ఇప్పుడు ఆమె కోపం పోగొడతానని ప్రతిజ్ఞచేసి వెడుతున్నాను. లేకపోతే నాకు ఇప్పుడు ప్రతిజ్ఞ చేయడానికి ఏముంది గనక. ఏమంటే,

'తియ్యని కోకిల కువకువతో
మామిడి చివుళ్ళ మెలకువతో
కయ్యమునకు దిగు తొయ్యలి అలుకను
వసంతుడే తీర్పగలడులే'—

ఇంకా ఏమంటే,

ఇంపు, సొంపును, ఎలప్రాయ, మోవి, మంచి
నడత, దాక్షిణ్యమును, అనునయపు పల్కు
అనెడు సద్గుణములు లోకమందు కలుగు
వాడె వనితల వలగొనువాడుగాడె!

ఓహోహో. కుసుమపురపు రాచబాట ఎంత గొప్పగా ఉందో. ఇదిగో—ఇక్కడ నీళ్ళు బాగా చల్లి, కడిగి ఇళ్ళల్లోంచి అన్ని వైపులనుంచి విసిరిన కుసుమోపహారాలు రాచబాటలపైని నివాసం ఏర్పరచుకున్నాయి. పెద్దబజారు దేవిడీ వేరువేరు దినుసుల క్రయవిక్రయాలలో మునిగిపోయిన జనంతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోదాహరణ సంగీత నాటక ప్రదర్శనలో వాద్యఘోషకు అనుగుణంగా పరస్పరం వాచకాభినయం చేస్తున్న రావణుడితలల్లా ఉన్నాయి వరుసగా లేచిన మేడలు. చిరు సవ్వడులుచేసే కిటికీలద్వారా మేడ మబ్బులలోనుంచి రాజమార్గాన్ని చూడగోరే ప్రమదావిద్యుల్లతలు కైలాసగిరిపై అప్సరసల్లా మెరిసిపోతున్నాయి. మరిన్ని మేలిమైన గుర్రాలపైనీ, ఏనుగులపైనీ, రథాలపైనీ రాజోద్యోగులు అటూ ఇటూ తీవిగా తిరుగాడుతున్నారు. వయసుగాళ్ళ కళ్ళనీ మనసుల్నీ ఆకట్టుకలిగే మంచి నడవడికతో, తగిన అలంకారాలతో చూపరుల కన్నుతుమ్మెదలు ఆస్వాదించే మోముదామరల అందంతో, రాజమార్గాన్ని అనుగ్రహించడానికా అన్నట్టు కుర్రకారు వేశ్యలు నడక షికార్లు సాగిస్తున్నారు. ఇన్నెందుకు—

అందరు భయహీను లందరు కామ సం
తుష్టాత్ములచట నిత్యోత్సవముల.
గడపువారును దండిగా వెలలేని రాల్
పొదిగిన సొమ్ముల పూలసరుల
వలపులగందాల, వసనాల ధరియించి
ఆటపాటల సౌఖ్యమందు వారు,
విరచిత ప్రఖ్యాత వివిధ గుణాలతో
వరలెదు వార లప్పురి గలారు,
అట్టి నాగరకుల పుట్టినిల్లగు పురి
పుడమితల్లి నుదుటిబొట్టు చుక్క
ఇప్పు డెదుట వెలయు నీ పాటలీపుత్ర
మపర దివిజ నగరి యనుట యసదె?

(ముందుకు సాగి) ఇదుగో, చరణదాసి కూతురు అనంగదత్త ప్రణయ కలాప పరిశ్రమవల్ల కొంచెం అలసినప్పటికీ నేర్పుగా మెత్తని అడుగులు వేస్తూ తన అందం చూచేవాళ్ల కళ్లల్లో అమృతం కురిసేలాగ ఇలాగే వస్తోంది. తన ప్రియుడి మోటుసరసానికి నలిగిపోయినట్లుంది. అందుకనే మరి—

పంటి గంటంపు లిపి చెక్కబడిన పెదవి
నిదురబడలిక కన్నులు కదలు మొగము
వలపు చెలగాటమున బెట్టు తొలగి సడలు
నారి గల పట్టుమొలదట్టి జారునడుము.

బలే, ఈమె దర్శనమే నా కార్యసిద్ధిని సూచించే శుభశకునంలా ఉంది. అరే నన్ను చూడకుండానే వెళ్లిపోతోందే. అందుకని పలక

రిస్తే నీమెను. బలే, తనకుతానే ఇటు తిరిగింది. ఏ పిల్లా, దణ్ణం పెట్టవేం?

అనం : అబ్బో, శాన్నాళ్లకి గుర్తు వొచ్చాను. అయ్యవారికి దణ్ణాలు.

వైశిక : విను, ఇదిగో ఆశీర్వచనం.

'కలికీ, దాత, స్వతంత్రుని
చెలువము జవ్వనము కల్గు చెలువుని, సిరితో
తులతూగు కళాకుశలుని
వలపున నిను వలగొనేటి వల్లభు గొనువా.'

పిల్లా, అన్నీ అలాగే ఉండనీ.

వేశలక్ష్మివా నీతోడ వెలది, యిట్టి
రాత్రి సార్థమై, యెవనికి రమ్యమగునో
అతని కింకరుడే కాడొ రతిధవుండు,
సఫలమే కాదొ ఆతని జన్మమపుడు?

అనం : మహామాత్యులవారి కొడుకు నాగదత్తుల బస నుంచి వస్తున్నాను.

వైశిక : అమ్మాయి, అదంతా జరిగిపోయిన వైభవం కదా. మీ అమ్మకి ఇష్టంకానిపని చేస్తున్నావని నాకు తెలుసు. (నవ్వుతూ) సిగ్గుతో తలవంచుకు నవ్వుతోంది. అరే, నా మాట బాగా పనిచేసింది. అమ్మాయి, అలా ఎన్నడూ చెయ్యకు. ఎందుకంటే—

'తల్లి ధన తృష్ణకాదని, తరలిపోయి—
ప్రియుని బసకెట్టి రతి సుఖాపేక్షతోనొ,
గణిక జవదాటరానిదౌ కట్టుబాటు
విడిచి, కామోత్సవపు విందు కుడిచినావు
కాలదన్నరే నిను వారకాంత లెల్ల?'

తగ్గట్లుగానే ఉందిలే నీ సిగ్గు. ఒట్టు వెయ్యడం ఎందుకులే. మన యింటికివచ్చి మీ అమ్మతో సర్ది చెపుతాను. వేశ్యాసంప్రదాయానికి విరుద్ధమైనపని చేశావు. పోయిరా.

అనం : దణ్ణాలు.

వైశి : సౌభాగ్యవతికి ఆశీస్సిదిగో.

'కొదవేమి సద్గుణాలకు, ఎదురుగ
నిలుచున్నదాని నేమని పొగడన్
ఇదిగో నీ యెలప్రాయము
పదిలమగుత, లోకనేత్రపర్వముగాగన్.'

వెళ్ళింది తాను. మేమూ వెడతాము.

ఆఁ. ఇదిగో విష్ణుదత్త కూతురు మాధవసేన— తనకూడా పరిచారకుల నెవరినీ రమ్మనకపోడం మూలాన్ని కాబోలు పులి తరుముతూ వుంటే బెదిరిపోయే లేడిపిల్లలా తొరతొరగా అడుగులు వేస్తూ ఇటే వస్తోంది. ప్రస్తుతం తల్లి పేరాసవల్ల ఇష్టంలేని ప్రియుడి కలయికలో ఈమె ఇబ్బందిపడిఉండాలని తోస్తుంది. అందుకే —

'వదనము వాడిపోదు, ప్రసవద్యుతి
క్రొమ్ముడి వీడలేదు, కెం
బెదవుల వెల్గు దంత పరిపీడన
కోడిన జాడలేదు, ఏ
కొదయునులేని నిండుసిరిగుబ్బలు
కౌగిలింగందలేదు, జా
రదు మొలనూలు శ్రోణితటి
రాగరతిప్రతిబంధముక్తికై.'

అరే, ఈమె తన కిష్టంలేనివాడితో పోవడం వల్ల కలిగిన చికాకుమూలాన్ని నన్ను చూడకుండానే దాటిపోతోంది. సరే, తనని వెంటాడి, చికాకుకి కారణం ఏమిటో తెలుసుకుంటాను. పాపం, తనే ఇటు తిరిగిందే. ఆఁ. ఏమిటంటావు?

మాధవసేన: క్షమించాలి— బావగారిని గుర్తు పటలేదు.

వైశిక: తప్పలేదమ్మాయి. ఏదో చికాకులో కుములుతున్నవాళ్ళకి మైమరపు మామూలే.

సేన : దణ్ణాలు.

వైశిక: సరే— ఇదిగో ఆశీర్వచనం—

ధనవంతులె ప్రియులై, ని
ర్ధను లప్రియులగుత, తల్లి ధనలోభముచే
నొనగూడదుగాకెన్నం
డును నప్రియసంగమం బుడుగు చింత చేలీ!

ఇంతకీ, ఎక్కడినుంచి వస్తున్నావ్ అమ్మాయ్?

సేన : వనదత్త శ్రేష్ఠిగారబ్బాయి సముద్రదత్తుడు గారి బసనుంచి వస్తున్నాను.

వైశిక : ఓహో, చేసిందేవిటో తెలిసింది. ఈ కాలపు కుబేరుడీ సముద్రదత్తుడు. ఏవలా నిట్టూర్పులతో పెదవి చివురు అదిరిపోతూ కనుబొమల వంపుల్లో కళ్లు పైకీ కిందికీ ఆడుతుంటే తామర పువ్వులాంటి తన ముఖాన్ని ఈమె అటువైపు తిప్పుకుంది? సరిసరి—నా ప్రసంగం ఊరికే పోలేదు.

ఎదనొచ్చుకొంచు తా పెదవులందిచ్చుట,
కొసరని పావురా గుసగుసలును
వెలయని నవ్వుల కిలకిల, లావు లింత
లును, నిట్టూర్పు దొంతరల తెరలు,
కైదోయి బిగియని కౌగిలింతయు, కాన
రాని ప్రేమయు, శయ్యపైని దిగులు,
తెచ్చి పెట్టుకొన్న తెరగు రతిక్రీడ,
చేష్టలందు భావపుష్టి లేమి,
చూడ, రాతిరెల్ల సూర్యునికై యింతి
యెదురుచూచు రీతి యిట్టెతోచె.

అమ్మాయి, చాలు చాలు. విచారించకు. రూప హీనుడైనా ధనవంతుడైతే పొందతగిన వాడుగా పేర్కొన్నారు పెద్దలు—విను.

ప్రియునకు అప్రియునకు ప్ర
ణయ మనయము గొలుపుచున్ ధనార్జనమొకటే
నయమైన కార్యమని, ని
శ్చయముగ ఘోషింపబడియె శాస్త్రములందున్.

సేన : బావగారి తీర్పు మా అమ్మ తీర్మానంలాగే ఉంది.

వైశిక : అలాకాదు. దానికొక కారణం ఉంది. నువ్వు వెళ్లు. నేను సరాసరి మీ యింటికేవచ్చి, ఈ శాస్త్రపు అంతరార్థం తెలిసేటట్లు చెపుతానులే. అరె, ఉపదేశం చేసినందుకా దణ్ణం పెట్టకుండానే చక్కాపోయింది. ఈ నిస్సహాయురాలు ఎంత దిగులుగా ఉందో పాపం. ఇక. మేమూ వెడతాం.

సరే, ఇదుగో, విలాస కౌండిని అనే పరివ్రాజిక మెత్తని అడుగుల వొయ్యారంతో, కనువిందైన అందంతో ఇటే వస్తోంది. ఆమె కొంగు ఘుమ ఘుమకి మత్తెక్కిన తుమ్మెదగుంపులు మామిడి కొమ్మలను వదిలిపెట్టి ఆమెనే ఆశ్రయిస్తున్నాయి. ఇప్పుడామెతో మాటాడి నా కళ్లకూ చెవులకూ ఆరాటం వదిలించుకోవాలి. భగవతి, నేను వైశికాచలుడను నమస్కరిస్తున్నాను.

విలా : వైశికాచలుడితో పనిలేదు మాకు, వైశేషికాచలుడైతే కావాలి.

వైశిక: ఓ, దానికి కారణం ఉందిలే. ఎలాగో తెలుసా?

ఏయెడ నిలకడలేదే యింతలేసి నీ కనులకు
మోమాలసియు రతిశ్రమను ముద్దులొలుకు
నుబుకు మోవి;
ప్రణయగాథలెన్నో బయల్పడు నీఖేదాలసగతి
వైశేషిక రత్యర్థము ప్రియుడె వెల్లడించె గదే.

విలా : ఓహో, దాసుడు స్వానుభవాలను ఎదటి వారివిగా నచ్చ జెపుతున్నాడు.

వైశిక: నీ యడుగుదామరల కొల్చు నిత్యదాసు
లెంతకును ధన్యులేగారె యిగురుబోడి.
పుణ్యహీనుడనగు నన్నుబోంట్ల కట్టి
వరతనువు లభ్యమగు టెట్లు వలనుపడును?

విలా: షట్పదార్థాలు విడిచిపెట్టినవారితో సంభాషణ పనికిరాదని మా గురువుగారు ఆంక్ష వేశారు.

వైశిక: భగవతి, నువ్వు చెప్పింది సబువే-ఏవంటే,

'ద్రవ్యమగును నీ తను వాయతాక్షి,
దయితారూపాదులు గుణములు!

సామాన్యమ్మగు నీ యౌవనము,
స్తవింత్రు యువకులు నీ కర్మల,
జనము కోరుదురు నీ సమవాయము,
తద్వారా నీ కొదవు విశేషము,
తరుణ మనోవాంఛ నీకు యోగ;
మనిష్మజనమునుండి మోక్షము!'

(ఆమె నవ్వుతుంది)

ఏఁవిటీ—యీ నవ్వే నా మాటకు జవాబన్న మాట. బలే,—నే ననుకున్నట్లే అయింది.

విలా : మాకు సాంఖ్యం తెలుసు. ఆ శాస్త్రంప్రకారం తాను వర్ణమూ గుణమూ లేనివాడైనప్పటికీ పురుషుడు క్షేత్రజ్ఞుడే—అంటే — స్త్రీలోని వివిధ లీలల ప్రకృతిని ఎరిగున్నవాడు.

వైశిక: బలే. దీనికి తిరుగుమాట లేదు. నా ధోరణి ఈమెలోని కుతుకాన్ని రేపినట్లు తోస్తుంది. తరుణజనుల కోర్కుల పంటకు విఘ్నం కలిగించడం తప్పు. భగవతీ వెళ్లిరా. వెళ్లింది. ఇక మేమూ వెడతాం.

(ముందుకు సాగి)

ఇదిగో—చారణదాసి తల్లి రామసేన కాదు గదా, వయస్సు పైబడుతున్నా, వొయ్యారపు చూపులతో నడకతో నవ్వులతో తిప్పుకుంటూ ఇటే వస్తోంది. ఓహో, మా అబ్బురానికి తగినదే—యీమె—ఎలాగంటే—

కోరికలు భోగములు కామకోటి తీర్ప,
తన వగలవారలను ప్రీతి తనియజేసి,
వయసుగాంఢ్ర వైరములకు వలతియగుచు,
కూతుప్రియుబట్టి పిడువంగ నాతియేగు

కామిజనులపాలిటికి ప్రాణాంతకమైన ఆమె ఒడలి ఒయ్యారాలను ఇప్పుడు చూసి ఆనందిద్దాం. కాముకులపాలి ఇంద్రాయుధానికి నమోవాకాలు. అమ్మా, రామసేనా, కూతురి జవ్వనపుసిరి ఆధారంగా ఏ కాముకుడి కొంప కూల్చడానికని బయల్దేరా విలాగ?— బాబో. ఈమె ఎదురయినప్పుడల్లా నాకు ముట్టేవి శాపనార్థాలే.

రా. సే: ఛీ. ఆడిపోసుకోడమే నీ స్వభావం.

వైశిక: అధికప్రసంగం ఆపు. ఇప్పుడు నువ్వు బయల్దేరిందెక్కడికో చెప్పు.

రా. సే: మా అమ్మాయి చారణదాసి నిన్న ధనికుడుగారింటికి వెళ్లింది. సంగీత నాటకం మిషమీద దాన్ని, అక్కడినుంచి తిరిగి రప్పించాలని బయలుదేరాను.

వైశిక: పాపం, చారణదాసికి ఎలాటి ప్రమాదం వచ్చిపడింది. విటరాయళ్ల సర్వస్వమూ సంగ్రహించే నేర్పుతో సారం అంతా తాగేసి పిప్పిని పారవేసే సమర్థతగల నీయంతటిదాని కూతురయీ కూడా, శాస్త్రోపదేశాలను పాటించకపోవడం చేత ఎంత జాలిపడవలసిన అవస్థ చూడు. ఎలాగంటే—

పొందదగు వాని, తగు సొమ్ము, పొంది కూడ,
అన్నివిధముల నిర్ధనుడగుట తెలిసి,
ఎరుగదు త్యజింపఁ దన్ను ప్రేమించువాని,
తరుణి నేర్చిన శాస్త్రతత్త్వమ్ము వమ్ము.

రా. సే. సంగీతనాటకం పనిమీద దానిని ఇంటికి రప్పిస్తాను. తిరిగి వచ్చేటప్పుడు నువ్వుకూడా అక్కడకువచ్చి నీ శాస్త్రం బోధిద్దువుగాని.

వైశిక : అలాగేమరి. అయితే త్వరగా చెయ్యవలసిన మిత్రకార్యం ఒకటుంది. దాన్ని చక్కపెట్టి నీ పనికూడా చూసిపెడతాను. వెళ్లిరా నువ్వు. ఇక మేమూ వెడతాం.

ఓరిబాబో. గణికల హృదయాలు నమ్మడానికి వీలులేదు. ఏమంటే—

'చెలిమి, నిచ్చకాల, కులుకుల, జోకొట్టి,
కరుణమాలి విటుని కలిమి దోచి,
అన్యరంజనార్థ మాదేహమును త్యజిం
పదె విరక్తదేహి పగిది వేశ్య.'

ఈ వేశ్యమాతలున్నారే— బాబోయ్—వీళ్లా కాముకుల పాలిటికి రక్షణలేని ఈతిబాధలు. కాముకులకు నిత్యమూ శుభమగుగాక! కాముక

జనుల సర్వస్వాన్ని కొల్లగొట్టే నేర్పరులూ, మొక్కవోని టక్కుల బాణాలను సృష్టించే కళాశిల్పులూ అయిన వేశ్యమాతలకు వినాశమవుగాక!

బాబోయ్—ఈ రాజమార్గం పాలిటికి కలిలాగ దాపురించిన తృతీయా ప్రకృతి సుకుమారిక పేరింటిది ఇలాగే వస్తోంది. అబ్బా, ఎంత అశుభదర్శనం ఇది? కానీ. ఇప్పుడు దీనిని పలకరించకుండా బట్టచాటు చేసుకుని దాటిపోవాలి. ఏవిటీ, నావైపే తరుముక వస్తోంది. ఇప్పుడు నాకేవిటి మార్గం? అబ్బా, యమధర్మరాజు గట్టివాడు; అంచేత, ఈమెతో మంచి మాటలాడి పులినోటినుంచి తప్పించుకున్నట్లు బయటపడాలి.

సుకు : అభివాదాలు.

వైశిక : అవిధవాభవ. బహుపుత్రాభవ. మరిన్నీ—

'కనుబొమ్మల విసుళ్ళ, కనుల పర్వుల నోష్ఠ
విచలనమ్ముల కర ప్రచలనముల,
నడకల సొంపుల, నవ్వుల నింపుల,
వెలది యొయ్యారముల్ విలసిలంగ,
దిగజారి వ్రేలాడు దీర్ఘవౌ మొలనూలు
వెడదయై యురువైన పిరుదుకప్ప
ఇంతలా కనులతో యెవని గృహమునుండి
తిరిగి వత్తువో రతితృప్తి గనక?

సుకు : రాజుగారి బావమరిది రామసేనుడి గారింటి నుంచి వస్తున్నా.

వైశిక : ఓహో, వాడి జీవితం ధన్యం. అమ్మాయి, ఇప్పుడు చక్రవాక దంపతులలాటి మీకీ వియోగం ప్రాప్తించిందేవిటి?

సుకు : రాజుగారి కోటకి వెడుతూండే వేశ్యదాసి రతితిలక చమక్కులతో తియ్యని నవ్వులతో శృంగార చేష్టలతో స్నేహపూర్వకమైన కోమల కటాక్ష వీక్షణాలతో కన్నీళ్లతో హృదయం నిత్యమూ అభిషిక్తం అవుతూవుంటే తన పులకరింతల ద్వారా కలిగిన మదనానురాగం బయటపడగా అతను ఆమెకు తలవంచి దణ్ణంపెట్టి ఆ మదనానురాగాన్ని స్వీకరించాడు. కంటియెదుట జరిగిపోయే దగాను సహించలేక నేను మందలిస్తే నా కాళ్లమీద పడ్డాడు. అప్పటికీ ఈర్ష్యతో కుంగిపోయిన నేను అతనంటే ఆదరం చూపలేదు. అప్పుడు అతనే నను బలవంతంగా ఇంటికి తీసుకొచ్చి పక్కను చేర్చుకున్నాడు. రాత్రివేళ మదనావేశపు అలసటలో నిద్రలో మునిగిన నన్ను విడిచిపెట్టి తిరిగి దానింటికి వెళ్లి, ఇప్పటికి కొన్ని రోజులయినాకూడా ఇంటికి తిరిగిరాడు. మళ్లీ తన ఆదరాన్ని కోల్పోయి, పశ్చాత్తాపంతో కుమిలిపోతూన్న నాకు అనుకోకుండా బావగారి దర్శనం దొరికింది. అంచేత నా ప్రాణ సముడైన తాను నన్ను తిరిగి కలిసేటట్లు చేయగలవారు బావగారే.

వైశిక : క్చు. క్చు. రామసేనుడెంతటి ప్రమాదంలో పడ్డాడో తెలుసా?

'వలపు బిగికౌగిలికి అడ్డుపడవు చనులు,
నెలనెలకు పొత్తు చెడగొట్టు 'నెలయు' రాదు.
సొగసు జవ్వనముల చేటు చూలు లేదు,
విడుచు రత్యుత్సవమె నిన్ను విడుచువాడు.'

ఇప్పుడిలా కానియ్యి. అతనికిలాగే నన్ను సొంతయింట్లో గౌరవించు. నాకు త్వరగా చక్కబెట్టుకొనవలసిన మిత్రకార్యం ఒకటుంది. అది పూర్తిచేసుకుని, నీవంటి సుకుమారి మనస్సు కష్టపెట్టినవాడిని, కన్నెసిరితో కళ్లు తలకెక్కిన నీ ప్రియుడిని తీసుకొచ్చి నీ కాళ్లమీద పడేటట్లు చేస్తాను. వెళ్లిరా నువ్వు. వెళ్ళింది. వెడతాన్నేను. అమ్మయ్య. కష్టంమీద ఈ తృతీయాప్రకృతినుంచి నా ఆత్మకి మోక్షం లభించింది.

ఏఁవిటీ, ఎవరు నాకు నమస్కారం చేస్తూ ఇల్లా వస్తున్నారు? నీకు శుభమవుగాక! ఛాలా

కాలానికి కనబడ్డావు నాకు. పార్థక శ్రేష్ఠిగారి కొడుకు ధనమిత్రుడవు కాదూ నువ్వు? తన కొలువులోని పనివాండ్లకు, యాచకులకు, బంధువులకు, స్నేహితులకు పేదతనపు చీకట్లను చెదరగొట్టేవాడూ, జవరాంద్ర హృదయ కుముదాలను వికసింప చేసేవాడూ అయిన కుసుమపుర గగనపూర్ణచంద్రుడికి ఈ దుర్దశా గ్రహణం ఎలా పట్టిందయ్యా? కుటుంబ సర్వస్వాన్ని కుండలో పోగుచేసుకుని ఎక్కువ ఆదా చేద్దామనే ఆశతో దేశాంతరం వెడుతూంటే దారిదోపిడి దారుల పాలబడ్డావా? లేదా, రాజద్రోహకార్యాలలో పాల్గొన్నందుకు రాజు నీ ఆస్తంతా జప్తు చేయించాడా? పోనీ, ఒక్క పాచిక తిరగబడ్డంతో కుబేరుడికైనా వైభవం అంతా తుడిచిపెట్టి వెయ్యగల జూదంలో దెబ్బతిన్నావా? ఇన్నిమాట లెందుకు?

'పెరుగు నఖ రోమ మలముల గురుతు లెసగి,
ధ్యానమున తెల్లవడి పుష్టి తరిగి మొగము,
ముదుకయ్యె చిన్గి, దుమ్ముతో చెదరిబట్ట,
ప్రతిభచెడనేల మునిశాపహతుని వోలె.'

ధన : రామసేన కూతురు రతిసేన అంటే నాకూ, అలాగే నేనంటే తనకూ వొల్లమాలిన వలపన్న సంగతంతా బావగారికి బాగా తెలిసిన విషయమే. అంచేత—తల్లి పిసినారి అని తెలిసినా తనుమాత్రం వదలకుండా నన్ను అంటిపెట్టుకొనుందని, స్నేహితులు వద్దు వద్దని అడ్డు పెడుతున్నా లెక్కపెట్టక, నాకున్న సంపదంతా తనకు అప్పజెప్పాను. అది తీసుకుని, కొన్నాళ్ళ గడిచాక ఒకనాడు స్నానం వంకని నన్ను తుండుగుడ్డ చుట్టబెట్టి అశోకవనిలోని కొలనుకు పంపి, ద్వారం మూసివేసి, ముందుగా చెప్పి అశోకవనం కాపలావాళ్ళచేత నన్ను దిడ్డిగుమ్మంగుండా బైటికి వెళగొట్టింది. ఉన్న ఊళ్ళోనే ఉడిగిన సంపదతో ఇన్ని దినాలు దీనంగా గడపడం ఎలాగా, అని చూసి చూసి, అడవులు పట్టిపోదామని బైలుదేరిన నాకు యాదృచ్ఛికంగా బావగారి దర్శనం ప్రాప్తించింది. బావగారికి నే చెప్పిందంతా అతిరహస్యం సుమా! ఇప్పుడు బావగారు సెల విచ్చేదాన్నిబట్టి నా భావి శ్రేయస్సును గురించి ఆలోచించుకోవాలి.

వైశిక : అబ్బా. వేశ్యల డబ్బాశ ఇంతా అంతా కాదు. వేశ్యాంగన వక్రబుద్ధి గురించి ఏం చెప్పను? రా. నిన్ను కౌగిలించుకోనీ. ఇలాగైనా బతికి బైటపడ్డావు సంతోషం. ఏవంటే—

'శాంతి చెందును మహౌషధిచేత మెల్లగా—
క్రూరవౌ పెనుత్రాచు కోర విషము,
పడయవచ్చును ముక్తి నడవిలో మత్తెక్కి
పరువులెత్తెడు నేన్గు బారినుండి,
మోక్షమ్ము కొండొకప్పుడు కల్గు మకర వ
క్త్రమునుండియైన-యర్ణవ జలాల,
వారాంగనా బడబానలమ్మున పడ్డ
వాడు మాత్రము లేవలేడు, లేడు.'

మరి, బాబూ, నీ నిర్వేదానికి కారణం—రతిసేనా, కాక, దాని తల్లా?

ధన : ఏమాట కామాటే చెప్పుకోవాలి. రతిసేనకి నేనంటే ఇష్టమే. జరిగినదానికంతా తల్లి తప్పే కారణం. బావగారుగాని తల్లికి తెలియకుండా తనతో నాకు కాస్తంత సమాగమానికి ప్రయత్నించారంటే నా ప్రాణాలు తిరిగి కుదుటపడతాయి.

వైశిక : పైవాళ్లకంటె దానికి నీమీదే ప్రేమని విన్నానులే. అరే—ఏడుస్తున్నాడితను. చాలు చాలు విచారం. నాకిప్పుడు త్వరగా చక్కబెట్టవలసిన మిత్రకార్యం ఒకటుంది. దాన్ని పూర్తిచేసి, తిరిగి వచ్చాక నీ పనికూడా చేసివెడతానులే. వెళ్ళిరా నువ్వు— అబ్బా, ఏం నేర్పు వేశ్యలది? ఫ్ణంళ్లే—

'కుటిలబుద్ధులౌ రాజులు గొంకకుండ
తమదు దోషాల మంత్రుల తలల మోపు
నట్లు శశవర్తనలు వేశ్య లాత్మదుష్కృ
తులకు బాధ్యత వేశ్యమాతలది యంద్రు.'

పాపం, దిగాలుపడిన ధూర్తోపాధ్యాయుడు వెళ్లాడు. ఇక మేమూ వెడతాం.

(ముందుకుసాగి)

అరె, వసంత వనకోకిల కంఠాన్ని అనుకరిస్తూ స్నిగ్ధ మధురస్వరంతో ఎవరు చెపుమా నన్ను పేరు పెట్టి పిలుస్తున్నారు!

(చూసి)

ఓహో—ప్రియంగుసేన—ఏవోయ్ ప్రియంగు సేనా! ఇదిగో, ఇదే వస్తున్నాను.

ప్రి : నమస్కరిస్తున్నాను.

వైశిక : అమ్మాయి—తీసుకో—ఆశీస్సిదిగో.

'కోమలముగ తన్ని, గ్రుద్దుచు శయ్యపై
ప్రియుని కోర్కి కద్దుపెట్టుదాన,
వలపు తొందరెక్కి వాడు మర్దించెడు
వేడద పిరుదు సుఖము లిడుత నీకు.'

అమ్మాయి, అలిసిపోయిన పిరుదులకు ఆప్యాయనకరమై బహువిధపరిమళభరితమైన గంధతైలానికి ఆత్మాంగస్పర్శప్రదానంచేసి అనుగ్రహిస్తున్నావా? ఇంత అందమైనముఖం కలిగి, మువ్వల పటకా తీసివేసిన బోసిమెడగల రాజుగారి పట్టపేనుగులాగ ఏ సింగారింపూ లేకుండానే శృంగారమొలికే నీ ఒళ్లు కళ్లారా చూడనివాడు జీవితంలో దగాపడినవాడనుకో. ఏమంటే—

'ఒలిచిన తొడవుల నెలవుల పొగసు, న
ఖక్షతమ్ములు, తైలగంధరక్తి
కొనలుకందిన కనుల్, హసిత వదనమును,
ఉష్ణత, యెలప్రాయు, ముబుకుచనులు,
ఉరువైన పిరుదుల నొరగెడు మొలనూలు,
అరచాటు వలిపౌన మెరయు తొడలు,
ఇంతటి యందమ్ము నీక్షించి, ధృతిప్రీలి,
మన్మథుడైనను మథనపడడె?

ప్రి : బావగారి మాటలు తేనెమూటలు.

వైశిక : ఓహోయ్. ఎందుకీ పొగడ్త. నాకు సిగ్గు తెప్పించడం చాలు. అసలు ఏంపనిమీద బయలుదేరావో చెప్పు.

ప్రి : వినండి మరి.

వైశిక : అమ్మాయి, సిద్ధంగా ఉన్నాను.

ప్రి : చండశాసనుడైన మహారాజు కుసుమపుర పురందరుని భవనంలో పురందరవిజయం అనే సంగీత నాటకాన్ని రసానుగుణ్యంగా ప్రదర్శించాలని దేవదత్తతో నాకు పందెం పడింది. అందులో నా అదృష్టం పండడానికి బావగారే కారణం గదా.

వైశిక: వద్దువద్దు—అలా అనకు. పదహారు కళలతో చంద్రుడు ప్రకాశించే పండువెన్నెల్లో దంపతుల్ని కలపడానికి ఒకరు ప్రయత్నించేదేవిటి? మరిన్నీ స్వయంశక్తిమంతులకు ఒకరి సహాయంతో అవసరం ఏం ఉంటుంది? నీ అదృష్టానికి నువ్వే కారణం. ఆ ప్రయోజనాన్నికోరే, నీయందు ప్రేమాసక్తుడైన రామసేనుడు నన్ను ప్రత్యేకంగా ప్రార్థించాడు! హాయి హాయి. కనుబొమ్మలు విలాసంగా ఎగరవేసి, కొంచెం కదిలించిన కనుచెంపలద్వారా బయలుపడేలోపల పొంగే ఆనందంతో, పెదవి చివురు కంపించే మోముతామరను అటుతిప్పి, తన పరిజనాన్ని చూస్తూ ఎంత బాగా నవ్విందో—బలే—రామసేనుడి ఆరాధనకు మంచిఫలితం లభించింది. దేవదత్త ఎంతతెలివితక్కువది? ఏవిటి ఆమెకు నీతోనా పోటీ? మొదట అన్నీ నీ సొమ్ముగదా—ఏవి—రూపసంపద, జవ్వనపు మెరుగు, గుణగణాలు, నాలుగువిధాల అభినయసిద్ధి, ముప్ఫయిరెండురకాల హస్తప్రచా

రాలు, పద్దెనిమిదిరకాల నేత్రాభినయం, షట్‌స్థానాలు, గతిద్వయం, ఎనిమిది రసాలు, గీత వాద్యతలయాత్మకత్రయం, నృత్తాంగాలైన ఇన్నీ నీకు పట్టుబడినందువల్ల చరితార్థాలయాయి. కాక అసలు, నీ యీ వేషంతోటే చాలు దేవాసురమహర్షిశ్రేష్ఠుల మనస్సులను హరింపగల అప్సరసలను సైతం తలదన్నగల దానివిగా కనబడతావు నాకు—మరిన్నీ—

'నెలతరో, నిత్యమును నీదు లలితచేష్ట
తముల మూలాన జనుల నేత్రములు నెదలు
నర్తనము సేయునో, నర్తనమున నీకు
సరసగతి ప్రాప్తమయ్యెనో చారులీల?'

అరే, సిగ్గుపడుతోంది! అమ్మయ్య — ఈ వ్రీడాలంకారం నన్ను విడిచిపెట్టివెళ్ళింది. ఇక మేము వెడతాం.

ఓహో, గంధచూర్ణం మెత్తిమెత్తి కర్కశమైన స్తనయుగళంతో రకరకాల విరు లమర్చిన కురులసొయతో ఎందుకో ఉప్పొంగే మొగముతో మత్తిల్లిన ఒయ్యారంలో తడబడే అడుగులతో ఇటే ఆ వస్తున్నది— మా నారాయణ దత్త చేటిక కనకలతే. ఇప్పుడీమెతో మాటాడాలి. చేతులు జోడించుకు ఇటే ఎలా వస్తోందో. ఏం అమ్మాయి బాగున్నావా?

కన : నమస్కారాలు.

వైశిక : అమ్మాయి, ప్రియప్రేయసి వగుదువుగాక నీ అడుగుదామర మోపి ఈ వేళ ఈ దారిని అనుగ్రహిస్తున్నావేం?

కన : బావగారెప్పుడూ మంచిమాటలు చెపుతారు.

వైశిక : ఇదేం పొగడ్త కాదమ్మాయి.

కన : అనుగ్రహీతురాలిని.

వైశిక : అదంతా అలా ఉంచుగాని,చక్రవాక దంపతుల కిప్పుడు వియోగం కలిగిందేం?

కన : మా యజమానురాలికి ఆయన మీదెందుకో ఈర్ష్యపుట్టి స్నానం, పానం, భోజనం, శయ్య, అలంకారం అన్నింటినీ వదిలిపెట్టి, అశోక వనంలోని అశోకపు మొక్కకింది వేదికపైని విడిది చేసుకుంది. అక్కడ కొంతసేపు ఆమె చంద్రబింబాన్ని చూసీ, క్రమ్ముకొని వచ్చే తుమ్మెదల రొద వినీ, ఆమని పూల కమ్మని పరిమళాలతో బాధించే కోడెగాలి తాకిడి సోకి లోపలితాపం మరింతగా పెరుగుతూంటే తోటి పరిచారికలు చల్లని మాటలతో ఊరడిస్తూంటే అశోకవనాంతరంలో నుంచే— ఎవరో మదనబాధ పొందుతున్న పురుషుడు కాకలీస్వరమూర్ఛనలో వీణానాదంలాగ మా యజమానురాలికి వినిపించేలాగ—ఈ పద్యాలను—తిరిగి తిరిగి పాడుతూ వెళ్ళిపోయాడు.

కుబే : 'ఆ మనుజా రూపయౌవన
ధామాదిక విభవముల్ వృథాయౌను కదా
ఆమని ప్రేయసిఁ గూడక
కాముని పండుగను వేడ్కఁ గడవకయున్నన్;'

మరిన్నీ—

'మచ్చలేని చందమామను చూచియు
పరభృతంపు తీయపాట వినియు,
ఎవడు సకియ ననునయింపడో అవ్వాని
బ్రతుకు బ్రతుకె రాతిబండ గాక.'

కన : ఆ పద్యాలు విన్నాక కోపం కాస్త తగ్గిపోయి, మా యజమానురాలు ఆయనగారు వస్తాడనైనా ఎదురు చూడకుండా, నన్ను మాత్రం తోడుగారమ్మని, కాలినడకని మా యజమాని ఇంటికి బైలుదేరి వెళ్ళింది. అదలాకాగా, మా యజమానికూడా వసంతపు రాకతో గుండె దిటవు చెడి, మా యజమానురాలిని శాంతి పరుద్దామని ఎవరితోనోకలిసి బైలుదేరి, వీణాచార్య విశ్వావసుదత్తుగారి ఇంటి దేవిడీలో అనుకోకుండా మా యజమానురాలిని కలుసుకున్నారు. అక్కడ నిశ్శబ్దంగా వాళ్ళిద్దరినీ యాదృచ్ఛికంగా ఇంటిలోంచి వస్తున్న విశ్వావసువుగారు చూసి, తమ ఇంటిలోకి తీసుకు

వెళ్లారు. ఆ తరువాత, తెల్లవారుతూంటే; మా యజమానురాలు నన్ను పిలిచి ఇలాగంది:

నారాయణదత్త: చూడు కనకలతా, బావ వైశికాచలుడు ఎక్కడున్నాసరే, కనుక్కొని ఇక్కడున్నట్లు తీసుకురా.

కన : అని చెపితే నేనిలా వచ్చాను.

వైశిక : హాయి హాయి. వినదగ్గ మంచిమాట వినిపించావు. నీ కింతకంటే ప్రీతి పాత్రమైన దేమివ్వను? ఈ ఆశీస్సు తీసుకో.

'ఎల్లప్రాయపు సిరితో ప్రియు
వలపించెడు సఖుల భాగ్యవతి వీవై, నీ
వలచిన యుపభోగమ్ముల
కలిమి ననవరతము సుఖముగాంచవె చెలియా.'

రా, నువ్వు ముందు పద కనకలతా.

కన : ఇదిగో విశ్వావసుదత్తు గారిల్లు. మనం లోపలికి వెడదాం.

వైశిక : సరే పద. ఆఁ ఆఁ. మీ తొట్రుపాటు చాలించండి. కానియ్యండి కానియ్యండి—ప్రేమికుల జంట.

'తనగుణము మేర ఋతు వసంతమ్ము నేడు
వలపు జంటయౌ మిమ్ముల కలిపినటులె
ఋతువులన్నియు కలహాంతరితుల మిమ్ము
వలపు జంటగా మరి మరి కలుపుగాత.'

తన గుణానికి గర్వించిన వసంత ఋతువు మూలాన్ని నేనుకూడా దగా పడ్డాను. ఎలాగంటే మీ రిద్దరూ కలిస్తే నాకు బహిష్కరణేకదా. మరిప్పుడేం చెప్పను? పోనీ ఇందులో వసంతుడి తప్పేంలేదననా? ఎలాగంటే—

'శశి వెలుగు తోటలా కావు, నిశలు కావు,
రంజకములగు వీణాస్వరములు కావు,
కావు దూతికాగోష్ఠులు, కావు వివిధ
ఋతువులు, విచిత్రభాష, లివేవికూడ
కావు ప్రేమిక జన సంగకారణములు,
తమ గుణము లొండొరుల రేపు మమతపొంగు
మాత్రమే కూర్చు ప్రణయ సమాగమముల'.

ఒకరి మంచి గుణాలొకరికి వలపువాగులవుతూ తమ తమ మంచి గుణాలద్వారా తగులు మిగులుతూ మదనతంత్రసారమై కుసుమపురానికి వెలుగై ఇతర జన దుర్లభమైన మీ యిద్దరి ప్రేమమూలాన్నీ నష్టపోయినవాడిని నేను.

నారాయణదత్త, కుబేరదత్తుడు : బావగారి ప్రయత్న ఫలితంగానే మా అనురాగం అంకురించింది. అందుచేత మా పునస్సమాగమానికి కారణంకూడా బావగారే. ఈ పాటలీపుత్రంలో బావగారి వచనలీలా వృత్తాన్ని అనుభవించిన వారికి ప్రేమికజన సల్లాపాలు ఏవంత రుచిస్తాయి.

వైశిక: ఒకరికోసం ఒకరు ఆవురావురుమంటున్న ప్రణయ మిథున సమాగమానికి ఆలస్యం కలిగించే కథా ప్రసంగాలను కట్టిపెట్టాలి. ఇక సెలవిప్పిస్తే వెడదామనుకుంటున్నాను మరి.

(భరత వాక్యము)

'ఫుల్లాంభోజమువలె నీ యుల్లము కొల్లగొను నేది,
మత్తెక్కించే మృదువగు మాటలు పలికెడు నేది,
అందము లొలుకుచు వెడదై అరుదుగ వెలిగెడు నేది,
అట్టి సఖీ ముఖమును నీ వరసెడు నటులే ప్రీతి,
సస్యము లెల్లెడ పెరుగగ సమృద్ధి వెలసెడు నేది
సాగరమే మేఖలగా జఘనము చుట్టెడు నేది,
ఉన్నత వింధ్య మేరువుల నురమ్ము బలిసెడు నేది,
అట్టి ధరిత్రి గుణాధిక నరయుత నరపతి ప్రీతి.

(ఆ విధముగా విటుడు నిష్క్రమిస్తాడు.)

ఇది శ్రీ వరరుచి మునికృతమయిన ఉభయాభిసారికా అను పేరింటి సంస్కృత భాణమునకు బాలాంత్రపు రజనీకాంతరావు ఆంధ్రానువాదము.

నృత్య సంగీత నాటిక

మూల స్తంభాలు

రజని

[తెర ఎత్తగానే 8గాని 10 గాని స్తంభాలు
లోపల ఆడా, మగా పిల్లలు నృత్యం
చేస్తుంటే ఆడుతూ రంగస్థలంపైకి వస్తాయి.]

బృందం : కదిలే ఆడే స్తంభాలూ,
కదలక నిలిచే స్తంభాలూ,
నడిచీ వచ్చే స్తంభాలూ,
నలుగడ నిలిచే స్తంభాలూ.

కొంటామిదిగో చల్లోయంటూ
కొసరే గొల్ల స్తంభాలూ,

వగసలు తీరే స్తంభాలూ,
వంతులు మారే స్తంభాలూ,
పరుగులు పెట్టే స్తంభాలూ,
పక పక నవ్వే స్తంభాలూ,

చెలిమిని కోరి చెంగున గెంతి
చేతులు మారే స్తంభాలూ

ఆటలు ఆడే స్తంభాలూ,
పాటలు పాడే స్తంభాలూ,
చేతుల లోపల చేతులు చరచి

పంటలు వేసే స్తంభాలూ,
చల్లను అమ్మే గొల్లభామగా
చక చక మారే స్తంభాలూ.

తాతలు పాతిన స్తంభాలూ
నేతలు మలచిన స్తంభాలూ
పౌరజీవితారంభాలూ,
రేపటి మూల స్తంభాలూ.

పిల్లలు నేడై పెద్దలు రేపౌ
సంఘపు మూల స్తంభాలు.

[స్తంభాలను అర్ధ చంద్రాకారంగా
రంగంపైన నిలబెట్టి ఒక్కొక్క స్తంభాన్ని
ఒక్కొక్క విద్యార్థి పట్టుకుని నిలబడి ఉండగా
ఒక విద్యార్థిని గొల్లభామగా నృత్యం
చేస్తుంది]

గొల్ల భామ : చల్లోయమ్మా, ఇదే చల్లోయమ్మా
ఎల్ల రాకానందా మిచ్చేనమ్మా

బృందం : గొల్ల భామా, ఎంతా వయ్యారివే
ఎల్లారకూ చల్లా పొయ్యారావే.

గొల్ల : కొనరారే యిదిగిదిగో కూరిమిచల్లా
ఊరక చూస్తారేమిదె ఓరిమి చల్లా

బృం : గొల్ల భామా, ఎంతా వయ్యారివే
ఎల్లారకూ చల్లా పొయ్యారావే

గొల్ల : కామధేనువు పొదుగూ కమ్మని చల్లా
కావాలంటే యిదుగో పుల్లని చల్లా

బృం : గొల్లా భామటువైపు
వెళ్ళంగ యిటువైపు
తేరి పారా చూచీ.
బారా బారా చాచీ
ఒక్కసారే వెయ్యా వయ్యారంగా,
వక్కొ స్తంభంచేరా ఒక్కా అంగా

గొల్ల : ఒక్కా స్తంభం విడిచీ
వక్కా స్తంభం గడిచీ
వెక్కిరిస్తూ నన్నూ
వెంటా పడ్డారంటే
చేతికందిన వారి తలపైనంతా
చేసూ గొల్ల భామా చల్లముంతా.

అంతా: స్తంభాలాటా నేడు స్తంభాలాట - రేపు
సంఘంలో ప్రగతికి గుంజూలాటా.

గొల్ల : ఒక్కొక్కరికీ ఉంది ఒక్కా స్తంభం

బృం : ఆమె తలపై ఉందీ చల్లా కుంభం

గొల్ల : కావాలి నాకొక్కా ఖాలీ స్తంభం

బృం : అక్కర్లేదూ మాకూ చల్లా కుంభం

అంతా: స్తంభాలాటా నేడు స్తంభాలాటా-రేపు
సంఘంలో ప్రగతికి గుంజూలాటా.

బృం : ఉన్నా స్తంభం వదిలీ తారాడుతాం
వెన్నాడీ భామానూ వెక్కిరిస్తాం

గొల్ల : ఖాళీ స్తంభం అందూకొంటానంతా
వారితలపై పెడతా చల్లాముంతా.

అంతా: స్తంభాలాటా నేడు స్తంభాలాటా-రేపు
సంఘంలో ప్రగతికి గుంజూలాటా
(పంతులు ప్రవేశిస్తాడు)

పంతులు : చూపుంకీనాడు బాలబాలికలయ్యా, వీరే
రేపటి దేశానికి పరిపాలకులయ్యా

పిల్లలు: పాటలు ఆటలు చాలికపదండి బడికీ, అదుగో
పంతులు పూజారి వచ్చె చదువుల గుడికీ.

పంతు: ఆడేదినాడు గొల్ల స్తంభాలయ్యా రేపటి
మేడలు లేచే మూల స్తంభాలయ్యా
కుదురేదో స్తంభాలకు మదురేదో మేడలకూ
గదులేవో దీపాలకు, కుదిరించే క్రమమాది.
చదువూ సున్నపుగానుగ కదిలించేమేస్త్రి నేను
ప్రాజదువులు క్రొంజదువులు పలికించే శాస్త్రి
నేను.

పంతులు నేను, నిత్య వసంతుడ నేను

పిల్లలు: ఆటలనూ పాటలనూ చాలించాలి-మనమిక
పంతులు చెప్పే పాఠాలాలించాలి.
(పంతులు బడిగంట మ్రోగిస్తాడు)

పిల్లలు: గణగణా బడిగంట మోగి చాటిదే మన
పంతులు

పంతు : రణగుణధ్వని మాని ఆపరే పిల్లలూ మీ
గంతులు.

పిల్లలు ఆటా పాటా చెల్లంగోర్
అందరు తరగతి చేరండి

పంతు : పాఠాలారంభించే ముందర
ప్రార్థన చేదాం రారండి

(తరగతిగదిలో వలె పంతులు ఒక ప్రక్కా, పిల్లలు ఒక ప్రక్క బార్లు తీరి ఉంటారు. పంతులు చెప్తూంటే పిల్లలు తిరిగి అంటూంటారు.)

పంతు తెలుగు తల్లికి వందనం మా భరత ధాత్రికి వందనం

దేశి కవులకు పూర్వ భారత దేశికులకిదె వందనం

మంచి చెడుగుల మేలు కీడుల నెంచు తెలివికి వందనం

మానవుల మహితాశయులగా మలచు శక్తికి వందనం

శాశ్వతమ్మౌ సత్యమై ఈ విశ్వగతికే మూలమై

ఈశ్వరుండని జ్ఞానులెరిగిన పరశక్తికి వందనం

[అభినవ కుమారుడను విద్యార్థి ప్రార్థనలో పాల్గొనక వెనక్కి తగ్గి మూతి బిగించి, నిరసన తెలియ జేస్తుంటే, మిగిలిన వారు మొగాలు చూచుకొంటూ ఉంటారు

అభినవ : పంతులుగారూ, మీకిదిగోను సలాము
వద్దు వద్దు మా బుద్ధి కిలాటి మలాము
ఎరుగని ఈశ్వరుడెవరో ఎలా నమ్మడం?
పెరుగుతున్న విజ్ఞానం ఎలా మరవడం?

పంతు: తరతరాల సత్యాన్వేషణల గమ్యము

> ఏ దేశమేగినా ఎందుకాలిడినా
> ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
> పొగడరా నీ తల్లి భూమి భారతిని
> నిలపరా నీ జాతి నిండు గర్వమ్ము
> —రాయప్రోలు

పెరిగే విజ్ఞాన పరుల కెల్ల మాన్యము
దైవభక్తి గురుభక్తుల కలదు సామ్యము
వినయ వివేచనలు లేని విద్య శూన్యము.

అభి : పంతులుగారూ మీకిదిగోను సలాము
వద్దు వద్దు మా బుద్ధికిలాటి మలాము.
ప్రశ్నించే తర్కబుద్ధి ప్రగతి ధర్మము
విద్యార్థుల విజ్ఞానము మెరుగు మర్మము.

నవకుమార్ : పాత నడక వీడదు మాగురు బోధ
కొత్త పరుగులెత్తును యువనాయక బోధ.
స్వాతంత్ర్యము సిద్ధించిన జాడలివేనా?
స్వతంత్ర భావనము చెప్పు చదువులివేనా?

పంతు: బడిలోపల ఒక పాఠం
బడి వెలుపల ఒక పాఠం,
గుడిలోపల ఒక బోధ
గుడి వెలుపల ఒక బోధ

బృం : పాఠాలూ బోధనలూ బహువిధమాయె
పాఠశాల క్రమశిక్షణ పరిమితమాయె
[గాంగ్]

పంతు : పిల్లల్లారా రారండి
వినండి చరిత్ర చెప్పినపాఠం
జగత్తు చరిత్ర మార్పులూ
భరత భువికి కనువిప్పులూ
భారత చరిత్ర మార్పులూ
జగత్తుకే కనువిప్పులూ.

బృం : శతాబ్ది సాగిన సమరమూ
స్వతంత్ర మొసగిన దమరమూ,
ఒక్కసారిగ స్వతంత్రతా
ఉప్పెనై పొంగె అంతటా,

పంతు: స్వతంత్ర సాధన దీక్షలో
విదేశ ప్రభుల కక్షలో
శతాబ్ది గడిచిన పరీక్షలో
పెద్దలు పొందిన శిక్షలో

బృం : శతాబ్ది సాగిన సమరము
స్వతంత్ర మొసగిన దమరము.
ఒక్కసారిగ స్వతంత్రతా
ఉప్పెనై పొంగె అంతటా.

పంతు: హక్కులేవి అని శోధనా
విధుల నెమరచు బోధనా
పొందబోరు క్రమశిక్షణా
అందుకో రొకరి రక్షణా.

బృం : ఒక్కసారిగ స్వతంత్రతా
ఉప్పెనై పొంగె అంతటా.
పిల్లల మనసులు మార్చెను
పెక్కుగతుల నాగరికతా. (గాంగ్)

పంతు: చదువకమునుపనేవారు కాకరకాయ
చదువు వచ్చి యిపుడందురు కీకరకాయ
గురువులన్న పెద్దలన్న తిరస్కారము
నామం పెట్టక పోడమె నమస్కారము.
ఆడపిల్లలన్న అలుసు అడుగు అడుగునా
ఏడిపించి వేస్తారేడాది పొడుగునా. (గాంగ్)
[పంతులు రంగమీదనుంచి తప్పుకొనిఉండగా
పిల్లలు రెండు బారులుగా ట్విస్ట్ చేస్తారు.]

Your Co-operation Helps
Andhra Pradesh State Road Transport Corporation

* Avoid Foot-Board Travel.
* Never Board the Bus which is already full with passengers or in motion.
* Travelling without proper ticket is an offence punishable Under A. P. M. V. Rules.
* Offer Small Change to Suit the fare.
* Demand Correct Ticket and Tender Exact fare.
* On demand show your ticket to any checking officials of A. P. S. R. T. C.
* Form 'Q' for quick boarding into the Bus.
* Retain your ticket till the end of the journey.
* Ensure your belongings while getting out of the bus.

YES! Tell your friends if they don't know!

ISSUED BY: ANDHRA PRADESH STATE ROAD TRANSPORT CORPORATION.

Andhra Pradesh State Co-operative Bank Ltd.,
Head Office : Troop Bazar, Hyderabad.
SCHEDULED BANK
(Bank where Deposits Grow Faster)

Branches in Hyderabad : (1) Vidyanagar, (2) Malakpet, (3) Narayanguda.

Attractive Rates of Interest on Deposits :

Savings Bank ... $5\frac{1}{4}$% Per annum
Fixed Deposits ... $5\frac{3}{4}$% to 10% per annum (According to period of Deposit)

Special rates on deposits of Charitable, Religious and Educational institutions.

Financial position as on 30-6-1974.

	(Rs. in lakhs)
Share Capital and Reserves	671.41
Deposits	2328.65
Advances	2964.97
Working Capital	3925.73
Net Profit (subject to audit)	24.62

Constituents are requested to contact us for all banking Services at any of our Offices in Hyderabad.

P. N. SRIVASTAVA
Managing Director.

ఆడపిల్లలు భయంగానూ మగపిల్లలు ఎగ
తాళీగాను ట్విస్ట్ చేస్తూ]

సుకుమార్ : రైట్ రైట్ రైటో
రైట్ రైట్ రైటో, ఆహో
జాస్మిన్ వైట్ ఓహో
అదో సెర్చ్ లైట్
పడింది నాపై నైట్
పెచ్చింది నాడిలైట్, రైట్
రైట్ రైట్ రైటో
రైట్ రైట్ రైటో.
స్ప్రింగ్ స్ప్రింగ్ స్ప్రింగో
స్ప్రింగ్ స్ప్రింగ్ స్ప్రింగో-ని
లిస్తే డాన్సింగ్-న
డిస్తే తాన్సింగ్-మా
టాడితే ఏక్టింగ్-చూపు
చూస్తే రయిటింగ్-రంగ్
స్ప్రింగ్ స్ప్రింగ్ స్ప్రింగో
స్ప్రింగ్ స్ప్రింగ్ స్ప్రింగో. (గాంగ్)

అనసూయ : చూడండి మేస్టారూ యీ సుకుమారు
నిక్ నేమ్‌తో పిలుస్తాడు మము పలుమారు.

ప్రియంవద : బడిలోనూ బడి బయటా అదే మారు
పేరు.

తాయమాయె మారుపేరు, పోయె అసలు
పేరు.

ప్రేమలత : మారు పేరు వచ్చెనంటే నీదేనోయ్
తప్పు

బడిలోనికి రావడాని కెందుకు మేకప్పు?
జడ అల్లీ అల్లకుండ ముందో వెనకో
పారేస్తావ్

బడిలోనికి వచ్చి దాన్ని అల్లి, విప్పి
రులిస్తావ్.

మా తెలుగు తల్లికి మల్లెపూదండ మా కన్నతల్లికి మంగళారతులు కడుపులో బంగారు కనుచూపులో కరుణ చిరునవ్వులో సిరులుదొర్లించు ॥మా తల్లి॥

రాదామరి వచ్చెనంటే నీకు మారు పేరు?
ఏదీ తెలుసా పంతులుగారి అసలు పేరు.
(గాంగ్)

సుకుమార్ : జిడ్డు పంతులుకి జిలేబి జాంగ్రీ
బడ్డు పంతులుకి బావంగిర్
ఎడ్డి పంతులుకి లడ్డు మిఠాయీ
మడ్డి పంతులుకి మసాలవడ. (నవ్వులు)

నవకుమార్ : (ప్రేక్షకులు నవ్వుతారు-వాళ్ళవైపు
చూసి)

సిగ్గు లేక టు నవ్వుతారేం?
చిన్న పెద్దా తారతమ్యం
చూడవద్దా - తెలుసుకోరేం
చదువులకు ఇదేనా గమ్యం?.
(పంతులు తిరిగి వస్తాడు)

పంతులు : గురువులన్న పెద్దలన్న తిరస్కారము
నామం పెట్టక పోడమే నమస్కారము.
ఆడపిల్లలన్న అలుసు అడుగు అడుగునా
ఏడిపించి వేస్తారేడాడి పొడుగునా.

చదువక మునుపనే వారు కాకరకాయ.
చదువు వచ్చి యిపుడందురు కీకరకాయ.
(గాంగ్)

నవ : అల్లరికీ మరి అరాచకానికి
కల్ల చదువులకు కపటముఖా

పిల్లలదే ఒక పేరాయే-బడి
పిల్లలదే ఒక పేరాయె.

ప్రేమ: పరీక్ష పేపరు ప్రశ్న లేమిటో
బట్టబయలుగా తెలియాలి.
జవాబులన్నీ చూచు కాపీగా
చక చక వ్రాసి పడవాలి.
ఇదేవిటీ అఘాయిత్యం అని
ఎవరు అడగక వదలాలి.

పంతు: అడిగిన పంతులు గడియ గడియకూ
అల్లరి మూకకు జడవాలి
(కళ్లజోడూ పాగా, బల్లమీద
పెట్టి పంతులు వెళ్లిపోతాడు)

బృం: అల్లరికీ మరి అరాచకానికి
కల్ల చదువులకు కపటముకూ
పిల్లలదే ఒక పేరాయే-బడి
పిల్లలదే ఒక పేరాయే

నవ: స్వర్గమర్త్య పాతాళలందున
పేపరు దిద్దే దెవరయినా
మార్కులు తక్కువ వచ్చే వారికి
ఖర్తీ మార్కులు వెయ్యాలి.
చదివిన వారిని, చదువని వారిని
బడినంతా ప్యాస్ చెయ్యాలి.

ప్రియం: అటుకాకుంటే సమ్మెలు చేస్తే
అసలు బడినే మూయ్యాలి.

బృం: అల్లరికీ మరి అరాచకానికి
కల్ల చదువులకు కపటముకూ
పిల్లలదే ఒక పేరాయే-బడి
పిల్లలదే ఒక పేరాయే.

(పంతులు కళ్లజోడు, పాగా
నెత్తిన పెట్టుకొని పాడుతుంది)

ప్రేమ: ఓరిమికీ, మరి-కూరిమికీ
ఓపలేని పేదతనముకూ
పంతులుదే ఒక పేరాయే-బడి
పంతులుదే ఒక పేరాయే.
ఎదుగూ బొదుగూ లేని జీవితం
జీతగాండ్రలో కనిష్ఠ జీతం
ఊరిపెద్దలకు ఉద్యోగులకూ
ఒదిగి ఒదిగి మసిలే దుర్గతికి
పంతులుదే ఒక పేరాయే - బడి
పంతులుదే ఒక పేరాయే.
స్వతంత్ర భారత జాతి చరిత్రలో
పంతులు ప్రగతికి పొంతన లేదా?
దేశంలో అత్యున్నత పదవికి
దీప్తినిచ్చు ధీమంతుడు పంతులే
దేశంలో అగర్భ దరిద్రుడు
దీనుడైన సామంతుడు పంతులె -
పంతులు అంటే చదువుల గనిగా
పంతులు అంటే తెలివికి గురిగా
వెలుగులు చిమ్మే విద్యాధునిగా
రాష్ట్రపతి పదవికిను మారులు గౌ
రవము తెచ్చినది మా బడిపంతులే.
ఎటువైపు, ఈనాడు, ప్రసరించునో
పంతులు చూపు
అటువైపె అటువైపె-పయనింతురు
పిల్లలు రేపు.

ఇటు చూడు, అటుచూడు,
మురిపించు వరదోయ రేఖల్
కడియెడమ, సడుమ నడుమ, తలలూపుతు
పిలుచు పతాకల్.
ప్రతిపల్లె, ప్రతిబస్తీ, వచ్చెనౌను ప్రజ
రాచరికం,

ప్రతీ వాడా, ప్రతి మేడా సఖ శాంతులొందవు
సమలోకం. (గాంగ్)

(తెరదింపి యెత్తేసరికి పంతులుండేచోట ప్రిన్సిపాలు నిల్చునిఉంటాడు. ప్రిన్సిపాల్ క్రింది పాట పాడుతూంటే విద్యార్థులంతా లోపలకు పోయి కాన్వొకేషన్ దుస్తుల్లో పట్టాలతో తిరిగి వస్తారు.)

ప్రిన్సిపాల్ : ప్రజాస్వామ్య పథంలో
పాతికేళ్ల ప్రగతిలో
స్వతంత్ర భారతంలో
చదువులెలా పెరిగాయ్

బృం : విరివి నేలబారుగా
విలువ నిలువు జారగా,

ప్రిన్సి: చిన్న బడులు, పెద్దబడులు
ఉన్నత విద్యల నెలవులు
ఉరకలు వేస్తూ పెరిగాయ్
ఊరూరా పేట పేట.

బృం : విరివి నేల బారుగా
విలువ నిలువు జారగా

ప్రిన్సి: ప్రతిజిల్లాలో తాలూకాలో
పట్టభద్రులను తీరిచి దిద్దే
సాంకేతిక విజ్ఞాన నవనిధులు
చరిత్రాదులౌ కళల పెన్నిధులు
ఉరకలు వేస్తూ వెరిగాయి
ఊరూరా ప్రతి పేటా.
(గాంగ్)

ప్రిన్సి: ఊరూరా, ఇంటింటా
ఊరి ఊరి వెలువడ్డారు
ఎందరేసి పట్టభద్రులో
ఏటేటా వెలువడ్డారు
అందరికేవీ అనువగు పదవులు
అందరికేవీ ఉద్యోగాలూ
నిరుద్యోగమూ, నిస్సహాయతా
నిత్యం పెరిగే నిరుత్సాహమూ
కలిమి లేములూ వ్యత్యాసాలకు
కక్షలకూ బలమిచ్చు పాలము.

ఒక బృందం : ఇటు రండోయ్-ఇటురండి,
ఎడమవైపె చూడండి,
పట్టభద్రులూ - ఓహో, అపర రుద్రులూ,
యువలోకం కలలుకనే నవలోకం నిర్మిద్దాం
నవలోకం సమలోకం
ఎడమవైపె ఎడమవైపె
ఇటు రండోయ్- ఇటురండి
ఎడమవైపె చూడండి.

ఇంకొక బృందం : అటుకాదోయ్ ఇటురండి
కుడివైపే చూడండి.
పట్టభద్రులూ - ఓహో, వీరభద్రులూ,
తరతరాల సంస్కృతీ వాతంలో నూతన
స్వర్గం
అదియే సమతా స్వర్గం.
కుడివైపే కుడివైపే
అటుకాదోయ్ ఇటురండి
కుడివైపే చూడండి

ఒక బృందం : ఎడమ వైపే

ఇంకొక బృందం : కాదు కాదు కుడివైపె

ఒక బృందం : కాదు కాదు ఎడమవైపే

ఇంకొక బృందం : కుడివైపే

ఒక బృంద : ఎడమవైపే

ఇంకొక బృందం : కుడివైపే

ఒక బృందం : ఎడమ వైపే,

(రెండు బృందాలు టగ్ ఆఫ్ వార్ వంటి నృత్యవిన్యాసం ప్రదర్శిస్తారు)

ప్రిన్సిపాల్ : కుడి యెడమ తగాదా తీర్పరి
ఓటు పెట్టేయే కాదా
వోటు హక్కు లభియించే వరకు•
చదువులు నేర్చే విద్యార్థులకు
కుడి యెడమలతో కూడదు జోక్యం
క్రమ శిక్షణతో చదువే ముఖ్యం

విద్యార్థి బృందం : ఇదియే భరత వాక్యం.

ప్రిన్సిపాల్ : విద్యాలయ సరిహద్దుల నడుమ
విద్యలు గరపే ఒజ్జల కెల్లా
సర్వసమ్మతాంశము లే పాఠ్యం.
శీలవంత మౌనదతయె ముఖ్యం.

విద్యార్థి బృందం : ఇదియే భరత వాక్యం.

ఈ శతాబ్దారంభంలో మన గురజాడ లోకాన్ని పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ లోకం ఇంకా శిశుత్వం లోనే ఉందని గ్రహించారు. అంచేత ఆయన ముత్యాల సరాలవంటి దేశి కవితా రీతులతో - పిల్లల తో ఆడుకున్నట్లే- లోకంతో క్రీడించారు. ఆయన పిల్లల్ని ఆకట్టడానికి ప్రధానాలైన కరుణ హాస్య రసాల్ని చేతబట్టారు. కితకితలు పెడు తూనే లోకానికి పాఠం నేర్పారు. ఆయన చెప్పదల్చుకున్న మహాదా దర్శాన్ని శిశు మనస్తత్వ శాస్త్రజ్ఞునివలె లోకానికి బోధించారు. కన్యక, పూర్ణమ్మ ఈ విధానంలో చెప్పినవే. ఆయన రచనలన్నీ అంతే."

—నార్ల చిరంజీవి